సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 137

గురువారం 7-8-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు తరాలు ఎవరినీ క్షమించవు'



31 నుంచి మోదీ చైనా పర్యటన

ఎస్సీవో శిఖరాగ్ర సదస్సుకు హాజరుకానున్న ప్రధానమంత్రి - 6లో



సీఎంల పేర్లు, ఫొటోలకు ఓకే..

సంక్షేమ పథకాలకు వాడుకోవచ్చన్న సుప్రీంకోర్టు - 6లో

బీసీ రిజర్వేషన్ల పెంపును ఆమోదించకుంటే..

మోదీని గద్దె దించుతాం

రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసుకుంటాం

బీసీలకు 42% రిజర్వేషన్లు సాధించి తీరతాం..

ఢిల్లీ మహాధర్నాలో సీఎం రేవంత్‌రెడ్డి

- తెలంగాణ ప్రజల శక్తిని, ఉద్యమ స్ఫూర్తిని ప్రధాని మోదీ తక్కువ అంచనా వేస్తే తడాఖా చూపిస్తాం
- ఇక ఢిల్లీకి రాము.. గల్లీలో బీజేపీ నేతలను పట్టుకుంటాం..
- ఆ పార్టీకి ఈసారి ఎట్టి పరిస్థితుల్లోనూ 150 సీట్లు దాటవు
- నాడు కేసీఆర్ చేసిన చట్టమే నేడు గుదిబండగా మారిందన్న సీఎం
- బీజేపీ నేతలు బీసీ కోటా పెంపునకు అడ్డుపడుతున్నారంటూ ఫైర్



12 లో

బుధవారం ఢిల్లీలో జరిగిన బీసీ మహాధర్నాలో సీఎం రేవంత్‌రెడ్డి, మీనాక్షి నటరాజన్, భట్టి విక్రమార్క, మహేశ్‌కుమార్ గౌడ్, పొన్నం ప్రభాకర్, మల్లు రవి

ముస్లిం రిజర్వేషన్ల కోసమే కాంగ్రెస్ ధర్నా: బండి సంజయ్

12 లో

రేవంత్ బ్యాచ్ ఢిల్లీ డ్రామా అట్టర్ ఫ్లాప్: హరీశ్‌రావు

టార్గెట్ రేవంత్!

- వివరాలు 3లో

- సూచనలిస్తున్నానంటూనే ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి విమర్శలు
- ముఖ్యమంత్రి భాష మార్చుకోవాలంటూ మరోసారి ఘాటైన వ్యాఖ్యలు
- మంత్రి పదవి గురించేనా?.. అనే చర్చ

నీట్ యూజీ కౌన్సెలింగ్‌కు కొత్త షెడ్యూల్..

9 నుంచి రాష్ట్ర కోటా కౌన్సెలింగ్ ప్రారంభం

సుప్రీంలో కేసు కారణంగా షెడ్యూల్‌లో మార్పు

- వివరాలు 3లో

పేలిన ట్రంప్ టారిఫ్ బాంబు



భారత్‌పై మరో 25% టారిఫ్ మోత మోగించిన అమెరికా అధ్యక్షుడు

- మొత్తంగా 50 శాతానికి పెరిగిన అమెరికా సుంకాల భారం
- కార్యనిర్వాహక ఉత్తర్వుపై సంతకం చేసిన అగ్ర రాజ్యాధినేత
- రష్యా నుంచి భారత్ ముడి చమురు కొనుగోళ్లపై పట్టరాని కోపంతో పన్నులు పెంచిన తెంపరి ట్రంప్
- 140 కోట్ల ప్రజానీకం చమురు అవసరాలే ప్రధానమన్న ప్రధాని మోదీ సర్కార్
- మిత్రదేశమంటూనే సుంకాల సుత్తితో కొట్టడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేసిన భారత్

న్యూయార్క్/న్యూఢిల్లీ: మెరుపువేగంతో వివాదాస్పద నిర్ణయాలు తీసుకునే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అన్నంత పనీ చేశారు. 24 గంటల్లో మళ్లీ భారత్‌పై దిగుమతి టారిఫ్ విధిస్తానని చెప్పినట్టే బుధవారం అదనంగా 25 శాతం సుంకాన్ని మోపారు. వద్దని ఎంతగా వారించినా వైరి దేశం రష్యా నుంచి విపరీతంగా ముడి చమురును కొని, బహిరంగ మార్కెట్లో అమ్ముకుని లాభాల పంట పండిస్తున్నారని ఆరోపిస్తూ భారత్‌పై 25 శాతం టారిఫ్ విధిస్తూ బుధవారం ట్రంప్ నిర్ణయం తీసుకున్నారు. సంబంధిత కార్యనిర్వాహక ఉత్తర్వుపై శ్వేతసౌధంలో ఆయన సంతకం చేశారు. ఇప్పటికే ప్రకటించిన 25 శాతం టారిఫ్ నేటి నుంచి అంటే ఆగస్ట్ ఏడో తేదీ నుంచి అమల్లోకి రానుంది. బుధవారం ప్రకటించిన అదనపు 25 శాతం టారిఫ్‌ను 21 రోజుల తర్వాత అంటే ఆగస్ట్ 27వ తేదీ తర్వాత వర్తింపజేయనున్నారు. ''రష్యా ముడిచమురును ప్రత్యక్షంగా, పరోక్షంగా భారత్ విచ్చలవిడిగా దిగుమతి మిగతా 2వ పేజీలో ▶

6 లో

ఉల్టా చోర్..

రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లపై అమెరికా సహా పెద్ద దేశాల దొంగనాటకం

మనల్ని మించి రష్యా చమురు కొంటున్న వైనం

ఎగుమతులపై ఎఫెక్ట్..

- అమెరికాకు ఎగుమతులపై మరింత భారం
- ఎక్స్‌పోర్ట్స్ 50% వరకు క్షీణించవచ్చని అంచనా
- ఆందోళనలో ఎగుమతి రంగాల సంస్థలు - 2లో

ఎగుమతులపై ఎఫెక్ట్

రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌పై గుర్రుగా ఉన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మళ్లీ మన ఎగుమతులను టార్గెట్ చేసుకున్నారు. ఇటీవలే వేసిన పాతిక శాతం సుంకాలను రెట్టింపు చేసి 50 శాతానికి పెంచుతున్నట్లు ప్రకటించారు. దీంతో అగ్రరాజ్యం 50 శాతం టారిఫ్‌లతో మనల్ని బ్రెజిల్ సరసన చేర్చినట్లయింది. మొదటి విడత టారిఫ్‌లు ఆగస్టు 7 నుంచి, కొత్తగా వేసిన మరో పాతిక శాతం సుంకాలు ఆగస్టు 27 నుంచి అమల్లోకి వస్తాయి. ఇప్పటికే మొదటి విడత పాతిక శాతం సుంకాల దెబ్బతోనే సతమతమవుతున్న మన ఎగుమతి పరిశ్రమలకు ఇవి మరింత భారంగా మారనున్నాయి. తాజా వడ్డింపుతో బంగ్లాదేశ్, పాకిస్తాన్‌లాంటి చిన్న పొరుగు దేశాలపై సుంకాలు మనతో పోలిస్తే సగానికన్నా తక్కువగా ఉండటంతో వాటి నుంచి పోటీ మరింత పెరిగితే మన ఉత్పత్తులకు డిమాండ్ పడిపోయే ముప్పు పొంచి ఉంది. దీంతో ఎగుమతుల కోసం అగ్రరాజ్యంపై ఎక్కువగా ఆధారపడుతున్న వస్త్రాలు, రత్నాభరణాలు, సీఫుడ్ మొదలైన రంగాల సంస్థల్లో ఈ విపత్తును ఎలా ఎదుర్కొనాలనే ఆందోళన నెలకొంది. దీని వల్ల అమెరికాకు ఎగుమతులు 40–50 శాతం పడిపోయే ముప్పు ఉందని మేధావుల సంఘం జీటీఆర్ఐ అంచనా వేస్తోంది.



అవకాశంగా మల్చుకోవాలి: ఆనంద్ మహీంద్రా

టారిఫ్‌ల గురించి ఆందోళన చెందకుండా దీన్ని అవకాశంగా మల్చుకోవడం ఎలా అనే అంశంపై దృష్టి సారించే ప్రయత్నాలు చేయాలని పారిశ్రామిక దిగ్గజం ఆనంద్ మహీంద్రా అభిప్రాయపడ్డారు. 1991 నాటి ఫారెక్స్ సంక్షోభం ఎలాగైతే ఆర్థిక సరళీకరణకు దారి తీసిందో.. అదే విధంగా ఈ టారిఫ్‌ల సాగర మథనం నుంచి భారత్‌కు అమృతం లభించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఇందుకోసం వ్యాపారాల నిర్వహణను మరింత వేగంగా సులభతరం చేయాలని, విదేశీ మారక ద్రవ్యాన్ని సమకూర్చే ఇంజిన్‌గా టూరిజంను మార్చుకోవాలని ఆనంద్ మహీంద్రా సూచించారు. ఇందులో భాగంగా వీసా ప్రాసెసింగ్ వేగవంతం చేయడం, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ని అప్‌గ్రేడ్ చేయడంలాంటి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

షాకింగ్ నిర్ణయం..

ట్రంప్ డబుల్ టారిఫ్‌లు తీవ్ర షాక్‌కి గురి చేశాయని ఎగుమతి సంస్థల సమాఖ్య ఎఫ్ఐఈవో డైరెక్టర్ జనరల్ అజయ్ సహాయ్ వ్యాఖ్యానించారు. దీని వల్ల అమెరికాకు 55 శాతం ఎగుమతులపై ప్రతికూల ప్రభావం పడుతుందని చెప్పారు. ఇప్పటికే పలు సంస్థలు ఆర్డర్లను ఆపి ఉంచాయని తెలిపారు. టారిఫ్‌ల భారం వల్ల పోటీ దేశాలతో పోలిస్తే ధరల విషయంలో 30–35 శాతం మేర మన ఎగుమతిదారులు వెనుకబడతారని సహాయ్ వివరించారు. చిన్న, మధ్య తరహా సంస్థలపై పెను భారం పడుతుందని, మార్జిన్లు మరింత తగ్గిపోవడంతో పాటు క్లయింట్లను కోల్పోయే ముప్పు నెలకొందన్నారు.

ప్రభుత్వానికి పరిశ్రమ వినతి

కీలకమైన అమెరికా మార్కెట్లో టారిఫ్‌ల మోత వల్ల నుంచి ఉపశమనం కల్పించేందుకు తగు తోడ్పాటు అందించాలని కేంద్రానికి ఎగుమతిదారులు విజ్ఞప్తి చేశారు. వడ్డీ రాయితీలు ఇవ్వాలని, ఆర్‌వోడీటీఈపీ స్కీమ్ (ఎగుమతి చేసే ఉత్పత్తులపై సుంకాలు, పన్నుల రెమిషన్), రాష్ట్ర, కేంద్ర ట్యాక్సులు, లెవీల్లో రిబేటుకు సంబంధించిన ఆర్‌వోఎస్‌సీటీఎల్ మొదలైన వాటిని పొడిగించాలని పరిశ్రమ వర్గాలు కోరాయి.

అమెరికాకు ఎగుమతులపై మరింత భారం

ఎక్స్‌పోర్ట్స్ 50 శాతం వరకు క్షీణించవచ్చని అంచనా

రత్నాభరణాలు, వస్త్రాలు తదితర పరిశ్రమలపై తీవ్ర ప్రభావం

ఆందోళనలో ఎగుమతి రంగాల సంస్థలు

30 బిలియన్ డాలర్ల ఎగుమతులకు మినహాయింపు

ప్రస్తుతం అమెరికాకు 86 బిలియన్ డాలర్ల మేర ఎగుమతులు ఉండగా, అందులో 48 బిలియన్ డాలర్ల విలువ చేసే ఎగుమతులపై సుంకాల ఎఫెక్ట్ పడుతుందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ఫార్మా, స్మార్ట్‌ఫోన్లు, సెమీకండక్టర్లు లాంటి 30 బిలియన్ డాలర్ల విలువ చేసే ఎగుమతులు ప్రస్తుతం మినహాయింపుల జాబితాలో ఉన్నాయని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. గత ఆర్థిక సంవత్సరం అమెరికాకు భారత్ నుంచి 10.5 బిలియన్ డాలర్లు, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులు (చాలా మటుకు స్మార్ట్‌ఫోన్లు) ఎగుమతులు 14.6 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. అయితే, విదేశీ ఔషధాలపై 250 శాతం వరకు సుంకాలు విధిస్తానంటూ ట్రంప్ బెదిరిస్తున్న నేపథ్యంలో ఫార్మాకు కూడా రిస్కులు ఉండొచ్చని భావిస్తున్నారు.

రత్నాభరణాలు .. 12 బిలియన్ డాలర్లు

మన రత్నాభరణాల ఎగుమతులకు అగ్రరాజ్యం పెద్ద మార్కెట్‌గా ఉంటోంది. అక్కడికి ఎగుమతులు సుమారు 12 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉంటున్నాయి. మొత్తం ఎగుమతుల్లో 30 శాతం వాటా అమెరికాదే ఉన్న నేపథ్యంలో టారిఫ్‌లను రెట్టింపు చేయడం వల్ల చిన్న వ్యాపారుల నుంచి బడా కంపెనీల వరకు అందరిపైనా ప్రభావం పడనుంది. పోటీ దేశాల నుంచి చౌకగా ఉత్పత్తులు లభిస్తాయి కాబట్టి కొనుగోలుదారులు మరింతగా బేరసారాలకు దిగొచ్చని, మార్జిన్లు తగ్గిపోవచ్చని, ఆర్డర్లు రద్దు కావచ్చని పరిశ్రమలో ఆందోళన నెలకొంది.

ఇంజనీరింగ్ ఉత్పత్తులు..

అమెరికాకు ఇంజనీరింగ్ ఉత్పత్తుల ఎగుమతులు 18.3 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉన్నాయి. ఇవి ఖరీదుగా మారితే మెక్సికోలాంటి దేశాలవైపు అమెరికా మళ్లే అవకాశం ఉంది.

రసాయనాలు.. వ్యవసాయోత్పత్తులు..

అగ్రరాజ్యానికి మన వ్యవసాయోత్పత్తుల ఎగుమతులు సుమారు 5.6 బిలియన్ డాలర్లుగా, ఉక్కు..రసాయనాలు.. పెట్రోలియం ఉత్పత్తులు మొదలైన వాటి ఎగుమతులు 8 బిలియన్ డాలర్ల పైగా ఉంటున్నాయి. డబుల్ సుంకాల వల్ల భారత ఉత్పత్తుల రేట్లు పెరిగిపోయి, అమెరికా దిగుమతులను తగ్గించుకునే అవకాశం ఉంది. కొన్ని రంగాల్లో బ్రెజిల్, వియత్నాంలాటి దేశాలతో పోటీపడలేక మన దగ్గర పలు కంపెనీలపై ప్రతికూల ప్రభావం పడొచ్చు.

టెక్స్‌టైల్స్ ..

దేశీయంగా టెక్స్‌టైల్స్, అపారెల్ పరిశ్రమ దాదాపు 4.5 కోట్ల మందికి ఉపాధి కల్పిస్తోంది. 5.6 బిలియన్ డాలర్ల విలువ చేసే రెడీమేడ్ దుస్తులు అమెరికాకు ఎగుమతవుతున్నాయి. లెదర్ ఉత్పత్తులు, దుస్తుల్లాంటి రంగాల ఎగుమతుల్లో అమెరికా వాటా 30 శాతం పైగా ఉంటోంది. వియత్నాం, ఇండొనేషియాలాంటి దేశాల్లో తక్కువ సుంకాల వల్ల మనం పోటీపడే పరిస్థితి లేకుండా పోతుందని, ఈ రంగంలో ఉపాధి అవకాశాలూ దెబ్బతింటాయని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

అమెరికాకు ఇతరత్రా ఎగుమతులు

ఉత్పత్తులు	బిలియన్ డాలర్లలో
డ్రగ్స్ ఫార్ములేషన్స్, బయోలాజికల్స్	8.1
టెలికం ఇన్‌స్ట్రుమెంట్స్	6.5
విలువైన రాళ్లు	5.3
పెట్రోలియం ఉత్పత్తులు	4.1
వాహనాలు, ఆటో విడిభాగాలు	2.8
బంగారం, విలువైన లోహాల జ్యుయలరీ	3.2
రెడీమేడ్ గార్మెంట్స్, యాక్సెసరీలు	2.8
ఇనుము, ఉక్కు	2.7

(2024 గణాంకాలు)

దిగుమతులు..

ఉత్పత్తులు	బి.డాలర్లు
ముడిచమురు	4.5
పెట్రోలియం ప్రొడక్టులు	3.6
బొగ్గు, కోక్	3.4
కట్, పాలిష్డ్ డైమండ్స్	2.6
ఎలక్ట్రిక్ మెషినరీ	1.4
ఎయిర్‌క్రాఫ్ట్, స్పేస్‌క్రాఫ్ట్ విడిభాగాలు	1.3
పసిడి	1.3


(2024 గణాంకాలు)

మన దేశానికి చెందిన పలు దిగ్గజ కంపెనీలు అమెరికా మార్కెట్‌పై భారీగా ఆధారపడుతున్నాయి. అలాంటి వాటిల్లో కొన్ని.

కంపెనీలు	అమెరికా నుంచి ఆదాయాలు (శాతాల్లో)
టాటా మోటార్స్	15.41
ఇప్కా ల్యాబ్స్	17.83
సుందరం ఫాజెనర్స్	22.36
ఎల్‌టీ ఫుడ్స్	38.53
అవంతి ఫీడ్స్	69

కొత్త టారిఫ్‌ల వల్ల మనకన్నా మెరుగ్గా ఉండే కొన్ని దేశాలు..

దేశం	టారిఫ్ (శాతం)
మయన్మార్	40
థాయ్‌లాండ్	36
కాంబోడియా	36
బంగ్లాదేశ్	35
ఇండొనేసియా	32
చైనా, శ్రీలంక	30
మలేషియా	25
ఫిలిప్పీన్స్, వియత్నాం	20







ఒకే టీచర్.. ఒకే విద్యార్థిని

చిట్యాల: జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం కైలాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఒకటవ తరగతి విద్యార్థి ఒకరు ఉండగా, ఒక ఉపాధ్యాయుడు ఉన్నారు. ఈ పాఠశాలలో మొత్తం ముగ్గురు విద్యార్థులు ఉండేవారు. వారిలో ఇద్దరు ప్రైవేట్ పాఠశాలకు వెళ్లారు. దీంతో గ్రామానికి చెందిన ఒకే ఒక విద్యార్థిని నిత్య (ఒకటవ తరగతి) పాఠశాలకు వస్తోంది. ఈ ఒక్క విద్యార్థినికి ఒకే ఉపాధ్యాయుడు దశరథ పాఠాలు బోధిస్తున్నారు.



పేలిన ట్రంప్ టారిఫ్ బాంబు

▶ మొదటి పేజీ తరువాయి

చేసుకుంటోంది. అందుకే మా చట్టాల ప్రకారం అమెరికా కస్టమ్స్ సుంకాల పరిధిలోకి వచ్చే భారతీయ ఉత్పత్తులపై 25 శాతం టారిఫ్‌ను మరోసారి పెంచాలని నిర్ణయించాం'' అని కార్యనిర్వాహక ఉత్తర్వులో ట్రంప్ పేర్కొన్నారు. అదనపు టారిఫ్‌లకు స్పందనగా భారత్ ప్రతీకార నిర్ణయాలు తీసుకుంటే వైట్‌హౌస్ అందుకు తగ్గ టారిఫ్‌ల సవరణకు సిద్ధపడుతుందని ట్రంప్ సర్కార్ హెచ్చరించింది. మిత్రదేశమని కూడా చూడకుండా మితిమీరిన ఆవేశంతో భారత్ వీపు మీద పన్నుల వాత పెట్టి ట్రంప్ తన అగ్రరాజ్య అధిపత్యధోరణిని మరోసారి నిస్సిగ్గుగా ప్రదర్శించారు. స్నేహహస్తమందిస్తూనే సుంకాల సుత్తితో మోదడంపై భారత్ సైతం దీటుగా, ఘాటుగా స్పందించింది. 140 కోట్ల జనాభా చమురు నిత్యావసరాలు, దేశ ఇంధన భద్రత విషయంలో ఏమాత్రం రాజీపడబోమని మోదీ సర్కార్ స్పష్టంచేసింది. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది.

'అదనం'అమలుకు మినహాయింపులు

భారత్‌పై అమెరికా బుధవారం ప్రకటించిన ఈ అదనపు 25 శాతం టారిఫ్‌ను వెంటనే వర్తింపజేయబోమని ట్రంప్ సర్కార్ స్పష్టంచేసింది. ట్రంప్ సంతకం చేసిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ అమల్లోకి వచ్చిన 21 రోజుల తర్వాత ఈ అదనపు 25 శాతాన్ని భారతీయ ఉత్పత్తులపై వర్తింపజేస్తారు. ఇప్పటికే నౌకల్లోకి ఎక్కించిన సరుకుపై ఈ అదనపు 25 శాతం సుంకాన్ని విధించబోరు. అలాగే బుధవారం అర్ధరాత్రిలోపు అమెరికా చేరుకునే ఉత్పత్తులపైనా ఈ అదనపు భారం మోపబోరు. సెప్టెంబర్ 17వ తేదీ అర్ధరాత్రిలోపు అమెరికాలో మార్కెట్లోకి వచ్చేసిన భారతీయ ఉత్పత్తులపై ఈ అదనపు వడ్డింపు ఉండదు.

తాము నష్టపోకుండా ముందుజాగ్రత్త

భారత్‌పై రెట్టింపు పన్నులతో రెచ్చిపోయిన ట్రంప్.. ఈ అదనపు సుంకాలు అమెరికా ఖజానాకు నష్టదాయకంగా మారకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే రంగాలవారీగా టారిఫ్ వసూలుచేస్తున్న ఉక్కు, అల్యూమినియంతోపాటు అత్యంత కీలకమైన ఫార్మాస్యూటికల్స్‌పై ఈ అదనపు భారం ఉండబోదని తెలుస్తోంది. తద్వారా అమెరికాలో ధరలు పెరగకుండా జాగ్రత్తపడుతున్నారు. ట్రంప్ విధించిన అదనపు టారిఫ్ కారణంగా భారత్‌లో సూక్ష్మ,చిన్న,మధ్య తరహా పరిశ్రమల ఉత్పత్తుల ఎగుమతి సంక్షోభంలో పడనుంది. టెక్స్‌టైల్స్, సముద్ర ఉత్పత్తులు, తోలు, సానబట్టిన వజ్రాలు, రత్నాభరణాల ఎగుమతులపై అదనపు టారిఫ్ భారం పడొచ్చు. దీంతో అమెరికాకు ఎగుమతి అవుతున్న వస్తూత్పత్తుల పరిమాణం సగానికి సగం తగ్గిపోవచ్చని భారతీయ ఎగుమతి సంస్థల సమాఖ్య(ఎఫ్ఐఈఓ) ఆందోళన వ్యక్తంచేసింది.

బ్రెజిల్.. భారత్ ఒక్కటే

అమెరికా దృష్టిలో బ్రెజిల్, భారత్ ఒక్కటేనని తాజా పన్నుల పెంపు పర్వంతో తేలిపోయింది. బ్రెజిల్‌పై అమెరికా ఇప్పటికే 50 శాతం టారిఫ్ విధిస్తుండగా భారత్‌పై తాజా పెంపుతో భారతీయ ఉత్పత్తుల దిగుమతి టారిఫ్ సైతం 50 శాతానికి చేరింది. మయన్మార్ ఉత్పత్తులపై 40 శాతం, థాయ్‌లాండ్ కాంబోడియాలపై 36 శాతం, బంగ్లాదేశ్‌పై 35 శాతం, ఇండోనేసియాపై 32 శాతం, చైనా, శ్రీలంకలపై 30 శాతం, మలేసియాపై 25 శాతం, ఫిలిప్పీన్స్, వియత్నాంలపై 20 శాతం టారిఫ్‌ను అమెరికా విధించిన విషయం విదితమే.

అత్యంత విచారకరమన్న భారత్

అదనంగా 25 శాతం టారిఫ్‌ల గుదిబండ పడేయడంపై భారత్ తీవ్ర ఆగ్రహం, అసహనం వ్యక్తంచేసింది. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ బుధవారం రాత్రి ఒక అధికారిక ప్రకటన విడుదలచేసింది. ''రష్యా నుంచి భారత్‌కు దిగుమతి అవుతున్న ముడి చమురునిల్వలను చూసి అమెరికా కళ్లలో నిప్పులు పోసుకుంటోంది. ఈ అంశంలో భారత్ తన వైఖరిని ఇప్పటికే సుస్పష్టంచేసింది. ముడిచమురు వంటి ఇంధన దిగుమతులు అనేవి పూర్తిగా మార్కెట్ ఒడిదుడుకులను అనుసరించి జరుగుతాయి. దేశ ఇంధన భద్రతే ఏకైక లక్ష్యంగా భారత్ ఇంధనాన్ని దిగుమతి చేసుకుంటోంది. భారత్‌పై అదనపు టారిఫ్ విధించడం ద్వారా ఎక్కువ సొమ్ములు కళ్లజూడాలని అమెరికా ఆశపడటం అత్యంత విచారకరం. ఇలాంటి చర్యలు ఏమాత్రం సబబుగా లేవు. ఇవన్నీ సహేతుకంకాని అన్యాయమైన నిర్ణయాలు. 140 కోట్ల మంది ప్రజల ఇంధన అవసరాలు మా తక్షణ కర్తవ్యం. ఇంతటి అత్యంత కీలకమైన బాధ్యతల నుంచి భారత్ ఏనాడూ పక్కకు తొలగిపోదు. దేశ ప్రయోజనాలు, ఇంధన సంక్షోభ నివారణ చర్యల విషయంలో భారత్ ఎప్పుడూ అప్రమత్తంగా ఉంటుంది. విదేశాలు తీసుకునే భారతవ్యతిరేక నిర్ణయాలపై కేంద్ర ప్రభుత్వం తగు కఠిన చర్యలు తప్పక తీసుకుంటుంది. జాతి ప్రయోజనాల పరిరక్షణ కోసం ఎలాంటి నిర్ణయాలైనా తీసుకుంటుంది. స్వప్రయోజనాల కోసం ప్రతిదేశం స్వీయ నిర్ణయాలు తీసుకుంటుందని అమెరికా స్ఫురణకు తెచ్చుకుంటే మంచిది''అని భారత విదేశాంగ శాఖ వ్యాఖ్యానించింది. గత మూడ్రోజుల్లో ట్రంప్ ప్రభుత్వానికి దీటుగా భారతప్రభుత్వం ఘాటైన జవాబివ్వడం ఇది రెండోసారి.

సీజే అభిప్రాయం కనుక్కోండి

తెలంగాణలో సివిల్ జడ్జీల నియామక నిబంధనల వివాదంపై సుప్రీంకోర్టు

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో సివిల్ జడ్జీల నియామక నిబంధనల విషయంలో తలెత్తిన వివాదంపై హైకోర్టు చీఫ్ జస్టిస్ అభిప్రాయం కనుక్కోవాలని సొలిసిటర్ జనరల్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది. అభ్యర్థి తప్పనిసరిగా తెలంగాణలో న్యాయవాదిగా కనీసం ఏడేళ్ల ప్రాక్టీస్ చేసి ఉండాలన్న నిబంధనను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై జస్టిస్ దీపాంకర్ దత్త, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసిహ్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున సీనియర్ కౌన్సిల్ మీనాక్షి అరోరా నేతృత్వంలోని న్యాయవాది వాదనలు విని పిస్తూ ఈ వ్యవహారంలో సుప్రీం మధ్యంతర ఉత్తర్వులతో ఏపీకి చెందిన కొందరు అభ్యర్థులు కూడా నియామక ప్రక్రియలో పాల్గొన్నప్పటికీ తుది నియామకాల్లో మాత్రం వారికి అవకాశం లభించలేదని ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చారు. 11 పోస్టుల కోసం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో 3 పోస్టులనే భర్తీ చేసి మిగిలిన 8 పోస్టులను 2024 నోటిఫికేషన్‌కు మళ్లించారని పేర్కొన్నారు. మెరిట్‌లో ఉన్న అభ్యర్థులను పక్కనబెట్టి తక్కువ మార్కులు సాధించిన వారికి కేవలం వారు తెలంగాణలోనే న్యాయవాదులుగా పనిచేస్తున్నారనే కారణంతో ఉద్యోగాలిచ్చారని వివరించారు. అయితే ఇంకా ఖాళీలు ఉన్నప్పటికీ అర్హులైన అభ్యర్థులను నియమించకపోవడంపై ధర్మాసనం ప్రశ్నలు వేసింది. తెలంగాణ హైకోర్టు జారీ చేసిన నూతన నిబంధనలను తప్పనిసరిగా అమలు చేయాలన్నది చీఫ్ జస్టిస్ అభిమతమా? లేక దీనిపై పునఃసమీక్షకు అవకాశం ఉందా? అనే విషయమై సందేహం వ్యక్తం చేసింది. 'పిటిషనర్లు మధ్యంతర ఉత్తర్వుల మేరకు పరీక్షలు రాసి మెరిట్‌లో నిలిచారు. కొత్త నిబంధనల వల్ల మాత్రమే వారు నియామకాలకు అర్హత సాధించలేకపోయారు. దీనిపై చీఫ్ జస్టిస్ పునర్విచారణకు సిద్ధంగా ఉంటే నియామకాలపై పునరాలోచించవచ్చు'అని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. తదుపరి విచారణను ఈ నెల 13కు వాయిదా వేసింది.



ఏఐలో తెలుగు, తమిళ భాషలకు ప్రాధాన్యం

లోక్‌సభలో ఈటల, డీకే అరుణ ప్రశ్నలకు కేంద్రమంత్రి జితిన్ ప్రసాద సమాధానం

సాక్షి, న్యూఢిల్లీ: దేశాన్ని 2047 నాటికి వికసిత భారత్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఎలక్ట్రానిక్స్ తయారీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగాల్లో కీలక చర్యలు చేపట్టిందని కేంద్ర ఐటీ శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద వెల్లడించారు. మంగళవారం లోక్‌సభలో ఎంపీలు డీకే అరుణ, ఈటల రాజేందర్ అడిగిన ప్రశ్నలకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాల్లో ఏఐ క్లస్టర్లు ఏర్పాటు ద్వారా దేశీయ భాషలతో ఏఐని అనుసంధానిస్తామన్నారు. తెలుగు, తమిళం వంటి పురాతన భాషలతో ఏఐ మోడళ్లను అభివృద్ధి చేయడం ద్వారా ప్రజలకు సాంకేతిక పరిజ్ఞానం మరింత చేరువవుతుందన్నారు.

దక్షిణ తెలంగాణలో ఇన్నోవేషన్ హబ్‌పై పరిశీలన: కేంద్రం

దక్షిణ తెలంగాణలో రీజినల్ ఇన్నోవేషన్ హబ్ లేదా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసే ప్రతిపాదనపై కేంద్రం పరిశీలన జరుపుతోందని, దీనిపై తగిన సమయంలో ప్రకటన చేస్తామని కేంద్ర విజ్ఞాన సాంకేతిక శాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు.నల్లగొండ జిల్లాలోనూ పరిశోధన మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్రం సహకారం అందించేందుకు సిద్ధంగా ఉందని కేంద్రమంత్రి పేర్కొన్నారు. లోక్‌సభలో తెలంగాణలోని నల్లగొండ జిల్లాను ప్రస్తావిస్తూ కాంగ్రెస్ ఎంపీ కుందూరు రఘువీర్ అడిగిన ప్రశ్నకు బుధవారం కేంద్రమంత్రి జితేంద్రసింగ్ ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో ఈ విషయాన్ని తెలిపారు.

మరిన్ని పార్లమెంట్ వార్తలు
సాక్షి ఫ్లస్ ఈ-పేపర్‌లో..

బనకచర్లపై బీఆర్ఎస్ వాయిదా తీర్మానం

సాక్షి, న్యూఢిల్లీ: గోదావరి నదిపై బనకచర్ల ప్రాజెక్ట్ నిర్మాణం పేరుతో ఏపీ ప్రభుత్వం చేస్తున్న జల దోపిడీపై రాజ్యసభలో బీఆర్ఎస్ చర్చకు సిద్ధమైంది. ఇందులో భాగంగా బుధవారం రాజ్యసభలో వాయిదా తీర్మానం ఇచ్చింది. సెంట్రల్ వాటర్ కమిషన్, పోలవరం ప్రాజెక్టు అథారిటీ, గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డ్, అపెక్స్ కౌన్సిల్ అనుమతులేవీ లేకుండానే ఏపీ ప్రభుత్వం బనకచర్లను నిర్మిస్తున్నట్లు బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు కేఆర్ సురేశ్‌రెడ్డి ఆరోపించారు. గోదావరి నీళ్లను అక్రమంగా వినియోగించుకుంటూ.. తెలంగాణ నీటి హక్కులకు నష్టం కలిగిస్తున్నందున 267 పద్దు కింద సురేశ్‌రెడ్డి వాయిదా తీర్మానం నోటీసు ఇచ్చారు. ఈ తీర్మానాన్ని రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్ తోసిపుచ్చి చర్చకు నిరాకరించారు.

ఫిలిప్పీన్స్ మంత్రితో మంత్రి ఉత్తమ్ భేటీ

బియ్యం ఎగుమతుల పెంపుపై చర్చ.. సానుకూలంగా స్పందించిన ఫ్రాన్సిస్కో

సాక్షి, న్యూఢిల్లీ: ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ మంత్రి ఫ్రాన్సిస్కో పి.టియు లారెల్ జూనియర్‌తో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బుధవారం ఢిల్లీలో భేటీ అయ్యారు. తెలంగాణ నుంచి బియ్యం ఎగుమతులను మరింత పెంచడంపై చర్చించారు. తెలంగాణ నుంచి దిగుమతి చేసుకుంటున్న బియ్యం నాణ్యతపట్ల ఫిలిప్పీన్స్ మంత్రి ప్రశంసలు కురిపించారు. తెలంగాణ నుంచి ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతుల పరిధిని విస్తరించడానికి ఆయన ఆసక్తి కనబరిచారు. ద్వైపాక్షిక వాణిజ్య విస్తరణకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ ఏడాది చివర్లో తెలంగాణలో పర్యటించాలని ఫిలిప్పీన్స్ మంత్రిని ఉత్తమ్ కోరగా ఫ్రాన్సిస్కో సానుకూలత వ్యక్తం చేశారు. పౌర సరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్.. తెలంగాణ సోనా (ఆర్ఎన్ఆర్ 15048) బియ్యం రకాన్ని ఎగుమతి చేసుకోవచ్చని సూచించారు. తెలంగాణ నుంచి మొక్కజొన్నను దిగుమతి చేసుకొనే అవకాశం గురించి ఫిలిప్పీన్స్ మంత్రి ఆరా తీశారు.



ఫిలిప్పీన్స్ మంత్రి ఫ్రాన్సిస్కోతో ఉత్తమ్ కరచాలనం

సామాజిక విప్లవానికి జాగృతి నాయకత్వం

- జయశంకర్ స్ఫూర్తితో సామాజిక తెలంగాణ సాధనకు కృషి
- తెలంగాణ జాగృతి ఆవిర్భావ వేడుకల్లో ఎమ్మెల్సీ కవిత



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సామాజిక విప్లవానికి తెలంగాణ జాగృతి నాయకత్వం వహిస్తుందని ఆ సంస్థ అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత తెలిపారు. సాంస్కృతిక, సామాజిక విప్లవాలను కలిసికట్టుగా ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. ప్రొఫెసర్ జయశంకర్ స్ఫూర్తితో సామాజిక తెలంగాణ సాధనకు కృషి చేస్తామని, ఆ దిశగా ఏ ఒక్క అంశాన్ని వదిలిపెట్టబోమని ప్రకటించారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో బుధవారం సంస్థ ఆవిర్భావ ఉత్సవాలతో పాటు ప్రొఫెసర్ జయశంకర్ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడుతూ.. 'ప్రొఫెసర్ జయశంకర్ కోరుకున్న సామాజిక తెలంగాణ లక్ష్యంగా తెలంగాణ జాగృతి పని చేస్తుంది. ఢిల్లీలో కాంగ్రెస్ ధర్నా కోసం తాను హైదరాబాద్‌లో చేపట్టిన 72 గంటల నిరాహార దీక్షను ప్రభుత్వం భగ్నం చేసింది' అని ఆరోపించారు.

కాంగ్రెస్ నిజస్వరూపం బట్టబయలైంది..

'ఎన్నికల్లో బీసీల ఓట్ల కోసం బూటకపు హామీలు, అబద్ధపు డిక్లరేషన్లు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ నిజ స్వరూపం ఢిల్లీ నడివీధుల్లో మరోసారి బట్టబయలైంది. తెలంగాణ బీసీ బిడ్డలను వరుసగా రెండుసార్లు ఢిల్లీకి పిలిపించి రాహుల్‌గాంధీ అవమానించాడు. 42 శాతం రిజర్వేషన్ల కోసం ఢిల్లీ జంతర్‌మంతర్ దగ్గర నిర్వహిస్తున్న ధర్నాలో పాల్గొనకుండా రాహుల్‌గాంధీ మొహం చాటేశాడు' అని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు.

మాధురిని తిరిగిచ్చేందుకు సిద్ధం

కొల్హాపూర్ జైన మఠం ఏనుగు వివాదంపై వంతారా జూ ప్రకటన

జామ్‌నగర్: మహారాష్ట్ర కొల్హాపూర్ సమీపంలోని నందనీ గ్రామంలో ఉన్న జైన మఠం నుంచి పునరావాసం కోసం తీసుకొచ్చిన ఏనుగు మాధురిని కోర్టు అనుమతిస్తే తిరిగి అప్పగించేందుకు సిద్ధమని గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో ఉన్న వంతారా జంతు సంరక్షణ కేంద్రం ప్రకటించింది. దాదాపు మూడు దశాబ్దాలపాటు జైన మఠంలో మతపరమైన కార్యక్రమాల్లో మాధురి సేవలందించింది. అయితే, మాధురి ఆరోగ్యంపై ఆందోళన వ్యక్తం చేస్తూ పెటా సంస్థ కోర్టుకు వెళ్లటంతో.. ఈ అంశంపై బాంబే హైకోర్టుతోపాటు సుప్రీంకోర్టు కూడా విచారణ జరిపి మాధురిని వంతారా జూకు తరలించాలని ఆదేశించటంతో అక్కడికి పంపారు. ఇటీవల మాధురిని తిరిగి తీసుకురావాలని పెద్ద ఎత్తున డిమాండ్లు రావటంతో వంతారా జూ యాజమాన్యం బుధవారం ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది.

టార్గెట్ రేవంత్!

సూచనలిస్తున్నానంటూనే ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి విమర్శలు

- తానే పదేళ్లు సీఎంగా ఉంటానన్న రేవంత్ వ్యాఖ్యలకు బహిరంగంగానే ఖండన
- పార్టీలో తొలిసారిగా విన్పించిన అసంతృప్త స్వరంతో కాంగ్రెస్‌లో కలకలం
- ముఖ్యమంత్రి భాష మార్చుకోవాలంటూ మరోసారి ఘాటైన వ్యాఖ్యలు
- మంత్రి పదవి గురించేనా?.. దీర్ఘకాలిక వ్యూహం ఉందా? అనే చర్చ

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్ష్యంగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో కలకలం రేపుతున్నాయి. గత కొన్ని రోజులుగా సీఎం వ్యాఖ్యలను, ఆయన వైఖరిని తప్పుపడుతున్న రాజగోపాల్‌రెడ్డి.. తాను ఎవరినీ విమర్శించడం లేదని, సూచనలు మాత్రమే చేస్తున్నానంటూనే తనదైన శైలిలో విమర్శలు కొనసాగిస్తున్నారు. తానే పదేళ్లు సీఎంగా ఉంటానన్న రేవంత్ వ్యాఖ్యలను ఇటీవల బహిరంగంగానే ఖండించారు. అంతేకాదు సమయం వచ్చినప్పుడల్లా రేవంత్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని మాటల తూటాలు పేలుస్తుండటం కాంగ్రెస్ పార్టీతో పాటు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమవుతోంది.

పార్టీ విధానాలకు వ్యతిరేకమంటూ..

పాలమూరు జిల్లాలో ఇటీవల జరిగిన బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ.. మరో పదేళ్లు తానే సీఎంగా ఉంటానని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలను రాజగోపాల్‌రెడ్డి బహిరంగంగా ఖండించడం ద్వారా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన 19 నెలల తర్వాత తొలిసారి పార్టీలో అసంతృప్త స్వరాన్ని వినిపించారు. ముఖ్యమంత్రి ఎవరనేది కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయిస్తుందని, తానే సీఎంగా ఉంటానని రేవంత్ చెప్పడం పార్టీ విధానాలకు వ్యతిరేకమని, ఈ వ్యాఖ్యలను నిఖార్సయిన కాంగ్రెస్ కార్యకర్తలు సహించరనే కోణంలో 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. రాజగోపాల్ వ్యాఖ్యలు అప్పట్లోనే కాంగ్రెస్ శిబిరంలో చర్చకు తెరలేపాయి. వాటి వెనుక ఆంతర్యమేంటన్న సందేహాలు వ్యక్తమయ్యాయి. ఆ ఎపిసోడ్ మరుగునపడుతోందనుకునే లోపే రాజగోపాల్ మరోమారు మరింత ఘాటైన విమర్శలు చేశారు. సోషల్ మీడియా గురించి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆయన తప్పుపట్టారు. ఆ తర్వాత బుధవారం కూడా అదే వైఖరి కొనసాగించారు. తనను కలిసిన డిజిటల్ మీడియా ప్రతినిధులనుద్దేశించి మాట్లాడుతూ.. సీఎం రేవంత్ ప్రతిపక్షాలను ఉద్దేశించి వాడుతున్న భాషను మార్చుకోవాలని సూచించారు. తాను రేవంత్‌రెడ్డిని విమర్శించడం లేదంటూనే, పార్టీలో జరుగుతున్న తప్పులను చెప్పకపోతే నష్టం జరుగుతుందని, అందుకే చెపుతున్నానంటూ ముక్తాయింపునివ్వడం గమనార్హం.

అధిష్టానాన్నీ వదలకుండా..

రాజగోపాల్‌రెడ్డి అప్పుడప్పుడూ పార్టీ అధిష్టానాన్ని సైతం వదిలిపెట్టకుండా సుతిమెత్తని వ్యాఖ్యలు చేస్తుండటం గమనార్హం. తనకు మంత్రి పదవి ఇస్తానని అధిష్టానం మాట ఇచ్చిందని చెబుతూ.. భువనగిరి ఎంపీ సీటులో గెలిపించినప్పటికీ అధిష్టానం మాత్రం తన మాట నిలబెట్టుకోవడం లేదంటూ నర్మగర్భంగా అసంతృప్తిని వెళ్లగక్కుతున్నారు. అధిష్టానం మంత్రి పదవి ఇస్తుందా లేదా అన్నది వారిష్టమని అంటూనే, మునుగోడు ప్రజల కోసం మళ్లీ త్యాగం చేసేందుకు కూడా వెనుకాడేది లేదంటూ పరోక్ష హెచ్చరికలు జారీ చేస్తుండడం గమనార్హం. రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలన్నిటిపై కాంగ్రెస్ పార్టీలో చర్చ జరుగుతోంది. మంత్రిపదవి ఇవ్వనందుకే రాజగోపాల్‌రెడ్డి అలా మాట్లాడుతున్నారని కొందరు, మంత్రిపదవి మాత్రమే కాదని దీర్ఘకాలిక వ్యూహంతో ఆయన వెళుతున్నారని, అందుకే రేవంత్ పదేళ్ల సీఎం వ్యాఖ్యలకు చెక్ పెట్టేందుకు ముందుకు వచ్చారని మరికొందరు అంటున్నారు. పార్టీలోని కొందరు నేతలు చేయలేని పనిని ఆయన చేశారని మరికొందరు వ్యాఖ్యానిస్తుండడం గమనార్హం.



డీకేతో భేటీ..!

రాజగోపాల్‌రెడ్డి బుధవారం మధ్యాహ్నం కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో భేటీ అయ్యారు. ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు హైదరాబాద్ వచ్చిన ఆయనతో మాదాపూర్‌లోని ఓ హోటల్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇరువురు వ్యక్తిగత, రాజకీయ అంశాలపై చర్చించారని, రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలను రాజగోపాల్‌రెడ్డి వివరించారని సమాచారం. కాగా ఈ వ్యవహారంపై గురువారం ఆయనతో మాట్లాడతానని పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి ఢిల్లీలో వ్యాఖ్యానించడం కొసమెరుపు.

క్లుప్తంగా...

దోస్త్ ప్రత్యేక రౌండ్‌కు భారీ స్పందన

సాక్షి, హైదరాబాద్: దోస్త్ ప్రత్యేక రౌండ్ కౌన్సెలింగ్‌కు గతంలో లేని విధంగా మంచి స్పందన వచ్చింది. ఈ ఒక్క రౌండ్‌లోనే 54,048 డిగ్రీ సీట్లను కేటాయించారు. ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి బుధవారం దోస్త్ ప్రత్యేక రౌండ్ సీట్ల కేటాయింపు వివరాలను వెల్లడించారు. 44,889 మందికి మొదటి ఆప్షన్ సీట్లు కేటాయించారు. 9,159 మంది రెండో ఆప్షన్ సీట్లు పొందారు. సరైన ఆప్షన్లు ఇవ్వకపోవడం వల్ల 3,290 మంది సీట్లు పొందలేకపోయారు. కామర్స్‌లో 22,328, ఫిజికల్ సైన్స్‌లో 12,211, లైఫ్ సైన్స్‌లో 10,435, ఆర్ట్స్‌లో 8,979, ఇతర గ్రూపుల్లో 95 మంది సీట్లు పొందారు. అన్ని రౌండ్లు కలిపి ఇప్పటి వరకు 1,96,820 డిగ్రీ సీట్లు భర్తీ అయ్యాయి.

జీఎస్టీ అప్పిల్లెట్ ట్రిబ్యునల్ మెంబర్‌గా భాస్కర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: జీఎస్టీ అప్పిల్లెట్ ట్రిబ్యునల్ జ్యుడీషియల్ మెంబర్‌గా సీనియర్ న్యాయవాది వేమిరెడ్డి భాస్కర్‌రెడ్డిని నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జీఎస్టీ వివాదాల పరిష్కారానికి ఏర్పాటు చేసిన ట్రిబ్యునళ్లలో ప్రిన్సిపల్ బెంచ్ ఢిల్లీలో ఉంటుంది. ఈ ట్రిబ్యునళ్లకు 52 మంది జ్యుడీషియల్ మెంబర్లను, 31 మంది టెక్నికల్ మెంబర్లను నియమిస్తూ కేంద్రం ఉత్తర్వులిచ్చింది. తెలుగు రాష్ట్రాల నుంచి వేమిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఒక్కరే నియామకం కావడం విశేషం. రాజమండ్రి లా కాలేజీలో విద్యనభ్యసించిన వేమిరెడ్డి 1987లో బార్ కౌన్సిల్‌లో ఎన్‌రోల్ అయ్యారు. ట్యాక్స్ లాలో నైపుణ్యం సంపాదించి తెలుగు రాష్ట్రాల్లోని హైకోర్టులో వాదనలు వినిపించారు. ఉమ్మడి హైకోర్టులో స్పెషల్ జీపీగా పనిచేశారు. 2022లో ఆయన సీనియర్ న్యాయవాది హోదా పొందారు.

మరింత గడువు కోరడం సబబు కాదు

తెలంగాణ సర్పంచ్‌ల సంఘం జేఏసీ

సాక్షి, హైదరాబాద్: దాదాపు రెండేళ్లకుపైగా పెండింగ్‌లో ఉన్న తమ బిల్లులను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరితే పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు తాత్సారం చేస్తున్నారని తెలంగాణ సర్పంచ్‌ల సంఘం జేఏసీ ఆరోపించింది. తమ పెండింగ్ బిల్లుల విషయమై తాము కొన్నిరోజుల క్రితం రాష్ట్ర మానవహక్కుల కమిషన్‌ను ఆశ్రయిస్తే...ఈ నెల 2న హాజరై వివరణ ఇవ్వాలని పీఆర్‌ఆర్‌డీ కమిషనర్ కార్యాలయాన్ని కమిషన్ ఆదేశించిందని జేఏసీ అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ తెలిపారు. ఈ విషయమై కనుక్కునేందుకు తాము కమిషన్ కార్యాలయానికి వెళితే... పీఆర్‌ఆర్‌డీ శాఖ మరో నాలుగు వారాల గడువు కోరినట్టు కమిషన్ అధికారులు తమకు తెలియజేశారన్నారు. దీంతో తమ ఫిర్యాదుపై సెప్టెంబర్ 16కు విచారణ వాయిదా పడిందని ఆయన తెలిపారు. ఈ విధంగా వాయిదా కోరడం సబబుగా లేదని పేర్కొన్నారు.

అథ్లెటిక్ పోటీల్లో బీసీ గురుకుల విద్యార్థులకు స్వర్ణపతకాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అథ్లెటిక్ అసోసియేషన్ నిర్వహించిన 11వ రాష్ట్రస్థాయి అథ్లెటిక్ క్రీడా పోటీల్లో బీసీ గురుకుల విద్యార్థులు స్వర్ణ పతకాలు సాధించారు. ఈ నెల 3, 4 తేదీల్లో హనుకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన క్రీడా పోటీల్లో మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల విద్యార్థులు స్వర్ణ పతకాలను సాధించారు. 200 మీటర్లు, 400 మీటర్ల పరుగు పందెంలో వరుసగా రెండు స్వర్ణ పతకాలను మహబూబ్‌నగర్ జిల్లాలోని కోయిల్‌కొండ బీసీ గురుకుల కాలేజీలో చదువుతున్న కె.శివకుమార్ సాధించాడు. 600 మీటర్ల పరుగు పోటీల్లో స్వర్ణ పతకం యాదాద్రి భువనగిరి జిల్లాలోని పోచంపల్లి బీసీ గురుకుల కాలేజీలో చదువుతున్న భరత్ సాధించాడు. స్వర్ణ పతకాలను గెలుచుకున్న విద్యార్థులను బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సెక్రటరీ శ్రీధర్, ఎంజేపీ సెక్రటరీ బడుగు సైదులు, జాయింట్ సెక్రటరీ తిరుపతి అభినందించారు. అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ విద్యార్థులు పతకాలు సాధించాలని ఎంజేపీ కార్యదర్శి బడుగు సైదులు ఆకాంక్షించారు.

మంత్రి పదవి హామీ ఇచ్చి పార్టీలోకి తీసుకొచ్చారు

- అధిష్టానం పిలుపు మేరకే కాంగ్రెస్‌లోకి వచ్చా.. ప్రభుత్వ పెద్దలు భాష మార్చుకోవాలి
- బీఆర్‌ఎస్ భవిష్యత్‌లో ఉండదు... ప్రతిపక్ష నేత పదవి వేరేవారికి ఇవ్వాలి
- తెలంగాణకు అన్యాయం జరిగితే బహిరంగంగానే మాట్లాడతా
- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు



సాక్షి, హైదరాబాద్: తనకు మంత్రి పదవి ఇస్తానని హామీ ఇచ్చి పార్టీలోకి తీసుకొచ్చారని, అధిష్టానం పిలుపు మేరకే తాను తిరిగి కాంగ్రెస్‌లోకి వచ్చానని మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ అని, ఐదేళ్లు అధికారంలో ఉంటుందని చెప్పిన ఆయన.. తప్పు ఎక్కడ జరుగుతుందో తెలియకపోతే పార్టీకి నష్టం జరుగుతుందని, అందుకే కొన్ని విషయాలను చెబుతున్నానన్నారు. రాష్ట్రంలోని డిజిటల్ మీడియా ప్రతినిధులు హైదరాబాద్‌లోని నివాసంలో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డిని బుధవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వంలో ఉన్న పెద్దలు భాష మార్చుకోవాలని హితవు పలికారు. ప్రజల పక్షాన నిర్ణయాలు తీసుకోవాలని, తక్కువ మాట్లాడి ఎక్కువ పనులు చేయాలన్నారు. ఖాళీగా ఉన్న కేబినెట్ బెర్తులను భర్తీ చేసి, వీలున్నంత త్వరగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరారు. తాను రేవంత్‌రెడ్డిని విమర్శించడం లేదని సలహాలు, సూచనలు మాత్రమే ఇస్తున్నానని చెప్పారు.

వాళ్లు ఫ్రస్ట్రేషన్‌లో ఉన్నారు

బీఆర్‌ఎస్ పార్టీ అధికారం పోయిందన్న ఫ్రస్ట్రేషన్‌లో ఉందని రాజగోపాల్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ అసెంబ్లీకి రాకుండా ప్రతిపక్ష హోదాలో కొనసాగే అర్హత లేదని, ఆయన అసెంబ్లీకి రావాలని లేదంటే ప్రతిపక్ష నేత హోదా ఇంకెవరికైనా ఇవ్వాలన్నారు. రాబోయే రోజుల్లో బీఆర్‌ఎస్ ఉండదని జోస్యం చెప్పారు. మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని కేసీఆర్ దివాలా తీయిస్తే ఆంధ్ర పెట్టుబడిదారులు రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని, సమయం వచ్చినప్పుడు వారి బండారం బయటపెడతానన్నారు. రాష్ట్ర సంపదను లూటీ చేసే విషయంలో, కాంట్రాక్టుల విషయంలో, భూములు, ఇసుక మాఫియా విషయంలో... తెలంగాణకు అన్యాయం జరిగే ఏ విషయం గురించైనా తాను బహిరంగంగానే మాట్లాడతానని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో కేసీఆర్ ఫ్యామిలీ లక్షల కోట్లు దాచుకుందని, విచారణల పేరుతో కాలయాపన చేయకుండా గత పదేళ్ల కాలంలో అవినీతి సొమ్మును దోచుకున్న వారందరినీ వీలున్నంత త్వరగా జైల్లో పెట్టాలని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి కోరారు.

నన్ను క్షమించండి

ఎవరికీ చెప్పకుండా రాజీనామా చేశా: మాజీ ఎమ్మెల్యే గువ్వల



మాట్లాడుతున్న మాజీఎమ్మెల్యే గువ్వల బాలరాజు

అచ్చంపేట/అచ్చంపేట రూరల్: బీఆర్ ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్టు ఎవరికీ చెప్పలేదని, ఈ విష యంలో కార్యకర్తలు తనను క్షమించాలని అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు కోరారు. బుధవారం అచ్చంపేటలోని తన స్వగృహంలో కార్యకర్తలు, ముఖ్య అనుచరులతో సమావేశమయ్యారు. కార్యకర్తల అభిప్రాయాల సేకరణ అనంతరం బాలరాజు మాట్లాడారు. ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఇంకెవరో వస్తారని తాను రాజీనామా చేయలేదని, రాజకీయ భవిష్యత్‌ను కూడా ఆలోచన చేయలేదన్నారు. కాంగ్రెస్, బీజేపీ అగ్రనాయకులు తనకు టచ్‌లో ఉన్నారని, దేశ రాజకీయాలకు పరిచయం చేసింది అచ్చంపేట కార్యకర్తలేనని చెప్పారు. మెజారిటీ కార్యకర్తలు, అనుచరులు రాజీనామాపై పునరాలోచించాలని, బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేయడం ముమ్మాటికీ తప్పేనని బాలరాజుకు తేల్చి చెప్పారు. బీజేపీలో చేరితే రాజకీయ భవిష్యత్ ఉండదన్నారు. కొందరు గువ్వల వెంటే ఉంటామని చెప్పగా.. మెజారిటీ కార్యకర్తలు బీఆర్‌ఎస్‌ను వీడొద్దని వేడుకున్నారు. అంతకుముందు బాలరాజు సతీమణి గువ్వల అమల మాట్లాడుతూ తనకు రాజకీయాలంటేనే గిట్టవని, తన భర్త వెనుక ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ అరుణ, నాయకులు శంకర్‌మాదిగ, మహేందర్, అమీనొద్దీన్ పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు కోరుతూ మహాధర్నా

వాల్‌పోస్టర్ విడుదల చేసిన ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని (సీపీఎస్) రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 1న మహాధర్నా నిర్వహించనున్నట్టు టీచర్స్ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి ప్రకటించారు. ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను బుధవా రం ఆయన హైదరాబాద్ పీఆర్టీయూటీఎస్ కార్యాలయంలో విడుదల చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. ఇందిరా పార్క్ వద్ద జరిగే మహాధర్నాకు పెద్ద సంఖ్యలో హాజరవ్వాలని ఉపాధ్యాయులకు ఆయన పిలుపునిచ్చారు. ఈ ధర్నా కార్యక్రమానికి ఏఐఎఫ్‌టీయూ సెక్రటరీ జనరల్ సీఎల్ రోజ్ హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మారం జగదీశ్, ఏలూరు శ్రీనివాసులు, పీఆర్టీయూటీఎస్ అధ్యక్షుడు గుండు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి, టీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజీబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నీట్ యూజీ కౌన్సెలింగ్‌కు కొత్త షెడ్యూల్

- 9 నుంచి రాష్ట్ర కోటా కౌన్సెలింగ్ ప్రారంభం
- సుప్రీంకోర్టులో కేసు కారణంగా షెడ్యూల్‌లో మార్పు
- స్టేట్ స్ట్రే వేకెన్సీ కౌన్సెలింగ్ అక్టోబర్ 2 నుంచి 5 వరకు
- అక్టోబర్ 10తో ముగియనున్న నీట్ యూజీ ప్రవేశాలు
- తాజా షెడ్యూల్ విడుదల చేసిన కాళోజీ యూనివర్సిటీ

సాక్షి, హైదరాబాద్: నీట్‌యూజీ–2025లో భాగంగా మెడికల్ కాలేజీల్లో రాష్ట్ర కోటా కింద ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల ప్రవేశాల కౌన్సెలింగ్‌కు కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం కొత్త షెడ్యూల్‌ను ప్రకటించింది. గత నెల 12వ తేదీన ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఆల్ ఇండియా కోటా కౌన్సెలింగ్ జూలై 21 నుంచి ప్రారంభమైతే, స్టేట్ కోటా కౌన్సెలింగ్ అదే నెల 30 నుంచి ప్రారంభం కావలసి ఉంది. అయితే, స్థానికత అంశంపై సుప్రీంకోర్టులో కేసు విచారణలో ఉండటంతో స్టేట్ కోటా కౌన్సెలింగ్‌ను వాయిదా వేశారు. మంగళవారం స్థానికత అంశంపై సుప్రీంకోర్టులో వాదనలు ముగిసి, తీర్పు రిజర్వు చేసిన నేపథ్యంలో వర్సిటీ కొత్త షెడ్యూల్‌ను ప్రకటించింది. అదే సమయంలో ఆల్ ఇండియా కోటా, డీమ్డ్, సెంట్రల్ వర్సిటీ ప్రవేశాల కౌన్సెలింగ్ తేదీల్లో కొన్ని మార్పులు జరిగినట్లు తెలిపింది.

9 నుంచి స్టేట్ కోటా కౌన్సెలింగ్

ఆల్ ఇండియా కోటాలో జూలై 21 నుంచి 30 వరకు తొలి విడత కౌన్సెలింగ్ జరగాల్సి ఉండగా, దానిని ఆగస్టు 9 వరకు పొడిగించారు. స్టేట్ కోటా తొలి విడత కౌన్సెలింగ్‌ను ఆగస్టు 9 నుంచి 18 వరకు నిర్వహించాలని వర్సిటీ నిర్ణయించింది. మూడు విడతల తర్వాత ఆల్ ఇండియా కోటా కింద స్ట్రే వేకెన్సీ కోటా కౌన్సెలింగ్ సెప్టెంబర్ 30 నుంచి 4 అక్టోబర్ వరకు జరగనుంది. రాష్ట్ర కోటాలో స్ట్రే వేకెన్సీ కోటా కౌన్సెలింగ్ అక్టోబర్ 2 నుంచి 5 వరకు నిర్వహిస్తారు. అక్టోబర్ 10వ తేదీతో ఆల్ ఇండియా కోటాతోపాటు స్టేట్ కోటా ప్రవేశాల ప్రక్రియ ముగుస్తుందని యూనివర్సిటీ ప్రకటించింది. సుప్రీంకోర్టు తీర్పు 9వ తేదీ వరకు వెలువడే అవకాశం ఉందనే ఉద్దేశంతోనే వర్సిటీ కొత్త షెడ్యూల్ ప్రకటించినట్లు తెలుస్తోంది. కాగా, బీఎస్సీ, బీడీఎస్, ఇతర అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సుల అకడమిక్ సెషన్ సెప్టెంబర్ 5 నుంచి ప్రారంభం కానుంది.

కొత్త షెడ్యూల్ ప్రకారం నీట్ కౌన్సెలింగ్ వివరాలు

ఆల్ ఇండియా/డీమ్డ్/కేంద్ర విశ్వవిద్యాలయాలు
మొదటి రౌండ్ కౌన్సెలింగ్: జూలై 21 నుంచి ఆగస్టు 9 వరకు
ఎంసీసీ ద్వారా అభ్యర్థుల డేటా ధ్రువీకరణ: ఆగస్టు 19 నుంచి 20 వరకు
చేరికకు చివరి తేదీ: ఆగస్టు 18
రెండో రౌండ్ కౌన్సెలింగ్: ఆగస్టు 21 నుంచి 29 వరకు
చేరికకు చివరి తేదీ: సెప్టెంబర్ 5
మూడో రౌండ్: సెప్టెంబర్ 9–17
చేరికకు చివరి తేదీ: సెప్టెంబర్ 25
స్ట్రే వేకెన్సీ రౌండ్: సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 4 వరకు
చేరికకు చివరి తేదీ: అక్టోబర్ 10

స్టేట్ కోటా కౌన్సెలింగ్ వివరాలు

మొదటి రౌండ్: ఆగస్టు 9 నుంచి 18 వరకు
డేటా ధ్రువీకరణ: ఆగస్టు 25 నుంచి 26 వరకు
చేరికకు చివరి తేదీ: ఆగస్టు 24
రెండో రౌండ్: ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 5 వరకు
డేటా ధ్రువీకరణ: సెప్టెంబర్ 12 నుంచి 13 వరకు
చేరికకు చివరి తేదీ: సెప్టెంబర్ 11
మూడో రౌండ్: సెప్టెంబర్ 15 నుంచి 25 వరకు
డేటా ధ్రువీకరణ: అక్టోబర్ 1
చేరికకు చివరి తేదీ: సెప్టెంబర్ 30
స్ట్రే వేకెన్సీ రౌండ్: అక్టోబర్ 2 నుంచి 5 వరకు
చేరికకు చివరి తేదీ: అక్టోబర్ 10

ప్రొటోకాల్ పాటించాలని కోరడం తప్పా?

బీఆర్‌ఎస్ మహిళా నేతలు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ పాటించాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కోరడం తప్పా అని ప్రభుత్వాన్ని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ ప్రశ్నించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్, మాజీ జెడ్పీ చైర్ పర్సన్ తుల ఉమ, బీఆర్‌ఎస్ నాయకురాలు సుమిత్రానంద్‌లతో కలిసి ఆమె మాట్లాడారు. బాలాపూర్‌లో రేషన్ కార్డుల పంపిణీ సందర్భంగా సబితకి అవమానం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి, ఎమ్మెల్సీ సురభి వాణీదేవికి కనీస గౌరవం ఇవ్వలేదని ఆరోపించారు. వార్డు మెంబర్‌గా గెలవలేని వాళ్లను, కాంగ్రెస్ నేతలను వేదికపై కూర్చోబెడుతున్నారని, రాష్ట్రంలో రాచరిక పాలన చేయాలని రేవంత్‌రెడ్డి భావిస్తున్నారని ధ్వజమెత్తారు. ఇందిరమ్మ ఇళ్లు 4లక్షలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ 20 నెలల్లో రెండు వేల ఇళ్లు మాత్రమే పూర్తిచేసిందని, మిగతా ఇళ్లు ఎప్పుడు పూర్తి చేస్తారో చెప్పాలని ఆమె నిలదీశారు. తుల ఉమ మాట్లాడుతూ.. శ్రీధర్ బాబు వేదికపై ఉండగానే సబితా ఇంద్రారెడ్డికి అవమానం జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.



మనిషికి తాను ఏ తీరం చేరాలో తెలియకపోతే, ఏ గాలీ అతడికి అనుకూలంగా ఉండదు.
– సెనెకా

సాక్షి
గురువారం, 7 ఆగస్టు 2025

జలప్రళయం

ఎన్ని హెచ్చరికలు చేస్తున్నా, ఎంతగా ఆగ్రహావేశాలు ప్రదర్శిస్తున్నా బేఖాతరు చేస్తున్న మనిషిపై ప్రకృతి మరోసారి తన విశ్వరూపాన్ని చూపింది. దేవభూమిగా పిలుచుకునే ఉత్తరాఖండ్‌లోని ధరాలీ గ్రామంపై మంగళవారం ఉవ్వెత్తున విరుచుకుపడిన వరద అక్కడి ఇళ్లూ, హోటళ్లూ, రెస్టారెంట్లూ, దుకాణాలూ వగైరాలను ఊడ్చిపెట్టేయగా దాదాపు వందమంది ఆచూకీ తెలియటం లేదని వార్తలొస్తున్నాయి. హర్సిల్ ప్రాంతంలో ఉన్న సైనిక శిబిరం కొట్టుకుపోగా అందులోని పదిమంది జవాన్ల ఆచూకీ తెలియటం లేదు. కుంభవృష్టితో ఖీర్‌గంగా నది పోటెత్తి ఇంత విలయానికి దారితీసింది. ఆకస్మిక వరదకు అరగంట ముందే ధరాలీ మార్కెట్ ప్రాంతానికి విరిగిపడ్డ కొండచరియలు, బురద కొట్టుకొచ్చాయనీ, అంతలోనే భారీయెత్తున వరదనీరు విరుచుకుపడిందనీ స్థానికుల కథనం. ఆత్మరక్షణ కోసం సమీపంలోని కొండపైకి ఎక్కినవారికి ఖీర్‌గంగ పెనుగర్జన వినబడిందంటే ఉద్ధృతి ఏ స్థాయిలో ఉందో ఊహించుకోవచ్చు. కేవలం 15 సెకన్ల వ్యవధిలోనే ఈ జలప్రళయం విరుచుకుపడింది.

ప్రకృతి విలయం సంభవించినప్పుడల్లా ఎన్నో విషాద ఘట్టాలు ఆవిష్కృతమవుతాయి. ఇకపై అత్యంత జాగ్రత్తగా మెలగాలన్న సంకల్పమూ వినబడుతుంది. నెలలు కాదు... రోజులు గడిచేసరికే అదంతా మరుగునపడుతుంది. పర్యావరణాన్ని బేఖాతరు చేస్తూ నిర్మాణాలు మొదలవుతాయి. నదుల్ని దేవతలుగా కొలిచే సంప్రదాయం మనది. అయినా వాటికి అవరోధం కలిగించే నిర్మాణాలైనా, వాటిని కాలుష్యంలో ముంచే కర్మాగారాలనైనా అనుమతించరాదన్న గ్రహింపు పాలకులకు లేదు. గంగానదిని మాఫియాల బారి నుంచి కాపాడాలంటూ 2011లో ఉపవాసదీక్షకు పూనుకున్న స్వామి నిగమానంద ప్రాణత్యాగం చేసినా పాలకుల వైఖరిలో మార్పు లేదు. ఉత్తరాఖండ్‌కు విపత్తులు కొత్తగాదు. దశాబ్దాలుగా ఇంచుమించు ఏటా రివాజుగా వరదలొస్తాయి. గ్రామాలకు గ్రామాలు వరదనీటిలో చిక్కుకుంటాయి. కొన్నిసార్లు పెద్దగా సమస్యలేమీ లేకుండా ముగుస్తుంది. 2013లో సంభవించిన విలయం ఏకంగా 6,000 మందిని బలి తీసుకుంది. అంతకు ముందూ తర్వాతా కూడా పదుల నుంచి వందలమంది వరకూ మృత్యువాత పడిన సందర్భాలున్నాయి. అభివృద్ధి ముసుగులో ప్రకృతినీ, పచ్చటి ప్రాంతాలనూ ధ్వంసం చేయటం... వేర్వేరు ప్రాజెక్టులకు ఎడాపెడా అనుమతులీయటం మన దేశంలో పాలకులకు అలవాటైన జాడ్యం. ఇప్పుడు ఉత్తరాఖండ్‌లో వరదలొచ్చిన ప్రాంతం భాగీరథి పర్యావరణ జోన్ పరిధిలో ఉంది. దాన్ని అత్యంత జాగ్రత్తగా పరిరక్షించాల్సిన ప్రాంతంగా గుర్తించారు. 4,157 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించిన ఆ జోన్‌ను 2012లో నోటిఫైడ్ ప్రాంతంగా పరిగణించారు. అక్కడ జరిగే విచక్షణారహిత అభివృద్ధిని నియంత్రించటానికి ఉద్దేశించిన ఈ చర్య ఆచరణలో ఎందుకూ కొరగాకుండా పోయింది. నదులూ, ఉపనదుల సమీపంలో నిర్మాణాలు ఉండరాదన్న ఇంగితజ్ఞానం ఎవరికీ లేదు. ప్రతిష్ఠాత్మకమైన చార్‌ధామ్ జాతీయ రహదారి ప్రాజెక్టు సైతం ఆ ప్రాంతంలోనే ఉంది. పర్యావరణ ఉద్యమకారులు న్యాయ స్థానాల్లోనూ, వెలుపలా పోరాడినా... చివరకు ప్రభుత్వానిదే పైచేయి అయింది. ఏడాదిక్రితం 34వ జాతీయరహదారిపై హినా–టెక్లాల మధ్య నిర్మించతలపెట్టిన బైపాస్ రోడ్డు గురించి కూడా ఆందోళనలు జరిగాయి. ఆ ప్రాంతం ధరాలీకి దక్షిణంగా ఉంది.

ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ అమరికలో పెను మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఒకప్పుడు ధ్రువ ప్రాంతాల్లో, హిమపర్వతశ్రేణిలో మాత్రమే కుంభవృష్టి, ఆకస్మిక వరదలు ఉండేవి. అలాంటి రాతినేలలకు వరద నీటిని పట్టివుంచే గుణం తక్కువ. నిమిషాల వ్యవధిలో వరదలు పోటెత్తుతాయి. కొండచరియలు విరిగిపడి ముప్పును మరిన్నిరెట్లు పెంచుతాయి. పర్యావరణంలో వచ్చిన మార్పుల పర్యవసానంగా ప్రకృతి వైపరీత్యాలకు ఏ ప్రాంతమూ అతీతం కాని స్థితి వచ్చేసింది. వాతావరణాన్ని కొలవటానికి ఉపయోగించే నమూనాలు, ఉపకరణాలు ఒక్కోసారి విఫలం కావటానికి మారిన స్థితిగతులే కారణం. వేడిగాలులు ఎక్కువ తేమను పట్టి ఉంచుతాయి. ఒక డిగ్రీ ఉష్ణోగ్రత హెచ్చితే తేమ ఏడు శాతం పెరుగుతుందనీ, దీనికి అధికశక్తి ఉంటుందనీ శాస్త్రవేత్తలు చెబుతున్న మాట. వాతావరణంలో తేమ పెరిగినకొద్దీ వేడిగాలుల వల్ల ఆకస్మిక కుంభవృష్టికి అనువైన పరిస్థితులేర్పడతాయి. అందుకే ఉత్తరాఖండ్ వంటిచోట్ల మాత్రమే కాదు... అన్నిచోట్లా పర్యావరణాన్ని ప్రాణప్రదంగా చూసుకుంటూ దానికి విఘాతం కలగనీయని రీతిలో ఆచరణ ఉండాలి. కానీ పట్టించుకునేదెవరు? అందుకే ప్రభుత్వాల అభివృద్ధి నమూనాలు మారాలి. పర్యావరణానికి విఘాతం కలిగించే అవకాశ మున్నదని భావించే ఎలాంటి ప్రాజెక్టునైనా నిస్సంకోచంగా తిరస్కరించాలి. ఇప్పుడొచ్చిన ఉత్పాతం ఆఖరిది కావాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు శ్రావణ మాసం, **తిథి:** శు.త్రయోదశి ప.1.27 వరకు, తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** పూర్వాషాఢ ప.2.09 వరకు, తదుపరి ఉత్తరాషాఢ, **వర్జ్యం:** రా.10.28 నుండి 12.08 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.59 నుండి 10.49 వరకు, తదుపరి ప.3.02 నుండి 3.52 వరకు, **అమృత ఘడియలు:** ఉ.9.01 నుండి 10.44 వరకు.

సూర్యోదయం : 5.44
సూర్యాస్తమయం: 6.28
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

సోషల్ టాక్

అమ్మచేతి వంట



మనందరికీ అమ్మ చేతి వంట ఇష్టం. చేనేత వస్త్రాల పట్ల కూడా నాకు అదే భావన ఉంది. ఎందుకంటే, చేనేత కార్మికులు అంతే ప్రేమతో నేత పని చేస్తారు. చేనేత బట్టల తయారీలో కలిసి ఉండే అనురాగాన్ని నేను అనుభూతి చెందగలను.

– నరేంద్ర మోదీ, భారత ప్రధాని

ఆలోచించండి



ప్రపంచం అసహనంగా మారిపోయింది. దేనినీ పూర్తిగా తెలుసుకోకుండానే, విషయం ఏమిటో అర్థం కాకుండానే చటుక్కున స్పందిస్తున్నాం. సోషల్ మీడియా కుమ్మరిస్తున్న సమాచారం ఎవరికీ సొంతంగా ఆలోచించే సమయమే ఇవ్వటం లేదు.

– ప్రతీక్ గాంధీ, నటుడు

అప్‌డేట్ అవ్వాలి



ఇంగ్లిష్ భాష కష్టజీవి. 'గురు', 'కర్మ', 'బంగళా' వంటి ఇతర భాషల పదాలను తనలో కలుపుకొంటూ నిరంతరం సంపన్నం అవుతుంటుంది. తను కూడా ఎప్పటికప్పుడు కొత్త పదాలు కనిపెడుతుంది. మనిషి సామాజిక జీవనం కూడా ఇలాగే ఉండాలి. కొత్తవి నేర్చుకుంటూ, ఎప్పటికప్పుడు కొత్త వాటిని చేర్చుకుంటూ!

– జగ్ సురయా, కాలమిస్ట్

కొంతవరకే ఏఐ



ప్రతి సాంకేతిక విప్లవం అవకాశాన్నీ, ఆందోళననూ రెండిటినీ సృష్టిస్తుంది. ప్రింటింగ్ ప్రెస్ ప్రచురణ కర్తలకు ఊపిరి పోసింది కానీ, కథకుల ఉసురు తీయగలిగిందా? ఏఐ కూడా అంతే! కొత్త కెరీర్‌లకు దారులు వేయొచ్చు కానీ, మానవ మేధను పక్కకు తోసేయలేదు.

– దేవశీష్ శర్మ, సీఈవో, 'టాగ్డ్'

అన్నీ మీలోనే!



గొప్పగా ఉండటానికి కావలసినవన్నీ మీలోనే ఉన్నాయి. ఎవరైనా వచ్చి, లేదా ఏదైనా జరిగి, మీలో వెలుగు నిండే వరకు వేచి ఉండకండి. మీకు సరిపడా నైపుణ్యాలు, ప్రతిభ మీలోనే ఉన్నాయి. కావలసింది ప్రయత్నం. తక్షణం ప్రారంభించటం మాత్రమే.

– డారెన్ హార్డీ, ప్రసిద్ధ వక్త, రచయిత

మనో దారుఢ్యం



మీరు శాశ్వత మార్పు తీసుకురావాలనుకుంటే, మీ సమస్యల పరిమాణంపై దృష్టి పెట్టడం మానేసి, మీ మానసిక దారుఢ్యంపై దృష్టి పెట్టడం ప్రారంభించండి.

– సేథ్ గోడిన్, ఆథర్

పాక్ ప్రమిదకు ట్రంప్ చమురు

విశ్లేషణ



రాణా బెనర్జీ

పాకిస్తాన్–అమెరికాలు జూలై 31న ఒక నూతన వాణిజ్య ఒప్పందంపై సంతకాలు చేశాయి. పాకిస్తాన్‌లోని చమురు నిక్షేపాలను అభివృద్ధి చేయడానికి సంయుక్తంగా కృషి చేయడంపై ఈ ఒప్పందం ప్రధానంగా దృష్టి పెట్టింది. ఇంధనం, ఖనిజాలు, సమాచార సాంకేతిక పరిజ్ఞానం, క్రిప్టో కరెన్సీలలో కూడా విస్తృత సహకారాన్ని అభివృద్ధి చేసుకోవాలని రెండు దేశాలూ కోరుకున్నాయి. ఇది పాకిస్తాన్‌లోని మౌలిక సదుపాయాలపై అమెరికా పెట్టుబడులను పెంపొందించేందుకు తోడ్పడవచ్చు. ద్వైపాక్షిక మార్కెట్ సౌలభ్య విస్తరణకు సాయపడవచ్చు. 'మేం ఈ భాగస్వామ్యానికి నేతృత్వం వహించగల ఆయిల్ కంపెనీని ఎంపిక చేసే ప్రక్రియలో ఉన్నాం' అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు.

పాకిస్తాన్ చమురు సంపద మొదట్లో ఆ దేశ సెంట్రల్ పంజాబ్‌లోని టూట్ చమురు క్షేత్రానికే పరిమితమైంది. ఆ ప్రాంతం పోటోహార్‌గా సుపరిచితం. అది ఇస్లామాబాద్‌కు సుమారు 135 కిలోమీటర్ల దూరంలో ఉంది. మొదటి చమురు బావిని 1964లో తవ్వారు. వాణిజ్యపరమైన ఉత్పాదన 1967లో మొదలైంది. సుమారు 6 కోట్ల పీపాల చమురు ఉందని భావించారు. దాని నుంచి 12–15 శాతం భాగం మాత్రమే తవ్వితీయగలమని నిర్ణయించారు. ఉత్పాదన 1986లో శిఖర స్థాయికి చేరి, రోజుకు సుమారు 2,400 పీపాల చమురు వెలికి తీశారు. పెట్రో దిగ్గజం యూనియన్ టెక్సాస్‌కు చెందిన పాకిస్తానీ అనుబంధ సంస్థ... సింధ్ దిగువన ఒక చమురు క్షేత్రాన్ని 1981లో కనుగొంది. సింధ్ చమురు క్షేత్రాలు 1998–1999 నాటికి టూట్ చమురు క్షేత్రం కంటే ఎక్కువ చమురును అందించాయి.

టూట్ క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు పాకిస్తాన్ జాతీయ చమురు కంపెనీ ఆయిల్ అండ్ గ్యాస్ డెవలప్ మెంట్ కంపెనీ (ఓజీడీసీ) లిమిటెడ్‌తో వాంకూవర్ ప్రధాన కేంద్రంగా ఉన్న ఇంటర్నేషనల్ సావరిన్ ఎనర్జీ కార్పొరేషన్ 2005లో ఒక అవగాహనా పత్రంపై సంతకాలు చేసింది.

ష్లంబర్గర్ ఆయిల్ ఫీల్డ్ సర్వీసెస్ 2006లో అక్కడ మొదట కార్యకలాపాలు ప్రారంభించింది. టూట్ చమురు క్షేత్రంలోను, దాని పొరుగునున్న మిస్సా కేశ్వాల్ చమురు క్షేత్రంలోను పనిచేసేందుకు రెండు కెనడియన్ కంపెనీలు రంగంలోకి దిగాయి. వీటి స్థానాన్ని ఇపుడొక అమెరికన్ కంపెనీ భర్తీ చేయవచ్చు.



◆ పాకిస్తాన్‌లోని ఖనిజ నిక్షేపాల పట్ల అమెరికాకు కొత్తగా ఆసక్తి పుట్టుకురావడం వెనుక వేరే లావాదేవీలు ఉన్నాయని వాషింగ్టన్‌లోని విల్సన్ సెంటర్‌లో సౌత్ ఏషియా ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ మైకేల్ కుగెల్ మ్యాన్ 'ఎక్స్' లో వెల్లడించారు. ట్రంప్ బంధువులకి వరల్డ్ లిబర్టీ ఫినాన్షియల్ సంస్థలో షేర్లు ఉన్నాయి. ఆ సంస్థ పాక్‌లో ఏర్పడిన పాకిస్తాన్ క్రిప్టో కౌన్సిల్‌తో 2025 ఏప్రిల్‌లో ఒక ఒప్పందం కుదుర్చుకుంది.

పాక్‌లో ఐదు చోట్ల –చెంగియా పీకే లిమిటెడ్ (బెలూచిస్తాన్‌లోని హబ్), పాక్–అరబ్ రిఫైనరీ కంపెనీ లిమిటెడ్ (గుజరాత్‌లోని కస్బా), పాకిస్తాన్ రిఫైనరీ లిమిటెడ్ (కరాచి), అటాక్ రిఫైనరీ లిమిటెడ్, నేషనల్ రిఫైనరీ లిమిటెడ్ (కామ్బి)–చమురు శుద్ధి కర్మాగారాలున్నాయి. వాటన్నింటి చమురు శుద్ధి సామర్థ్యం రోజుకు 4,20,000 పీపాల వరకు ఉంటుంది. గ్వాదర్‌లో మరో ఆయిల్ రిఫైనరీ నెలకొల్పే ఆలోచనలో ఉన్నట్లు సౌదీ ఆర్మ్‌కో 2019లో ప్రకటించింది.

అమెరికా–పాకిస్తాన్‌ల మధ్య వాణిజ్యం 2024లో 7.3 బిలియన్ల డాలర్ల మేరకు ఉంది. అమెరికా వస్తువుల వాణిజ్య లోటు 300 కోట్ల డాలర్ల మేరకు ఉంటుంది. పాకిస్తాన్ నుంచి అమెరికా లినెన్ ఉత్పత్తులు, లెదర్ వస్తువులు, కలపతో చేసిన ఫర్నిచర్ వస్తువులను దిగుమతి చేసుకొంటూ, పాకిస్తాన్‌కు ముడి పత్తి, విమానాల భాగాలు, ఇతర యంత్ర సామగ్రి పరికరాలను ఎగుమతి చేస్తోంది. ఈ అసమతౌల్య సమస్యను పరిష్కరించేందుకు అమెరికా నుంచి వస్తువుల దిగుమతులను పెంచుకుంటామని పాక్ పేర్కొంది.

పాకిస్తాన్‌లోని ఖనిజ నిక్షేపాల పట్ల అమెరికాకు కొత్తగా ఆసక్తి పుట్టుకురావడం వెనుక వేరే లావాదేవీలు ఉన్నాయని వాషింగ్టన్‌లోని విల్సన్ సెంటర్‌లో సౌత్ ఏషియా ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ మైకేల్ కుగెల్ మ్యాన్ 'ఎక్స్'లో వెల్లడించారు. ట్రంప్ బంధువులకి వరల్డ్ లిబర్టీ ఫినాన్షియల్ సంస్థలో షేర్లు ఉన్నాయి. ఆ సంస్థ పాక్‌లో 2025 మార్చిలో ఏర్పడిన పాకిస్తాన్ క్రిప్టో కౌన్సిల్‌తో ఆ వెంటనే ఏప్రిల్‌లో ఒక ఒప్పందం కుదుర్చుకుంది. పాక్‌లో కొత్తగా మంత్రిగా నియమితుడైన బిలాల్ బిన్ సాకిబ్ ఆ కౌన్సిల్‌కి నేతృత్వం వహిస్తున్నారు.

సాకిబ్ ఇటీవల బిట్ కాయిన్ల రంగంలోకి ప్రవేశించారు. లాస్ వేగాస్‌లో మే నెలలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న సాకిబ్, క్రిప్టోను కాపాడిన అధ్యక్షుడిగా తాను ట్రంప్‌ను గుర్తుంచుకోవాలని కోరుకుంటున్నానని చెప్పారు. తర్వాత, వైట్ హౌస్‌లో అమెరికా అధికారులతో సాకిబ్ మంతనాలు జరిపారు. పాకిస్తాన్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్‌కి, ఐఎస్ఐ డైరెక్టర్ జనరల్ లెఫ్టినెంట్ జనరల్ ఆసిమ్ మాలిక్‌కి వైట్ హౌస్‌లో ట్రంప్ విందు ఏర్పాటు చేయడానికి ఆ సమావేశమే మార్గం సుగమం చేసిందని చెబుతారు.

అఫ్గానిస్తాన్ నుంచి అమెరికా సేనలను ఉపసంహరించుకుని నాలుగేళ్ళు గడుస్తున్నా, అమెరికా–పాక్ సంబంధాలలో ఇప్పటికీ చాలా అనిశ్చితి ఉంది. పాకిస్తాన్‌కు చెందిన ఎఫ్–16 యుద్ధ విమానాల నిర్వహణ, మరమ్మతు పరికరాలకు సంబంధించి ఈ ఏడాది మొదట్లో అమెరికా సైన్యం సమకూర్చిన సాయం 397 మిలియన్ల డాలర్ల మేరకు ఉంది. చైనా ఆయుధాలపై మితిమీరి లేదా దాదాపు పూర్తిగా ఆధారపడుతున్న స్థితి నుంచి పాక్ రక్షణ వ్యవస్థను తప్పించాలని అమెరికా కోరుకుంటూ ఉండవచ్చుకానీ, మునుపు పాక్‌తో భారీ స్థాయిలో ఉన్న ఆయుధాల సంబంధాలను పునరుద్ధరించుకోవడంపై అమెరికా వైపు ఏకాభిప్రాయం లేదు.

ఈ నేపథ్యంలో, భారత్–పాక్‌ల మధ్య శాంతికి ప్రయత్నించినట్లు ట్రంప్ పదే పదే చెప్పుకుంటున్నా, భారత్‌తో కలసి అడుగులు వేయడంపై అమెరికా తాత్సారం చూపడం సహజ పరిణామంగానే తోస్తుంది.

వ్యాసకర్త క్యాబినెట్ సెక్రటేరియట్‌లో మాజీ ప్రత్యేక కార్యదర్శి ('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

ఇండియాలోనూ పదహారేళ్లకు తగ్గించాలా?

కామెంట్



కరణ్ థాపర్

16 ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కు కల్పించాలని యునైటెడ్ కింగ్‌డమ్ నిర్ణయించింది. స్కాట్లాండ్, వేల్స్ పార్లమెంటు ఎన్నికలకు ఇప్పటికే ఈ అర్హత అమలులో ఉంది. వయఃపరిమితి తగ్గింపు నిర్ణయం అనూహ్యమేం కాదు. లేబర్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలోనే ఈ వాగ్దానం చేసింది. దీని ఆమోదానికి అవసరమైన సంఖ్యాబలం ఆ ప్రభుత్వానికి ఉంది.

16 ఏళ్ల బ్రిటిషర్లకు దీంతో సమకూరే ఇతర హక్కులు మరింత ఆసక్తికరంగా ఉంటాయి. జాతీయ ఎన్నికల్లో ఓటేయడమే కాకుండా, తల్లితండ్రుల అంగీకారం ఉంటే వారు పెళ్లి కూడా చేసుకోవచ్చు. సివిల్ భాగస్వామ్య ఒప్పందాలు కుదుర్చు కొనేందుకు అర్హులు. ఇంట్లోంచి వెళ్లిపోయి స్వతంత్రంగా జీవించే హక్కు లభిస్తుంది. ట్రేడ్ యూనియన్‌లో చేరే హక్కు వస్తుంది. పన్నులు చెల్లిస్తారు. వెయిటర్‌గా పనిచేసే హక్కుంటుంది. రైళ్లలో ఇక హాఫ్ టికెట్ కుదరదు, ఫుల్ టికెట్ తీసుకోవాలి.

అయితే కొన్ని పనులు చేయడానికి వారికి ఇక మీదట కూడా అనుమతి ఉండదు. ఉదాహరణకు, వారు లాటరీ టికెట్లు కొనడం నిషేధం. తమంతట తాము కారు డ్రైవ్ చేయకూడదు. పబ్బులో కూర్చుని బీరు తాగకూడదు. అన్నింటికంటే ముఖ్యంగా, ఎన్నికల్లో పోటీ చేయడానికి పదహారేళ్ళ వారు అనర్హులు. అంటే తమకు తాము ఓటేసుకునే హక్కు ఉండదు. ఇదంతా సమాజంలో గందరగోళం సృష్టిస్తుంది అనుకుంటున్నారు కదూ? మీరే కాదు, బ్రిటన్ ప్రతిపక్ష మితవాదులు కూడా మీలానే అనుకుంటున్నారు.

దేశాన్ని ఎవరు పాలించాలో నిర్ణయించే అంతటి పరిపక్వత 16 ఏళ్ల వారికి ఉంటుందా అనేది కీలకమైన ప్రశ్న. ఇక్కడ గుర్తించాల్సిన విషయం ఏమిటంటే, తెలివితేటలతో అనే పదం నేను ఈ ప్రశ్నలో ఉపయోగించ లేదు. 20లు, 30లు, లేదా 50లు, 60ల వయసులో ప్రజలు తెలివితేటలతో నిర్ణయం తీసుకుంటున్నారా? ఉద్వేగంతోనే ఓటేస్తున్నారా? లేదా కేవలం ఆనవాయితీగానో, దురభిప్రాయంతోనో వ్యవహరిస్తున్నారా? ఎలా నిర్ణయం తీసుకున్నా పెద్దవారికి చెల్లుబాటు అయినప్పుడు 16 ఏళ్ల వారికి ఎందుక్కాకూడదు?

◆ 16 ఏళ్లవారికి ఓటు హక్కు కల్పించాలని యూకే నిర్ణయించింది. ఎవరికి ఓటేయాలనేది మన ముందున్న పలు ప్రత్యామ్నాయాలను పరిశీలించి నిర్ణయం తీసుకోవలసిన విషయం. పెద్దవారు నిజంగా అలానే చేస్తున్నారా? వాస్తవానికి ఇండియా 1989లో 18 ఏళ్ల వారికి ఓటు హక్కు ఇచ్చినప్పుడు ఇవే ఆందోళనలు వ్యక్తమయ్యాయి.

అయినా సరే, వారి పరిపక్వత సరిపోతుందా అనేది ప్రశ్నే. ఆ వయసు వారు కొందరికైనా సరే ఓటేసే పరిపక్వత ఉంటుంది. చాలా మంది పెద్దవారి కంటే వారు ఆలోచనాపరులు అని 'యూకే యూత్ పార్లమెంట్' చైర్‌పర్సన్ వ్యాఖ్యానించారు.

16 ఏళ్ల వారు ఇంకా మానసికంగా ఎదిగే దశలోనే ఉంటారని యాభై పైబడిన పెద్దవాడిని కాబట్టి నేను అలానే అనుకుంటాను. అనుభవం ద్వారా నేర్చుకునే వయసనీ అంటాను. ఆ నేర్చుకునేది... ఒప్పు లేదా తప్పు ఏదైనా కావచ్చు. 1970ల ప్రారంభంలో నాకది కచ్చితంగా వర్తిస్తుంది. ఇందిరా గాంధీ కాంగ్రెస్, ప్రతిపక్ష మహాకూటమి... రెంటిలో ఒకదాన్ని నేను అప్పట్లో అర్థవంతంగా ఎంచుకునేవాడినా? చాలామంది మాదిరిగానే నా తల్లిదండ్రుల అభిప్రాయాన్నే నా అభిప్రాయం చేసుకుని ఉండేవాడినా?

సొంత నిర్ణయం తీసుకునే చిన్న వాళ్లూ ఉంటారు. నేను కాదనను. కానీ, అధిక సంఖ్యాకులు తమ చుట్టూ ఉండే పెద్దవారి భావాలనే ఆమోదిస్తారు. వారితో ఏకీభవించడం లేదనీ, వారి కంటే ఎదిగిపోయామనీ తెలుసుకొనే వరకైనా అలా చేస్తారు.

ఎవరికి ఓటేయాలనేది మన ముందున్న పలు ప్రత్యామ్నాయాలను జాగ్రత్తగా పరిశీలించి నిర్ణయం తీసుకోవలసిన విషయం. మరోసారి ఆలోచించండి. పెద్దవారు నిజంగా అలానే చేస్తున్నారా? 16 ఏళ్ల వారు ఎలా చేస్తారో అలానే మనం కూడా ఇతరుల ప్రభావానికి లోనవటం వాస్తవం కాదా?


వాస్తవానికి ఇండియా 1989లో 18 ఏళ్ల వారికి ఓటు హక్కు ఇచ్చినప్పుడు ఇవే ఆందోళనలు వ్యక్తమయ్యాయి. వ్యతిరేకుల సంశయాలు అన్నీ తప్పని కాలం రుజువు చేసింది. ఇప్పుడూ అదే పునరావృతం అవుతుందా? పెద్దవారికి తేలిగ్గా మింగుడు పడని సత్యం ఏమిటంటే, ఇవ్వాళ్టి చిన్నవారు మనం ఆ వయసులో ఉన్నప్పటి కంటే తెలివైనవారు. ప్రతి తరమూ తన ముందటి తరం కంటే తెలివిగా ఉంటుంది. కావాలంటే స్మార్ట్ ఫోన్ పట్టుకున్న నాలుగేళ్ల పిల్లాడిని గమనించండి. నేను చెప్పేది నిజమని మీకు తెలుస్తుంది.

అందుకే నేను బ్రిటిష్ వారిని మెచ్చుకుంటున్నా. మనం కూడా వారిలా అలాంటి నిర్ణయం తీసుకోవాలేమో!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

శ్రీకృష్ణ సృష్టి... సురభి

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

జనానాం క్షున్నివృత్యర్థం ప్రత్యూషే భజతి ప్రభుః
తథాహి శ్రీహరి సృష్టా కామధేనుః ప్రసూరభూత్

లోకాలన్నిటికీ సంతృప్తి కల్గటానికి శ్రీహరి తన ఆకలి తీర్చుకుంటాడు. అందుకే కామధేనువు సృష్టి జరిగింది. సర్వజీవకోటికీ ఆహారాన్ని అనుగ్రహించటమే శ్రీహరి సంకల్పం.

నిజమాలోచిస్తే, శ్రీహరికి ఆకలి ఏమిటనిపిస్తుంది. గోలోకంలో ఒకప్పుడు శ్రీకృష్ణుడు తనకు ఆకలి వేసింది అన్నాడు. రాధ ప్రక్కనే ఉంది. ఇదేదో విచిత్రమను కొన్నది. అప్పుడు శ్రీకృష్ణుడు తన దేహం ఎడమభాగం నుండి 'సురభి'ని సృష్టించాడు. ఒక కుండలోకి పాలు పితికాడు. ఆయన కొన్ని ఆరగించి, ఎందుకనో ఆ కుండను నేలకేసి కొట్టాడు. ఆ కుండ తాకిడికి భూమి మీద ఒక పెద్ద కొలను ఏర్పడింది. ఆ కొలను చూడగానే రాధకు పట్టలేనంత సంతోషం కల్గింది. ఆ కొలనులో స్నానం చేస్తూ, ఈతలు కొడుతూ సంతోషంతో, కేరింతలు కొట్టడం ప్రారంభించింది.

ఈ సురభి నుండి గోవులనేకం పుట్టుకొచ్చాయి. అవి అన్నీ, భూలోకానికి చేరుకున్నాయి. భూమి మీద ఉన్న ఆవులజాతి అంతా ఈ సురభి సంతానమే. భూమి మీద మానవులంతా ఈ ఆవులను పోషిస్తూ, వాటి పాలు, పెరుగు, నెయ్యి మొదలగునవి ఆహారంగా తీసుకొని, సుఖశాంతులతో ఉన్నారు. ఆవును తల్లిగా భావించి, రక్షించి, పూజించటం ప్రారంభించారు. అప్పటినుంచి అది 'గోమాత' అని పిలవబడింది.

ఒకప్పుడు భూలోకంలో విపత్కరమైన కరవు వచ్చింది. అందువల్ల గోరక్షణా లేదు, గోపూజా లేదు. పంచ గవ్యములు లేక పోవటం చేత యజ్ఞయాగాదులు ఆగిపోయాయి. అందువల్ల దేవతలకు హవిర్భాగాలు అందటం లేదు. కనుక మానవులతో పాటు దేవతలకు కూడా ఇబ్బంది కల్గింది. ఇలా దేవతలు, మానవులు ఇక్కట్టుల పాలవటం బ్రహ్మ గమనించి దేవతలను వెంటబెట్టుకొని, గోలోకం వెళ్లాడు. అక్కడ శ్రీకృష్ణునికి ఈ బాధలన్నీ చెప్పి మొర పెట్టుకున్నాడు.

కృష్ణుడు వారి దైన్యాన్ని చూచి మొర ఆలకించి కనికరించాడు. వెంటనే సురభిధేనువు తోక నుండి 'కామధేనువు'ను సృష్టించి దేవతలకు అనుగ్రహించాడు. దేవతల కోరిక మేరకు ఆ కామధేనువు వేలకొలది ఆవుల్ని భూలోకానికి ప్రసాదించింది.

మళ్లీ ప్రజలందరికీ ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. యథావిధిగా గోపూజ, గోరక్షణ మునుపటి లాగానే కొనసాగుతున్నాయి.

జయ గురు దత్త

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ–మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

డేటా పాయింట్

యూనికార్న్‌లకు... ఖేదం... మోదం!

స్టాక్ మార్కెట్లో ఇటీవలి కాలంలో తీవ్ర అనిశ్చితి కొనసాగుతోంది. ముఖ్యంగా అమెరికా టారిఫ్‌ల రగడ, కొన్ని దేశాల్లో యుద్ధ వాతావరణం ఈ పరిస్థితికి ప్రధాన కారణాలు. ఈ ప్రభావం స్టాక్ మార్కెట్లోకి ఐపీఓలతో అడుగుపెట్టిన ప్రముఖ యూనికార్న్ కంపెనీలపైనా తీవ్రంగా పడింది. ఒక బిలియన్ డాలర్ల (సుమారు రూ. 8,700 కోట్లు) విలువున్న స్టార్టప్‌లను యూనికార్న్‌లుగా పిలుస్తారు. లిస్టయిన 14 యూనికార్న్ కంపెనీల్లో సగం... ఐపీఓ ధర కంటే తక్కువ ధర ప్రస్తుతం పలుకుతున్నాయి. పేటీఎమ్ (వన్ 97) షేరు... ఐపీఓ ధరతో పోలిస్తే 50 శాతానికిపైగా పడిపోతే, ఓలా ఎలక్ట్రిక్ 46 శాతం తక్కువ పలుకుతోంది. ఇదే సమయంలో జొమాటో (ఎటర్నల్) షేర్ ధర ఏకంగా సుమారు 300 రెట్లు పెరిగితే, పాలసీ బజార్ 78.4 శాతం వృద్ధి నమోదు చేసింది.

కంపెనీ	ఐపీఓ ధర లిస్టింగ్ డే	ముగింపు ధర	ప్రస్తుత ధర (ఆగస్టు 5)	మార్పు శాతం
పేటీఎమ్	2,150	1,564.15	1,052.65	-51
ఓలా ఎలక్ట్రిక్	76	91.18	40.87	-46.2
ఫస్ట్ క్రై	465	678.25	362.10	-22.1
మామాఎర్త్	324	337.15	261.75	-19.2
వన్ మొబిక్విక్ సిస్టమ్స్	279	530.30	239.30	-14.2
ఢిల్హివరీ	487	537.25	458.50	-5.9
స్విగ్గీ	390	455.95	385.75	-1.1
జొమాటో	76	125.85	302.05	297.4
పాలసీ బజార్	980	1,202.9	1,748.40	78.4
బ్లాక్‌బక్	273	260.20	484.45	77.5
ఈజ్‌మైట్రిప్	5.84	6.51	9.53	63.2
గోడిజిట్ జనరల్ ఇన్సూరెన్స్	272	305.75	358.9	31.9
నైకా	187.5	367.78	211.15	12.6
యూనికామర్స్ ఇ–సొల్యూషన్స్	108	210.05	119.30	10.5

జర్నలిస్టులకు పెన్షన్ విధానం అమలు చేయాలి: కొప్పుల



సాక్షి, హైదరాబాద్: జర్నలిస్టులకు ప్రత్యేక బీమా సౌకర్యం కల్పించడంతో పాటు పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలతో అనేక వర్గాలు నష్టపోతున్నాయని, సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న వారి జీవనోపాధి ప్రశ్నార్థకంగా మారుతోందన్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం కొప్పుల మీడియాతో మాట్లాడారు. ఉచిత బస్సు సౌకర్యాన్ని మహిళలు వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. గిగ్ వర్కర్లు, జర్నలిస్టుల ప్రమాద బీమా సౌకర్యం ప్రమాదంలో పడిందన్నారు. ప్రమాద బీమా సౌకర్యానికి సంబంధించిన డబ్బులు కట్టడంలో ప్రభుత్వం చేతులెత్తేసిందని విమర్శించారు. దీంతో రాష్ట్రంలో సుమారు 13.51 లక్షల మంది బీమా కోల్పోయే పరిస్థితి తలెత్తిందన్నారు. ప్రమాద బీమా పరిహారం కోసం 1,090 కుటుంబాలు ఎదురుచూస్తున్నాయని కొప్పుల చెప్పారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులను బద్నాం చేయడమే పనిగా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు.



‘మహా లక్ష్మి’ వదంతులు.. బారులు తీరిన మహిళలు

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెడతామని చెప్పిన మహాలక్ష్మి పథకం కింద రూ.2,500 ఇండియన్ పోస్ట్ పేమెంట్ బ్యాంకులో అకౌంట్ ఉంటేనే వస్తుందని వదంతులు రావడంతో మహిళలు పోస్టాఫీసుకు బారులు తీరారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పోస్టాఫీసులో రూ.200లు పెట్టి కొత్త అకౌంట్ ఇవ్వాలని కౌంటర్ వద్ద తోపులాడుకుంటూ ఇలా అకౌంట్లు తీస్తున్నారు. దీనిపై పోస్టాఫీసు అధికారులను సంప్రదించగా.. బయట ఎవరో వదంతి సృష్టించడంతో ఇంతమంది వస్తున్నారని చెప్పారు.

- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

గోదావరి నుంచి 4.71 లక్షల ఎకరాలకు సాగునీరు

‘స్కివమ్’ కమిటీ రెండో సమావేశంలో నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: వానాకాలం (ఖరీఫ్)లో గోదావరి బేసిన్లోని ప్రాజెక్టుల కింద నీటి లభ్యత ఆధారంగా భారీ, మధ్యతరహా ప్రాజెక్టుల కింద 4.71 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించాలని రాష్ట్రస్థాయి సాగునీటి విడుదల ప్రణాళిక కమిటీ (స్కివమ్) నిర్ణయించింది. బుధవారం జలసౌధలో ఈఎన్సీ (జనరల్) మహ్మద్ అంజద్ హుస్సేన్ అధ్యక్షతన కమిటీ రెండో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జలాశయాల్లో నీటి లభ్యత ఏవిధంగా ఉంది.. తాగునీటి అవసరాలు వంటి అంశాలపై చర్చించారు. ప్రస్తుతం ఉన్న నిల్వల ప్రకారం 50.34 టీఎంసీల నిల్వలు భారీ, మధ్యతరహా ప్రాజెక్టుల్లో ఉన్నందున.. 4,71,737 ఎకరాలకు సాగునీటిని అందించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రాజెక్టుల కింద 12.30 లక్షల ఎకరాల ఆయకట్టు కోసం ప్రతిపాదించగా.. 12.08 లక్షల ఎకరాల ఆయకట్టును సృష్టించారు. అయితే నిల్వలు పరిమితంగా ఉండటంతో 78,307 ఎకరాల్లో ఆరుతడి పంటలకు, 3,93,430 ఎకరాల్లో వరి పంటకు నీళ్లివ్వనున్నారు. ఇప్పటికే కృష్ణా బేసిన్ పరిధిలోని ప్రాజెక్టుల్లో పుష్కలంగా నీటినిల్వలు ఉన్నందున... ఈ బేసిన్ పరిధిలోని ప్రాజెక్టుల్లో ఆరుతడి, వరి పంటకు కలిపి, 17.68 లక్షల ఎకరాలకు నీళ్లు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్న విషయం విదితమే.

గేమింగ్ యాప్‌నే ప్రమోట్ చేశా..

- ఈడీ ఎదుట హీరో విజయ్ దేవరకొండ
- బ్యాంకు లావాదేవీ పత్రాల అందజేత



సాక్షి, హైదరాబాద్: బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేశారంటూ ఆరోపణలు ఎదుర్కొంటున్న సినీ హీరో విజయ్ దేవరకొండ బుధవారం ఈడీ ఎదుట విచారణకు హాజరయ్యారు. విచారణ అనంతరం మీడియాతో మాట్లాడుతూ, తన బ్యాంకు లావాదేవీలు ఈడీకి సమర్పించినట్లు వెల్లడించారు. ‘బెట్టింగ్ యాప్ కేసులో నా పేరు రావడంతో విచారణకు పిలిచారు. దేశంలో బెట్టింగ్ యాప్స్, గేమింగ్ యాప్స్ అని రెండు రకాలు ఉన్నాయి. నేను ప్రమోట్ చేసిన ఏ-23 అనే యాప్ గేమింగ్ యాప్ అని క్లారిటీ ఇచ్చాను. గేమింగ్ యాప్‌లకు రాష్ట్రాల్లో లీగల్ అనుమతులు ఉన్నాయి. నేను ప్రమోట్ చేసిన ఏ-23 యాప్ తెలంగాణలో తెరుచుకోదు. చట్టాలకు లోబడి అనుమతులు ఉన్న గేమింగ్ యాప్స్‌ను మాత్రమే ప్రమోట్ చేశాను. చేసుకున్న ఒప్పందాలు, తీసుకున్న మొత్తం తదితరాలకు సంబంధించిన వివరాలు ఈడీకి అందజేశాను’ అని విజయ్ దేవరకొండ ప్రకటించారు.

విజిబుల్ పోలీసింగ్‌పై దృష్టి పెట్టండి

- పోలీసు విభాగం పనితీరుపై సమీక్షలో డీజీపీ



సాక్షి, హైదరాబాద్: ఆర్థిక, సంస్థాగత నేరాలపై దృష్టి పెట్టడంతో విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని డీజీపీ జితేందర్ ఆదేశించారు. మహిళలు, చిన్నారుల భద్రతతో పాటు షీ టీమ్స్, మహిళా మానవ అక్రమ రవాణా విభాగాలు (ఏహెచ్‌టీయూ), పనితీరుపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రాష్ట్ర పోలీసు విభాగం పనితీరుపై జితేందర్ బుధవారం డీజీపీ కార్యాలయంలో తొలి అర్ధవార్షిక సమీక్ష సమావేశం నిర్వహించారు. సీఐడీ అదనపు డీజీ చారు సిన్హా నేతృత్వంలో జరిగిన సమీక్ష సమావేశంలో అదనపు డీజీ (లా అండ్ ఆర్డర్) మహేశ్ భగవత్, అదనపు డీజీ (పర్సనల్) అనిల్ కుమార్, ఐజీ (పీ అండ్ ఎల్) ఎం.రమేశ్, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎస్పీలు, ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, రేంజ్ డీఐజీ తఫ్సీర్ ఇక్బాల్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాశ్ మహంతి, రాచకొండ సీపీ సుధీర్‌బాబు పాల్గొన్నారు.

రైలు ఢీకొని ఇద్దరి దుర్మరణం


దిలీప్‌కుమార్


అకలేశ్ వాఖడే

జమ్మికుంట: బహిర్భూమికని వెళ్లిన ఇద్దరు యువకులు ప్రమాదవశాత్తు రైలు ఢీకొని దుర్మరణం చెందారు. ఈ ఘటన కరీంనగర్ జిల్లా జమ్మికుంట రైల్వేస్టేషన్ సమీపంలో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ గంగారపు తిరుపతి కథనం ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రం చిఖిలి గ్రామానికి చెందిన దిలీప్ కుమార్ (25), మహారాష్ట్రలోని సీతపర్ గ్రామానికి చెందిన అకలేశ్ శ్రీరామ్ వాఖడే (25) జమ్మికుంట పట్టణ శివారులోని మడిపల్లి రైల్వే గేట్ సమీపంలోని ఓ సిమెంట్ బ్రిక్స్ కంపెనీలో కూలీలుగా పనిచేస్తున్నారు. వీరిద్దరూ బంధువులు. మంగళవారం అర్ధరాత్రి రైల్వే పట్టాలు దాటి బహిర్భూమికి వెళ్లారు. తిరిగి పట్టాలు దాటి వస్తుండగా.. అతివేగంగా వచ్చిన గుర్తుతెలియని రైలు ఢీకొట్టింది. దీంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాలను జమ్మికుంట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ఉల్టా చోర్..



రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లపై అమెరికా సహా పెద్ద దేశాల దొంగనాటకం

మనల్ని మించి రష్యా చమురు కొంటున్న చైనం

'రష్యా యుద్ధ యంత్రాంగం మొత్తానికీ ఆర్థిక ఇంధనాన్ని భారతే సరఫరా చేస్తోంది'

– తెంపరి ట్రంప్ ఇటీవల చేసిన తలతిక్క వ్యాఖ్యలివి. అంతేగాక, రష్యా నుంచి భారీగా చమురు కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌పై టారిఫ్‌లను భారీగా పెంచేస్తానంటూ బాధ్యతారహిత వ్యాఖ్యలకు దిగిన అమెరికా అధ్యక్షుడు బుధవారం అన్నంత పనీ చేశారు. టారిఫ్‌ను 50 శాతానికి పెంచేస్తూ ఉత్తర్వులపై సంతకం చేశారు. కానీ వాస్తవాల ఆధారంగా ఒకసారి పరిశీలన చేస్తే ఇలాంటి విషయాల్లో వర్ధమాన దేశాలకు నిత్యం సుద్దులు చెప్పే పెద్ద దేశాలు తమవరకూ వచ్చేసరికి మాత్రం ఎంతటి కొద్ది బుద్ధులు ప్రదర్శిస్తాయో తెలుస్తుంది. ట్రంప్ అనే కాదు, ఇలాంటి విషయాల్లో సంపన్న దేశాల స్వార్థపూరిత వైఖరి ఇట్టే కళ్లకు కడుతుంది...

ఉక్రెయిన్‌పై ఏళ్లుగా సాగిస్తున్న మతిలేని యుద్ధానికి రష్యాకు అవసరమైన ఆర్థిక సాయం మొత్తాన్నీ ఒకరకంగా భారతే సమకూరుస్తూ వస్తోందన్నది అమెరికాతో పాటు పాశ్చాత్య దేశాలన్నీ కొద్దికాలంగా పాడుతూ వస్తున్న పాట. రష్యా నుంచి నానాటికీ పెరిగిపోతున్న భారత చమురు దిగుమతులనే ఇందుకు తార్కాణంగా అవి చూపిస్తున్నాయి. కానీ నిజానికి రష్యా నుంచి స్వీయ చమురు కొనుగోళ్లను నేటికీ ఆపని తెంపరితనం ఆ దేశాలది! ఇందుకు సంబంధించిన అన్ని విషయాలనూ ఒకసారి అంశాలవారీగా విశ్లేషిస్తే... **ఉల్టా చోర్ కొత్వాల్‌కు డాంటే (దొంగే... దొంగ దొంగ అన్నట్టు) నానుడి ఈ దేశాల వైఖరికి అతికినట్టుగా సరిపోతుంది.**

రష్యా చమురే ముద్దు!

ఉక్రెయిన్‌పై పాశ్చాత్య రష్యా యుద్ధానికి దిగిన వెంటనే అమెరికాతో పాటు పాశ్చాత్య దేశాలన్నీ పాలోమంటూ దానిపై నానారకాల ఆర్థిక తదితర ఆంక్షలు విధించాయి. కానీ అత్యంత ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే రష్యా చమురుపై మాత్రం అవి ఎలాంటి ఆంక్షలూ విధించలేదు. అంతేకాదు, స్వయంగా అమెరికాతోపాటు ఆ దేశాలన్నీ నేటికీ రష్యా చమురును చంకలు గుద్దుకుంటూ కొనుక్కుంటున్నాయి. స్వీయ అవసరాలు తీర్చుకుంటూ వస్తున్నాయి. భారత్ వంటి దేశాలకు మాత్రం రష్యా చమురు కొనొద్దంటూ సుద్దులు చెబుతున్నాయి. 'అలా ఎలా కొంటుం'దంటూ సన్నాయినొక్కులూ నొక్కుతున్నాయి. తెంపరితనానికి మారుపేరుగా మారిన ట్రంప్ అయితే ఆంక్షల రంకెలు వేస్తున్నారు.

ధరపై పరిమితి మాత్రమే

ఇరాన్, వెనెజువెలా చమురు మాదిరిగా రష్యా చమురుపై అంతర్జాతీయంగా నేటికీ పూర్తిస్థాయి నిషేధం లేదు. అలా చేస్తే పెద్ద దేశాల్లో ఒక్కదానికీ పూట గడవని పరిస్థితి! అందుకే తెలివిగా ప్రపంచంలోని ఏడు అతి సంపన్న, శక్తిమంతమైన దేశాల కూటమి అయిన జీ7, యూరోపియన్ రష్యా చమురుపై 'ప్రైస్ క్యాప్'విధానంతో సరిపెట్టాయి. దాంతో రష్యా దర్జాగా తన చమురును అంతర్జాతీయ మార్కెట్లో విక్రయించుకుంటూ వస్తోంది. భారత్ కూడా జీ7, ఈయూ విధించిన 'ప్రైస్ క్యాప్'కు లోబడే, వాటి మాదిరిగానే రష్యా నుంచి చమురు కొనుగోళ్లు జరుపుతూ వస్తోంది. అది కూడా పూర్తి చట్టబద్ధంగా, అత్యంత పారదర్శకంగా! ఈ విషయంలో ఒక్క అంతర్జాతీయ నిబంధనను గానీ, చట్టాన్ని గానీ ఉల్లంఘించడం లేదు.

మరి మనపై ఏడుపెందుకు?

ఒక్కముక్కలో చెప్పాలంటే స్వీయ వంచన, పరవంచన! అంతర్జాతీయ ఇంధన మార్కెట్లో నానాటికీ పెరిగిపోతున్న భారత ప్రాభవాన్ని చూసి ఓర్వలేనితనం!! స్వార్థ రాజకీయాలకు పరాకాష్ట. కేవలం ఆ ఒక్క కారణంగానే సంపన్న దేశాలన్నీ ఇలా ఏడ్పులు, పెడబొబ్బలు పెడుతున్నాయి. అదే సమయంలో తాము మాత్రం చడీచప్పుడూ లేకుండా అదే రష్యా నుంచి 'ఓపెన్ మార్కెట్'ముసుగులో నిర్నిరోధంగా చమురు కొనుగోలు చేస్తూనే ఉన్నాయి. ట్రంప్ అయితే శాపనార్థాలతో పాటు బెదిరింపులకు కూడా దిగుతున్నారు.

నాడు అమెరికాయే మెచ్చింది...

ఉక్రెయిన్‌తో యుద్ధం మొదలైన తర్వాత కూడా రష్యా నుంచి భారత చమురు కొనుగోళ్లను అమెరికా ప్రశంసించిన దాఖలు కోకొల్లలు. రుజువులివిగో...

'రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లు చేస్తున్నందుకు మాకెంతో ఆనందంగా ఉంది'

- 2022లో అమెరికా ఆర్థిక మంత్రి

'(రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడం ద్వారా) భారత్ ఆదుకుంది కాబట్టే అంతర్జాతీయంగా ధరలు అడ్డగోలుగా పెరగలేదు'

- 2024 మే లో భారత్‌లో అమెరికా రాయబారి ఎరిక్ గాసెటీ

నీతులు చెబుతున్న దేశాలు చేస్తున్నది ఇదే...

రష్యా చమురు కొని ఉక్రెయిన్‌పై యుద్ధానికి తోడ్పాటుగా నిలవొద్దంటూ భారత్‌కు నీతులు చెబుతున్న పాశ్చాత్య, సంపన్న దేశాలు ఈ విషయంలో వాస్తవానికి చేస్తున్నదేమిటో చూస్తే ఆశ్చర్యం కలగక మానదు...

- హంగరీ, స్లొవేకియా గుండా సాగే పైప్‌లైన్ల ద్వారా ఈయూ దేశాలన్నీ చడీచప్పుడూ లేకుండా రష్యా చమురును ఒడిసిపట్టుకుంటున్నాయి.
- 2026 దాకా రష్యా నుంచి చమురు కొనుగోళ్లను కొనసాగించేలా జపాన్ ప్రత్యేక అనుమతి పొందింది!
- వీటన్నింటినీ మించి ఆశ్చర్యకరమైన సంగతి మరోటుంది. అదేమిటో తెలుసా? ఈయూ ఇటీవలి 18వ ఆంక్షల ప్యాకేజీలో రష్యా చమురు కొనుగోళ్ల నిషేధం నుంచి పలు దేశాలను మినహాయించారు. అవేమిటో తెలుసా? బ్రిటన్, కెనడా, నార్వే, స్విట్జర్లాండ్. ఇంకా... మీ అనుమానం నిజమే! అమెరికా కూడా!!

చైనా కంటే తక్కువే

భారత్ తన చమురు అవసరాల్లో ఏకంగా 38 శాతం రష్యా నుంచే కొనుగోలు చేస్తోంది. కానీ ఈ విషయంలో అగ్రతాంబూలం మాత్రం చైనాదే. అది ఏకంగా 47 శాతం చమురు కొంటోంది. పాశ్చాత్య దేశాలతో పాటు వాటి మిత్ర దేశాలు కూడా రష్యా చమురును నమ్ముకునే మనుగడ సాగిస్తున్నాయి.

మనం తప్పకుంటే..

గగ్గోలు పుడుతుంది. అంతర్జాతీయంగా చమురు ధరలు ఆకాశాన్నంటుతాయి. బ్యారెల్ ఏకంగా 200 డాలర్లు దాటేస్తుంది. అది మొత్తం ప్రపంచ దేశాలన్నింటికీ కోలుకోలేని దెబ్బేనని అంతర్జాతీయ చమురు రంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

పాశ్చాత్య దేశాల 'గ్యాస్'

రష్యా నుంచి భారత చమురు కొనుగోళ్లపై గుండెలు బాదుకుంటున్న పాశ్చాత్య దేశాలు నిజానికి సహజ వాయువు కొనుగోళ్లలో నంబర్‌వన్ స్థానంలో ఉన్నాయి! గత జూన్‌లో ఈయూ దేశాలన్నీ కలిసి రష్యా సహజ వాయువు కొనుగోళ్ల నిమిత్తం వెచ్చించింది ఏకంగా 120 కోట్ల డాలర్లంటే నమ్మక తప్పదు! ఈ జాబితాలో ఫ్రాన్స్, హంగరీ, నెదర్లాండ్స్, స్లొవేకియా వంటి యూరప్ దేశాలు అగ్రస్థానంలో ఉన్నాయి. అంతేకాదు, రష్యా నుంచి రిఫైన్డ్ పెట్రో ఉత్పత్తుల కొనుగోళ్లలో కూడా నాటో దేశాలదే అగ్ర స్థానం. స్వార్థానికి మారుపేరైన తుర్కియే అయితే రష్యా రిఫైన్డ్ పెట్రో ఎగుమతుల్లో ఏకంగా 26 శాతాన్ని సొంతం చేసుకుంటోంది! ఈ విషయంలో భారత్ వాటా అక్షరాలా సున్నా! వీటన్నింటినీ బేరీజు వేసుకుని చూస్తే నిజానికి రష్యా యుద్ధ తంత్రానికి పూర్తిస్థాయిలో ఆర్థిక సాయం చేస్తూ వస్తున్నది అమెరికా, పాశ్చాత్య దేశాలు మాత్రమేనన్నది అక్షరసత్యం. ఆ లెక్కన ఈ విషయంలో భారత్‌పై వాటి ఏడుపు దొంగే, 'దొంగా'అంటూ దొంగ అరుపులు అరిచిన చందమన్నది అంతర్జాతీయ నిపుణుల మాట.

- సాక్షి, నేషనల్ డెస్క్

సాక్షిప్లస్ జాతీయం పేజీలో..

- ప్రజలే కేంద్రంగా పారదర్శక పాలన
- పార్లమెంట్‌లో వాయిదాల పర్వం
- గాజాలో ఆగని మృత్యుఘోష

ట్రంప్ బుకాయింపులు

- రష్యా నుంచి దిగుమతుల గురించి తెలియదన్న అమెరికా అధ్యక్షుడు
- ఆయన ద్వంద్వ ప్రమాణాలను ఎండగట్టిన భారత విదేశాంగ శాఖ
- రష్యా నుంచి యురేనియం, ఎరువులు, రసాయనాలు దిగుమతి చేసుకుంటున్న అమెరికా
- రెండు దేశాల మధ్య బలమైన వాణిజ్య బంధం



వాషింగ్టన్: రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకుంటున్న భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మండిపడుతున్నారు. టారిఫ్‌ల బాంబులు పేలుస్తున్నారు. కానీ, అదే అమెరికా అదే రష్యా నుంచి యురేనియం, ఎరువులు, రసాయనాలు భారీగా దిగుమతి చేసుకుంటోంది. తమ అవసరాల కోసం రష్యాపై ఆధారపడుతోంది. రష్యా నుంచి దిగుమతుల గురించి తనకేమీ తెలియదని డొనాల్డ్ ట్రంప్ తాజాగా వ్యాఖ్యానించారు. అసలేం జరుగుతోందో తనిఖీ చేస్తానని అన్నారు. ట్రంప్ మాటల్లోని ద్వంద్వ ప్రమాణాలను భారత విదేశాంగ శాఖ ఎండగట్టింది. ట్రంప్ బుకాయింపులు గణాంకాల సాక్షిగా బహిర్గతమయ్యాయి. నిజానికి అమెరికా–రష్యా మధ్య బలమైన వాణిజ్య బంధం కొనసాగుతోంది. అణు ఇంధన పరిశ్రమల కోసం అమెరికా కంపెనీలు రష్యా నుంచి యురేనియం హెక్సాఫ్లోరైడ్‌ను దిగుమతి చేసుకుంటున్నాయి. అలాగే ఎలక్ట్రిక్ వాహనాల కోసం పల్లాడియంను, వ్యవసాయం కోసం ఎరువులను దిగుమతి చేసుకుంటున్నాయి. అమెరికా ప్రభుత్వ గణాంకాలను పరిశీలిస్తే.. అమెరికా–రష్యా మధ్య 2024లో 5.2 బిలియన్ డాలర్ల వాణిజ్యం జరిగింది. ఇందులో 3.5 బిలియన్ డాలర్ల వాణిజ్యం సరుకులకు సంబంధించినదే. అమెరికా నుంచి రష్యాకు 528.3 మిలియన్ డాలర్ల ఎగుమతులు జరిగాయి. రష్యా నుంచి అమెరికా 3 బిలియన్ డాలర్ల సరుకులు దిగుమతి చేసుకుంది. అంటే రష్యాతో అమెరికాకు 2.4 బిలియన్ డాలర్ల వాణిజ్య లోటు ఉన్నట్లు దీన్నిబట్టి తెలుస్తోంది. 2025 ప్రథమార్ధంలో రష్యా నుంచి దిగుమతులు 2.4 బిలియన్ డాలర్లకు పడిపోయినట్లు అమెరికా సెన్సెస్ బ్యూరో, బ్యూరో ఆఫ్ ఎకనామిక్ అనాలిస్ గణాంకాలు చెబుతున్నాయి నాలుగేళ్ల క్రితం ఇవి 14.14 బిలియన్ డాలర్లుగా ఉండేవి. అయినప్పటికీ 2022 జనవరి నుంచి ఇప్పటిదాకా రష్యా నుంచి అమెరికా 24.51 బిలియన్ డాలర్ల విలువైన సరుకులు దిగుమతి చేసుకుంది.

- 2021లో రష్యా నుంచి అమెరికాకు దిగుమతి అయిన ఎరువుల విలువ 1.14 బిలియన్ డాలర్లు. 2024లో ఇది 1.27 బిలియన్ డాలర్లు.
- 2021లో రష్యా నుంచి యూఎస్‌కు 646 మిలియన్ డాలర్ల విలువైన యురేనియం, ప్లుటోనియం వచ్చాయి. 2024లో 624 మిలియన్ డాలర్లకు తగ్గింది.
- 2021లో 1.59 బిలియన్ డాలర్ల విలువైన పల్లాడియం దిగుమతి చేసుకోగా, 2024లో 878 మిలియన్ డాలర్ల సరుకు దిగుమతి చేసుకుంది.
- రష్యా నుంచి ఇండియా కంటే చైనా అధికంగా చమురు దిగుమతి చేసుకుంటోంది. అయినప్పటికీ డొనాల్డ్ ట్రంప్ చైనాను ప్రశ్నించే సాహసం చేయలేకపోతున్నారు.
- 2024లో చైనా ఏకంగా 62.6 బిలియన్ డాలర్ల చమురును రష్యా నుంచి కొనుగోలు చేసింది. ఇండియా దిగుమతులు 52.7 బిలియన్ డాలర్లే. దీనిపై ట్రంప్ నోరు మెదపడం లేదు.

---

31 నుంచి మోదీ చైనా పర్యటన



న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ చైనా పర్యటన ఖరారయ్యింది. ఆయన ఈ నెల 31, వచ్చేనెల 1వ తేదీల్లో చైనాలో పర్యటిస్తారని అధికార వర్గాలు బుధవారం వెల్లడించాయి. తియాంజిన్‌లో జరిగే షాంఘై సహకార సంస్థ(ఎస్సీఓ) సదస్సులో మోదీ పాల్గొంటారు. 2020 జూన్‌లో తూర్పు లద్దాఖ్‌లోని గల్వాన్ లోయలో రెండు దేశాల జవాన్ల మధ్య జరిగిన భీకర ఘర్షణ తర్వాత ప్రధానమంత్రి చైనాలో అడుగు పెడుతుండడం ఇదే మొదటిసారి కావడం విశేషం. ఆయన చివరిసారిగా 2018లో డ్రాగన్ దేశంలో పర్యటించారు. ఈసారి చైనా పర్యటన కంటే ముందు మోదీ ఈ నెల 30న జపాన్‌ను సందర్శించబోతున్నారు. ఇండియా–జపాన్ వార్షిక సదస్సుకు హాజరవుతారు. జపాన్‌ప్రధానమంత్రి ఫుమియో కిషిదాతో సమావేశమవుతారు. అక్కడి నుంచి చైనాకు చేరుకుంటారు. మోదీ పర్యటన కంటే ముందే భారత రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ చైనాలో ఎస్సీఓ సమావేశాల్లో పాల్గొంటారు. అనంతరం భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ చైనాను సందర్శిస్తారు. చైనా అధినేత షీ జిన్‌పింగ్‌తో భేటీ అవుతారు. గల్వాన్ లోయ ఘర్షణ తర్వాత భారత్–చైనా మధ్య సంబంధాలు తీవ్ర ఒత్తిడికి లోనైన సంగతి తెలిసిందే. సంబంధాల పునరుద్ధరణ కోసం జరుగుతున్న ప్రయత్నాలు దాదాపు చివరి దశకు వచ్చాయి. మోదీ పర్యటనతో స్నేహ సంబంధాలు మళ్లీ పూర్వస్థితికి చేరడం ఖాయమని ప్రభుత్వ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మోదీ చైనా పర్యటనకు విశేష ప్రాధాన్యం ఉందని అంతర్జాతీయ వ్యవహారాల నిపుణులు చెబుతున్నారు. రష్యా నుంచి చమురు కొంటున్నందుకు ఇండియాతోపాటు 'బ్రిక్స్' దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కన్నెర్ర చేస్తున్నారు. ఇండియా ఉత్పత్తులపై ఇప్పటికే 25 శాతం టారిఫ్‌లు విధించారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడం ఆపకపోతే మరిన్ని తీవ్రమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. డాలర్ ఆధిపత్యానికి గండి కొట్టేందుకు బ్రిక్స్ దేశాలు ప్రయత్నిస్తున్నాయని ఆయన ఆరోపించారు. చైనాపై కూడా ట్రంప్ సుంకాల మోత మోగించారు. చైనా ఉత్పత్తులపై 30 శాతం టారిఫ్‌లు విధించారు. మరోవైపు ఉక్రెయిన్‌పై యుద్ధం నిలిపివేయాలంటూ రష్యాపై ఒత్తిడి పెంచుతున్నారు. రష్యాను కట్టడి చేయడమే లక్ష్యంగా ఉక్రెయిన్‌కు మరింత ఆయుధ సాయం అందిస్తామని హామీ ఇచ్చారు ఈ నేపథ్యంలో ఎస్సీఓ సదస్సు జరుగుతుండడం, భారత ప్రధాని మోదీ, చైనా అధినేత జిన్‌పింగ్‌తోపాటు రష్యా ప్రతినిధి హాజరుకానుండడం ప్రాధాన్యం సంతరించుకుంది. రష్యా అధ్యక్షుడు పుతిన్ హాజరవుతారా? లేదా? అనేది ఇంకా తెలియరాలేదు. షాంఘై సహకార సంస్థలో చైనా, ఇండియా, రష్యా, కజకిస్తాన్, కిర్గిజిస్తాన్, పాకిస్తాన్, తజకిస్తాన్, ఇరాన్, ఉజ్బెకిస్తాన్ దేశాలకు సభ్యత్వం ఉంది. ఈ ఏడాది ఎస్సీఓ శిఖరాగ్ర సదస్సుకు చైనా ఆతిథ్యం ఇస్తోంది. ఈ ఏడాది జూన్‌లో చైనాలోని ఖింగ్‌డావోలో ఎస్సీఓ సభ్య దేశాల రక్షణ మంత్రుల సదస్సు జరిగింది. ఉమ్మడి ప్రకటనపై సంతకం చేసేందుకు భారత రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నిరాకరించారు. పహల్గాం ఉగ్రవాద దాడి ప్రస్తావన ఇందులో లేకపోవడమే కారణం. దాంతో ఉమ్మడి ప్రకటన విడుదల చేయకుండానే సదస్సు ముగిసింది.

బిహార్‌లో తొలగించిన ఓటర్ల వివరాలివ్వండి

ఎన్నికల సంఘానికి సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ: బిహార్‌లో ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియ వ్యవహారం సుప్రీంకోర్టుకెక్కింది. ఈ ప్రక్రియలో భాగంగా తొలగించిన 65 లక్షల మంది ఓటర్ల వివరాలు ఈ నెల 9వ తేదీలోగా సమర్పించాలని ఎన్నికల సంఘాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. బిహార్‌లో ఎస్ఐఆర్ చేపట్టాలని జూన్ 24న ఎన్నికల సంఘం జారీ చేసిన ఉత్తర్వును సవాలు చేస్తూ ప్రజాస్వామ్య సంస్కరణల సంస్థ(ఏడీఆర్) అనే ఎన్జీఓ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. పిటిషన్ దాఖలు చేసింది. తొలగింపునకు గురైన 65 లక్షల ఓటర్ల వివరాలు ప్రచురించేలా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని విజ్ఞప్తి చేసింది. వారు మరణించారా? లేక వలస వెళ్లారా? లేక మరేదైనా కారణం ఉందా? అనేది తెలియజేయాలని కోరింది. ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. తొలగించిన 65 లక్షల మంది ఓటర్ల సమాచారం అందజేయాలని, ఒక కాపీని ఏడీఆర్‌కు ఇవ్వాలని ఎన్నికల సంఘం తరఫు న్యాయవాదికి సూచించింది.

సీఎంల పేర్లు, ఫొటోలను పథకాలకు ఉపయోగించుకోవచ్చు

- సుప్రీంలో డీఎంకే సర్కార్‌కు ఊరట
- పిటిషన్ వేసిన అన్నాడీఎంకే నేత షణ్ముగంకు రూ.10 లక్షల జరిమానా
- అన్ని రాష్ట్రాల్లో సీఎంల పేర్లు, ఫొటోలు వాడుతున్నారన్న ధర్మాసనం

న్యూఢిల్లీ: తమిళనాడులో ఎంకే స్టాలిన్ సారథ్యంలోని డీఎంకే రాష్ట్ర ప్రభుత్వానికి సర్వోన్నత న్యాయస్థానం నుంచి భారీ ఊరట లభించింది. మీకు అండగా స్టాలిన్(విత్ యూ స్టాలిన్) పేరిట తమిళనాట డీఎంకే సర్కార్ అమలుచేస్తున్న సంక్షేమ పథకం పేరులో ముఖ్యమంత్రి(స్టాలిన్), ఇతర మంత్రుల పేర్లు ఉండటాన్ని సుప్రీంకోర్టు సమర్థించింది. సంక్షేమ పథకంలో స్టాలిన్ పేరు ఉండటంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేస్తూ అన్నాడీఎంకే నేత సీవీ షణ్ముగం మద్రాస్ హైకోర్టులో పిటిషన్ వేయగా ఆయనకు అనుకూలంగా హైకోర్టు ఉత్తర్వు వచ్చింది. దీంతో మద్రాస్ హైకోర్టు తీర్పును డీఎంకే ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్‌చేయగా బుధవారం ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వచ్చింది. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్, జస్టిస్ ఎన్‌వీ అంజారియాల సుప్రీంకోర్టు ధర్మాసనం పిటిషనర్ షణ్ముగంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. దురుద్దేశంతో పిటిషన్ వేశారని మండిపడుతూ షణ్ముగంపై రూ.10 లక్షల జరిమానా విధించింది. ''పిటిషనర్ షణ్ముగం అత్యుత్సాహాన్ని మేం ఏమాత్రం ప్రోత్సహించట్లేము. ఆయన కేవలం ఒకే ఒక్క రాజకీయ పార్టీని లక్ష్యంగా చేసుకుని పిటిషన్ వేశారు. రాజకీయ పార్టీలు ప్రభుత్వ నిధులను నాయకుల పేర్లతో వృథాగా ఖర్చుచేస్తున్నారన్న స్పృహ ఆయనకు నిజంగా ఉంటే ఆయన దేశంలో ఇలాంటి అన్ని రాజకీయ పార్టీలు అమలు చేస్తున్న అన్నీ పథకాలను ఆయన సవాల్‌చేయాలి. వాస్తవానికి దేశవ్యాప్తంగా ఇలా ముఖ్యమంత్రుల పేర్లను ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ఉపయోగిస్తున్నారు. రాజకీయ నాయకుల పేర్లతో పథకాలు ఉండొద్దనే న్యాయబద్ధమైన నిషేధాజ్ఞలు లేవు'' అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. '' రాజకీయ యుద్ధాలను ఎన్నికల్లో తేల్చుకోవాలి. రాజకీయ యుద్ధాల కోసం కోర్టులను ఉపయోగించుకోవద్దు'' అని ధర్మాసనం అసహనం వ్యక్తంచేసింది. ''షణ్ముగం వేసిన పిటిషన్ న్యాయబద్ధంగా లేదు. చట్టప్రకారం లేదు. అందుకే ఆయనకు అనుకూలంగా గతంలో వచ్చిన తీర్పును పక్కనబెడుతున్నాం. ఈమేరకు హైకోర్టు తీర్పును పక్కనబెట్టేందుకు ఉద్దేశించిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను అనుమతిస్తున్నాం'' అని కోర్టు తెలిపింది.

మోదీ చేతుల్ని ట్రంప్ కట్టిపడేశారు

- అమెరికాలో అదానీ అక్రమాలపై విచారణ జరిపిస్తానని ట్రంప్ భయపెడుతున్నారు
- ఆర్థిక ఒప్పందాలు బయటపడతాయని మోదీ భయం
- రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు



న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారతీయ వస్తువులపై దిగుమతి సుంకాల సుత్తితో మోదుతానని మొత్తుకుంటున్నా మోదీ మౌనం వహించడం వెనుక అక్రమ వ్యాపార సంబంధాలు దాగున్నాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రమైన విమర్శలు గుప్పించారు. మరో 24 గంటల్లో మరోమారు భారత్‌పై దిగుమతి టారిఫ్‌లను పెంచుతానని మంగళవారం ట్రంప్ ప్రకటించిన మరుసటి రోజే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ మోదీపై విమర్శలతో విరుచుకుపడ్డారు. ఈ మేరకు రాహుల్ తన సామాజిక మాధ్యమ 'ఎక్స్' ఖాతాలో పలు పోస్టులు పెట్టారు. '' భారత్‌పై అదనపు టారిఫ్‌లు మోపుతానని ట్రంప్ పదేపదే ప్రకటిస్తూ ఇప్పటికే ఒకసారి 25 శాతం పెంచినా ప్రధాని మోదీ ఏమాత్రం ట్రంప్‌ను నిలువరించలేకపోయారు. దీని వెనుక అసలు కారణం ఇప్పటికైనా భారతీయులకు తెలియాల్సి ఉంది. అదేంటంటే అమెరికాలో గౌతమ్ అదానీపై అక్కడి విచారణ సంస్థలు దర్యాప్తు కొనసాగిస్తున్నాయి. మోదీ, ఏఏ(అంబానీ, అదానీ), రష్యా ముడి చమురు కొనుగోళ్ల వ్యవహారంలో అక్రమ ఆర్థిక సంబంధాలు బట్టబయలు చేస్తానని ట్రంప్ బెదిరిస్తున్నారు. అందుకే భారత్‌పై ఎంతటి టారిఫ్‌ల భారం పడుతున్నా ప్రధాని మోదీ చీమకుట్టినట్లయినా లేకుండా మౌనంగా ఉండిపోయారు. అదానీ దర్యాప్తు పేరు చెప్పి మోదీ చేతుల్ని ట్రంప్ కట్టిపడేశారు'' అని రాహుల్ గాంధీ ఆరోపించారు. రాహుల్ ఆరోపణలపై అదానీ గ్రూప్ సంస్థనుంచిగానీ కేంద్రప్రభుత్వం నుంచిగానీ ఇంతవరకు ఎలాంటి స్పందన, వివరణ రాలేదు. రష్యాతో ముడి చమురు వాణిజ్యాన్ని భారత్ మరింతగా పెంచుకోవడంపై ట్రంప్ మొదట్నుంచీ తీవ్ర స్థాయిలో అభ్యంతరం వ్యక్తం చేస్తుండటం తెల్సిందే. ఈ అక్కసుతోనే ఆయన భారత్‌పై అదనపు దిగుమతి టారిఫ్‌లను విధిస్తు న్నారు. ఇప్పటికే ఒక దఫా పెంచగా మరోదఫా మరికొన్ని గంటల్లో పెంచుతానని ప్రకటించడం, భారత్ ఘాటుగా బదులివ్వడం తెల్సిందే.

కొనసాగుతున్న ముమ్మర గాలింపు

- ధరాలీలో 28 మందితో కూడిన కేరళ పర్యాటక బృందం జాడ గల్లంతు
- బురదలో కూరుకుపోయిన వారి జాడ కోసం తీవ్రస్థాయిలో అన్వేషణ



ఛమోలీ జిల్లాలోని రైనీ గ్రామం వద్ద కొండచరియ పడటంతో ధ్వంసమైన రహదారి

ఉత్తరకాశీ(ఉత్తరాఖండ్): ఎగువ ప్రాంతాల్లో క్లౌడ్ బరస్ట్(మేఘ విస్ఫోటనం) కారణంగా ఖీర్‌గంగా నదీ ప్రవాహం ఉప్పొంగి దిగువన ధరాలీ గ్రామాన్ని బురద ముంచెత్తడంతో అందులో కూరుకుపోయిన వారి జాడ కోసం యుద్ధప్రాతిపదికన గాలింపు కొనసాగుతోంది. ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీ జిల్లాలోని ధరాలీలో ఇప్పటికే ఐదుగురు సజీవ సమాధికాగా మరొకరి మృతదేహాన్ని బుధవారం వెలికితీశారు. గ్రామంలో చిక్కుకుపోయిన 190 మందిని కాపాడారు. ఇంకా 100 మందికిపైగా జాడ గల్లతైంది. దీంతో ఐటీబీపీ, ఎస్‌డీఆర్ఎఫ్, ఆర్మీ, పోలీసు, సహాయక బృందాలు సహాయక, అన్వేషణ చర్యల్లో పూర్తిగా మునిగిపోయాయి. హార్సిల్‌లోని ఆర్మీ క్యాంప్‌కు చెందిన 11 మంది జవాన్ల జాడ ఇంకా తెలియరాలేదు. గంగోత్రి ధామాన్ని దర్శించుకునేందుకు కేరళ నుంచి వచ్చిన 28 మంది యాత్రికుల బృందం జాడ గల్లంతైంది. దీంతో ఆ బృందసభ్యుల బంధువుల్లో ఆందోళనలు రెట్టింపయ్యాయి. '' ఉత్తరకాశీ నుంచి గంగోత్రికి మంగళవారం ఉదయం 8.30 గంటలకు బయల్దేరినట్లు నాతో ఫోన్‌లో చెప్పారు. వాళ్లు ప్రయాణిస్తున్న మార్గంలోనే కొండచరియలు పడ్డాయి. తర్వాత వాళ్లకు ఫోన్ చేస్తే అస్సలు కలవడంలేదు'' అని ఒక బంధువు ఏడుస్తూ చెప్పారు. ''ధరాలీలో మాకు ఇల్లు, హోటల్ ఉన్నాయి. అక్కడే నా సోదరుడు, భార్య, కుమారుడు ఉంటారు. మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఇంతవరకు నా సోదరుడు, అతని కుటుంబం జాడ తెలీడంలేదు'' అని మరో వ్యక్తి వాపోయాడు.

బురదలో కూరుకుపోయిన ప్రాచీన ఆలయం

మంగళవారంనాటి బురదచరియలు దూసుకొచ్చిన ఘటనలో ధరాలీ గ్రామంలోని ప్రాచీన కల్ప్ కేదార్ శివాలయాన్ని బురద పూర్తిగా కప్పేసింది. ఈ ఆలయాన్ని సైతం కేదార్‌నాథ్ ఆలయం మాదిరే 'కథూర్' శైలిలో నిర్మించారు. దశాబ్దాల క్రితం జరిగిన ఇలాంటి ఘటనలోనూ కల్ప్‌కేదార్ ఆలయం చాలాభాగం మట్టిలో కూరుకుపోయింది. ఇన్నాళ్లూ శివాలయం పైభాగం మాత్రమే బయటకు కనిపించేది. దీంతో చిన్నపాటి మార్గం గుండా లోపలికి వెళ్లి భక్తులు దర్శనాలు చేసుకునే వాళ్లు. ఆలయ గర్భగుడిలో శివలింగంపై ఖీర్‌గంగా నదీజలం అభిషేకం చేస్తున్నట్లు పడేలా గతంలో ఏర్పాట్లుచేశారు. మంగళవారం నాటి ఉత్పాతంతో పూర్తిగా బురదలో కలిసిపోయింది. ఈ ఆలయాన్ని 1945లో తవ్వకాల్లో గుర్తించారు.

పలు చోట్ల విరిగిపడిన కొండచరియలు..

కొండచరియలు పడడంతో గంగోత్రి జాతీయ రహదారిపై పలు చోట్ల రాకపోకలు స్తంభించిపోయాయి. గంగోత్రి జాతీయరహదారి వెంట లిమిఛా నదిపై గంగ్నానీ వద్ద నిర్మించిన వంతెన పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో ఆ వైపు నుంచి వస్తున్న సహాయక బృందాలు ముందుకు కదల్లేక అక్కడే ఆగిపోయాయి. కొండచరియలు పడిన ప్రతిచోటా ఇదే పరిస్థితి. దీనికి తోడు భారీ వర్షాలు సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం కల్గిస్తున్నాయి. వర్షం తగ్గాక ఆకాశమార్గంలో గాలింపు కోసం ఆర్మీ ఎంఐ–17, ఛినూక్ హెలికాప్టర్లను సిద్ధం చేసింది. '' ధరాలీ గ్రామంలో సగభాగం సమాధిలా మారింది. ఇళ్లు, హోటళ్లు, రెస్టారెంట్లు, హోమ్‌స్టేలు, చెట్లు మొత్తం బురదలో కూరుకుపోయాయి. బాధితులకు ఆహారం, ఔషధాలు అందిస్తున్నాం. పునరావాస కార్యక్రమాలను 160 మంది పోలీసులు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు'' అని ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామీ చెప్పారు. బుధవారం ఆయన ఘటనాస్థలిని సందర్శించారు.



బురద నుంచి బయటకులాగిన బాధితుడిని రాళ్లు,రప్పల మీదుగానే తరలిస్తున్న సైనికులు

సాక్షి హైదరాబాద్

గురువారం। 7। ఆగస్టు। 2025



డాక్టర్ నమ్రతపై మరో కేసు

సరోగసీ పేరుతో శిశువుల అక్రమ రవాణాకు పాల్పడిన యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ నిర్వాహకురాలు డాక్టర్ నమ్రతపై బుధవారం మరో కేసు నమోదైంది. -8లో



డాక్టర్.. రన్నర్..

'దీర్ఘకాలిక వ్యాధులతో రోగులు నా తలుపు తట్టని రోజునే నేను వైద్యుడిగా విజయం సాధించినట్టు' అంటున్నారు నగరానికి చెందిన డాక్టర్ సుధీర్‌కుమార్. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0/23.0

నగరంలో గురువారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి వర్షం కురిసే అవకాశముంది. గరిష్టంగా 32, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.

'వాసవీ'పై హైడ్రా చర్యలు

వరద కాల్వ ఆక్రమణలపై పోలీసులకు ఫిర్యాదు



సాక్షి, సిటీబ్యూరో: రాజధానిలోని నాలాలు, వరద కాల్వల కబ్జాలను హైడ్రా తీవ్రంగా పరిగణిస్తోంది. ఇలాంటి చర్యలకు ఉపక్రమిస్తున్న బడా సంస్థల్నీ విడిచిపెట్టట్లేదు. తాజాగా నిర్మాణ సంస్థ వాసవీపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీన్ని ఆధారంగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు హైడ్రా బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. భరత్‌నగర్-ఖైతలాపూర్ మార్గంలోని కాముని చెరువు-మైసమ్మ చెరువులను కలుపుతూ సాగే వరద కాల్వను వాసవీ నిర్మాణ సంస్థ కబ్జా చేసింది. దీనిపై హైడ్రాకు ఫిర్యాదు రావడంతో తీవ్రంగా పరిగణించి క్షేత్రస్థాయిలో పరిశీలించింది. 17 మీటర్ల వెడల్పు, ఇరువైపులా తొమ్మిది మీటర్ల చొప్పున బఫర్ ఉండాల్సి ఉండగా... వాసవీ సంస్థ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నట్లు గుర్తించింది. స్వయంగా రంగంలోకి దిగిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ బుధవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. హైటెక్ సిటీ రైల్వే స్టేషన్ సమీపంలోని ముల్లకత్వ చెరువు-కాముని చెరువు-మైసమ్మ చెరువులను కలుపుతూ వెళ్లే వరద కాలువలో మట్టి పోసినట్టు నిర్ధారించారు. దీంతో నిర్మాణ సంస్థపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. నాలా ఆక్రమణలను వెంటనే తొలగించాలని సూచించారు. ఈ మేరకు హైడ్రా అధికారులు జేసీబీలతో, టిప్పర్లతో వరద కాల్వలోని మట్టి తొలగించారు. ఆ మట్టిని వాసవీ నిర్మాణ సంస్థకు చెందిన స్థలంలో పడేశారు. వరద కాల్వను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారంటూ వాసవీ నిర్మాణ సంస్థపై కూకట్‌పల్లి పోలీసుస్టేషన్‌లో ఇరిగేషన్ అధికారులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అధికారులు కేసు నమోదు చేశారు. కాల్వ ఇరువైపులా రిటైనింగ్ వాల్స్‌తో నిర్మించి, స్లాబ్ వేసేందుకు మధ్యలో వేసిన పిల్లర్లనూ తొలగించాల్సి ఉందని హైడ్రా అధికారులు గుర్తించారు. వాసవీ సరోవర్ పేరిట ఖైతలాపూర్‌లో నిర్మాణాలు చేపడుతున్నప్పుడే వరద కాల్వకు సంబంధించిన నిబంధనలను పాటించాలని హైడ్రా హెచ్చరించిన విషయాన్ని అధికారులు నిర్వాహకులకు గుర్తు చేశారు.

రక్తదానంతో ఒక ప్రాణం నిలుస్తుంది: చిరంజీవి



కార్యక్రమంలో పాల్గొన్న చిరంజీవి తదితరులు

రాయదుర్గం: రక్తదానంతో ఒక ప్రాణం నిలుస్తుందని, నేటి యువతకు మళ్లీ మళ్లీ చెబుతున్నా.. రక్తదాతలు కావాలని ప్రముఖ సినీ నటుడు చిరంజీవి సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో నాలెడ్జి సిటీలోని ఫినిక్స్ సంస్థలో మెగా బ్లడ్ డొనేషన్ డ్రైవ్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో చిరంజీవి మాట్లాడుతూ.. ఒక జర్నలిస్ట్ రాసిన కథనం చదివిన తర్వాత బ్లడ్‌బ్యాంక్ పెట్టాలనే ఆలోచన తనకు వచ్చిందని గుర్తు చేశారు. సినీనటులు తేజ సజ్జా, సంయుక్త, ఫినిక్స్ గ్రూప్ చైర్మన్ సురేష్ చుక్కపల్లి తదితరులు పాల్గొన్నారు.

ఓల్డ్ మలక్‌పేటలో కుంగిన రోడ్డు

చాదర్‌ఘాట్: నగరంలో రహదారులు, నాలాలు కుంగిపోవడం పరిపాటిగా మారింది. మంగళవారం బంజారాహిల్స్‌లో నాలా కుంగి లారీ ఇరుక్కున్న సంగతి విదితమే. అలాంటి ఘటనే ఓల్డ్‌మలక్‌పేటలో చోటుచేసుకుంది. డివిజన్ పరిధిలోని లాలాబజార్ ఎక్స్ రోడ్ నుంచి హెచ్‌ఆర్‌సీ వైపు వెళ్లే రహదారిలో పంచశీల లైబ్రరీ వద్ద బుధవారం సాయంత్రం అకస్మాత్తుగా రహదారి కుంగి పెద్ద గుంత ఏర్పడింది. సమాచారం అందుకున్న అధికారులు మరమ్మతు పనులు చేపట్టారు.



వానొస్తే వరద.. రోడ్డెక్కితే రోత.. ఇదీ ప్రస్తుతం సిటీ సీన్. గడచిన కొన్ని రోజులుగా నగరంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో వర్షం అంటే చాలు.. జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ పోలీసులతో పాటు హైడ్రా గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. వాటర్ లాగింగ్, ట్రాఫిక్ జామ్స్, మ్యాన్‌హోల్స్... ఈ ముప్పుల్ని ఎలా నివారించేదెలా అని తలలు పట్టుకుంటున్నారు. సోమవారం హఠాత్తుగా కురిసిన వర్షంతో దాదాపు మూడు గంటలకు పైగా నగరం పూర్తిగా స్తంభించిపోయింది. అసలు నగరంలో ఈ పరిస్థితులు నెలకొనడానికి కారణమేమిటి? ప్రణాళిక ఎందుకు లోపించింది? అసలు లోపం ఎక్కడుంది?
– సాక్షి, సిటీబ్యూరో

అత్యంత సమస్యాత్మకంగా 34 ప్రాంతాలు

రీ-కార్పెటింగ్ చేయాల్సిన రోడ్లపైనా బేఖాతరు

బిగ్ స్టోరీ

డివైడర్ల కారణంగానూ పెరుగుతున్న కష్టాలు

సిటీలో నిత్యకృత్యంగా మారిన ట్రాఫిక్ జామ్స్



సోమాజిగూడ రోడ్డును ముంచెత్తిన వరదనీరు (ఫైల్)

జనగోస వెనుక!

నగరంలో 149 వాటర్ లాగింగ్ ఏరియాలు



వర్షం కురిస్తే చాలు ట్రాఫిక్ జామ్స్ ఏర్పడటానికి వాటర్‌లాగింగ్ ఏరియాలు ప్రధాన కారణం. ఇలాంటివి నగర వ్యాప్తంగా 149 ఉన్నాయి. వీటిలో 34 అత్యంత సమస్యాత్మకమైనవిగా ట్రాఫిక్ అధికారులు తేల్చారు. ఈ ప్రాంతాల్లో వర్షం వస్తే చాలు గంటకు పైగా నీళ్లు నిలుస్తుండటంతో తీవ్రమైన ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. ఇవి హఠాత్తుగా వచ్చిపడిన సమస్యలు కావు. ప్రతి ఏడాదీ వర్షాకాలం ప్రారంభానికి ముందు ట్రాఫిక్ విభాగం అధికారులు సిటీలోని వాటర్‌లాగింగ్ ఏరియాలు, తీవ్రమైన ఇబ్బందులు ఉండే ప్రాంతాల జాబితాను రూపొందించి జీహెచ్‌ఎంసీకి ఇస్తుంటారు. సదరు అధికారుల నుంచి సరైన స్పందన, సమస్యల పూర్తి పరిష్కారం లేకపోవడంతో నగరజీవికి రెయినీ, ట్రాఫిక్ కష్టాలు తప్పట్లేదు.

ఇలా చేసి చూస్తే...

యుద్ధ ప్రాతిపదికన 34 సమస్యాత్మక ప్రాంతాల్లో వర్షపు నీరు నిలవకుండా చూడాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే ఈ ప్రాంతాల్లో నిలిచిన నీటితో ట్రాఫిక్ ఆగుతోంది. ఇవి అత్యంత కీలకమైన, రద్దీ ప్రాంతాలు కావడంతో ఆ ప్రభావం కనెక్టివిటీతో ఉండే ఇతర రోడ్ల మీదా పడుతోంది. ఈ సమస్య తీరాలంటే స్టామ్ వాటర్ పైపులైన్స్ నిర్మాణాన్ని పూర్తి స్థాయిలో, శాస్త్రీయంగా చేపట్టాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం నగరంలోని కొన్ని ప్రాంతాల్లో నిర్మించినా.. ఆశించిన స్థాయి ఫలితాలు రావట్లేదు. ఆయా ముంపు ప్రాంతాల్లో ప్రత్యేక మ్యాన్‌హోల్స్ ఏర్పాటు చేసి అక్కడి నుంచి సమీపంలో ఉన్న నాలాలకు పైపులైన్ వేశారు. కేవలం లైన్ వేసి చేతులు దులుపుకోకుండా ప్రవహించే నీటి సామర్థ్యానికి అనుగుణంగా నాలాలను విస్తరించకపోవడం, పూడికలు తీయకపోవడంతో ఇబ్బందులు తప్పట్లేదు.

మ్యాన్‌హోల్స్ రూపంలో మరో ముప్పు..



జీహెచ్‌ఎంసీ, వాటర్‌బోర్డ్‌లకు చెందిన మ్యాన్‌హోళ్లతో వర్షం వచ్చిందంటే చాలు ముప్పు పొంచి ఉంటోంది. శాఖల మధ్య సమన్వయ లోపం కారణంగా ఏటికేడాదీ రోడ్ల ఎత్తు పెరుగుతోంది. అందుకు తగ్గట్టు మ్యాన్‌హోళ్ల ఎత్తును పెంచకపోవడంతో అనేక ప్రాంతాల్లో వీటి దగ్గర గోతులు ఉన్నాయి. వాహనాలు వాటిలో పడి మ్యాన్‌హోల్ మూతలు దెబ్బతింటున్నాయి. ఫలితంగా అవి నీటిని బయటకు కక్కడంతో పాటు ట్రాఫిక్ ఇబ్బందులకూ కారణమవుతున్నాయి. వర్షం కురిసినప్పుడు రోడ్డుకు లోతుగా ఉంటున్న వీటిలో నీరు నిండి గుర్తించడం కష్టంగా మారుతోంది. ఇవే వాహన చోదకులను ప్రమాదాలకు గురి చేస్తున్నాయి.

రీ కార్పెటింగ్ ఊసే లేదు..

వివిధ విభాగాలు చేపడుతున్న అభివృద్ధి పనులు వర్షం కురిసినప్పుడు కొత్త ఇబ్బందులు తెచ్చిపెడుతున్నాయి. కేబుళ్లు, పైపులైన్ల ఏర్పాటు, రిపేర్ల కోసం సమన్వయం లేకుండా, విచ్చలవిడిగా, ఎక్కడపడితే అక్కడ, ఇష్టానుసారం తవ్వకాలు చేపడుతున్నారు. సంకల్పించిన పని పూర్తి కాగానే అక్కడ రోడ్డును మిగిలిన దానితో సమానంగా రీ-కార్పెటింగ్ చేయాల్సి ఉంది. జలమండలికి స్వయంగా చేసుకునే నిధులున్నా.. మిగిలిన విభాగాలకు జీహెచ్‌ఎంసీనే దిక్కు. ఇక్కడా నిర్లక్ష్యం కన్పిస్తుండటంతో నగరంలోని అనేక ప్రాంతాల్లో రీ కార్పెటింగ్ వర్క్ పెండింగ్‌లో ఉండి వర్షాలు కురిసినప్పుడు కొత్త సమస్యలు తెచ్చిపెట్టడానికి సిద్ధంగా ఉంది. ఇకనైనా జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి సాధ్యమైనంత వరకు సమస్యలు పరిష్కరించాల్సిన అవసరం ఉంది.

డివైడర్లతోనూ వాటర్ లాగింగ్ పరేషాన్..

ట్రాఫిక్ జామ్స్ నియంత్రణ, ఎదురెదురుగా వచ్చే వాహనాలు ఢీకొట్టుకోకుండా చూడటంతో ఉపయుక్తంగా ఉంటున్న డివైడర్లు వర్షం కురిసినప్పుడు ట్రాఫిక్‌కు కొత్త కష్టాలు తెచ్చిపెడుతున్నాయి. అశాస్త్రీయంగా నిర్మించిన వీటి కారణంగా వర్షపు నీరు రోడ్లపై నిలిచిపోతూ కొత్త వాటర్ లాగింగ్ ఏరియాలుగా రూపాంతరం చెందుతున్నాయి. రోడ్డులో ఓ వైపు వచ్చిన రెయిన్ వాటర్ మరో వైపు ఉన్న డ్రైనేజీలోకి చేరేందుకు ఈ డివైడర్ల కారణంగా అవకాశం లేకపోవడంతో అక్కడే నిలిచి వాహనాలకు ఆటంకం కలిగించడంతో పాటు.. రహదారులు దెబ్బతినేందుకు కారణంగా మారుతున్నాయి. నగరంలోని 80 ప్రాంతాల్లో డివైడర్ల కారణంగానే నీరు నిలిచిందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇలాంటి చోట్ల ఆ నీటిని తరలించేందుకు ప్రత్యేకంగా మోటార్లను ఏర్పాటు చేసుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిర్మాణంలో తేడానే కారణం...



సాధారణంగా 100 అడుగుల కంటే ఎక్కువ వెడల్పు ఉన్న రోడ్ల మధ్యలోనే డివైడర్లు నిర్మించాల్సి ఉంటుంది. ప్రస్తుత అవసరాల దృష్ట్యా ఇందులో సగం ఉన్న రహదారుల్లోనూ వీటిని ఏర్పాటు చేయాల్సి వస్తోంది. మరోపక్క గతంలో అనేక ప్రాంతాల్లో డివైడర్లు మాత్రమే ఉండేవి. వీటి మధ్యలో వర్షపు నీరు ఓ పక్క నుంచి మరో పక్కకు పోయే అవకాశం ఉండేది. అడ్వర్టైజ్‌మెంట్ బోర్డులు, లాలీపాప్స్ ఏర్పాటు చేయడం ద్వారా ఆదాయం ఆర్జించాలనే జీహెచ్‌ఎంసీ వైఖరి కారణంగా డివైడర్ల ప్లేస్‌లో సెంట్రల్ మీడియమ్స్ వచ్చి చేరుతుండటంతో వీటి వల్ల ఇబ్బందులు పెరుగుతున్నాయి. సాధ్యమైనంత వరకు సెంట్రల్ మీడియమ్స్ కంటే డివైడర్ల పైనే దృష్టి పెట్టాలి. గతంలో ప్రధాన రహదారుల్లో ఉన్న వీటిపై యాడ్స్ ఏర్పాటు చేసుకునేలా బారికేడింగ్ ఏర్పాటు చేసి రెవెన్యూ, భద్రత రెండూ పెంచవచ్చు. పల్లపు ప్రాంతాల్లో ఏర్పాటు చేసే డివైడర్లను ప్రత్యేకంగా డిజైన్ చేయాలి. డివైడర్ కానీ, సెంట్రల్ మీడియం కానీ ఏది ఏర్పాటు చేసినా వాటి కింది నుంచి వర్షపు నీరు వెళ్లే అవకాశం ఉండాలి. కొన్ని ప్రాంతాల్లో డివైడర్లకు కింది భాగంలో పైపులు ఏర్పాటు చేసినా.. చెత్త కారణంగానూ ఫలితం దక్కట్లేదు.

నాలా కథే వేరయా!

అక్రమాల పునాదులు.. అంతులేని అనర్థాలు

నాలాలను ఆక్రమించి అపార్ట్‌మెంట్ల నిర్మాణం

స్లాబ్‌ల పైనుంచి భారీ వాహనాలు

వాటర్‌బోర్డు సివరేజీ వాటిలోకే..

సాక్షి రిపోర్ట్

కనీస నిర్వహణనూ పట్టించుకోని యంత్రాంగం



కూలిన నాలా స్లాబ్

సాక్షి, సిటీబ్యూరో: కర్ణుడి చావుకు కారణాలనేకం అన్నట్లు నగరంలో సకల సమస్యలకూ అక్రమ నిర్మాణాలే హేతువులు. చెరువులను ఆక్రమించిన నిర్మాణాలతో ముంపు సమస్యలు పెరిగినట్లే.. నాలాల స్లాబ్‌లపైనే బహుళ అంతస్తులతో ప్రమాదాలు జరుగుతున్నాయి. తాజాగా బంజారాహిల్స్‌లో నాలా కప్పు కూలి వాటర్ ట్యాంకర్ దిగబడటం తెలిసిందే. దీని వెనుకా ఇలాంటి కథే ఉంది. నాలాలపై, చుట్టుపక్కల ఏమేం నిర్మాణాలు వస్తున్నాయి.. ఎలాంటి కట్టడాలు వెలుస్తున్నాయి అన్నదీ అధికారులు ఏనాడూ పట్టించుకున్న పాపాన పోలేదు. ఇక నిర్వహణ అనేదైతే పూర్తిగా మరచేపోయారు. అంతేకాదు.. నగరంలో ఉన్న నాలాలెన్ని వాటి స్థితిగతులేమిటనేది తెలియనే తెలియదు. నగరంలో ఇళ్లల్లోంచే వెళ్తున్న నాలాలెన్నో ఉన్నాయి. నాలాల విస్తరణ, ఆధునికీకరణ పనుల కోసం రూ.వేల కోట్లు ఖర్చు చేస్తున్న యంత్రాంగం పాత నాలాల గురించి కనీసం పట్టించుకోవడంలేదు. నగరంలో ప్రధాన మేజర్ నాలాలు 393 కిలోమీటర్లు, మొత్తం నాలాలు 1302 కిలోమీటర్లని చెబుతున్నప్పటికీ, ఈ లెక్కల్లో లేని నాలాలెన్నో



జాగ్రత్తలతో ప్రమాదాల నివారణ



పెద్ద నాలాలకు స్లాబ్‌లు వేయొద్దు. చిన్న నాలాల స్లాబ్‌లపై నడిస్తే ప్రమాదాలు ఉండవు కానీ, వాహనాలు మాత్రం వెళ్లరాదు. నగరంలో ఇరుకు మార్గాల్లో ఉన్న నాలాలపైనా వాహనాలు తిరుగుతున్నాయి. నగరంలోని పాత నాలాలు ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్న స్థానికులకు తప్ప ఇతరులకు తెలియవు. దీంతో ఎక్కడ దేనికింద ఏ నాలా ఉందో కూడా తెలియని పరిస్థితులున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే అక్కడ నాలాలున్నాయని తెలుస్తోంది. నాలాలపైనే వివిధ నిర్మాణాలతో పాటు బహుళ అంతస్తుల భవనాలు కూడా ఉన్నాయి. అలాంటి ప్రాంతాల్లో నాలాలున్నట్లు కూడా తెలియదు. నాలాల సమస్యల పరిష్కారానికి కిర్లోస్కర్, వాయెంట్స్ నివేదికలే కీలకం. పాత నాలాలున్న ప్రాంతాల్లో వాహనదారులకు తెలిసేలా సైనేజీలు ఏర్పాటు చేయడం, భారీ వాహనాలకు ప్రవేశం నిషేధించడం వంటి చర్యల ద్వారా ప్రమాదాలు నివారించవచ్చు. రహదారుల మార్గాల్లో నాలాలు నిర్మించాల్సి వచ్చినప్పుడు ట్రాఫిక్ రద్దీని, వాహన భారాన్ని దృష్టిలో ఉంచుకుని బాక్స్ డ్రెయిన్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టాం. వాటితో ప్రమాదం ఉండదు
– రుమాండ్ల శ్రీధర్, ఇంజినీరింగ్ నిపుణులు (రిటైర్డ్ ఈఎన్‌సీ, పబ్లిక్‌హెల్త్ అండ్ మున్సిపల్ ఇంజినీరింగ్)

ఉన్నాయి. అన్ని నాలాలను లెక్కలోకి తీసుకుంటే 5వేల కిలోమీటర్ల వరకు ఉంటాయని అంచనా. రెండుమీటర్ల కంటే ఎక్కువ వెడల్పున్న నాలాలకు కప్పులే వేయరాదు. తప్పనిసరి సందర్భాల్లో వేసినా తగిన నిర్వహణ, జాగ్రత్తలు అవసరం కాగా వాటి గురించి అధికారులు పట్టించుకోవడంలేదు.

నాలాలంటే మురుగు కాల్వలా?

నాలాలంటే మురుగునీరు పారే కాల్వలనే చాలా మంది అనుకుంటారు. కానీ.. కురిసిన వర్షం వెళ్లేందుకు నిర్మించిన వరదనీటి కాల్వలే నాలాలు. వరదనీటి కాల్వల్లోకే వాటర్‌బోర్డు మురుగునీటి లైన్లను కలపడంతో మురుగు కలగలసి నాలాలు అలా మారాయి. మురుగునీరే పారుతుందనే ముద్ర పడింది. అలా మురుగునీరు ఎల్లప్పుడూ పారుతుండటం.. పైకప్పుల వల్ల గాలి వెళ్లే మార్గం లేక రసాయన వాయువులు వెలువడుతూ పైకప్పులు దెబ్బతిని శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. నాలాల కప్పులకు మరమ్మతులు చేసే పరిస్థితి లేదు.

నాలాపైనే నిర్మాణం?

బంజారాహిల్స్ మహేశ్వరి టవర్స్ వద్ద వాటర్ ట్యాంకర్ కుంగిన రోడ్డు కింది నాలా దాదాపు 35 ఏళ్ల క్రితం ఆర్‌ఆర్ మిషనరీతో నిర్మించినట్లు జీహెచ్‌ఎంసీ పేర్కొంది. నాలా నిర్మాణం జరిగిన తర్వాత రెండేళ్లకు 32 ఏళ్ల క్రితం అపార్ట్‌మెంట్స్ నిర్మించినట్లు స్థానికులు తెలిపారు. ఈ నేపథ్యంలో నాలాపైనే నివాస భవనాలు నిర్మించారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనికి తోడు నాలాలో కలిసే మురుగునీటి వల్ల కూడా విషవాయువులతో స్లాబ్ దెబ్బతిన్నట్లు అధికారులు భావిస్తున్నారు.

నిర్వహణ లేనందునే..

రెండుమీటర్ల కంటే తక్కువ వెడల్పుండే నాలాలకు పైకప్పులే ఉండొద్దు. పైకప్పుల వల్ల.. నాలాల్లో మురుగునీరు కలుస్తున్నందున హైడ్రోజెన్ సల్ఫైడ్, కార్బన్డైయాక్సైడ్, మిథేన్, తదితర గ్యాసెస్‌తో స్లాబ్ కాంక్రీటు, స్టీలు దెబ్బతింటాయి.అలా దెబ్బతినకుండా నిర్వహణ పనులు చేయాలి. నిర్ణీత వ్యవధుల్లో తనిఖీలు చేయడంతోపాటు ఏటా గ్రౌటింగ్ వంటి పనులు చేస్తే దృఢత్వం దెబ్బతినకుండా ఉంటుంది. సల్ఫేట్‌రెసిస్టెంట్ సిమెంట్‌ను కూడా వాడవచ్చు.
– దేవానంద్, రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్, జీహెచ్‌ఎంసీ



ప్రాణహాని భయంతోనే రౌడీషీటర్ హత్య


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ నరేష్ రెడ్డి

నలుగురు నిందితుల రిమాండ్

దుండిగల్: తీసుకున్న అప్పు తిరిగి చెల్లించమని కోరితే చంపేస్తానని బెదిరించడంతో..ఎప్పటికైనా ప్రాణహాని ఉంటుందని భావించిన సదరు వ్యక్తి మరో ముగ్గురితో కలిసి ఓ రౌడీషీటర్‌ను దారుణంగా హత్య చేశాడు. జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన హత్య కేసులో నలుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ ఆవరణలో బుధవారం బాలానగర్ ఏసీపీ నరేష్‌రెడ్డి తెల్పిన మేరకు..కూకట్‌పల్లి ఎల్లమ్మబండ ప్రాంతానికి చెందిన సయ్యద్ ఫజల్ (48) స్క్రాప్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ఇతనికి ముషీరాబాద్ ప్రాంతానికి చెందిన స్క్రాప్ వ్యాపారి, రౌడీషీటర్ మహబూబ్‌తో కొన్నేళ్లుగా పరిచయం ఉంది. ఫజల్, అతని సోదరుడు కలిసి మహబూబ్‌కు ఐదేళ్ల క్రితం రూ.11 లక్షలు అప్పుగా ఇచ్చారు. అప్పటి నుంచి తిరిగి చెల్లించాలని పలుమార్లు కోరగా వాయిదా వేస్తు వస్తున్నాడు. ఈ మధ్య కాలంలో మహబూబ్‌పై ఒత్తిడి తీసుకురాగా తాను తిరిగి డబ్బులు ఇవ్వనని, మరోసారి అడిగితే ఫజల్‌ను చంపేస్తానని బెదిరించాడు. దీంతో ఆందోళన చెందిన ఫజల్..డబ్బులు రాకపోగా మహబూబ్ నుంచి ఎప్పటికైనా అపాయం పొంచిఉందని భావించి అతని హత్యకు ప్లాన్ చేశాడు. ఇందుకు ఎల్లమ్మబండ ప్రాంతానికి చెందిన అతని మేనల్లుడు సయ్యద్ జహంగీర్‌ను సహాయం కోరగా, అదే ప్రాంతానికి చెందిన స్నేహితులు షేక్ కరీం, షేక్ అమీర్‌లతో కలిసి పథకం రచించారు. ఫజల్ ఈ నెల 5వ తేదీన మహబూబ్‌కు ఫోన్ చేసి డబ్బుల విషయంపై మాట్లాడేందుకు ఎల్లమ్మబండ ప్రాంతానికి రావాలని కోరాడు. దీంతో మహబూబ్ మరో ఇద్దరు వ్యక్తులతో కలిసి వచ్చాడు. అందరు స్థానికంగా ఉన్న గుడ్‌విల్ హోటల్‌లో సమావేశమై మాట్లాడుతుండగా ఒక్కసారిగా వారి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. వెంటనే జహంగీర్ తనతో తెచ్చుకున్న కత్తితో మహబూబ్‌పై విచక్షణారహితంగా దాడి చేయగా కుప్పకూలిపోయాడు. మహబూబ్ వెంట వచ్చిన ఇద్దరు అక్కడి నుంచి పారిపోగా నలుగురు కలిసి అతన్ని నరికి చంపి అక్కడి నుంచి పరారయ్యారు. కేసు నమోదు చేసుకున్న జగద్గిరిగుట్ట పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా నలుగురు నిందితులను గుర్తించారు. బుధవారం అల్విన్ కాలనీలోని ఓ మద్యం షాపులో మద్యం తాగుతున్న ఫజల్, జహంగీర్, కరీం, అమీర్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి నాలుగు సెల్ ఫోన్లు, మూడు కత్తులు, ఆటో స్వాధీనం చేసుకున్నారు. కాగా మృతుడు మహబూబ్‌పై పటాన్‌చెరువులో ఓ హత్య కేసు, 13 ఇతర కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. 24 గంటల్లో కేసును ఛేదించిన జగద్గిరిగుట్ట ఇన్‌స్పెక్టర్ నర్సింహ తదితరులను ఏసీపీ అభినందించి వారికి రివార్డులు ప్రకటించారు.

డాక్టర్ నమ్రతపై మరో కేసు

- ఫిర్యాదు చేసిన నగరానికి చెందిన గైనకాలజిస్ట్
- తాజాగా మరో ఎనిమిది మంది నిందితుల అరెస్టు
- లోతుగా దర్యాప్తు చేస్తున్న గోపాలపురం పోలీసులు



సాక్షి,సిటీబ్యూరో/రామ్‌గోపాల్‌పేట: సరోగసి పేరు తో శిశువుల అక్రమ రవాణాకు పాల్పడిన యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ నిర్వాహకురాలు డాక్టర్ నమ్రతపై బుధవారం మరో కేసు నమోదైంది. సికింద్రాబాద్ ప్రాంతానికి చెందిన ప్రముఖ గైనకాలజిస్ట్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దీన్ని రిజిస్టర్ చేసిన గోపాలపురం పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. దీంతో కలిపి ఇప్పటి వరకు నమ్రత, ఆమె ముఠాపై నమోదైన కేసుల సంఖ్య ఆరుకు చేరింది. తాజాగా ఈ కేసులో మరో ఎనిమిది మంది నిందితులను అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. వీరితో కలిపి ఇప్పటి వరకు అరెస్టు అయిన వారి సంఖ్య 22కు చేరింది. నమ్రతపై 2020లో విశాఖపట్నంలో కేసులు నమోదయ్యాయి. వీటి ప్రభావంతో సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ లైసెన్సులు అధికారులు పొడిగించలేదు. ఆ సమయంలో తాను ఆస్పత్రి మూసేస్తున్నట్లు సమాచారం ఇచ్చిన నమ్రత అక్రమంగా కొనసాగించారు. తన పేరు బయటకు రాకుండా ఉండటానికి చికిత్స కోసం సంప్రదించిన వారికి మరో డాక్టర్ పేరుతో ఉన్న లెటర్ హెడ్‌పై మందులు, పరీక్షల వివరాలు రాసి ఇచ్చారు. రాజస్థాన్ దంపతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న గోపాలపురం పోలీసులు సృష్టి సెంటర్‌పై దాడి చేసినప్పుడు ఈ లెటర్‌హెడ్స్ పోలీసులకు లభించలేదు. అయితే వరుసగా తాజా మెట్లు ఎక్కుతున్న బాధితుల్లో కొందరు తమ ఫిర్యాదులతో పాటు నమ్రత రాసి ఇచ్చిన మందుల చీటీలు తదితరాలను జత చేశారు. వీటిలో కొన్ని సదరు డాక్టర్ పేరుతో ఉండటాన్ని గమనించిన పోలీసులు దీనిపై ఆరా తీశారు. సికింద్రాబాద్‌కు చెందిన ప్రముఖ గైనకాలజిస్ట్ అయిన ఆమె ఓ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ కన్సల్టెంట్‌గా పనిచేస్తున్నారు. పోలీసులు ఆమెను సంప్రదించినప్పుడే తన పేరుతో ఉన్న లెటర్ హెడ్స్ దుర్వినియోగం అవుతున్నట్లు గుర్తించారు. దీంతో ఆమె స్వయంగా గోపాలపురం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నమ్రతపై బుధవారం మరో కేసు నమోదైంది. రాజస్థాన్ దంపతుల ఫిర్యాదు మేరకు నమోదైన కేసులో పోలీసులు నమ్రత ఐదు రోజుల పాటు కస్టడీలోకి తీసుకుని విచారించారు. ఇది మంగళవారంతో పూర్తి అయింది. తాజాగా మరో కేసులో కస్టడీకి ఇవ్వాల్సిందిగా కోరుతూ బుధవారం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మరోపక్క సహ నిందితులుగా ఉన్న సంతోషి, కళ్యాణిల పోలీసు కస్టడీ పూర్తి కావడంతో కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

86 మందికి సరోగసి

ఇప్పటి వరకు వెలుగులోకి వచ్చిన వివరాలు, దర్యాప్తు, ఫిర్యాదుల ఆధారంగా నమ్రత తనకు ఉన్న వివిధ సెంటర్ల ద్వారా 86 మంది దంపతులకు సరోగసి చేసినట్లు గుర్తించారు. వీటిలో సక్రమం ఎన్ని? అక్రమం ఎన్ని? చైల్డ్ ట్రాఫికింగ్ ఎన్ని? అనే అంశాలు ఆరా తీస్తున్నారు. దీనికోసం ఆ ప్రక్రియలు చేయించుకున్న దంపతుల కోసం గాలిస్తున్నారు. రాజస్థాన్ దంపతులతో పాటు మరో మూడు జంటలకు శిశువుల్ని విక్రయించినట్లు బయటపడింది. దీంతో ఈ శిశువులను రెస్క్యూ చేసిన పోలీసులు శిశువిహార్‌కు తరలించారు. ఈ వ్యవహారాల్లో దళారులుగా వ్యవహరించిన వారితో పాటు శిశువుల్ని ఉద్దేశపూర్వకంగా విక్రయించిన ముగ్గురు తల్లుల్ని కటకటాల్లోకి పంపారు. బుధవారం గోపాలపురం పోలీసులు నమ్రతతో సంబంధాలు కలిగి ఉండి, శిశు విక్రయాల దందా నడిపిన విశాఖపట్నం వైద్యులు రవి, రమ్యలతో పాటు ఏజెంట్లు విజయ్, సరోజ, రత్న, శిశువుల్ని విక్రయించిన ముగ్గురు తల్లుల్ని అరెస్టు చేశారు. ఈ ఎనిమిది మంది అరెస్టులతో కలిపి ఇప్పటి వరకు 'సృష్టి' సంబంధిత కేసుల్లో కటకటాల్లోకి చేరిన వారి సంఖ్య 22కు పెరిగింది.

కంచెతో కబ్జాలకు చెక్

పుప్పాలగూడ, నిథమ్ చెరువులను పరిశీలించిన హైడ్రా కమిషనర్

సాక్షి, సిటీబ్యూరో: కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను కబ్జాల నుంచి కాపాడేందుకు కంచె ఏర్పాటు చేయనున్నామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. బుధవారం పుప్పాలగూడలో సర్వే నెంబరు 452/1, 454/1 సర్వే నెంబర్లలో సుమారు 200 ఎకరాల్లో విస్తరించి ఉన్న ప్రభుత్వ భూములు, కొండలను రక్షించాలని కోరుతూ సొసైటీ టూ సేవ్ రాక్స్ ప్రతినిధుల ఫిర్యాదు మేరకు క్షేత్ర స్థాయికి పరిశీలనకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ దేవాలయాలు, ప్రార్థనా మందిరాలకు కేటాయించిన భూముల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిథమ్ (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్) ఆవరణలో ఉన్న చెరువును హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ బుధవారం సందర్శించారు. చెరువు అభివృద్ధికి సంబంధించి ఎలాంటి చర్యలు తీసుకోవాలో సూచించాలని కోరుతూ నిథమ్ డైరెక్టర్ ప్రొ.వెంకటరమణ హైడ్రా కమిషనర్‌ను ఆహ్వానించారు.

ఖాతా డబ్బులు అడిగినందుకు కత్తితో దాడి

కేపీహెచ్‌బీకాలనీ: కిరాణా షాపు ఖాతా డబ్బులు ఇవ్వకపోగా..నిర్వాహకురాలిపై దాడి చేసి కత్తితో దాడి చేసిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం కేపీహెచ్‌బీ కాలనీ 7వ ఫేజ్‌లోని ఎల్ఐజీ 143లో మణిమాల కుటుంబం నివాసం ఉంటుంది. ఈమె స్థానికంగా కిరాణా షాపు నిర్వహిస్తుంది. ఇదే కాలనీలోని ఎల్ఐజీ 183లో నివాసం ఉండే రాజేష్‌రెడ్డి కిరాణా షాపులో కిరాణా సామాగ్రి కొనుగోలు చేస్తుంటాడు. దీంతో ఇద్దరి మధ్య పరిచయం పెరగడంతో రాజేష్ రెడ్డి డబ్బులు ఖాతా పెట్టి కిరాణా సామాగ్రి తీసుకునేవాడు. అయితే నాలుగు నెలలు గడుస్తున్నా ఖాతా డబ్బులు ఇవ్వలేదు. దీంతో డబ్బులు ఇవ్వాలని ఆమె ఒత్తిడి చేయగా.. బుధవారం మధ్యాహ్నం మణిమాల ఇంటికి వెళ్లిన రాజేష్‌రెడ్డి ఆమెపై అకస్మాత్తుగా దాడి చేశాడు. గొంతు నులిమి పక్కనే ఉన్న కత్తితో గొంతు కోసేందుకు యత్నించాడు. తీవ్రమైన పెనుగులాటలో మణిమాల గొంతుపై కత్తి కోసుకుపోగా, రాజేష్ రెడ్డి చేతికి కూడా గాయాలయ్యాయి. మణిమాల గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు వచ్చి రక్షించి 108 అంబులెన్సులో ఆసుపత్రికి తరలించారు. కింద పడిపోయిన రాజేష్‌రెడ్డిని కూడా ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మణిమాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆధునిక పరిజ్ఞానంతో కొత్త ఆవిష్కరణలు



అంతరిక్ష పరిశోధనా కేంద్రం మాజీ డైరెక్టర్ పాండియన్

సాక్షి, సిటీబ్యూరో: ఆధునిక పరిజ్ఞానంతో కంప్యూటర్ ఇంజినీరింగ్, కమ్యూనికేషన్ సిస్టమ్స్ రంగాలలో కొత్త ఆవిష్కరణలు సాధ్యమని ఇస్రోలోని సతీష్ ధావన్ అంతరిక్ష పరిశోధన కేంద్రం మాజీ డైరెక్టర్, శాస్త్రవేత్త డా.ఎస్.పాండియన్ అన్నారు.

బుధవారం ప్రగతినగర్‌లోని వీఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో 'కంప్యూటర్ ఇంజినీరింగ్, కమ్యూనికేషన్ సిస్టమ్స్ అభివృద్ధి'పై 6వ అంతర్జాతీయ సదస్సు ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా హాజరైన పాండియన్ మాట్లాడుతూ అంతరిక్ష పరిశోధనలో డిలే డిస్రప్షన్ టోలరెన్స్, లో లాటెన్సీ, హైత్రూపుట్ వంటి అంశాలు కీలకమని తెలిపారు. జీపీయూ ఆధారిత హెవీ కంప్యూటింగ్ అవసరం ఉందని, అందుబాటులో ఉన్న సాంకేతికతను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. వైద్య రంగంలో పరిశోధనలు రోబోటిక్ సర్జరీల వంటి కొత్త ఆవిష్కరణలకు దారితీస్తున్నాయన్నారు. పరిశోధనల్లో నైతికత, సమాజంపై ప్రభావం వంటి అంశాలను తప్పకుండా పరిగణనలోకి తీసుకోవాలని ఇండో-ఫ్రెంచ్ సెంటర్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ డైరెక్టర్ డా.నితిన్ సేథ్ అన్నారు. ఆయన వర్చువల్ విధానంలో మట్లాడుతూ ఇండో-ఫ్రెంచ్ శాస్త్రీయ సహకారానికి అవరోధం లేకుండా మద్దతు లభిస్తోందన్నారు. ఐఆర్‌డీపీటీ ప్రొఫెసర్ డా.రవి వడ్లమాని మాట్లాడుతూ ఫ్లాష్ ఫ్లడ్స్, విమాన ప్రమాదాల వంటి విధ్వంసకర సంఘటనలను ముందే అంచనా వేయడానికై స్ట్రీమింగ్ అనలిటిక్స్ ఉపయోగపడుతాయని చెప్పారు. డీన్ డా.శ్రీజన్ రాజు, బల్గేరియాకు చెందిన టీకే ఇంజినీరింగ్ ఉపాధ్యక్షురాలు ప్రొఫెసర్ రొమియానా కౌంట్ చేవా, జేఎన్‌టీయూ హైదరాబాద్ సీఈసీ విభాగాధిపతి ప్రొఫెసర్ కె.పి. సుప్రీతి, విజ్ఞాన జ్యోతి అధ్యక్షుడు దగ్గుబాటి సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సదస్సు సావనీర్‌ను ఆవిష్కరించారు.

గ్రీన్ సిటీగా హైదరాబాద్

రైల్వేస్టేషన్ల పరిధిలో బ్యాటరీ స్వాపింగ్ కేంద్రాలు
దక్షిణ మధ్య రైల్వే డీఆర్ఎం వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: గ్రీన్ రెవల్యూషన్‌లో హైదరబాద్ నగరం పురోగమిస్తోందని, ఇందులో ఇండియన్ రైల్వే కూడా భాగం కావడం సంతోషంగా ఉందని దక్షిణ మధ్య రైల్వే డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్ఎం) ఆర్.గోపాలకృష్ణన్ అన్నారు. దేశంలోనే ప్రముఖ బ్యాటరీ స్వాపింగ్ ప్రొవైడర్ అయిన ఇండోఫాస్ట్ ఎనర్జీతో భారతీయ రైల్వేశాఖ చేతులు కలిపింది. ఇంధన సంస్థ ఇండియన్ ఆయిల్, సుస్థిర మొబిలిటీ సంస్థ సన్ మొబిలిటీలతో 50-50 జాయింట్ వెంచర్ ఏర్పాటు చేసి హైదరాబాద్, సికింద్రాబాద్ డివిజన్లలోని కీలక రైల్వేస్టేషన్ల వద్ద అత్యాధునిక బ్యాటరీ స్వాపింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం నగరంలోని సంజీవయ్య పార్క్ రైల్వే స్టేషన్ వేదికగా బ్యాటరీ స్వాపింగ్ స్టేషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్.గోపాలకృష్ణన్ మాట్లాడుతూ., ఈ బ్యాటరీ స్వాపింగ్ స్టేషన్ వేదికగా ఈ-ఆటో, ఈ-బైక్ తదితర ఈ-వాహనాలు కేవలం 30 సెకన్లలో ఫుల్ చార్జ్ అయిన బ్యాటరీని పొందవచ్చని అన్నారు. ఇది మినీ పెట్రోలియం పంప్ వంటిదని, ఈ భాగస్వామ్యంలో భాగంగా ఇప్పటికే 25 రైల్వేస్టేషన్ల పరిధిలో మొత్తం 80 స్వాపింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారన్నారు. ఇండోఫాస్ట్ ఎనర్జీ సీఈఓ అనంత్ బద్జాత్య మాట్లాడుతూ.. నగరంలో ఏర్పాటు చేసిన సైట్‌లలో ఇది 150వది అని, ఈ కేంద్రంలో ఏకంగా 4 స్టేషన్లను ఉన్నాయని అన్నారు.

జంట జలాశయాల పరిధిలో వరద హెచ్చరిక

సాక్షి, సిటీబ్యూరో: నగర శివారులోని హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ జలాశయాల వరద గేట్లు తెరిచే అవకాశం ఉండటంతో లోతట్టు ప్రాంతాలకు జలమండలి వరద హెచ్చరికతో హై అలర్ట్ ప్రకటించింది. ఎగువ భాగం నుంచి వరద ప్రవాహం పెరగడంతో జంట జలాశయాలలో నీటి మట్టాలు పూర్తి స్థాయికి చేరుకుంటున్నాయన్నారు. తాజాగా పరివాహక ప్రాంతంలో మరింత వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉండటంతో హిమాయత్ సాగర్ జలాశయం వరద గేట్లు తెరిచే అవకాశాలున్నాని పేర్కొంది. మూసీ పరివాహక ప్రాంతాల వాసులు అప్రమత్తంగా ఉండాలని జలమండలి విజ్ఞప్తి చేసింది.

హిమాయత్‌సాగర్	
పూర్తి స్థాయి నీటి మట్టం	1790 అడుగులు
ప్రస్తుత నీటిమట్టం	1782.80 అడుగులు
ఇన్ ఫ్లో	50 క్యూసెక్కులు

ఉస్మాన్‌సాగర్	
పూర్తి స్థాయి నీటి మట్టం	1763.50 అడుగులు
ప్రస్తుత నీటిమట్టం	1762.45 అడుగులు
ఇన్‌ఫ్లో	500 క్యూసెక్కులు

'నెట్ నెట్'పై సమగ్ర దర్యాప్తు చేయండి

- పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శికి హైకోర్టు ఆదేశం
- ఆరోపణలు తీవ్రస్థాయిలో ఉన్నాయన్న న్యాయమూర్తి

సాక్షి, హైదరాబాద్: షేక్‌పేట్‌లోని నందగిరి హిల్స్‌లో నెట్ నెట్ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ చేస్తున్న నిర్మాణాలపై దర్యాప్తు చేపట్టి.. సమగ్ర నివేదిక అందజేయాలని పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శిని హైకోర్టు ఆదేశించింది. జీహెచ్ఎంసీ గత కమిషనర్ ఆమ్రపాలి వివరణతో సహా అన్ని వివరాలతో నివేదిక సమర్పించేందుకు రెండు నెలలు గడువిస్తున్నామని స్పష్టం చేసింది. అప్పటివరకు నిర్మాణాలపై స్టేటస్‌కో ఆదేశాలు కొనసాగించాలని తేల్చిచెప్పింది. పర్యావరణ, అగ్నిమాపక సహా పలు అనుమతులు, ఎన్ఓసీలు లేకుండా నెట్‌నెట్ వెంచర్ నిర్మాణాలు చేస్తున్నట్లు తీవ్ర స్థాయిలో ఆరోపణలు ఉన్నాయని వ్యాఖ్యానించింది. తదుపరి విచారణ అక్టోబర్ 6కు వాయిదా వేసింది. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 45లోని నందగిరిహిల్స్‌లో జి.అమరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలోని నెట్ నెట్ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ భారీ భవనాన్ని నిర్మిస్తోంది. ఈ స్థలంలో 12 అంతస్తులు నిర్మాణం చేపట్టేందుకు 2013లో జీహెచ్ఎంసీ నుంచి అనుమతి పొందింది. ఆ తర్వాత పలు రకాల చర్యలతో జీ ప్లస్ 13 నిర్మాణం 2,09,620 చదరపు అడుగుల్లో చేసుకునేలా అనుమతి పొందింది. ఈ స్థలంలో సెవన్ స్టార్ హోటల్, మల్టీప్లెక్స్, షాపింగ్ మాల్ నిర్మించాలనేది నెట్ నెట్ వెంచర్ ప్రతిపాదన. అలా నిర్మించడం హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ పర్యావరణ నిబంధనలకు విరుద్ధం. ఈ నిర్మాణం, తవ్వకాలపై నందగిరి కో ఆపరేటివ్ హౌస్సింగ్ సొసైటీ సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతో జీహెచ్ఎంసీ కమిషనర్ స్పందించారు. అనుమతించిన ప్లాన్ ప్రకారం కాకుండా చేపట్టిన నిర్మాణాలను తొలగించాలని ఈ ఏడాది జనవరిలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశించారు. నెట్ నెట్ అక్రమ నిర్మాణాలపై తమ ఫిర్యాదు మేరకు దర్యాప్తు జరిపిన విజిలెన్స్ విభాగం 2024, జూన్ 18న నివేదిక సమర్పించిందని, ఆ మేరకు చర్యలు తీసుకునేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ నందగిరి కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ హైకోర్టును ఆశ్రయించింది.

'విజిలెన్స్'ప్రస్తావన లేకపోవడంపై...

ఈ పిటిషన్ పై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టి.. విజిలెన్స్ నివేదికను పరిశీలించి ఉత్తర్వులు వెలువరించారు. 'నందగిరి హిల్స్ సొసైటీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విజిలెన్స్ 'నెట్‌నెట్'పై దర్యాప్తు చేపట్టింది. జీహెచ్ఎంసీ అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయని, వెంటనే చర్యలు తీసుకోవాలని సర్కార్‌కు సిఫార్సు చేసింది. జీహెచ్ఎంసీ అనుమతులకు విరుద్ధంగా చేసిన నిర్మాణాలను తొలగించాలని కమిషనర్ ఆదేశించారు. దీన్ని నెట్ నెట్ వెంచర్స్ సిటీ స్మాల్ కాజెస్ కోర్టులో సవాల్ చేయగా, పిటిషన్‌ను కొట్టివేసింది. ఏపీ కేడర్ సర్వీస్‌లో చేరాలని 2024, అక్టోబర్ 9న ఆమ్రపాలికి ఉత్తర్వులు జారీ కాగా, అక్టోబర్ 10న విజిలెన్స్ నివేదికను ఉపసంహరించాలంటూ సర్కార్‌కు లేఖ రాశారు' అని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. అక్రమ నిర్మాణాలను తొలగించాలని కమిషనర్ రెండుసార్లు ఉత్తర్వులు జారీ చేసినా ఎక్కడా విజిలెన్స్ నివేదికను ప్రస్తావించకపోవడాన్ని న్యాయమూర్తి పరిగణనలోకి తీసుకున్నారు. నెట్‌నెట్‌పై సమగ్ర విచారణ జరిపి నివేదిక అందజేయాలని పురపాలక ముఖ్యకార్యదర్శిని ఆదేశించారు.

నెట్‌నెట్ వెంచర్స్ పనులు ఆపేయాలి..

నందగిరి హిల్స్‌లో నెట్ నెట్ వెంచర్స్ నిర్మిస్తున్న భవనం పనులను సత్వరం ఆపాలని సిటీ స్మాల్ కాజెస్ కోర్టు గత నెల ఆదేశించిన విషయం తెలిసిందే. భవన నిర్మాణంలో తీవ్ర ఉల్లంఘనలు ఉన్నాయని అభిప్రాయపడిన న్యాయస్థానం జీహెచ్ఎంసీ కమిషనర్ జారీ చేసిన స్పీకింగ్ ఆర్డర్‌ను కొట్టివేయడానికి నిరాకరించింది. పర్యావరణ సమతుల్యత దెబ్బతినేలా నిబంధనలు పట్టించుకోకుండా నిర్మించడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. 'నెట్‌నెట్'పై ఎలాంటి చర్యలు తీసుకోకుండా అధికారులను నిలువరించలేమని తేల్చిచెప్పింది.

Crime Corner

గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరి అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను బుధవారం ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. ఒడిశా నుంచి హైదరాబాద్‌కు గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని బుధవారం సికింద్రాబాద్ మెట్రో స్టేషన్ సమీపంలో పట్టుకున్నామని ఎక్సైజ్ డీటీఎఫ్ ఈఎస్ శ్రీనివాసరావు తెలిపారు. ఇంటర్ చదువుతూ ఒక హోటల్‌లో వెయిటర్‌గా పనిచేస్తున్న సునీల్ నాయక్ చిత్రపురి నుంచి కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి తీసుకుని సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో దిగాడు. అందజేయాల్సిన వ్యక్తి కోసం ఎదురుచూస్తుండగా సికిందద్రాబాద్‌లో డీటీఎఫ్ సీఐ సౌజన్య సిబ్బందితో కలసి తనిఖీలు చేయగా 14 కేజీల గంజాయి లభించిందని తెలిపారు. దీని విలువ సుమారు రూ.7 లక్షలు ఉంటందన్నారు. మరో కేసులో సికింద్రాబాద్ క్లాక్ టవర్ వద్ద జుర్రు ప్రవీణ్ అనే వ్యక్తి నుంచి 400 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఆయనతో పాటు అనిల్ అనే వ్యక్తిపైనా కేసు నమోదు చేసినట్లు ఈఎస్ శ్రీనివాసరావు వివరించారు.

మద్యం మత్తులో కానిస్టేబుల్‌పై దాడి

బంజారాహిల్స్: మద్యం కొనుగోలు కోసం వెళ్లిన ఓ కానిస్టేబుల్‌ను పార్కింగ్ స్థలంలో ఓ యువకుడు అడ్డుకుని తీవ్రంగా కొట్టాడు. వివరాల్లోకి వెళితే.. వెంకటగిరిలో నివసించే ఎన్.ప్రసాద్ అనే ఏఆర్ కానిస్టేబుల్ మంగళవారం రాత్రి బంజారాహిల్స్ రోడ్డునెంబర్-2లోని ఇందిరానగర్‌లో ఉన్న ప్రియాంకా వైన్స్‌కు బైక్‌పై మద్యం కొనుగోలు కోసం వెళ్లాడు. పార్కింగ్ స్థలంలో అడ్డుగా ఉన్న యువకుడిని పక్కకు జరగాలంటూ చెప్పగా అప్పటికే మద్యం మత్తులో ఊగిపోతున్న సదరు యువకుడు నన్నే జరగమంటావా..? అంటూ ఆగ్రహంతో ఊగిపోతూ పిడిగుద్దులతో చితకబాదాడు. తాను పోలీసునని చెబుతున్నా వినకుండా మళ్లీ కొట్టాడంటూ బాధిత కానిస్టేబుల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దాడి చేసిన యువకుడిని స్టేషన్‌కు తరలించి విచారించగా వెంకటగిరికి చెందిన డెలివరీ బాయ్ పల్లె భార్గవ్‌గా గుర్తించారు. నిందితుడిని బుధవారం అరెస్టు చేశారు.

ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన యువతి మాట్లాడటం లేదని..


సందీప్ (ఫైల్)

సుభాష్‌నగర్: ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన ఓ యువతి గత కొన్ని రోజులుగా మాట్లాడకపోవడంతో మనస్తాపానికి గురైన యువకుడు ఉరివేసుకుని చనిపోయిన ఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెల్పిన వివరాల ప్రకారం..సిద్దిపేట జిల్లా దుబ్బాకకు చెందిన సందీప్ (20) రాజీవ్ గాంధీనగర్‌లో నివాసం ఉంటున్నాడు. సందీప్‌కు విజయవాడకు చెందిన ఓ యువతి ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయమైంది. తరచూ చాటింగ్ చేసుకుంటున్నారు. గత కొన్ని రోజుల నుండి సదరు యువతి నుండి ఎలాంటి స్పందన రాకపోవడంతో మనస్తాపానికి గురైన సందీప్ మంగళవారం రాత్రి ఇంట్లో చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని గాంధీ మార్చురీకి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

పబ్‌లో యువతి పట్ల అసభ్యకర ప్రవర్తన

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-36లోని క్రిస్టల్ క్లబ్ పబ్‌లో ఓ యువతి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ముగ్గురు యువకులపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. మణికొండలో నివసించే యువతి (29) మంగళవారం రాత్రి తన స్నేహితురాలితో కలిసి క్రిస్టల్ పబ్‌కు వచ్చారు. రాత్రి 11.40 గంటల ప్రాంతంలో వీరి వెనుక సీట్లో కూర్చొన్న ఓ యువకుడు వాటర్ బాటిల్‌ను యువతి ఉన్న చోటికి వదిలాడు. తీసుకునే క్రమంలో ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. రాత్రి 12.10 గంటల ప్రాంతంలో సదరు యువతి స్నేహితురాలితో కలిసి బయట నిలబడగా భరత్, మారుతి, డోనాల్డ్ అనే ముగ్గురు యువకులు బయటకు వచ్చి మరోసారి ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించారు. అప్పటికే ఆమె సోదరుడు బయటకు రాగా తీవ్రంగా కొట్టారు. ఆపేందుకు వెళ్లిన ఆమెను దూషించారు. విషయం తెలుసుకున్న బౌన్సర్లు బయటకు వచ్చి యువకులను కట్టడి చేసేందుకు యత్నించగా వారిపై కూడా దాడికి పాల్పడ్డారు. ఈ ఘర్షణలో బాధిత యువతితో పాటు ఆమె సోదరుడికి తీవ్ర గాయాలు కాగా, అదే రోజు అర్ధరాత్రి అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందారు. జరిగిన ఘటన పట్ల బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. జూబ్లీహిల్స్ పోలీసులు భరత్, మారుతి, డోనాల్డ్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెట్టుకు ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

కంటోన్మెంట్: చెట్టుకు ఉరేసుకొని ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు వెల్లడించిన వివరాల మేరకు ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేసే నిఖిల్ తన మిత్రుడు నాగబాబుతో కలిసి మంగళవారం సాయంత్రం సుచిత్ర మార్గంలో ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. సుచిత్ర రైల్వే స్టేషన్ సమీపంలో మూత్ర విసర్జన కోసం చెట్లపొదల్లోకి వెళ్లారు. సమీపంలోని చెట్టుకి ఉరేసుకొని వేలాడుతున్న ఓ వ్యక్తి కనిపించాడు. తక్షణమే 100 ద్వారా పోలీసులకు సమాచారం ఇచ్చారు. పెట్రోలింగ్ విధుల్లో ఉన్న బోయిన్పల్లి కానిస్టేబుళ్లు దేవేందర్ నాయక్, యాదగిరి గౌడ్ ఘటన స్థలికి వెళ్లి చెట్టుకు వేలాడుతున్న వ్యక్తిని కిందికి దింపారు. సుమారు 20 ఏళ్ల వయసున్న యువకుడు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడినట్లు గుర్తించారు. ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో శవాన్ని స్వాధీనం తీసుకొని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్: స్వర్ణజయంతి 11కెవీ ఫీడర్ ఈఎస్ఐ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతు పనుల కారణంగాగా గురువారం ఉదయం 6 నుంచి 10 గంటల వరకు హుడా కాంప్లెక్స్, స్వర్ణజయంతి కాంప్లెక్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గ్రీన్‌లాండ్స్ సీబీఈ ఏడీఈ కిశోర్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అదే విధంగా జయశంకర్‌నగర్ 11కెవీ ఫీడర్ బోరబండ సబ్‌స్టేషన్ పరిధిలోని పద్మావతినగర్, బోరబండ సైట్-3, ఎస్ఆర్ఆర్‌పురం ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

హిమాయత్‌నగర్: నారాయణగూడలోని బాబు జగ్జీవన్ రామ్(బీజేఆర్) ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కెప్టెన్ డాక్టర్ మడుగు విజయ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హిస్టరీ-1, బీబీఏ(రిటైల్)-1 బయో-టెక్నాలజీ-1, ఎకనామిక్స్-1, తదితర విభాగాల్లో అతిథి అధ్యాపక నియామకాలకు అర్హులైన అభ్యర్థులు ఈనెల 7లోగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు ప్రత్యక్ష ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు. సంబంధిత విభాగంలో పీజీ స్థాయిలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి, పీహెచ్‌డీ, నెట్, సెట్, డిగ్రీ కాలేజీ బోధనానుభవం కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరు కావాలని సూచించారు.

పార్టీ బలోపేతానికి సమష్టి కృషి

వెంగళరావునగర్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో నియోజకవర్గంలోని కార్యకర్తలు, నాయకులు సమష్టిగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బీఆర్ఎస్ ఎలక్షన్ డివిజన్ ఇన్‌చార్జి పోచంపల్లి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం యూసుఫ్‌గూడ డివిజన్ బూత్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో మన సీటును మనమే గెలిపించుకోవాలన్నారు. ఇందుకోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యూసుఫ్‌గూడ బూత్ కమిటీ నేతలు పాల్గొన్నారు.

ఘనంగా 'సావన్ కీ సైర్'



హిమాయత్‌నగర్: అగర్వాల్ సమాజ్ మహిళా సేవిక ఆధ్వర్యంలో బుధవారం 'సావన్ కీ సైర్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి అగర్వాల్ సమాజ్ తెలంగాణ అధ్యక్షులు అనిరుధ్ గుప్తా, ఉపాధ్యక్షులు రూపేష్ అగర్వాల్, ఐపిపి మనీష్ అగర్వాల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆటల పోటీలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు డింపుల్ అగర్వాల్, ఉపాధ్యక్షురాలు రాజ్ అగర్వాల్, కార్యదర్శి అంజు అగర్వాల్, సంయుక్త కార్యదర్శి సీమా అగర్వాల్, కోశాధికారి రిధిమా అగర్వాల్, కేంద్ర కమిటీ సభ్యురాలు నిధి అగర్వాల్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

వెంగళరావునగర్: గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మంగళవారం రాత్రి మధురానగర్ పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా యూసుఫ్‌గూడ గడ్డ వద్ద పడి ఉన్న వృద్ధుడిని గుర్తించి అంబులెన్స్‌లో గాంధీ ఆసుపత్రికి తరలించారు. అతడిని పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కాస్ట్యూమర్ యూనియన్ ప్రతినిధిపై దాడి

వెంగళరావునగర్: కాస్ట్యూమర్ యూనియన్ ప్రతినిధిపై కొందరు యూనియన్ సభ్యులు దాడి చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితుడి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వేతనాల పెంపు విషయమై ఈనెల 1 నుంచి పలు యూనియన్లు షూటింగ్స్‌కు బంద్ పాటిస్తున్నాయి. కాగా గత సోమవారం సారథి స్టూడియోలో ఒక సీరియల్‌కు సంబంధించి కాస్ట్యూమర్ యూనియన్ ప్రతినిధి సత్యనారాయణ పని చేస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న యూనియన్ ప్రధాన కార్యదర్శి నరసింహారావు తన ప్రతినిధులతో కలిసి అక్కడికి వెళ్లగా ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. ఈ సందర్భంగా ఇరువురి మధ్య జరిగిన గొడవలో సత్యనారాయణకు గాయపడ్డాడు. బాధితుడు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అనంతరం బుధవారం మధురానగర్ పీఎస్‌కు వచ్చి తనపై కాస్ట్యూమర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నరసింహారావు దాడి చేశాడని ఫిర్యాదు చేశాడు.

బస్తీలను కాస్తా చూడండి సారూ..

బస్తీల్లో దెబ్బతిన్న రోడ్లను పట్టించుకోని అధికారులు


ఉదయ్‌నగర్ బస్తీలో కోతకు గురైన రోడ్డు..

- బస్తీవాసుల అవస్థలు
- నాలాల వెంట ఉన్న బస్తీల్లో ప్రమాదకర పరిస్థితులు

బంజారాహిల్స్: వరుసగా కురుస్తున్న వర్షాలకు బస్తీల్లోని రోడ్లన్నీ ఛిద్రమవుతున్నాయి. అధికారులు ప్రధాన రోడ్లపై చూపుతున్న శ్రద్ధ అంతర్గత రహదారులపై పెట్టడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మూడు రోజులు క్రితం కురిసిన భారీ వర్షానికి బంజారాహిల్స్‌లోని పలు బస్తీల్లోని రోడ్లు ధ్వంసమయ్యాయి. కొన్ని చోట్ల కోతకు గురికావడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. బంజారాహిల్స్‌రోడ్ నెం. 10లోని నాలా వెంట ఉన్న సింగాడ బస్తీ, నాయుడు నగర్, సింగాడికుంట, ఉదయ్‌నగర్, అంబేద్కర్‌నగర్ బస్తీల్లో రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఎక్కడికక్కడ వరద దాటికి కొన్ని చోట్ల రోడ్లు గుంతలు పడగా మరికొన్ని చోట్ల కొట్టుకుపోయాయి. బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని నందినగర్ బస్టాప్‌కు వెళ్లే దారిలో రోడ్డు గుంతలమయమై స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. జూబ్లీహిల్స్ టీటీడీ ఆలయానికి వెళ్లే దారిలో చుట్టూ ఉన్న రోడ్డు దెబ్బతింది. బీటీతో కొన్ని చోట్ల గుంతలు పూడ్చినా ఇటీవల కురిసిన వర్షానికి మళ్లీ కొట్టుకుపోయింది. జూబ్లీహిల్స్ క్లబ్ చుట్టూ ఉన్న కాలనీలో పలు ప్రాంతాల్లో రోడ్డు దెబ్బతిని గుంతలమయం కావడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు కేవలం ప్రధాన రోడ్లలోనే పర్యటించకుడా బస్తీలు, కాలనీల్లోని అంతర్గత రోడ్లపై దృష్టి సారించాలని ఆయా బస్తీల వాసులు కోరుతున్నారు.



ప్రొ.జయశంకర్ ఆశయ సాధనకు కృషి



మాట్లాడుతున్న వీరమల్ల ప్రకాష్

హిమాయత్‌నగర్: తెలంగాణ ఉద్యమానికి దిశానిర్దేశం చేసిన దార్శనికుడు ప్రొ.జయశంకర్ అని రాష్ట్ర జల వనరుల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, తెలంగాణ ఉద్యమ నేత వీరమల్ల ప్రకాష్ అన్నారు. బుధవారం నారాయణగూడలోని బాబు జగ్జీవన్ రామ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'నీళ్లు-నిధులు-నియమకాలకు' జయశంకర్ ఎంతగానో పరితపించారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాళ్లు డా.కలువల శ్రీనివాస్ రావు, డా.రాపోలు శ్రీనివాస్, పి.సత్యనారాయణ రెడ్డి, ప్రొ.భిక్షపతి, ప్రొ.గోవింద్ దేశముఖ్, డా.జె.గంగాధర్, డా.రవి కుమార్, డా.గడ్డం ఆదాం, సీవీఎల్.నారాయణ, సూర్య కుమారి, అరుణ, పండరినాథ్, కడారి శ్రీనివాస్ రావ్, డా.అజయ్, డా.మాధవాచారి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రొ. జయశంకర్ సేవలు ఎనలేనివి


కార్యక్రమంలో పాల్గొన్న మురళీగౌడ్

రహమత్‌నగర్: మలిదశ తెలంగాణ ఉద్యమానికి మార్గదర్శి అచార్య జయశంకర్ అని, ఆయన తెగువతోనే తెలంగాణ రాష్ట్రం సాకారం మైందని జూబ్లీహిల్స్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ గుర్రం మురళీగౌడ్ అన్నారు. అచార్య జయశంకర్ జయంతిని పురస్కరించుకుని బుధవారం రహమత్‌నగర్ కూడలిలో తెలంగాణ ఉద్యమకారులతో కలిసి కేక్ కట్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జయశంకర్ చిరకాల వాంఛ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును చూడకుండానే, ఆయన భౌతికంగా దూరం కావడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఉద్యమకారులు గౌస్,చంద్రమౌళి, వినోద్‌కుమార్, కొండపల్లి రమేశ్, ఖాదర్, ముత్యాల యాదగిరి, రాగిని యాదగిరి పాల్గొన్నారు.

తెలుగు సినీ కార్మికుల సమ్మెతో మాకు సంబంధం లేదు


మాట్లాడుతున్న కరుణాకర్‌రెడ్డి

బంజారాహిల్స్: తెలుగు సినీ కార్మికులు చేస్తున్న సమ్మె, ఆందోళనలకు తెలంగాణ సినిమా ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్‌కు, తమ ఫెడరేషన్‌లో ఉన్న కార్మిక సంఘాలకు సంబంధం లేదని తెలంగాణ సినిమా ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు వి. కరుణాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని ఫెడరేషన్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ తమ ఛాంబర్ తెలంగాణ స్టేట్ ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్‌తో అనుసంధానమై ఉన్నదని చలనచిత్ర మండలితోనే తాము కలిసి పని చేస్తామన్నారు. ఇందుకు అనుగుణంగానే తమలోని అన్ని విభాగాల కార్మికులు పని చేస్తున్నట్లు తెలిపారు. దీనిపై తాము లేబర్ కమిషనర్, ఎఫ్‌డీసీకి లేఖ రాసినట్లు తెలిపారు. సమావేశంలో ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి మూర్తి, కోశాధికారి ఠాగూర్, మేకప్ యూనియన్ అధ్యక్షుడు జీఆర్‌పీ రఘు, మహ్మద్ గౌస్, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికార సాధనే ధ్యేయం

పంజగుట్ట: రాజ్యాధికార సాధనే ధ్యేయంగా బీసీలు ఉద్యమించాలని బీసీ యునైటెడ్ ఫ్రంట్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు పాలూరి రామకృష్ణయ్య అన్నారు. బుధవారం సోమాజిగూడ లోని ఫ్రంట్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర కమిటీని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ యునైటెడ్ ఫ్రంట్ రాజ్యాధికార సాధనే ధ్యేయంగా ముందుకు సాగుతుందన్నారు. బీసీ కులాలనన్నింటినీ ఏకం చేసి అన్ని కులాలకు రాజకీయాల్లో ప్రాతినిధ్యం దక్కేలా కృషి చేస్తామన్నారు. సమావేశంలో బీసీ హిందూ మహాసభ అధ్యక్షులు బత్తుల సిద్దేశ్వర్, పురుషోత్తం, నరహరి, సతీష్, తిరుపతి, మైనర్ బాబు, అశోక్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పార్టీ నూతన కమిటీని ప్రకటించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఐతగోని రాఘవేందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా వసు కే యాదవ్, అధికారప్రతినిధిగా చీమల శ్రీనివాస్, కోశాధికారి విక్రమ్ ముదిరాజ్, కార్యవర్గ సభ్యులుగా ద్రోణాచారి, కుమార్‌లను ఎన్నుకున్నారు.

ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘన నివాళి


నిమ్స్‌లో..

లక్డీకాపూల్: నిమ్స్ లో తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలు బుధవారం లెర్నింగ్ సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. డైరెక్టర్ డా. నగరి బీరప్ప , మెడికల్ సూపరింటెండెంట్ డా. నిమ్మ సత్యనారాయణతో కలిసి జయశంకర్ చిత్ర పటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ ఆశించినట్లుగా స్వయం పాలనలో తెలంగాణ ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. వైద్య రంగంలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ శాంతివీర్, మీడియా రిలేషన్స్ ఆఫీసర్ సత్య గౌడ్, కేజియా, శ్రీనివాస్ రావు, భరత్ భూషణ్ జయశంకర్ సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో ప్రొ. గంగాధర్, రాధికా, నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ శైలజ, శైలజ జ్యోతి, జలజా ఆసుపత్రి సిబ్బంది, అధ్యాపక బృందం పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


చెస్ట్ ఆసుపత్రిలో నివాళులర్పిస్తున్న డాక్టర్ పీవీ రవిశేఖర్‌రెడ్డి

ఎర్రగడ్డ చెస్ట్ ఆసుపత్రిలో..

శ్రీనగర్‌కాలనీ: తెలంగాణా సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు బుధవారం ఎర్రగడ్డ చెస్ట్ ఆసుపత్రిలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ మాజీ అధికార ప్రతినిధి డాక్టర్ పీవీ రవిశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ శ్రవణ్‌కుమార్, డాక్టర్ ప్రమోద్, డాక్టర్ సీమ, డాక్టర్ ప్రభాకర్ పాల్గొన్నారు. ఎర్రగడ్డలో తెలంగాణా ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఆచార్య జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇంద్రకుమార్, జూబ్లీహిల్స్ కన్వీనర్ చంద్రశేఖర్, నర్సింగరావు, సెబాస్టియన్, గౌస్, ప్రభాకర్ నివాళులర్పించారు.

వైభవంగా పవిత్రోత్సవాలు


పవిత్రోత్సవాల్లో పాల్గొన్న అర్చకులు, ఆలయ ఏఈవో రమేష్ బాబు

హిమాయత్‌నగర్: హిమాయత్‌నగర్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో పవిత్రోత్సవాల్లో భాగంగా బుధవారం రెండో రోజు శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి తోమాల, అర్చన నిర్వహించారు. యాగశాల వైదిక కార్యక్రమాల అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం శ్రీవారి మూలవిరాట్, ఉత్సవ మూర్తులు, గరుడాళ్వార్, పరివార దేవతలకు, ధ్వజ స్తంభానికి శాస్త్రోక్తంగా పవిత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో ఏఈఓ రమేష్ బాబు, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

నాలాలో ప్రమాదకర రసాయనాలు..


నాలాలో పారుతున్న రసాయనాలు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-1లోని తాజ్‌బంజారా చెరువులోకి ప్రమాదకర రసాయనాలతో కూడిన వరద, మురుగు నీరు చేరడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బంజారాహిల్స్ రోడ్డునెంబర్-13లోని అంబేద్కర్ నాలా నుంచి గులాబీ రంగులో ఉన్న రసాయన నీరు వరదనీటి కాలువలో నుంచి తాజ్‌బంజారా చెరువులోకి చేరుతోంది. బంజారాహిల్స్ రోడ్డునెంబర్-10లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రి వెనక ఉన్న నూర్‌నగర్ బస్తీలో దాదాపు 100కు పైగా హ్యాండ్‌లూమ్ దుస్తుల షాపులు కొనసాగుతున్నాయి. వీటికి రసాయనాలు కలుపుతూ అక్కడే పిండి ఆరేస్తున్నారు. కాలువ ద్వారా ఈ నీరు సింగాడికుంట, నాయుడునగర్, ఉదయ్‌నగర్, అంబేద్కర్‌నగర్ నాలా మీదుగా తాజ్‌బంజారా చెరువులోకి చేరుతోంది.

అంబేడ్కర్ వర్సిటీలో యోగా శిక్షణ..


మాట్లాడుతున్న పుష్పా చక్రపాణి..

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం మహిళాభివృద్ధి, విస్తరణ కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం సమగ్ర మహిళల ఆరోగ్యం కోసం 'మానసిక, శారీరక ఆరోగ్యం -యోగా ఆవశ్యకత' అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విశ్వవిద్యాలయ అకడమిక్ డైరెక్టర్ పుష్పా చక్రపాణి మాట్లాడుతూ మహిళలు వేళకు ఆహారం తీసుకోవాలని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. క్రమం తప్పకుండా యోగా చేయడం ద్వారా మానసిక ఒత్తిడిని దూరం చేయవచ్చన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్.విజయకృష్ణారెడ్డి, యోగాచార్య బ్రహ్మకుమారి లక్ష్మీ, బీకే బిందు మహిళా ఉద్యోగులు, విద్యార్థినులకు యోగా ఆవశ్యకతను వివరించారు. పనిచేసే కార్యాలయాల్లో ఒత్తిడి ఎలా అధిగమించాలో వివరించారు. విశ్వవిద్యాలయ మహిళాభివృద్ధి, విస్తరణ కేంద్రం ఇన్‌ఛార్జి ప్రొఫెసర్ కే రాణి రజితా మాధురి తమ విభాగం ద్వారా మహిళలకు అనేక అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.రజని, ప్రొఫెసర్ మేరీ సునంద, విశ్వవిద్యాలయ మహిళా ఉద్యోగులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

టౌన్‌ప్లానింగ్ అధికారులపై ఫిర్యాదు..

బంజారాహిల్స్: జీహెచ్ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్-18 అధికారుల అవినీతి, అక్రమాలపై విచారణ చేపట్టాలని కోరుతూ షేక్‌పేట సూర్యానగర్ వాసులు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌కు బుధవారం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూర్యానగర్ కాలనీలోని చిన్న చిన్న ప్లాట్లలో అక్రమంగా 7-8 అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్నారని, వీటి వెనుక సర్కిల్-18 టౌన్‌ప్లానింగ్ అధికారుల హస్తం ఉందని ఆరోపించారు. పార్కింగ్ సౌకర్యం, సెట్ బ్యాక్‌లు వదలకుండా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. జూబ్లీహిల్స్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాస్‌తో పాటు సెక్షన్ ఆఫీసర్ సురేష్‌పై హైలెవల్ విజిలెన్స్ విచారణ చేపట్టాలని, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమ నిర్మాణాల కారణంగా డ్రైనేజీ బ్లాక్ అవుతున్నదని, మంచినీటి సరఫరాలో ప్రెషర్ తగ్గుతుందని తాము పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదన్నారు. సూర్యానగర్‌కాలనీలో అక్రమ నిర్మాణాలపై సమగ్ర దర్యాప్తు చేపట్టి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నాలా మరమ్మతులకు ప్రతిపాదనలు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 1లోని మహేశ్వరి టవర్స్ అపార్ట్‌మెంట్ సమీపంలో కుప్పకూలిన నాలా శ్లాబ్ మరమ్మతులకు రూ. 68 లక్షలతో జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ శాఖ అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. 40 ఏళ్ల క్రితం నిర్మించిన శ్లాబ్ కావడంతో శ్లాబ్‌కు రెండు వైపులా ఉన్న గోడలు దెబ్బతిన్నాయి. మంగళవారం భారీ ట్యాంకర్ రావడంతో ఒక్కసారిగా నాలా కుప్పకూలి ట్యాంకర్ అందులో కూరుకుపోయిన విషయం తెలిసిందే. బుధవారం తెల్లవారుజాము వరకు శ్రమించిన అధికారులు భారీ క్రేన్ సహాయంతో నాలాలో పడిపోయిన లారీని బయటికి తీశారు. ప్రమాదకరంగా ఉన్న ఈ నాలాలో ఎవరూ పడిపోకుండా బారికేడ్లను ఏర్పాటు చేశారు. షార్ట్ టెండర్ ద్వారా పనులు చేపట్టనున్నట్లు జీహెచ్ఎంసీ ఈఈ విజయ్‌కుమార్ తెలిపారు.



'ఆగస్ట్ 15 లోగా న్యాయం చేయకుంటే ఆమరణ దీక్షలు'

హిమాయత్‌నగర్: డీఎస్సీ-2024 ఎస్‌జీటీ స్పోర్ట్స్ కోటా అభ్యర్థులకు ఈ ఆగస్ట్ 15 లోగా న్యాయం చేయాలని తెలంగాణ నిరుద్యోగ జేఏసీ నాయకులు జనార్ధన్, ఇంద్ర నాయక్ డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆమరణ నిరాహార దీక్ష చేపడతామన్నారు. బుధవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అభ్యర్థులు అస్మా, నవీన్, రాచకొండ రమేష్ లతో కలిసి వారు మాట్లాడారు. జీవో నెం.74 ప్రకారం గత నోటిఫికేషన్‌లో 100 పోస్టులను కేటాయించి కేవలం 33 మందికి ఉద్యోగాలు ఇచ్చారన్నారు. అయితే ఈ నియామకాల్లోనూ అక్రమాలు జరిగాయని ఆరోపించారు. దీనిపై తాము పోరాటం చేయగా రీ వెరిఫికేషన్ చేసి అర్హులను న్యాయం చేస్తామని హామీ ఇచ్చి తొమ్మిది నెలలు గడిచినా పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు.

గద్దర్‌కు ఘన నివాళి


గద్దర్‌కు నివాళులర్పిస్తున్న నేతలు

వెంగళరావునగర్: తెలంగాణా ఉద్యమంలో గద్దర్ పాత్ర ఎనలేనిదని, ప్రత్యేక రాష్ట్రం సాధనకు ఆయన చేసిన సేవలు మరువలేనివని సీపీఎం జూబ్లీహిల్స్ జోన్ కార్యదర్శి అశోక్ అన్నారు. గద్దర్ అభిమాన సంఘం నాయకులు దండు సత్యనారాయణ ఆధ్వర్యంలో మధురానగర్‌లో బుధవారం గద్దర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను చైతన్యవంతం చేయడానికి, భావ వ్యాప్తి కోసం గద్దర్ గ్రామ గ్రామాన తిరిగి ప్రచారం చేశారని, ఇందుకోసం బుర్రకథను ఎంచుకున్నారన్నారు. తొలుత గద్దర్‌తో పాటు పలువురు తెలంగాణ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సురేష్,. రమణ, పాపారావు, యాదగిరి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో నిందితులను అరెస్ట్ చేయాలి

హిమాయత్‌నగర్: సికింద్రాబాద్ మోండా మార్కెట్‌లో ఇటీవల మాల యువకుడు ఎడ్ల సాయి కిరణ్‌పై అకారణంగా దాడిచేసిన వ్యాపారులను వెంటనే అరెస్ట్ చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పబ్బతి శ్రీకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం మాల మహానాడు రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ దాడికి పాల్పడిన వారిపై అట్రాసిటీ కేసులు నమోదు చేసి వారం రోజులు గడిచినా ఇంతవరకు ఎందుకు అరెస్ట్ చేయలేదని ప్రశ్నించారు. రాజ్యాంగాన్ని రక్షించే పోలీసు అధికారులు ఎస్సీల పట్ల వివక్ష చూపించడం తగదన్నారు. సమావేశంలో నాయకులు ఎల్.గిరిజా శంకర్, సంకి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భార్యపై హత్యాయత్నం..

పెట్రోల్‌పోసి నిప్పంటించి పరారైన భర్త...

బంజారాహిల్స్: భార్యపై పెట్రోల్ పోసి నిప్పంటించి హత్యాయత్నానికి పాల్పడిన భర్తపై జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..మధురానగర్‌కు చెందిన యువతి మైసూర్‌కు చెందిన మెల్సన్ రాజన్‌ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. మద్యానికి బానిసైన మెల్సన్ రాజన్ తరచూ భార్యను వేధిస్తుండటంతో ఆమె గత ఏప్రిల్‌లో ఆల్వాల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటినుంచి ఇద్దరూ వేర్వేరుగా ఉంటున్నారు. ఇదిలా ఉండగా మంగళవారం సాయంత్రం ఆమె పనిచేస్తున్న అన్నపూర్ణ కాలేజ్ ఆఫ్ ఫిల్మ్ అండ్ మీడియా అడ్మిన్ బ్లాక్‌లోకి వచ్చిన మెల్సన్ రాజన్ ఆమెపై పెట్రోల్ పోసి లైటర్‌తో నిప్పంటించి అక్కడి నుంచి పరారయ్యాడు. దీనిని గుర్తించిన సిబ్బంది మంటలను ఆర్పారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డబ్బుల విషయంలో ఘర్షణ

తల్వార్‌తో దాడి

హిమాయత్‌నగర్: డబ్బుల విషయంలో ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన ఘర్షణ తల్వార్‌తో దాడికి దారి తీసిన సంఘటన బుధవారం నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. దత్తానగర్‌కు చెందిన బాబు కుట్టి అనే వ్యక్తి అదే బస్తీకి చెందిన బబ్లూ వద్ద రూ.5 వేలు అప్పుగా తీసుకున్నాడు. ఈ విషయమై ఇద్దరి మధ్య మాటా మాటా పెరగడంతో ఆగ్రహానికి లోనైన బబ్లూ బాబు కుట్టిపై తల్వార్‌తో దాడి చేయడంతో అతడి తలకు తీవ్ర గాయమైంది. బాధితుడు బాబుకుట్టి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి సిటీ ప్లస్
10
హైదరాబాద్‌। గురువారం।
7। ఆగస్టు। 2025





'దీర్ఘకాల రోగాలతో రోగులు నా తలుపు తట్టని రోజునే నేను వైద్యుడిగా విజయం సాధించినట్టు' అంటున్నారు నగరంలోని జూబ్లీహిల్స్‌ అపోలో ఆస్పత్రికి చెందిన న్యూరాలజిస్ట్‌ డా.సుధీర్‌కుమార్‌. రోగులు రావాలని కాకుండా.. రోగాలు రాకూడదని కోరుకునే మంచి వైద్యుడిగా మాత్రమే కాదు రోగాల బారిన పడకుండా ఏం చేయాలి? అనే దానికి కూడా ఆయన స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ఒకప్పుడు అధిక బరువుతో, దీర్ఘకాలిక వ్యాధితో పోరాడిన ఆయన వాటిని మందులతో కాకుండా జీవనశైలి మార్పులతో జయించవచ్చని నిరూపించారు.

– సాక్షి, సిటీబ్యూరో



డాక్టర్.. రన్నర్..

- నిన్న అర కి.మీ.కే అలసట.. నేడు మారథాన్‌ రన్నర్‌
- ఓవర్‌ వెయిట్‌కు చెక్‌.. చకచకా వర్కవుట్స్‌..
- 55ఏళ్ల వయసులో పాతికేళ్ల కుర్రాడిలా..
- నగర వైద్యుడి స్ఫూర్తిదాయక ట్రాన్స్‌ఫార్మేషన్‌

వైద్యుడిగా బిజీ అయిపోయాక ఆరోగ్యంపై శ్రద్ధ తగ్గింది. వేళాపాళా లేని నిద్ర, ఆహారపు అలవాట్లు, పని ఒత్తిడి.. నాకు 49 సంవత్సరాల వయస్సు వచ్చేసరికి దాదాపు 100 కిలోల బరువుకు చేరుకున్నా. అలాగే ఆంకైలోజింగ్‌ స్పాండిలైటిస్‌ అనే వ్యాధి కూడా ఇబ్బంది పెట్టేంది అంటూ గుర్తు చేసుకున్నారు జూబ్లీహిల్స్‌లోని అపోలో హాస్పిటల్‌లో సీనియర్‌ న్యూరాలజిస్ట్‌గా సేవలు అందిస్తున్న డాక్టర్‌ సుధీర్‌ కుమార్‌. ఆ పరిస్థితిని తాను అధిగమించిన తీరు, స్ఫూర్తిదాయక ట్రాన్స్‌ఫార్మేషన్‌ విశేషాలను సాక్షితో పంచుకున్నారు ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

లాస్‌ గుర్తు చేసిన లాక్‌డౌన్‌

కోవిడ్‌–19 లాక్‌డౌన్‌ అందించిన ఖాళీ సమయం నా గురించి నేను ఆలోచించుకునే అవకాశం అందించింది. అప్పుడే బరువు తగ్గాలని నిర్ణయించుకుని జాగింగ్‌ ప్రారంభించాను. రోడ్లు ఖాళీగా ఉండటం కాలుష్యం లేకపోవడం.. నా ప్రయత్నాలకు ఊతమిచ్చింది. అయితే మొదటిసారి 400 మీటర్లు మించి పరుగెత్తడానికి ప్రయత్నించినప్పుడు, నాకు ఊపిరి ఆడలేదు. కానీ ఆపడానికి బదులుగా దాన్ని నడకగా మార్చి కొనసాగించాను. పట్టు విడవకుండా ప్రయత్నించి రోజూ 5–10 కి.మీ నడక, అలా పరుగుకు చేరుకున్నా. 'ఏటు వంటి శిక్షణ లేకుండా మారథాన్‌ల సమయంలో ఏడాదికి ఒకసారి మాత్రమే పరిగెత్తేవాడిని కాలక్రమేణా నగరంతో పాటు లడఖ్‌ తదితర చోట్ల మారథాన్‌లలో పాల్గొని మొత్తం 14,000 కిలోమీటర్లకు పైగా రన్‌ చేశా. వాటిలో 10కి.మీ పరుగులు 822, హాఫ్‌ మారథాన్‌లు 133 ఉన్నాయి.

వెయిట్‌ లాస్‌.. మజిల్‌ మిస్‌..

నిర్విరామ నడక, పరుగు, డైట్‌లతో రెండేళ్ల స్వల్ప వ్యవధిలోనే 30 కిలోల బరువు తగ్గి 69 కిలోలకు చేరాను. అయితే, మజిల్‌ లాస్‌ (కండరాల నష్టాన్ని) కూడా గమనించా, స్ట్రెంగ్త్‌ ట్రైనింగ్‌లో చేరి 4.5 కిలోల కండర (మజిల్‌ మాస్‌) సముదాయాన్ని తిరిగి పొందాను. శారీరక శ్రమ, ప్రొటీన్‌ రిచ్‌ ఫుడ్‌ పెంచడం వంటి మెరుగైన ఆహారపు అలవాట్లు, తగినంత నిద్ర వంటివి ఈ సక్సెస్‌లో ఇమిడి ఉన్నాయి. అత్యంత క్రమ శిక్షణతో కూడిన దినచర్య కూడా అనారోగ్యకరమైన ఆహారం వలన కలిగే నష్టాన్ని భర్తీ చేయలేదని గుర్తుంచుకోవాలి. అందుకే ప్రాసెస్డ్‌ ఫుడ్‌, చక్కెర, శీతల పానీయాలను పూర్తిగా మానేశా.. పని గంటలు తగ్గించుకుని 7–8 గంటలకు నిద్ర సమయాన్ని పెంచుకున్నా అంటూ వివరించారు డా.సుధీర్‌కుమార్‌. రోగాలకు చికిత్స చేయడం కాదు చికిత్స చేసే అవసరం రాకుండా చేయడం కూడా వైద్యుల బాధ్యతే అంటున్న ఆయన అందుకు తనను తానే నిదర్శనంగా మలుచుకున్న తీరు స్ఫూర్తిదాయకం.



టెరాసోలో.. పసందైన రుచులు



జూబ్లీహిల్స్‌ రోడ్‌ నెం.45లోని టెరాసో రూఫ్‌ టాప్‌ ది ఇండియన్‌ సోషల్‌ బార్‌లో బుధవారం పసందైన వంటకాలతో సరికొత్త మెనూను పరిచయం చేశారు. ఈ సందర్భంగా టెరాసో నిర్వాహకులు, చెఫ్‌లు రుచికరమైన వంటకాలను ప్రదర్శించారు. భారతీయ సంస్కృతిలోని రుచులను ఆధునికతతో మిళితం చేసి నగర వాసులకు అందిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఇతర దేశాల వంటకాలను కూడా అందిస్తున్నట్లు వారు తెలిపారు.

– బంజారాహిల్స్‌

యువతుల విద్యకు చేయూత

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి, ముఖ్యంగా యువతులు నాణ్యమైన విద్య పొందేందుకు ప్రైవేటు భాగస్వామ్యాలు తోడ్పడాలని రాష్ట్ర కళాశాల విద్యాశాఖ కమిషనర్‌ దేవసేన అన్నారు. వీడియో గేమింగ్‌ రంగం దిశగా యువతను ప్రోత్సహించేందుకు లక్ష్య డిజిటల్‌ సంస్థ బేగంపేటలోని గవర్నమెంట్‌ డిగ్రీ కాలేజ్‌ ఫర్‌ ఉమెన్‌(జీడీసీడబ్ల్యూ)లో సాంకేతికతను బలోపేతం చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నిర్మాణ్‌ ఆర్గనైజేషన్‌ సహకారంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిశ్రమ అధిపతులు, విద్యా సంస్థలతో చేతులు కలిపితే వీడియో గేమ్‌ల రంగంలో విద్యార్థులకు ప్రవేశం కల్పించడంలో ఆ భాగస్వామ్యాలు కీలక పాత్ర పోషిస్తాయని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో భాగంగా 3డీ వీడియో గేమ్‌ ఆర్ట్‌లో కెరీర్‌లను ఎంచుకునే మహిళల కోసం ఏర్పాటు చేసిన టెక్‌ ల్యాబ్‌ను ప్రారంభించారు. విద్యార్థులు, అధ్యాపకులు గేమింగ్‌ రంగ ప్రముఖులు పాల్గొన్నారు.



ఎత్తుకు పైఎత్తు.. లక్ష్యం గ్రాండ్‌ మాస్టర్‌

చెస్‌లో రాణిస్తున్న బీవీబీపీ విద్యార్థి భమిడి నిర్వాణ్‌



బంజారాహిల్స్‌: ఎత్తుకు పైఎత్తులు వేస్తూ నిరంతర సాధనతో జూబ్లీహిల్స్‌ భారతీయ విద్యాభవన్‌ పబ్లిక్‌ స్కూల్‌ విద్యాశ్రమంలో 12వ తరగతి చదువుతున్న భమిడి నిర్వాణ్‌ చదరంగం పోటీల్లో దూసుకుపోతున్నాడు. రాష్ట్రస్థాయిలో సత్తాచాటిన అతడు మూడేళ్లుగా జాతీయ స్థాయిలో ఆడుతూ వివిధ పతకాలను కైవసం చేసుకున్నాడు. త్వరలోనే యూరప్‌లో జరిగే అంతర్జాతీయ పోటీలకు వెళ్లనున్న నిర్వాణ్‌ తల్లి సాఫ్ట్‌వేర్‌ ఇంజినీర్‌ కాగా షేక్‌పేట సమీపంలోని లక్ష్మీనగర్‌ కాలనీలో ఉంటూ సమీపంలోని జూబ్లీహిల్స్‌ భారతీయ విద్యాభవన్‌ పబ్లిక్‌ స్కూల్‌లో చదువుకుంటున్నాడు. తాజాగా అండర్‌–18 విభాగంలో టాప్‌–100లోకి చేరి గత ఏడాది నేషనల్‌ సీనియర్‌ స్టేట్‌ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకాన్ని సాధించాడు. విశ్వనాథన్‌ ఆనంద్‌ స్ఫూర్తిగా చెస్‌లో సత్తా చాటుతున్న అతడు గ్రాండ్‌మాస్టర్‌ కావాలన్న డ్రీమ్‌తో కృష్ణతేజ అనే కోచ్‌ వద్ద శిక్షణ తీసుకుంటున్నాడు. వెలాసిటీ చెస్‌ అకాడమీలో శిక్షణ పొందుతూ ప్రతిరోజూ స్కూల్‌ నుంచి ఇంటికి వెళ్లాక రెండు గంటల పాటు చదరంగంపై సాధన చేస్తున్నాడు. 'స్కూల్‌ ప్రిన్సిపాల్‌ అరుణశ్రీ, క్లాస్‌ టీచర్‌ శోభ, సువర్చల మేడం ప్రోత్సాహంతో చెస్‌లో ముందుకెళ్తున్నానని, తనకు కావాల్సినంత సమయం శిక్షణ కోసం కేటాయించడమే కాకుండా పోటీలకు కూడా పంపుతున్నారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఎప్పటికప్పుడు టైటిళ్లు, పతకాలు సాధిస్తున్నట్లు తెలిపాడు. గ్రాండ్‌ మాస్టర్‌ కావాలన్న కలను నెరవేర్చుకోవడానికి నిరంతర సాధన చేస్తున్నానని వెల్లడించారు. రాష్ట్రస్థాయిలో టాప్‌లో ఉన్నానని చెబుతున్న ఈ బాలుడు త్వరలోనే అంతర్జాతీయ పోటీలకు కూడా రాణించేందుకు శిక్షణలో రాటుదేలుతున్నారు. ఎన్నో టైటిళ్లు, పతకాలు సాధించిన నిర్వాణ్‌ను స్కూల్‌ టీచర్లు కూడా ఎప్పటికప్పుడు ప్రోత్సహిస్తున్నారు.

మరి కొద్ది రోజుల్లో రానున్న 78వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రముఖ సామాజిక సేవా వేదిక రాబిన్‌ హుడ్‌ ఆర్మీ ఆధ్వర్యంలో 'మిషన్‌ సంకల్ప్‌ 78' నేషనల్‌ ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా హైదరాబాద్‌ నగరంతో పాటు దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 78 ప్రాంతాల్లో 78 లక్షల మందికి తోడ్పాటు అందించే సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. భారీ స్థాయిలో నిర్వహించనున్న ఈ ప్రాజెక్ట్‌ను నగరంలో ప్రతిష్టాత్మకంగా రూపకల్పన చేశారు. వలంటీర్ల సహకారంతో 11 ఏళ్లుగా సామాజిక సేవలు అందిస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థ రాబిన్‌ హుడ్‌ ఆర్మీ ఇప్పటి వరకు హైదరాబాద్‌తో పాటు 406 నగరాల్లో 162 మిలియన్ల భోజనాలు అందించడం విశేషం. – సాక్షి, సిటీబ్యూరో

మిషన్‌ సంకల్ప్‌ 78

- 78వ స్వాతంత్య్ర దినోత్సవ నేపథ్యంలో నేషనల్‌ ప్రాజెక్ట్‌
- 78 వేల మంది నిరుపేదలకు సమగ్ర నిత్యావసర వస్తువుల పంపిణీ
- హైదరాబాద్‌తో పాటు 78 నగరాల్లో నిర్వహించనున్న రాబిన్‌ హుడ్‌ ఆర్మీ
- మిషన్‌ సంకల్ప్‌లో కీలక పాత్ర పోషిస్తున్న నగరంలోని వలంటీర్స్‌





స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో ప్రతిష్టాత్మకంగా రూపొందించిన 'మిషన్‌ సంకల్ప్‌ 78' నేషనల్‌ ప్రాజెక్ట్‌లో భాగంగా నగరంలోని కార్పొరేట్‌ కంపెనీలు, మీడియా భాగస్వాములు, వలంటీర్లు కలిసి 78,000 కేజీల కిరాణా సరుకులను సేకరించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ నిత్యావసర సరుకులు, వస్తువులను హైదరాబాద్‌తో పాటు నగర శివార్లలోని గ్రామీణ ప్రాంతాల్లో వితరణ చేయనున్నారు. మంచిర్యాల, మహబూబాబాద్‌, ఖమ్మం, ఆదిలాబాద్‌, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని ఎంపిక చేసిన గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లోని 7,800 కుటుంబాలకు ఈ సహకారాన్ని అందించనున్నారు. దేశవ్యాప్తంగా పోషణ భారంగా ఉన్న కుటుంబాలకు తోడ్పాటు అందించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. 2,75,000 వలంటీరింగ్‌ వ్యవస్థతో ఇప్పటికే రాబిన్‌ హుడ్‌ ఆర్మీ వలంటీర్ల బృందం విశేష కృషితో 162 మిలియన్ల భోజనాలు అందించగా.. ప్రస్తుతం ప్రణాళికలు రూపొందిస్తున్న 78 లక్షల మందికి తోడ్పాటునందించే ఈ ప్రాజెక్టుకు అద్భుత ఆదరణ లభిస్తుందని నిర్వాహకులు తెలిపారు. నేటిని పోషిస్తూ, రేపటి కోసం అవకాశాలను నిర్మించడమే ఈ మిషన్‌ ప్రధాన ఉద్దేశం.



నెల రోజుల కిరాణ కిట్లు..

సహాయం కోసం ఎదురు చూసే కుటుంబాలు ఇప్పటికీ ఎన్నో ఉన్నాయి. ఈ పదేళ్ల కాలంలో అలాంటి వారికి రాబిన్‌ హుడ్‌ ఆర్మీ ఆపన్నహస్తాన్ని అందించింది. అంతేగాకుండా వర్షాకాలంలో హైదరాబాద్‌తో పాటు గ్రామీణ, గిరిజన ప్రాంతాల ప్రజలు భారీ వర్షాలు, వరదలతో ఎక్కువగా ప్రభావితమవుతారు. ఇలాంటి సందర్భాలను ప్రతీ ఏడాది చూస్తూనే ఉన్నాం. అలాంటి వారికి అవసరమైన వస్తువులు అందుబాటులో ఉండకపోవచ్చు. ఇలాంటి సమయంలో ఈ కిరాణా కిట్లు వారికి కనీసం నెలరోజుల పాటు ఆసరాగా నిలుస్తాయి. సామాజిక బాధ్యతగా, దేశభక్తితో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ మిషన్‌కు మద్దతుగా నిలవాలనుకునే వారు లేదా కిరాణా సరుకులను విరాళంగా ఇవ్వాలనుకునే వారు హైదరాబాద్‌ టీమ్‌ను +91-99494 24361 నంబర్‌లో సంప్రదించవచ్చు. రాబిన్‌ హుడ్‌ ఆర్మీలో వలంటీర్‌గా చేరాలనుకునే వారు వాట్సాప్‌లో +91 8971966164 నంబర్‌కు హాయ్‌ అని పంపవచ్చు.

– మైత్రి, హైదరాబాద్‌ వీసీ



ఏపీ ఆర్థికశాఖ మాజీమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ కుమారుడు బుగ్గన అర్జున్ అమర్నాథ్‌రెడ్డి వివాహ రిసెప్షన్‌కు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. చల్లా సతీశ్‌రెడ్డి దంపతుల కుమార్తె అనన్యరెడ్డి, అర్జున్‌ల వివాహం ఈనెల 3న జరగగా.. బుధవారం డోన్‌లో రిసెప్షన్ ఏర్పాటు చేశారు. జగన్ కోసం భారీగా తరలివచ్చిన జనాలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఆయనను చూడగానే ఈలలు, కేకలతో హోరెత్తించారు.





బరితెగించిన బాబు గ్యాంగ్

ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్‌పై హత్యాయత్నం

పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నిక వేళ సర్కారు పెద్దల దిగజారుడుతనం

సాక్షి, టాస్క్‌ఫోర్స్: వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నిక వేళ చంద్రబాబు అండ్ గ్యాంగ్ బరితెగించింది. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరిగితే డిపాజిట్ కూడా దక్కదనే భయంతో ప్రజల్లో భయాందోళనలు సృష్టించడమే లక్ష్యంగా కుట్రలు, కుతంత్రాలకు తెగబడింది. ఇందులో భాగంగానే కొద్ది రోజులుగా వైఎస్సార్‌సీపీ నేతలపై వరుస దాడులకు పాల్పడుతూ వస్తున్న ఈ సైకో గ్యాంగ్.. తాజాగా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, వేముల మండల నాయకుడు వేల్పుల రామలింగారెడ్డి (వేల్పుల రాము)లపై బుధవారం వేల్పుల మండలం నల్లగొండువారిపల్లెలో హత్యాయత్నం చేసింది. ఇనుప సమ్మెటలు, రాడ్లు చేత పట్టుకుని టీడీపీ రౌడీ మూకలు విచక్షణా రహితంగా దాడికి దిగాయి. వాడే.. టార్గెట్.. వేయండి.. అంటూ సైకోల్లా అరుపులు, కేకలతో అరగంటపాటు రెచ్చిపోయాయి. ఈ దాడిలో రామలింగారెడ్డి తలకు బలమైన గాయం కాగా, ఎమ్మెల్సీ భుజం ఎముక విరిగింది. ఊహించని పరిణామాన్ని ఎదుర్కొన్న వైఎస్సార్‌సీపీ నేతలకు ఆ గ్రామ మహిళలు అండగా నిలిచి, ప్రతిఘటించేందుకు సిద్ధమవడంతో టీడీపీ మూకలు అక్కడి నుంచి నిష్క్రమించాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. వేల్పుల మండలం నల్లగొండువారిపల్లె గ్రామానికి చెందిన చెన్నారెడ్డి.. వేల్పుల రామలింగారెడ్డికి సమీప బంధువు. పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నిక సందర్భంగా ఆయనతో చర్చించేందుకు ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌తో కలిసి వేల్పుల రామలింగారెడ్డి బుధవారం ఆ గ్రామానికి వెళ్లారు. అక్కడ ఆయనతో మాట్లాడిన తర్వాత పక్కనే ఉన్న సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డితో మాట్లాడేందుకు వెళ్తుండగా, ఒక్కమారుగా టీడీపీ రౌడీ మూకలు వారిని చుట్టుముట్టాయి. వేల్పుల రామలింగారెడ్డి తలపై రాడ్డుతో కొట్టారు. దీంతో తల పగిలి ఆయన కింద పడిపోయారు. పక్కనే ఉన్న ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పైనా అదే స్థాయిలో దాడి చేశారు. రమేష్ యాదవ్ తల తిప్పడంతో భుజంపై రాడ్ల దెబ్బలు పడ్డాయి. దాంతో ఆయన భుజం ఎముకలు విరిగిపోయాయి. ఆపై ఎమ్మెల్సీ రేంజ్ రోవర్, వేల్పుల రామలింగారెడ్డికి చెందిన ఫార్చ్యూనర్, స్కార్పియో వాహనాలను సమ్మెటలతో ధ్వంసం చేశారు. పెద్ద ఎత్తున అలజడి ఏర్పడటంతో ఇళ్లలో నుంచి బయటకు వచ్చిన మహిళలు.. కింద పడిపోయిన రామలింగారెడ్డికి అడ్డుగా నిలిచారు. ఆయనపై మళ్లీ దాడి చేయబోతుండగా అడ్డుకున్నారు. కొంత మంది మహిళలు ఆయనను లాక్కెళ్లి పక్కనే ఉన్న ఇంట్లో వేసి తాళం వేశారు. దీంతో టీడీపీ రౌడీలు.. తాళం వేసిన ఇంటి లోపలికి పెట్రోల్ చల్లారు. నిప్పు పెట్టేందుకు విఫల యత్నం చేశారు. గొడవ జరుగుతోందనే విషయం గ్రామం మొత్తానికి తెలియడంతో గ్రామస్తులు మూకుమ్మడిగా అక్కడికి వచ్చారు. గ్రామస్తులు తిరగబడి ప్రతిఘటించేందుకు సిద్ధమవడంతో టీడీపీ రౌడీ మూకలు అక్కడి నుంచి వెనుదిరిగాయి.

ఓటమి తప్పదనే భయోత్పాతం: వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: పులివెందులలో టీడీపీ గూండాల దాడి ఘటనను వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగితే తమకు ఓటమి తప్పదన్న సంగతి అర్థమై, కూటమి నేతలు ఇలా భయోత్పాతం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ గూండాల దాడిలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, వేల్పుల రామలింగారెడ్డిలను బుధవారం ఆయన ఫోన్‌లో పరామర్శించారు. వారితోపాటు టీడీపీ నేత బీటెక్ రవి అనుచరుల దాడిలో మంగళవారం గాయపడ్డ వైఎస్సార్‌సీపీ నేతలు సైదాపురం సురేష్ రెడ్డి (చంటి), అమరేష్ రెడ్డిలతో కూడా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు. తమపై టీడీపీ గూండాలు ఎలా దాడి చేశారనేది వైఎస్సార్‌సీపీ నాయకులు వైఎస్ జగన్‌కు వివరించారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని అడ్డదారుల్లో గెలవాలనే ప్రయత్నాన్ని కూటమి నేతలు చేస్తున్నారని, దీనిని బలంగా తిప్పికొడదామని పార్టీ నాయకులకు వైఎస్ జగన్ సూచించారు. టీడీపీ కూటమి నేతలు వ్యవస్థలను అడ్డం పెట్టుకుని అధికార దుర్వినియోగానికి పాల్పడడం దారుణమన్నారు.

తుద ముట్టించేందుకు పక్కా ప్రణాళిక

వేల్పుల రామలింగారెడ్డి తెలుగుదేశం పార్టీ నాయకులకు కంటగింపుగా ఉన్నారు. టిఫెన్ బెరైటీస్ కంపెనీ కేర్‌టేకర్‌గా కొనసాగుతున్నారు. అందులో నిల్వ ఉన్న కోట్లాది రూపాయల విలువైన బెరైటీస్ దోపిడీపై.. టీడీపీ నేత, ఎమ్మెల్సీ బీటెక్ రవి సహకారంతో వేముల పార్థసారథిరెడ్డి, మబ్బుచింతపల్లె శ్రీనాథరెడ్డి దొంగిలించారని ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. టిఫెన్ బెరైటీస్‌లో అక్రమ మైనింగ్‌కు అడ్డుగా నిలిచారు. ఈ నేపథ్యంలో ఆయన టీడీపీ నేతలకు టార్గెట్ అయ్యారు. పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. రెండు రోజుల క్రితం కనంపల్లె, మోట్నూతల గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. ఈ పరిస్థితుల్లో టీడీపీ శ్రేణులు మరింతగా రెచ్చిపోయాయి. పక్కా ప్రణాళికతో ఆయన్ను తుద ముట్టించాలని టీడీపీ శ్రేణులు కుట్ర పన్నాయి. బుధవారం ఆయన ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌తో కలిసి నల్లగొండువారిపల్లెకు వెళ్లారని తెలుసుకుని.. ఇనుప సమ్మెటలు, రాడ్లు.. పెట్రోల్ బాటిళ్లు తదితర మారణాయుధాలతో అక్కడికి వెళ్లి మాటు వేశారు. ఇవన్నీ పరిశీలిస్తే వేల్పుల రామలింగారెడ్డిని అంతం చేయాలని పక్కా ప్రణాళికతోనే టీడీపీ మూకలు వెళ్లినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో తలపై రాడ్డుతో కొట్టగానే రామలింగారెడ్డి కింద పడిపోగానే, ఆ వెంటనే ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై వారు దాడికి దిగారు. ఆ సమయంలోగుంపులో నుంచి 'వాడు కాదురా.. వీడిని వదలొద్దు' అంటూ కేకలు వినిపించడంతో మళ్లీ రామలింగారెడ్డి వైపు తిరిగారు. అప్పటికే మహిళలు అడ్డుగా నిలవడంతో రెండోసారి దాడి చేయడం సాధ్య పడలేదని తెలుస్తోంది. గ్రామంలో కాకుండా మార్గం మధ్యలో దాడి జరిగింటే రామలింగారెడ్డి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్.. ఇద్దరూ హత్యకు గురై ఉండే వారని గ్రామస్తులు చెబుతున్నారు.





తీవ్రంగా గాయపడిన వేల్పుల రామలింగారెడ్డి, ఎమ్మెల్సీ రమేశ్‌యాదవ్

బాబు డైరెక్షన్.. బీటెక్ రవి యాక్షన్

- పులివెందుల నియోజకవర్గంలో భయాందోళనలు సృష్టించడమే లక్ష్యంగా టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు డైరెక్షన్‌లో ఎమ్మెల్సీ బీటెక్ రవి యాక్షన్ చేస్తున్నారు. మంగళవారం రాత్రి వైఎస్సార్‌సీపీ నేతలు సురేష్ కుమార్‌రెడ్డి, అమరేష్‌రెడ్డి తదితరులపై హత్యాయత్నం ఘటనలో టీడీపీ వర్గీయులైన అక్కులగారి విజయ్‌కుమార్‌రెడ్డి, కిరికిరిబాషా బృందంపై వైఎస్సార్‌సీపీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ వెంటనే మీడియా ముందుకు వచ్చిన బీటెక్ రవి.. సురేష్ కుమార్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీ నేతలకు మధ్య తేడాలు వచ్చాయని, అందుకే ఆయన స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారని.. దీంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆయనపై దాడి చేసి, నింద తమపై మోపారని చెప్పుకొచ్చారు. బుధవారం నాటి ఘటనతో టీడీపీకి సంబంధం లేనిదని తప్పించుకోజూశారు.
- మరోవైపు రామలింగారెడ్డి వేముల మండలానికి చెందిన ఎస్సీ కార్యకర్తలను కులం పేరుతో దూషించడంతోనే ఘర్షణ చోటుచేసుకుందని ఇష్యూను డైవర్ట్ చేసే ప్రయత్నం చేశారు. కొద్ది రోజులుగా ఇక్కడ ఏం జరుగుతోందో స్థానికులందరికీ స్పష్టంగా తెలిసినా, బీటెక్ రవి ఇలా బరితెగించి మాట్లాడటంపై విస్తుపోతున్నారు.

విచ్చలవిడికి 'పర్మిట్'!

3,736 మద్యం దుకాణాలకు అనుబంధంగా అన్నిచోట్లా పర్మిట్ రూమ్‌లకు మళ్లీ 'పచ్చ'జెండా

మందు ఏరులై పారించాలి..! మద్యం ఆదాయం రూ.35 వేల కోట్లు దాటించాలి..! ఇదీ టార్గెట్! ఎంత భారీగా తిన్నా బకాసురుడి ఆకలి తీరనట్లుగా... మద్యం విధానం ద్వారా ఎంత బరి తెగించి దోపిడీకి పాల్పడుతున్నా కడుపు నిండని టీడీపీ మద్యం సిండికేట్ ఇంకా కావాలనే అంటోంది! మద్యం దోపిడీలో చంద్రబాబు సర్కారు తీరు బకాసురుడినే తలపిస్తోంది!! అందుకే సిండికేట్ దోపిడీకి మరింత రాచబాట పరుస్తూ రాష్ట్రంలో పర్మిట్ రూమ్‌లకు చంద్రబాబు సర్కారు తలుపులు బార్లా తెరిచింది. ఈ ఏడాది సెప్టెంబరులో కొత్త బార్లకు లైసెన్సులతోపాటు మద్యం దుకాణాలకు అనుబంధంగా పర్మిట్ రూమ్‌లకు రిబ్బన్ కత్తిరించాలని నిర్ణయించింది. తాజాగా రాష్ట్ర మంత్రి మండలి సమావేశంలో తీర్మానం ద్వారా మద్యం సిండికేట్ లూటీకి అధికారికంగా రాచబాట పరిచింది.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

నగర వార్తలు

8న మూలవాసీ 'ఉరుములు- మెరుపులు'

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఆద్య కళా మ్యూజియం ఆధ్వర్యంలో ఈ నెల 8న సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం సమీపంలోని పబ్లిక్ గార్డెన్‌లో అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా 'మూలవాసీ ఉరుములు- మెరుపులు' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రొఫెసర్ జయధీర్ తిరుమల్‌రావు తెలిపారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 50 ఆదివాసీ తెగలు, ఉప కులాలకు చెందిన 150 మంది కళాకారులు పాల్గొంటారని పేర్కొన్నారు. సాయంత్రం 6 గంటల నుంచి జరిగే ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క, సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి సుదర్శన్‌రెడ్డి, జయరాజ్, ప్రొఫెసర్ కాశీం, విమలక్క తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఆదివాసీలపై అరుణోదయ పాటల క్యాసెట్ ఆవిష్కరణ ఉంటుందన్నారు. సమావేశంలో ప్రొఫెసర్ జి.మనోజ, భూపతి వెంకటేశ్వర్లు, తోట అపర్ణ, ముచ్చెర్ల పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం రిజర్వేషన్ల కోసమే కాంగ్రెస్ ధర్నా

- లంకల దీపక్‌రెడ్డి

కాచిగూడ: ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద కాంగ్రెస్ చేపట్టిన ధర్నా బీసీల కోసం కాదని, అది ముస్లింల రిజర్వేషన్ల కోసమేనని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి అన్నారు. బుధవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్టీ నేతలు డాక్టర్ ఎస్.గౌతంరావు, జి.ఆనంద్ గౌడ్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రకటించిన 42 శాతం బీసీ రిజర్వేషన్లలో 10 శాంతి రిజర్వేషన్లు ముస్లింలకు కట్టబెట్టాలని చూస్తోందని ఆరోపించారు. దేశానికి తొలి బీసీ ప్రధానిని చేసిన ఘనత బీజేపీదేనన్నారు. బలహీన వర్గాలు చైతన్యవంతులై కాంగ్రెస్‌ను భూస్థాపితం చేసే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు.

ఈ నెలాఖరులోగా ఏబీ కేబుల్స్ పనులు పూర్తి

సాక్షి, సిటీబ్యూరో: ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్ల స్థానంలో ఎయిర్ బంచ్డ్(ఏబీ) కేబుళ్లను ఏర్పాటు చేయనున్నట్లు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ చెప్పారు. బుధవారం కార్పొరేట్ కార్యాలయంలో మెట్రోజోన్ పరిధిలోని సబ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. బంజారాహిల్స్, సికింద్రాబాద్, హైదరాబాద్ సెంట్రల్, హైదరాబాద్ సౌత్ సర్కిళ్ల పరిధిలో 550 కిలో మీటర్ల మేర ఎల్‌టీ ఓవర్ హెడ్(ఓహెచ్) కండక్టర్ స్థానంలో ఏబీ కేబుళ్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ నెలాఖరులోగా పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇళ్ల మధ్య ప్రమాదకరంగా మారిన లైన్లను మార్చాలని ప్రజల నుంచి విజ్ఞప్తులు అందాయని చెప్పారు. సమావేశంలో సంస్థ డైరెక్టర్లు నర్సింహులు, చక్రపాణి, ఎస్ఈ వేణుగోపాల్ పాల్గొన్నారు.

విద్యావ్యవస్థ బలోపేతానికి ఒప్పందాలు

కళాశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన

సనత్‌నగర్: ప్రభుత్వ కళాశాలల్లో విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా సాంకేతిక, డిజిటల్, గేమింగ్ పరంగా పలు సంస్థలతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు కళాశాల విద్యాశాఖ కమిషనర్ ఎ.శ్రీదేవసేన అన్నారు. బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 80 కిలోవాట్స్ సోలార్ విద్యుత్తు ఉత్పాదన యూనిట్‌ను బుధవారం ఆమె ప్రారంభించారు. అనంతరం బీఎస్సీ గేమింగ్ కంప్యూటర్ ల్యాబ్, సౌర విద్యుత్‌తో నడిచే లిఫ్టును ప్రారంభించారు. బీఎస్సీ గేమింగ్ కోర్సు పూర్తి చేసుకున్న విదార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. శ్రీదేవసేన మాట్లాడుతూ గేమింగ్ రంగానికి విపరీతమైన డిమాండ్ ఉందని, అందులో రాణించేందుకు విద్యార్థులు సృజనాత్మకంగా ఆలోచించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.పద్మావతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కళాశాల విద్యా శాఖ జాయింట్ డైరెక్టర్లు ప్రొఫెసర్ రాజేందర్‌సింగ్, ప్రొఫెసర్ బాలభాస్కర్, ప్రొఫెసర్ సౌందర్య జోసెఫ్, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సుబ్బారావు, క్రిస్ప్ వ్యవస్థాపకులు, సీఈఓ రెడ్డి సుబ్రహ్మణ్యం, వైస్ ప్రిన్సిపాల్ భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, పర్వీన్ సుల్తానా తదితరులు పాల్గొన్నారు.



కళాశాలలో గేమింగ్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న శ్రీదేవసేన

ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘన నివాళి

సాక్షి, సిటీబ్యూరో: జీవితమంతా తెలంగాణ ఉద్యమానికి, స్వరాష్ట్ర సాధనకు అంకితం చేసిన మహనీయులు ప్రొఫెసర్ జయశంకర్ అని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ అన్నారు. ప్రొఫెసర్‌గా విద్యార్థులకు మార్గదర్శనం చేస్తూనే తన జీవితాన్ని తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అంకితం చేశారని కొనియాడారు. బుధవారం ఆచార్య జయశంకర్ జయంతిని పురస్కరించుకుని జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆయన చిత్రపటానికి కమిషనర్, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జయశంకర్ సేవలను గుర్తు చేసుకున్నారు.



జయశంకర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కర్ణన్

ట్రాఫిక్ సిగ్నళ్ల ఆధునీకరణ టెండర్లకు ఆహ్వానం

సాక్షి, సిటీబ్యూరో: ట్రాఫిక్ సిగ్నళ్ల నిర్వహణ, సిగ్నలైజ్డ్ ఇంటర్‌సెక్షన్ ట్రాఫిక్ కంట్రోల్(ఎస్ఐటీసీ) కోసం ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్(పీఎంయూ)గా పనిచేసేందుకు జీహెచ్ఎంసీ సంబంధిత ఏజెన్సీల నుంచి టెండర్లు ఆహ్వానించింది. నగరంలో ప్రస్తుతం 404 ట్రాఫిక్ సిగ్నళ్లు ఉన్నాయి. కొత్తగా 50 సిగ్నళ్లు ఏర్పాటు చేయనుంది. నాలుగేళ్ల వరకు పీఎంసీగా పనిచేసేందుకు ఈ టెండర్లు ఆహ్వానించింది. ప్రస్తుతమున్న ట్రాఫిక్ సిగ్నళ్లు ఏర్పాటు చేసి చాలా కాలమైనందున సరికొత్త సాంకేతికతతో వాటిని ఆధునీకరించాలని నిర్ణయించింది. వాహనాల వేగం, పాదచారుల భద్రత, అత్యవసరంగా వెళ్లాల్సిన అంబులెన్సులకు ప్రాధాన్యత, అడాప్టివ్ ట్రాఫిక్ సిగ్నల్ సిస్టమ్, పెలికాన్ సిగ్నల్ సిస్టమ్స్ నిర్వహణను పీఎంయూ చేపట్టాల్సి ఉంటుంది. పీఎంయూగా ఎంపికయ్యే ఏజెన్సీ సిగ్నళ్ల నిర్వహణకు సంబంధించి ప్రణాళిక, పర్యవేక్షణ, సమీక్ష, బిడ్ల మూల్యాంకనం వంటి అంశాల్లో జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ అధికారులకు సహకరించాలి. సాంకేతిక అంశాలు సరిగ్గా ఉండేలా చూడటం వంటి పనులు చేయాల్సి ఉంది. తద్వారా ట్రాఫిక్ రద్దీ, కాలుష్యం తగ్గుదల, పాదచారులు, అత్యవసర వాహనాలకు భద్రత, ప్రయాణ సమయంపై ప్రజలకు నమ్మకం కలుగుతుందని అధికారులు భావిస్తున్నారు.

వేతనాలు చెల్లించాలని నిలోఫర్ నర్సుల ఆందోళన

నాంపల్లి: ప్రముఖ చిన్నపిల్లల ఆసుపత్రి నిలోఫర్‌లో నర్సులు బుధవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఆందోళన చేశారు. ఐదు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదంటూ సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. నర్సులు అధిక సంఖ్యలో హాజరై ప్రభుత్వ వైఖరిని, అధికారుల నిర్లక్ష్యాన్ని తప్పుబట్టారు. వేతనాలు లేకుండా ఎన్ని నెలలు విధులు నిర్వర్తించాలని అధికారులను నిలదీశారు. ప్రతి నెలా వేతనం వస్తేనే ఇల్లు గడిచేది కష్టంగా ఉందని, అలాంటిది ఐదు నెలలుగా వేతనాలు ఇవ్వకపోతే ఎలాగంటూ మండిపడ్డారు. ఇంటి అద్దెలు, పిల్లల ఫీజులకు ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. నెల నెలా వేతనాలు చెల్లిస్తేనే విధులకు వెళ్తామనడంతో ఆసుపత్రి సూపరింటెండెంట్ నర్సులకు సర్ది చెప్పడంతో ఆందోళనను విరమించారు.



15, 16 తేదీల్లో పశువుల కబేళాల మూసివేత

సాక్షి, సిటీబ్యూరో: ఈ నెల 15, 16 తేదీల్లో స్వాతంత్ర్య దినోత్సవం, శ్రీ కృష్ణ జన్మాష్టమి దృష్ట్యా జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని పశువుల కబేళాలు, రిటైల్ బీఫ్ దుకాణాలను మూసివేయాలని జీహెచ్ఎంసీ ఆదేశాలు జారీ చేసింది. స్వాతంత్ర్య దినోత్సవం, జన్మాష్టమి ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకుంది. పశువుల కబేళాలు , బీఫ్ దుకాణాల మూసివేత నిర్ణయం అమలులో మునిసిపల్ అధికారులకు పూర్తి సహకారం అందించాలని హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనర్లను జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ కోరారు.

నేటితో హజ్ దరఖాస్తుల స్వీకరణ గడువు ముగింపు

- హజ్ కమిటీ చైర్మన్ అఫ్జల్ బియాబానీ

సాక్షి, సిటీబ్యూరో: హజ్ యాత్ర-2026 దరఖాస్తుల స్వీకరణ గడువు గురువారం(నేడు) ముగుస్తుందని రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ సయ్యద్ అఫ్జల్ బియాబానీ ఖుస్రో పాషా తెలిపారు. దరఖాస్తుదారుల సౌలభ్యం కోసం హజ్‌హౌస్‌లో ఎనిమిది ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు దాదాపు 10 వేల దరఖాస్తులు మాత్రమే అందాయని పేర్కొన్నారు. యాత్రకు వెళ్లే వారి పాస్‌పోర్టు గడువు 31 డిసెంబర్ 2026 వరకు ఉండాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారిని డ్రా పద్ధతిలో హజ్ యాత్రకు ఎంపిక చేస్తారని, ఈ నెల చివరి వారంలో డ్రా నిర్వహిస్తామని తెలిపారు. జంటనగరాల యాత్రికుల కోసం నాంపల్లి హజ్‌హౌస్‌లో, జిల్లాల్లో అయితే హజ్ సొసైటీలను సంప్రదించాలని సూచించారు. దరఖాస్తులకు సంబంధించి సందేహాలు ఉంటే 040 23298793 నంబర్ లేదా కేంద్ర హజ్ కమిటీ వెబ్‌సైట్ ద్వారా పూర్తి వివరాలు తెలుసుకోవాలని సూచించారు.

కాంగ్రెస్ ధర్నా బీసీల కోసం కాదు

వకుళాభరణం కృష్ణమోహన్‌రావు

పంజగుట్ట: కాంగ్రెస్ పార్టీ ఢిల్లీలో చేస్తున్న ధర్నా బీసీల కోసం కాదని, కేవలం రాజకీయ హంగామాకేనని రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. న్యాయస్థానానికి వెళ్లి లీగల్‌గా పరిష్కరించుకునే అవకాశం ఉన్నా రాజకీయ డ్రామాలు చేస్తోందని విమర్శించారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టుపై సమగ్ర అధ్యయనానికి 16 నెలల సమయం పట్టిందని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం కోట్లాది మంది బీసీల భవిష్యత్ నిర్ణయించే సర్వే అధ్యయనాన్ని మాత్రం నెలలో ముగించిందని, దీనిని బట్టే కాంగ్రెస్‌కు బీసీల పట్ల ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో తెలుస్తోందని అన్నారు. బీసీల కోసం వేసిన డెడికేటెడ్ కమిషన్ నివేదికలు బయటపెట్టలేదని, రాజకీయలబ్ధి కోసం 665 పేజీల కాళేశ్వరం నివేదికను వెంటనే బహిర్గతం చేశారని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణకు వేసిన షమీమ్ అక్తర్ కమిషన్‌ను కమిషన్ యాక్ట్ ప్రకారం చట్టబద్ధంగా వేసి బీసీల కోసం వేసిన కమిషన్‌లను మాత్రం చట్టబద్ధత లేకుండా వేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు కాటం నర్సింహ్మ యాదవ్ మాట్లాడుతూ 42 శాతం రిజర్వేషన్లలో మైనార్టీలకు 10 శాతం ఇస్తామంటే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎలా ఒప్పుకుంటుందని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్లు రావడం కాంగ్రెస్ పార్టీకి ఇష్టం లేదని, అందుకే మెలికపెట్టి కేంద్రానికి బిల్లు పంపిందని ఆగ్రహంవ్యక్తం చేశారు. సమావేశంలో సమావేశంలో జాతీయ బీసీ అధ్యయన వేదిక కన్వీనర్ ఎం.మారుతీప్రసాద్, అంబటి సుధాకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కృష్ణమోహన్ రావు

రిటైల్ వ్యాపారానికి రాష్ట్రం బాసట

రిటైలర్స్ అసోసియేషన్ సీఈఓ కుమార్ రాజగోపాలన్

రాయదుర్గం: రిటైల్ వ్యాపార రంగం అభివృద్ధికి తెలంగాణ బాసటగా నిలుస్తోందని రిటైలర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఆర్ఏఐ) సీఈఓ కుమార్ రాజగోపాలన్ అన్నారు. అసోసియేషన్ హైదరాబాద్ రిటైల్ సమ్మిట్ నాల్గవ ఎడిషన్ సమావేశాన్ని హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని ఐటీసీ కోహినూర్‌లో బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆర్థిక విస్తరణ, డిజిటల్ ఫస్ట్ గవర్నెన్స్, టిక్-ఎనేబుల్డ్ ఎకో సిస్టమ్‌ను కలపడం ద్వారా తెలంగాణలో రిటైల్ రంగం అభివృద్ధిని సాధిస్తోందన్నారు. ఆధునిక మాల్స్ నుంచి కిరాణ స్టోర్‌ల వరకు ఈ కామర్స్‌ను అవలంబిస్తున్నాయని చెప్పారు. అన్ని ఫార్మాట్లలో వృద్ధికి రాష్ట్రం మద్దతు ఇస్తోందన్నారు. కార్యక్రమంలో అపోలో ఫార్మసీ సీఈఓ జయ కుమార్, మెడిప్లస్ హెల్త్ సర్వీసెస్ వ్యవస్థాపకుడు మధుకర్ గంగాడి, పీఎంజే జ్యువెల్స్ సీఈఓ కిరణ్ షిండే, ఆర్ బ్రదర్స్ రిటైల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ అభినయ్, స్కంధన్ని రిటైల్ ప్రైవేట్ లిమిటెడ్ బిజినెస్ హెడ్ వై.శివగోవర్ధన్‌రెడ్డి, ప్యారడైజ్ ఫుడ్‌కోర్ట్ సీఈఓ గౌతమ్‌గుప్తా, క్రీమ్‌స్టోన్ ఐస్‌క్రీమ్ కాన్సెప్ట్స్ సీఈఓ శీతల్‌పాటిల్ పాల్గొన్నారు.

నిజాం కళాశాల విద్యార్థినుల ఆందోళన

హాస్టల్ వసతి కల్పించాలని డిమాండ్



ప్రిన్సిపాల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థినులు

గన్‌ఫౌండ్రీ: హాస్టల్ వసతి కల్పించాలని నిజాం కళాశాల విద్యార్థినులు గళమెత్తారు. విద్యాసంవత్సరం ప్రారంభమై నెలలు కావస్తున్నా హాస్టల్ వసతి కల్పించకపోవడాన్ని నిరసిస్తూ బుధవారం ప్రిన్సిపాల్ చాంబర్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థినులు మాట్లాడుతూ యూజీ బాలికల కోసం అప్పటి ప్రభుత్వం హాస్టల్ నిర్మించిందని గుర్తు చేశారు. కానీ, ప్రస్తుత ప్రిన్సిపాల్ డిగ్రీ విద్యార్థులకు కాకుండా పీజీ విద్యార్థులకు ఆ హాస్టల్ వసతి కల్పించారని విమర్శించారు. ఉస్మానియా యూనివర్సిటీలోని హాస్టల్‌లో పీజీ విద్యార్థినులకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. తమ హక్కుల గురించి అడిగితే ప్రిన్సిపాల్ బెదిరింపులకు పాల్పడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. ఆందోళన చేస్తున్న విద్యార్థినుల తల్లిదండ్రులకు ఫోన్లు చేసి పోలీసు కేసులు పెడుతామని బెదిరించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. డిగ్రీ విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించే వరకు ఆందోళనలు కొనసాగుతాయని విద్యార్థినులు స్పష్టం చేశారు.

క్లుప్తంగా...

రేవంత్ నటించిన విఫల నాటకం ఇది

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు



సాక్షి, హైదరాబాద్: ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద కాంగ్రెస్ చేపట్టిన ధర్నా రాజకీయ నాటకంలో భాగమేనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు విమర్శించారు. 'బీసీల హక్కులు బీసీలకే ఇవ్వాలి. స్పష్టంగా 42 శాతం రిజర్వేషన్లు బీసీలకే ప్రకటించాలి. ఈ ఢిల్లీలో కాంగ్రెస్ ధర్నా అనేది రాహుల్ గాంధీ దర్శకత్వం వహించి, రేవంత్‌రెడ్డి నటించిన విఫల నాటకం మాత్రమే'అని ఎద్దేవాచేశారు. ఢిల్లీలో రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందిస్తూ... కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే (అది అసంభవం) ఓబీసీ నాయకుడినే ప్రధానిని చేస్తానని రాహుల్‌గాంధీ బహిరంగంగా హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ హామీ ఇవ్వకపోతే, రాహుల్ గాంధీ ప్రజలను మోసం చేస్తున్నట్టేనన్నారు.

42 శాతం రిజర్వేషన్లపై అసెంబ్లీలో ఒత్తిడి తెస్తాం

బీజేఎల్పీ ఉపనేత పాయల్ శంకర్



సాక్షి, హైదరాబాద్: రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు (ముస్లింలకు కాకుండా) అమలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని బీజేఎల్పీ ఉపనేత పాయల్ శంకర్ చెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అంటూ ఢిల్లీలో ధర్నా పేరుతో కాంగ్రెస్ పార్టీ కేంద్రంపై, బీజేపీపై చేస్తున్న దుష్ప్రచారాన్ని బీసీలు గమనిస్తున్నారన్నారు. తమను కాంగ్రెస్ ఏ రకంగా మోసం చేస్తుందో బీసీలకు పూర్తిగా అర్థమైంది కాబట్టే ఢిల్లీ ధర్నాలో బీసీలు పాల్గొనలేదని చెప్పారు. బుధవారం పాయల్ శంకర్ మీడియాతో మాట్లాడుతూ శాసనసభలో బిల్లు పెట్టిన సందర్భంలోనే ఇక్కడ బిల్లు పెడతారు, భవిష్యత్తులో ఢిల్లీలో ధర్నా చేస్తారు తాము స్పష్టంగా చెప్పామని గుర్తుచేశారు. బీసీ బిల్లు పెట్టినట్టే పెట్టి, ముస్లింలను బీసీ రిజర్వేషన్లలో చేర్చి, ఆ బిల్లును సమర్థించకుండా తప్పించుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. రూ.20 వేల కోట్లు ఇవ్వడానికి ఏ షెడ్యూల్ అడ్డంగా ఉంది? ఏ ఆర్టికల్ వద్దంటోంది? సీఎం రేవంత్, కాంగ్రెస్ చెప్పాలని శంకర్ డిమాండ్ చేశారు.

వ్యవస్థల గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్‌కు లేదు

ఎమ్మెల్సీ మధుసూదనాచారి



సాక్షి, హైదరాబాద్: దేశంలోని రాజ్యాంగ, పాలన వ్యవస్థలను భ్రష్టుపట్టించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని శాసనమండలిలో ప్రతిపక్ష నాయకుడు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎస్.మధుసూదనాచారి విమర్శించారు. బీఆర్ఎస్‌కు వ్యవస్థల మీద నమ్మకం లేదని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవస్థల గురించి మాట్లాడే నైతిక అర్హత కాంగ్రెస్ పార్టీకి లేదన్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం మధుసూదనాచారి విలేకరులతో మాట్లాడారు. దేశ వ్యవస్థల మీద బీఆర్ఎస్‌కు సంపూర్ణ విశ్వాసం ఉందన్నారు. ఎమర్జెన్సీ సమయంలో కేరళలో కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని కూల్చివేసింది మొదలుకుని అనేక ప్రభుత్వాలను ఏకపక్షంగా రద్దు చేసిన చరిత్ర కాంగ్రెస్‌కు ఉందన్నారు. కాళేశ్వరం కమిషన్ విచారణ కమిషన్‌ను ప్రభావితం చేసేలా కాంగ్రెస్ వ్యవహరించిందని మధుసూదనాచారి విమర్శించారు. వ్యవస్థల మీద సీఎం రేవంత్‌రెడ్డికి విశ్వాసం లేదని, ఎమ్మెల్యేల ఫిరాయింపుపై అసెంబ్లీలో ఆయన చేసిన వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు చురకలు వేసిన విషయాన్ని బీఆర్ఎస్ నాయకులు దేవీప్రసాద్ గుర్తు చేశారు.

నేడు గోవాలో జాతీయ ఓబీసీ మహాసభ: జాజుల



సాక్షి, హైదరాబాద్: గోవా యూనివర్సిటీ సమీపంలోని డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆడిటోరియంలో గురువారం జాతీయ ఓబీసీ పదవ మహాసభ నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మహాసభకు గోవా సీఎం ప్రమోద్ సావంత్, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, మహారాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు నానాపటేల్, ఎంపీలు ఈటల రాజేందర్, వద్దిరాజు రవిచంద్ర, జాతీయ, ప్రాంతీయ పార్టీల ప్రతినిధులు, సామాజిక ఉద్యమకారులు హాజరుకానున్నట్టు తెలిపారు. మహాసభలో బీసీ డిమాండ్లపై చర్చించి కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా వెంకన్న

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ బస్‌భవన్‌లో చీఫ్ మెకానికల్ ఇంజనీర్ (సీఎంఈ)గా పనిచేస్తున్న వెంకన్నకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పిస్తూ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాలు జారీ చేశారు. ఆయనకు ఖాళీగా ఉన్న ఇంజినీరింగ్ విభాగాన్ని అప్పగిస్తున్నట్టు అందులో పేర్కొన్నారు. తదుపరి ఆదేశాలు వెలువడే వరకు ఆయన సీఎంఈ పోస్టును కూడా పర్యవేక్షించాలని అందులో పేర్కొన్నారు.

మోదీని గద్దె దించుతాం

- రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసుకుంటాం
- బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించి తీరతాం
- ఢిల్లీలో టీపీసీసీ మహా ధర్నాలో సీఎం రేవంత్‌రెడ్డి



ఎంపీలు సుప్రియాసూలే, కనిమొళితో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు విద్యా, ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు సాధించి తీరతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల పెంపును ఆమోదించకుంటే రాహుల్‌గాంధీ నేతృత్వంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని గద్దె దించుతామని హెచ్చరించారు. ఎర్ర కోటపై మూడు రంగుల జెండా ఎగురవేసి రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసుకుని బీసీ రిజర్వేషన్ల డిమాండ్‌ను నెరవేర్చుకుంటామని చెప్పారు. తెలంగాణ ప్రజల శక్తిని, ఉద్యమ స్ఫూర్తిని మోదీ తక్కువగా అంచనా వేస్తే తడాఖా చూపిస్తామని అన్నారు. బిల్లులు ఆమోదం పొందే వరకు తాము నిద్రపోమని స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్ల బిల్లుల ఆమోదం కోరుతూ ఢిల్లీ జంతర్‌మంతర్‌లో టీపీసీసీ బుధవారం నిర్వహించిన మహాధర్నాలో సీఎం ప్రసంగించారు.

సామాజిక న్యాయాన్ని వ్యతిరేకిస్తే అదే మరణ శాసనం

'గోధ్రా అల్లర్ల సమయంలో రాజీనామా చేయమని నాటి ప్రధానమంత్రి వాజ్‌పేయి నాడు సీఎంగా ఉన్న నరేంద్ర మోదీని కోరితే చేయలేదు. 75 ఏళ్లు నిండినందున ప్రధాని పదవి నుంచి వైదొలగాలని ఆర్ఎస్ఎస్ సర్ సంఘ్ చాలక్ మోహన్ భాగవత్ కోరుతున్నా ఆయన పట్టించుకోవడం లేదు. మోదీ లేకపోతే బీజేపీకి 150 సీట్లు కూడా రావని ఆయన భక్తుడు నిశికాంత్ దూబే అంటున్నారు. ఈసారి బీజేపీకి ఎట్టి పరిస్థితుల్లోనూ 150 సీట్లు దాటవు. బీసీ రిజర్వేషన్లను మోదీ అడ్డుకుంటే ఆయనను గద్దె దించడం ఖాయం. రిజర్వేషన్ల పెంపు బిల్లులను ఆమోదించకుంటే ఇక ఢిల్లీ రాము.. గల్లీకి వచ్చినప్పుడు బీజేపీ నేతలను పట్టుకుంటాం. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ వారసునిగా వచ్చిన రాహుల్ గాంధీ బీసీలకు న్యాయం చేసేందుకు కంకణం కట్టుకున్నారు. సామాజిక న్యాయంపై రాహుల్‌గాంధీ శిలాశాసనానికి వ్యతిరేకంగా వస్తే అదే మరణ శాసనం అవుతుంది..' అని రేవంత్ హెచ్చరించారు.

బీజేపీకి తెలంగాణ బీసీల అవసరం లేదా?

'బలహీన వర్గాలపై కక్ష గట్టిన గత ముఖ్యమంత్రి కేసీఆర్ మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించకుండా చట్టం చేశారు. నాడు కేసీఆర్ చేసిన చట్టమే నేడు రిజర్వేషన్ల పెంపునకు గుదిబండగా మారింది. తెలంగాణలో బలహీన వర్గాల బిడ్డలు.. సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, మేయర్లు కాకుండా అడ్డుగా ఉన్న చట్టాన్ని తొలగించాలని ఆర్డినెన్స్ చేసి గవర్నర్‌కు పంపినా ఆమోదించడం లేదు. కేసీఆర్‌తో పాటు బీజేపీ నేతలు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రాంచందర్‌రావులు బీసీ రిజర్వేషన్ల పెంపునకు అడ్డుపడుతున్నారు. రాష్ట్ర బీజేపీ నేతలకు తెలంగాణ బీసీల అవసరం లేదా? బీఆర్ఎస్ నాయకులు బీసీ రిజర్వేషన్ల పెంపు ధర్నాకు ఎందుకు రాలేదు? తెలంగాణతో పేరు బంధంతో పాటు పేగు బంధం కూడా తెంచుకుందా?

ఆ అదృష్టం నాకు దక్కింది

'దేశంలో వందేళ్ల కాలంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేయలేదు. ఇప్పటివరకు దేశంలో 300 మంది ముఖ్యమంత్రులైనా ఎవరూ చేయని పనిని చేసే అదృష్టం నాకు దక్కింది. బీసీల రిజర్వేషన్లు పెంచే అవకాశం నాకు వచ్చింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించేందుకే ఢిల్లీలో ధర్నాకు దిగాం. కేంద్ర ప్రభుత్వం మెడలు వంచైనా సాధించి తీరతాం..'అని ముఖ్యమంత్రి అన్నారు.

కేటీఆర్ బుద్ధి మారలేదు.. అహంకారం తగ్గలేదు

బీసీ రిజర్వేషన్ల పెంపు ధర్నాను కేటీఆర్ డ్రామా అంటున్నారు. కానీ కేటీఆర్ పేరే డ్రామారావు. కేసీఆర్ కుటుంబం డ్రామాలతో బతుకుతోంది. అధికారం, పదవులు పోయినా కేటీఆర్ బుద్ధి మారలేదు..అహంకారం తగ్గలేదు. ఆ కుటుంబంలోనే ఒకరు రిజర్వేషన్లకు అనుకూలం.. మరొకరు ప్రతికూలం.. మరొకరు అటూఇటూ కాకుండా మాట్లాడుతున్నారు..'అని సీఎం ధ్వజమెత్తారు.

మార్మోగిన బీసీ నినాదం

ఢిల్లీ మహాధర్నాకు భారీగా తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు

- సంఘీభావం ప్రకటించిన ఇతర పార్టీల ఎంపీలు, నేతలు
- తెలంగాణ మోడల్‌తో దేశ వ్యాప్తంగా కులగణన చేపట్టాలని డిమాండ్
- హాజరుకాని మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ

సాక్షి, న్యూఢిల్లీ: విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ అవకాశాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన బిల్లును పార్లమెంట్‌లోనూ ఆమోదించాలనే డిమాండ్‌తో బుధవారం టీపీసీసీ 'వన్ వాయిస్..వన్ విజన్..యునైటెడ్ బీసీ'నినాదంతో నిర్వహించిన మహాధర్నాతో ఢిల్లీలోని జంతర్‌మంతర్ దద్దరిల్లింది. సెంట్రల్ ఢిల్లీలో ఎక్కడ చూసినా బీసీ గర్జన ఫ్లెక్సీలు, పోస్టర్లే కన్పించాయి. తెలంగాణ నుంచి భారీగా తరలివచ్చిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలు, కార్యకర్తల బీసీ నినాదంతో చుట్టుపక్కల ప్రాంతాలన్నీ మార్మోగాయి. రాష్ట్రం నుంచి వచ్చిన బిల్లును కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆమోదించడంతో పాటు ఓబీసీ వర్గాలకు సామాజిక న్యాయం చేయాలని ధర్నాకు హాజరైన నేతలు నినదించారు. ఈ సందర్భంగా రాష్ట్రం చేపట్టిన కులగణనను ప్రశంసించిన వివిధ రాష్ట్రాల నేతలు.. అదే మోడల్‌తో ఇతర రాష్ట్రాల్లో కులగణన చేయాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర కాంగ్రెస్ నేతలంతా ధర్నాలో..


మహాధర్నాలో పాల్గొనేందుకు తెలంగాణలోని అన్ని జిల్లాల నుంచి సుమారుగా 2 వేల మందికి పైగా నేతలు, కార్యకర్తలు హాజరయ్యారు. కాంగ్రెస్‌తో పాటు వివిధ బీసీల సంఘాల నేతలు భారీగా తరలివచ్చారు. రాష్ట్రం నుంచి బీసీ వర్గానికి చెందిన కీలక నేతలంతా హాజరయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖ, వాకిటి శ్రీహరితో పాటు ఎంపీలు సురేశ్ షెట్కార్, మల్లు రవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, గడ్డం వంశీకృష్ణ, రామసహాయం రఘురామిరెడ్డి, బలరామ్ నాయక్, కడియం కావ్య, అనిల్‌కుమార్, రేణుకా చౌదరి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్‌లు, సీనియర్ నేతలు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు. ఎక్కడ చూసినా బీసీ సంఘాల నేతలు ప్లకార్డులు పట్టుకొని బీసీ రిజర్వేషన్లకు అనుకూలంగా, బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కనిపించారు. మొదట మధ్యాహ్నం 2 గంటల వరకే ధర్నా ఉంటుందని ప్రకటించినా సాయంత్రం 4 గంటల వరకు ధర్నా కొనసాగింది. బీసీల పోరుపై సాంస్కృతిక కళాకారులు పాడిన పాటలు అలరించాయి.

ఇండియా కూటమి పక్ష ఎంపీల సంఘీభావం

ఈ ధర్నాకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ హాజరుకాలేదు. ధర్నా కార్యక్రమాన్ని ఖర్గే ఆరంభిస్తారని, రాహుల్ చివరలో తుది ప్రసంగం చేస్తారనే ప్రచారం జరిగినా ఇద్దరు కీలక నేతలు దూరంగా ఉన్నారు. ఇండియా కూటమి పక్షాలతో భేటీ ఉండటం వల్లే ఖర్గే రాలేదని తెలిసింది. రాహుల్‌గాంధీ ఉదయం జార్ఖండ్‌లో రాంచీ కోర్టుకు హాజరై, మధ్యాహ్నం తర్వాత ఢిల్లీలోని లోధీరోడ్డులో జరిగిన జమ్మూకశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ అంత్యక్రియలకు హాజరయ్యారు. అయితే నేతలు ట్వీట్‌ల ద్వారా ధర్నాకు తమ మద్దతు ప్రకటించారు. కాగా..వివిధ రాష్ట్రాలకు చెందిన పలు పార్టీల ఎంపీలు, నేతలు బీసీ పోరు గర్జనకు తమ పార్టీ తరఫున సంఘీభావం తెలిపారు. ఎన్సీపీ, ఎస్పీ, డీఎంకే, ఎస్పీ, ఎంఐఎం, సీపీఐ, ఆర్జేడీలతో పాటు కాంగ్రెస్ సీనియర్ నేతలు దిగ్విజయ్‌సింగ్, గౌరవ్ గొగోయ్, ప్రణితి షిండే, వివిధ రాష్ట్రాలకు చెందిన 30 మంది వరకు కాంగ్రెస్ ఎంపీలు మద్దతు తెలిపారు.



'సబ్ కా సాత్' అంతా డొల్ల



- బీసీ రిజర్వేషన్లకు మోదీయే అడ్డుగోడ
- అణగారిన వర్గాల కోసమే కాంగ్రెస్ పోరాటం
- ఇది న్యాయం, సమానత్వం కోసం పోరు
- కాంగ్రెస్ నేతలు ఖర్గే, రాహుల్, ప్రియాంక

సాక్షి, న్యూఢిల్లీ: 'సబ్ కా సాత్ సబ్‌కా వికాస్'అనే మోదీ ప్రభుత్వ నినాదం అంతా డొల్ల అని, అణగారిన వర్గాల రిజర్వేషన్ల కోసమే తమ పోరాటమని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. న్యాయం ఆలస్యం కావడమంటే, దాన్ని నిరాకరించడమేనని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ వ్యాఖ్యానించారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలు కోసం తెలంగాణ ప్రభుత్వం తెచ్చిన బిల్లులకు కేంద్రం ఆమోదం తెలపాలని కోరుతూ బుధవారం జంతర్ మంతర్ వద్ద టీపీసీసీ ధర్నా పురస్కరించుకుని వారు 'ఎక్స్'లో తమ అభిప్రాయాలను వెల్లడించారు.

సామాజిక న్యాయం కోసం తెలంగాణ సర్కారు కృషి: ఖర్గే

'విద్య, ప్రభుత్వ ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో ఓబీసీలకు 42% రిజర్వేషన్ హక్కు కోసం తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం బిల్లులు ఆమోదించింది. కానీ రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉండటంతో.. రిజర్వేషన్ల సాధనకు తెలంగాణ ముఖ్యమంత్రి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఢిల్లీలో మహాధర్నా చేపట్టారు. రాష్ట్రంలో కుల సర్వే అనంతరం సామాజిక న్యాయాన్ని బలోపేతం చేసే చర్య మా ప్రభుత్వం తీసుకుంది. 'సబ్ కా సాత్, సబ్ కా వికాస్'అనే మోదీ ప్రభుత్వ నినాదం అంతా డొల్ల. ఎందుకంటే ఈ బిల్లులకు, అణగారిన వర్గాల హక్కులకు మోదీయే అడ్డుగోడగా ఉన్నారు..'అని ఖర్గే ధ్వజమెత్తారు.

అణగారిన వర్గాల కోసమే ఈ పోరాటం: రాహుల్ గాంధీ

'తెలంగాణ ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ ఢిల్లీలో ధర్నా చేశాయి. బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం తెలపాలని వారు డిమాండ్ చేశారు. సామాజిక న్యాయం దిశగా ఈ బిల్లు ఒక పెద్ద ముందడుగు. మద్దతు ఇచ్చిన 'ఇండియా'నేతలకు నా కృతజ్ఞతలు. రాష్ట్రపతి దీనిని గుర్తించి ఆమోదిస్తారని ఆశిస్తున్నా. ఈ పోరాటం కేవలం తెలంగాణ కోసం మాత్రమే కాదు. దేశంలోని అణగారిన వర్గాలకు అధికారం, హక్కుల కోసం జరుపుతున్న సమిష్టి పోరాటం.'. అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

చరిత్రాత్మక బిల్లు



'తెలంగాణ ప్రభుత్వం చరిత్రాత్మక బిల్లు ఆమోదించింది. అయితే ఈ బిల్లు రాష్ట్రపతి ఆమోదం కోసం అక్కడే ఆగిపోయింది. ఇందుకు నిరసనగా ముఖ్యమంత్రి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఢిల్లీలో ధర్నా చేపట్టారు. రాష్ట్రపతి తక్షణమే బిల్లును ఆమోదించాలని డిమాండ్ చేశారు. ఇది కేవలం తెలంగాణ పోరాటమే కాదు. అణగారిన వర్గాలకు న్యాయం, సమానత్వం, న్యాయబద్ధమైన ప్రాతినిధ్యం కోసం జాతి యావత్తు చేస్తున్న ఆందోళన. న్యాయాన్ని ఆలస్యం చేయడమంటే, దాన్ని తిరస్కరించడమే..'అని ప్రియాంకా గాంధీ స్పష్టం చేశారు.

ముస్లిం రిజర్వేషన్ల కోసమే కాంగ్రెస్ ధర్నా

కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపణ



సాక్షి, న్యూఢిల్లీ: 'బీసీల హక్కుల పేరుతో ముస్లింలకు 100 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కాంగ్రెస్ కుట్ర పన్నుతోంది. కామారెడ్డి డిక్లరేషన్ బీసీల కోసం కాదు... ముస్లింల ఓట్ల కోసమే'అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన ధర్నా వెనుక అసలైన ఎజెండా ముస్లింలకు లబ్ధి చేకూర్చడమేనని దుయ్యబట్టారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పిన కాంగ్రెస్.. కామారెడ్డి డిక్లరేషన్ ద్వారా 32 శాతం మాత్రమే బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలనుకుంటోందని... మిగిలిన 10 శాతాన్ని ముస్లింలకు కట్టబెట్టే పథకాన్ని రూపొందించిందని ఆయన ఆరోపించారు. 'ఇది బీసీ డిక్లరేషన్ కాదు.. ముస్లిం డిక్లరేషన్. ముస్లింల ఓట్ల కోసమే ఈ మాయాజాలం'అని విమర్శించారు. నామినేటెడ్ పదవుల్లో, పార్లమెంట్ టికెట్లలో, కేబినెట్‌లో బీసీలకు ఇచ్చిన ప్రాధాన్యతపై బహిరంగ చర్చకు సిద్ధమా? అంటూ కాంగ్రెస్‌కు ఆయన సవాల్ విసిరారు. ముస్లింలకు 100 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలన్న కుట్ర కింద కాంగ్రెస్ తెలంగాణలో మెజారిటీ హిందువులను మైనారిటీలుగా మార్చే ప్రమాదకర ప్రణాళిక అమలు చేస్తోందని బండి సంజయ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇది రాజ్యాంగ విరుద్ధమని.. అంబేడ్కర్ మత రిజర్వేషన్లకు వ్యతిరేకమన్నారని గుర్తుచేశారు. కానీ కాంగ్రెస్ పార్టీ మతపరమైన ఓట్ల కోసం దేశాన్ని విక్రయించడానికి సిద్ధమవుతోందంటూ బండి సంజయ్ దుయ్యబట్టారు. కాంగ్రెస్ ధర్నాకు బీసీలు కనీస మద్దతు ఇవ్వలేదని బండి సంజయ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ఇకనైనా బీసీలకే 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని.. తీరు మార్చుకోకపోతే బీసీలు, హిందూ సమాజమంతా కాంగ్రెస్‌ను తిరస్కరిస్తుందన్నారు. యూపీ, బెంగాల్, బిహార్, తమిళనాడు తరహాలో తెలంగాణలోనూ బలహీన వర్గాలు కాంగ్రెస్‌ను గమనిస్తున్నాయని.. త్వరలోనే కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెబుతాయని బండి సంజయ్ హెచ్చరించారు.

రేవంత్ బ్యాచ్ ఢిల్లీ డ్రామా అట్టర్ ఫ్లాప్: హరీశ్



దొంగ దీక్షకు రాహుల్‌గాంధీ, ఖర్గే రాలేదు

సాక్షి, హైదరాబాద్: బీసీలకు 42% రిజర్వేషన్ల పేరిట సీఎం రేవంత్‌రెడ్డి బ్యాచ్ ఢిల్లీలో చేసిన డ్రామా అట్టర్ ఫ్లాప్ అయ్యిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. 'ఢిల్లీ వేదికగా రేవంత్ నిర్వహించిన దొంగదీక్షకు కూతవేటు దూరంలో ఉన్నా రాహుల్ గాంధీ రాలేదు. బీసీలకన్నా బిహార్ ముఖ్యమని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే హాజరు కాలేదు. కాంగ్రెస్ ధర్నాలో నిజాయితీ లేదని.. బీసీలకు 42% కోటా అమలు చేస్తారనే మాటలపై నమ్మకం రాహుల్, ఖర్గేతోపాటు రాష్ట్ర ప్రజలకు కూడా లేదని స్పష్టమైంది. మేము గుజరాత్, యూపీ, మహారాష్ట్రలో అడగలేదు. తెలంగాణలోనే బీసీలకు 42% రిజర్వేషన్లు అడుగుతున్నామని రేవంత్ ప్రసంగించారు. రాహుల్ మాత్రం తెలంగాణ కోసమే కాకుండా మొత్తం దేశం కోసం జరుగుతున్న పోరాటం అని ట్వీట్ చేశారు. రేవంత్, రాహుల్ మాటలకు పొంతన లేదని తేలిపోయింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల మీద కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని తేలిపోయింది'అని హరీశ్‌రావు మండిపడ్డారు.

- రేషన్‌కార్డుల విషయంలో ప్రభుత్వాన్ని నిలదీయడమే సబితాఇంద్రారెడ్డి చేసిన తప్పా అని బుధవారం ఒక ప్రకటనలో హరీశ్‌రావు ప్రశ్నించారు. ఇందిరమ్మ రాజ్యం అని చెప్పుకుంటూ మహిళా సభ్యురాలి పట్ల ఇంత కర్కశంగా, అవమానకరంగా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు.

బాలిక అబార్షన్‌కు హైకోర్టు నో

సాక్షి, హైదరాబాద్: పెళ్లికాకుండానే గర్భందాల్చి 28 వారాల గర్భంతో ఉన్న ఓ బాలిక అబార్షన్‌కు ఉత్తర్వులు జారీ చేసేందుకు హైకోర్టు నిరాకరించింది. ప్రాణాపాయం ఉందన్న వైద్య నివేదిక నేపథ్యంలో ప్రసవం వరకు ఆమెను డిశ్చార్జ్ చేయొద్దని.. నిరంతరం వైద్యం అందించాలని నిలోఫర్ ఆస్పత్రిని ఆదేశించింది. తదుపరి విచారణను అక్టోబర్ 29కి వాయిదా వేసింది. తన కుమార్తె గర్భాన్ని (కవలలు) తొలగించేందుకు నిలోఫర్ వైద్యులను ఆదేశించాలంటూ హైదరాబాద్‌కు చెందిన ఓ మహిళ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ ఏడాది జూలై 22 నాటి వైద్య నివేదిక ప్రకారం తన కుమార్తె గర్భధారణ వయసు 27 వారాలు (ట్విన్ ఏ), 25 వారాలు (ట్విన్ బీ) అని పేర్కొంది. ఈ పిటిషన్‌పై జస్టిస్ నగేశ్ భీమపాక మరోసారి విచారణ చేపట్టారు. మెడికల్ బోర్డును ఏర్పాటు చేయాలన్న గత ఉత్తర్వుల మేరకు నివేదిక అందించిన నిలోఫర్ సూపరింటిండెంట్... గర్భాన్ని తొలగిస్తే మైనర్ బాలిక ప్రాణాలకు ముప్పు ఉండే అవకాశం ఉందని నివేదికలో పేర్కొన్నారు. దీన్ని పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి పిటిషనర్ విజ్ఞప్తిని నిరాకరించారు.



నిబంధనలను మార్చి కోర్టులు ఉత్తర్వులివ్వలేవ్

పరీక్షలు రాసేందుకు విద్యార్థికి హాజరు శాతం తప్పనిసరి: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: యూనివర్సిటీ నిబంధనల ప్రకారం విద్యార్థులకు కనీస హాజరు 65 శాతం ఉండాల్సిందేనని హైకోర్టు స్పష్టం చేసింది. సాధారణంగా 75 శాతం ఉండాలని.. అనారోగ్య సమస్యలు, క్రీడలు లాంటి వాటిని పరిగణనలోకి తీసుకొని 10 శాతం మినహాయింపు ఉంటుందని వెల్లడించింది. అన్ని అంశాలను దృష్టిలో పెట్టుకొనే నిబంధనలు రూపొందించారని.. వాటిని మార్చి న్యాయస్థానాలు తీర్పులు ఇవ్వలేవని తేల్చిచెప్పింది. ఇంజనీరింగ్ మూడో సంవత్సరం రెండో సెమిస్టర్ పరీక్షలు రాయకుండా కాలేజీ యాజమాన్యం సర్క్యులర్ జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ కీసరలోని గీతాంజలి ఇంజనీరింగ్ కాలేజీకి చెందిన బీటెక్ విద్యార్థిని కొండపర్తి మాన్విత హైకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి.. పిటిషనర్ పేర్కొన్న అనారోగ్య కారణాల దృష్ట్యా ఇంజనీరింగ్ పరీక్షలు రాసేందుకు అనుమతించాలని ఆదేశించారు. దీనిపై కాలేజీ అప్పీల్ దాఖలు చేయగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం వర్సిటీ నిబంధనల్లో జోక్యం చేసుకోలేమని చెబుతూ సింగిల్ జడ్జి ఉత్తర్వులను రద్దు చేసి కాలేజీ అప్పీల్‌ను అనుమతించింది.

ఐక్యంగా పోరాడుదాం.. రిజర్వేషన్లు సాధిద్దాం

- జంతర్‌మంతర్ ధర్నాలో నేతల పిలుపు
- మతం పేరుతో బీజేపీ బీసీ కోటాను అడ్డుకుంటోందని ఆగ్రహం

సాక్షి, న్యూఢిల్లీ: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను ఐక్యంగా పోరాడి సాధించుకుందామని తెలంగాణ రాష్ట్ర మంత్రులు, టీపీసీసీ నేతలు పిలుపునిచ్చారు. మతం పేరుతో బీజేపీ బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటోందని మండిపడ్డారు. కాంగ్రెస్ నేతల బీసీ నినాదం ప్రధాని మోదీని కదిలించాలని, తెలంగాణ సర్వే మోడల్ దేశ వ్యాప్తం చేయాలని ఇతర పార్టీల ఎంపీలు అన్నారు. బుధవారం జంతర్‌మంతర్‌లో టీపీసీసీ నిర్వహించిన మహాధర్నాలో వారు మాట్లాడారు.

తెలంగాణ సర్వే దేశానికే ఆదర్శం: డిప్యూటీ సీఎం భట్టి



'రిజర్వేషన్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తన పని తాను పూర్తి చేసింది. ఇక కేంద్రానిదే బాధ్యత. ఈ ధర్నా దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినది. 42 శాతం రిజర్వేషన్ త్వరితగతిన సాధించేందుకు, రాష్ట్రపతి వద్ద ఉన్న బిల్లులను ఆమోదింప చేసుకునేందుకు ఈ ధర్నా చేపట్టాం. రాష్ట్రంలో సర్వే చేపట్టినప్పుడు ఇది సాధ్యమా అని పలువురు నేతలు హేళనగా మాట్లాడారు. కానీ సీఎం రేవంత్‌రెడ్డి చేసి చూపించారు. ఇప్పుడు దేశం మొత్తం తెలంగాణ వైపే చూస్తోంది..'అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు

బీజేపీ నేతలు చేతగాని దద్దమ్మలు: టీపీసీసీ చీఫ్



'రిజర్వేషన్ల అంశాన్ని మతం కార్డుతో ముడిపెట్టి అడ్డుకోవడమే బీజేపీ లక్ష్యం. బిడ్డా కిషన్‌రెడ్డీ.. ఎస్సీలు, ఎస్టీలు, బీసీల మద్దతు లేకుండా సికింద్రాబాద్‌లో నామినేషన్ వేయగలరా? బీసీల పేరిట గెలిచిన బండి సంజయ్, ఇప్పుడు కిషన్‌రెడ్డికి వత్తాసు పలకడం సిగ్గుచేటు. బీజేపీ నేతలు చేతగాని దద్దమ్మలు. తెలంగాణ అసెంబ్లీలో బీసీ బిల్లుకు ఓటు వేసిన ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఇప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారు?..'అని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ మండిపడ్డారు.

రేవంత్ సాహసం చేస్తారని ఊహించలేదు: మీనాక్షి నటరాజన్



'భూదానోద్యమంలో ఒక రెడ్డి సామాజిక వర్గానికి చెందిన భూస్వామి భూముల్లేని పేదవారి కోసం తన భూమిని దానం చేశారు. ఇప్పుడు ఒక రెడ్డి ముఖ్యమంత్రి వెనుకబడిన వర్గాల మేలు కోసం గళం ఎత్తారు. తొలిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వ్యక్తి ఇలాంటి సాహసం చేస్తారని ఎవరూ ఊహించలేదు. కానీ సీఎం రేవంత్‌రెడ్డి సాహసోపేతమైన అడుగు వేశారు..'అని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ చెప్పారు.

బీసీ రిజర్వేషన్లు ఎవరికీ వ్యతిరేకం కాదు: పొన్నం ప్రభాకర్



'బీసీ రిజర్వేషన్లు ఎవరికీ వ్యతిరేకం కాదు. అన్ని రంగాల్లో బీసీలకు న్యాయం చేయడం కోసం చట్టసభలో బిల్లు చేసి రాష్ట్రపతికి పంపాం. లక్ష్య సాధన కోసం ఐక్యంగా పోరాటాలు చేద్దాం..'అని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.

కేంద్రం మెడలు వంచుతాం: ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



'బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించిన ఫైలు 4 నెలలుగా రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉంది. ఏది ఏమైనా కేంద్రం మెడలు వంచుతాం. సామాజిక న్యాయం కోసం ఎంతవరకైనా పోరాడతాం..'అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు.

కేంద్రం కళ్లు తెరవాలి: దామోదర రాజనర్సింహ



'తెలంగాణ ప్రజల కోసం రాజకీయాలకు అతీతంగా బిల్లులు తెచ్చాం. 4 నెలలు అవుతున్నా కేంద్రం స్పందించడం లేదు. ఇప్పటికైనా కళ్లు తెరవాలి. మా ఆవేదనను, నిబద్ధతను అర్థం చేసుకోవాలి..'అని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు.

బీజేపీపై ఒత్తిడి తెస్తాం: శ్రీధర్‌బాబు



'బీసీ వర్గాలకు న్యాయం జరిగే వరకు బీజేపీపై ఒత్తిడి తెస్తాం. రాష్ట్రపతి సమయం ఇస్తారని ఆశిస్తున్నాం. రిజర్వేషన్ల కోసం చట్టాన్ని తెచ్చిన కాంగ్రెస్‌ను విమర్శించే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదు..'అని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు.

మోదీ డీఎన్ఏలో బీసీ వ్యతిరేకత ఉంది: సీతక్క



'ప్రధాని మోదీ పేరుకే బీసీ. ఆయన డీఎన్ఏలో మాత్రం బీసీ వ్యతిరేకత ఉంది. ప్రధాని మోదీ నరనరాన బీసీ, అట్టడుగు వర్గాల వ్యతిరేక భావజాలం ఉంది. అందుకే పీఎంఓలో బీసీ అధికారులు లేరు..'అని మంత్రి సీతక్క మండిపడ్డారు.

బీజేపీ బీసీ నేతల గొంతు ఏమైంది?: కొండా సురేఖ



'ఎమ్మెల్సీ కవిత బీసీల గురించి మాట్లాడుతుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లుంది. బీసీ బిల్లు అసెంబ్లీలో ప్రవేశ పెట్టినపుడు బీజేపీ ఎమ్మెల్యేలు మద్దతు పలికారు. ఇప్పుడు వారి గొంతు ఏమైంది?..'అని మంత్రి కొండా సురేఖ ప్రశ్నించారు.

కేంద్రం దిగిరావాలి: అడ్లూరి లక్ష్మణ్




'42 శాతం రిజర్వేషన్ల బిల్లులను రాష్ట్రపతికి పంపాం. కేంద్రం దిగివచ్చి బీసీ రిజర్వేషన్ల అమలుకు చొరవ చూపించాలి..'అని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కోరారు.

ఔర్ ఏక్ ధక్కా.. 42% పక్కా: వాకిటి శ్రీహరి



'మన హక్కుల కోసం మనమే ఐక్యంగా పోరాడాలి. ఔర్ ఏక్ ధక్కా..42 పర్సంటేజ్ పక్కా. తెగించి పోరాడితే తప్ప రిజర్వేషన్లు సాధించలేం..'అని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు.

కాంగ్రెస్ ఉద్యమంతో మోదీ కదలాలి: గౌరవ్ గొగోయ్



'ఈ బీసీ నినాదం ప్రధాని మోదీని కదిలించాలి. బీసీలకు న్యాయం జరిగే వరకు రాహుల్, ఖర్గేలు వెనక్కి తగ్గరు. పార్లమెంట్ నుంచి వీధుల వరకు దీనిపై కొట్లాడుతూనే ఉంటాం..'అని కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ స్పష్టం చేశారు.

బీజేపీ రాష్ట్రాల హక్కులు హరిస్తోంది: కనిమొళి



'గవర్నర్ వ్యవస్థను అడ్డుపెట్టుకొని బీజేపీయేతర రాష్ట్రాలను ఆ పార్టీ ఇబ్బందులకు గురిచేస్తోంది. అన్ని పార్టీలు కలిసి దీనిని ఎదుర్కొందాం. 42 శాతం బీసీ రిజర్వేషన్ల విషయంలో మేము తోడుగా ఉంటాం..'అని డీఎంకే ఎంపీ కనిమొళి చెప్పారు.

తెలంగాణ మోడల్‌ను దేశవ్యాప్తం చేయాలి: ధర్మేంద్ర యాదవ్



'బీసీ రిజర్వేషన్లకు సంబంధించి తెలంగాణ మోడల్‌ను దేశ వ్యాప్తంగా అమలు చేయాలి. ఈ మోడల్‌ను అనుసరించే కులగణన చేపట్టాలి. తెలంగాణ బిల్లులను బీజేపీ ఆమోదించాలి..'అని ఎస్పీ ఎంపీ ధర్మేంద్ర యాదవ్ డిమాండ్ చేశారు.

నేడు జాతీయ చేనేత దినోత్సవం

చేనేత రంగంలో 70 శాతం శ్రమ మహిళలదే. బ్లీచ్ చేయడం, ఆసుపోయడం, డిజైన్ కట్టడం, రంగులద్దడం, ఆసు మిషన్ మీద దారాలను అమర్చడం, చిటికి కట్టడం, కండె చుట్టడంతోపాటు వార్ప్ వంటి పనులన్నీ మహిళలే చేస్తారు. మగ్గం మీద నేత ప్రధానంగా మగవాళ్లు చేస్తారు. ఆసక్తి ఉన్న మహిళలు కూడా నేస్తారు. మహిళ సహాయం లేనిదే మగ్గం మనుగడ సాగదు. నేతకారులకు సహాయకులుగా, స్వయంగా నేతకారులుగా, డిజైనర్‌లుగా, బిజినెస్ విమెన్, కమ్యూనిటీ లీడర్‌లుగా కీలకపాత్ర పోషిస్తున్నారు.

2015లో ప్రభుత్వం జాతీయ చేనేత దినోత్సవాన్ని ప్రకటించింది. చేనేత దినోత్సవంగా ఆగస్టు 7వ తేదీని ఎందుకు ఎంచుకున్నారంటే... స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా 1905లో ఈ రోజున విదేశీ వస్త్రాలను బహిష్కరిస్తూ స్వదేశీ ఉద్యమం ప్రారంభమైంది.



● చేనేత దుస్తుల్లో మిస్ వరల్డ్ బ్యూటీ పాజంట్‌లు (ఫైల్ ఫొటో)

మగ్గం వెనుక ఆమె శ్రమ

ఇది స్కిన్ ఫ్రెండ్లీ

సంప్రదాయ చేనేతను మోడరన్ బిజినెస్‌గా మారుస్తూ చేనేతరంగానికి దోహదం చేస్తున్న మహిళల్లో స్వాతి మఠం ఒకరు. ఐఐటీ బాంబేలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసి డెలాయిట్, మైక్రోసాఫ్ట్ కంపెనీల్లో ఉద్యోగం చేసిన స్వాతి ప్రస్తుతం చేనేతరంగంలో కెరీర్‌ను విజయవంతం చేసుకున్నారు. తన పాపాయికి ఒంటికి మెత్తగా ఉండే దుస్తులు కావాలి, వాటికి ఫంక్షన్ లుక్ ఉండాలి, బ్రైట్‌గా కలర్‌ఫుల్‌గా ఉండాలి. ఎన్ని షాపులు తిరిగినా ఈ లక్షణాలన్నీ ఒక డ్రస్‌లో దొరకకపోవడంతో సొంతంగా నారాయణపేట్ మెటీరియల్‌తో స్వయంగా డిజైన్ చేశారామె. ఆ ప్రయత్నమే ఆమెను ఎంటర్‌ప్రెన్యూర్‌ను చేసింది. హ్యాండ్‌లూమ్ ప్రమోటర్‌గా గుర్తింపునిచ్చింది. చేనేత వస్త్రాలను ఫ్యాషనబుల్ డిజైనర్‌వేర్‌గా తీర్చిదిద్దడం ఆమె ప్రత్యేకత. ఫ్యాషన్ డిజైనింగ్ చేసిన కొత్త తరం యువతులు ఆమెతో పని చేస్తున్నారు. క్రియేటివ్ డిజైన్‌కు చేనేతను మించిన ఫ్యాబ్రిక్ మరొకటి ఉండదని చెబుతున్నారీ యువతులు. శ్రీకాళహస్తి కలంకారీ పనితనాన్ని ప్రపంచదేశాలకు విస్తరింపచేస్తున్నారు వాళ్లు. మిస్ ఇండియా పోటీలకు హైదరాబాద్‌కు వచ్చిన బ్యూటీ పాజంట్‌లకు చేనేత డ్రెస్‌లు డిజైన్ చేశారు.



మన చేనేతకు ప్రశంసలు

ఏడేళ్ల కిందట హైదరాబాద్‌లో డిజైనర్ వేర్ యూనిట్‌ను ముగ్గురితో ప్రారంభించాను. కొన్నాళ్లకు దానికి సిస్టర్ ఆర్గనైజేషన్‌గా చేనేతలతో క్యాజువల్ వేర్ యూనిట్ ప్రారంభించాను. ఇప్పుడు 90 మందికి జీతాలిస్తున్నాను. ఒకప్పుడు చేనేత అంటే చిన్నచూపు ఉండేది. కానీ ఇప్పుడు చేనేత దుస్తులు ధరించడానికి సెలబ్రిటీలు కూడా ఉత్సాహంగా ఉన్నారు. రెండు యూనిట్స్‌కి అవసరమైన రా మెటీరియల్ కోసం నెలకు ఆరేడు లక్షల రూపాయలు చేనేతకారులకు ఇస్తున్నాం. చేనేతను విశ్వవ్యాప్తం చేయడంలో నా పాత్ర కూడా ఉన్నందుకు సంతోషంగా ఉంది.

– స్వాతి మఠం, హ్యాండ్‌లూమ్ ప్రమోటర్

మగ్గం ఇంజనీరింగ్ అద్భుతం

మగ్గంతో ఇంద్రధనస్సులాంటి రంగుల జీవితాన్ని ఎంచుకున్న వాళ్లలో తెలంగాణ, యాదాద్రి భువనగిరి జిల్లా, పోచంపల్లికి చెందిన నవనీత ఒకరు. ఆమె తొలిసారి మగ్గాన్ని చూసింది అత్తవారింట్లో. మగ్గం వెనుక హిడెన్ ఇంజనీరింగ్ ఉంది. పాదంతో తొక్కితే ఒక కదలికకు అనుబంధంగా ఆరు చోట్ల కదులుతూ దారం వస్త్రంగా రూపుదిద్దుకుంటుంది. ఆసక్తిగా అనిపించి భర్త దగ్గర నేత పని నేర్చుకున్నారామె. గత తరం మహిళలు ఇంటి నాలుగ్గోడల మధ్య సహాయకపనులకే పరిమితమయ్యారు. ఈ తరం నేతకార మహిళలు వస్త్రాలను వాట్సాప్ గ్రూపులు, ఇన్‌స్టాలో మార్కెట్ చేస్తున్నారు. రీటైలర్స్, బొటిక్ నిర్వాహకులతో సమన్వయం చేసుకుంటున్నారు. చీర మగ్గం మీద ఉండగానే ఫొటోలు అప్‌లోడ్ చేయడంతో చీర పూర్తయ్యేలోపు కొనేవాళ్లు సిద్ధంగా ఉంటున్నారు.



బ్యూటీ పాజంట్స్‌కు దుపట్టా

"వియ్‌హబ్‌లో సభ్యత్వం తీసుకోవడంతో నా ఉత్పత్తులకు మంచి కూడలి లభించింది. మిస్ వరల్డ్ పోటీల కోసం వచ్చిన బ్యూటీ పాజంట్‌లకు బహూకరించడానికి పాతిక ఇకత్ దుపట్టాలిచ్చాను. ప్రభుత్వం ఈ కళను ఒక కోర్సుగా రూపొందించి కొత్తతరం చేనేతకారులకు శిక్షణనిస్తే ఈ కళను మరింత సమగ్రంగా నేర్చుకునే అవకాశం ఉంటుంది. ఎందుకంటే మా మామయ్యకు తెలిసిన కళలో నా భర్త నేర్చుకున్నది సగమే. తరానికీ తరానికీ జ్ఞానం లుప్తమై పోకుండా మరింతగా విస్తరింపచేయాలి."

– నవనీత, వీవర్స్ క్లబ్ హ్యాండ్‌లూమ్స్

అత్త నేర్పించింది

తెలంగాణ, నారాయణపేట జిల్లా పుల్లంపల్లికి చెందిన శృతిక... తన అత్తగారి దగ్గర మగ్గం పని నేర్చుకున్నారు. గతంలో చేనేత ఏ మాత్రం గిట్టుబాటు అయ్యేది కాదు. చేనేతను ప్రమోట్ చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న తర్వాత పరిస్థితులు మెరుగయ్యాయి. ఆన్‌లైన్ క్లాసులు, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లతో చేనేతకారులు మెళకువలు నేర్చుకుంటున్నారు. చీరల దగ్గరే ఆగిపోకుండా చుడీదార్, లంగాఓణీ సెట్‌లు డిజైన్ చేస్తున్నారు.



నెలకు 30 వేలు

చేనేతను ప్రోత్సహించడం కోసం ప్రభుత్వం ఎగ్జిబిషన్‌లను నిర్వహిస్తోంది. మహిళాశక్తి బజార్ మాకు ఉపయోగంగా ఉంది. ఎగ్జిబిషన్‌లో స్టాల్, బస ఉచితం. నేను ఢిల్లీ, కోల్‌కతా, ముంబయిలో కూడా స్టాల్ పెట్టాను. ఇల్లు దాటి బయటకు రావడం చేతకాని మాలాంటి వాళ్లకు ఈ సౌకర్యాలు బాగా ఉపయోగపడుతున్నాయి. మంచి చీర నేస్తే మాకు పదివేలు మిగులుతాయి. గట్టిగా పని చేస్తే నెలకు మూడు చీరలు నేయవచ్చు. సమాజంలో గౌరవప్రదంగా జీవించగలుగుతున్నాం. మాకు పని కల్పించడం కోసం... ప్రభుత్వం ప్రముఖులకు సత్కారం చేసే శాలువాల ఆర్డర్‌లు కూడా భారీగానే ఇస్తోంది.

– శృతిక, చేనేతకారిణి. శ్రీ భక్త మార్కండేయ టెక్స్‌టైల్స్

– వాకా మంజులారెడ్డి

● దృష్టి

రంగు మానేశాక స్వేచ్ఛ లభించింది

వెండి తెర నటీమణులు తమ వయసును దాచుకోవాలి. వయసును దాచాలంటే జుట్టుకు రంగు వేయాల్సిందే. అయితే బహుశా దేశంలో జుట్టుకు రంగు వేయడం మానేసిన తొలినటి రత్నా పాఠక్. స్త్రీ ఏ రంగంలోనైనా రాణించాలంటే రూపం కంటే కూడా ప్రతిభ, శరీరానికి ఇచ్చే తర్ఫీదు, దృష్టి ముఖ్యమని అంటారామె. రంగు వేయడం మానేశాక అవకాశాలు తగ్గినా వయసును యాక్సెప్ట్ చేయడంలో స్థిమితం ఉందంటున్నారామె. తాజాగా బీబీసీకి ఇచ్చిన ఇంటర్వ్యూ విశేషాలు...



బాలీవుడ్‌లో క్యారెక్టర్ ఆర్టిస్టుగా అందరికీ తెలిసిన దీనా పాఠక్ కుమార్తె రత్న పాఠక్ టీవీ, సినిమా రంగంలో పని చేస్తున్నారు. ఆమె నటించిన 'సారాభాయ్ వెర్సస్ సారాబాయ్' టీవీ సీరియల్ విశేష ఆదరణ పొందింది. 'లిప్‌స్టిక్ అండర్ మై బుర్ఖా'. 'థప్పడ్','ధక్‌ధక్' సినిమాల్లో ఆమె నటన అందరికీ గుర్తుంటుంది. సుప్రియ పాఠక్, రత్న పాఠక్ అక్కచెల్లెళ్లు. నసీరుద్దిన్ షాను వివాహం చేసుకున్న రత్నపాఠక్ విలక్షణమైన పాత్రలతో దేశ విదేశాల్లో అవార్డులెన్నో పొందారు. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో తన కెరీర్ గురించి, స్త్రీల గురించి మాట్లాడారు.

ఆడపిల్లలే: 'మా అమ్మ దీనా పాఠక్‌కు మేము ఇద్దరమే ఆడపిల్లలం. మా నానమ్మ మా ఇద్దరినీ చూసి– పాఠక్ వంశాన్ని ముందుకు తీసుకెళ్లే మగ నలుసే లేదే అని నెత్తి కొట్టుకునేది. అయితే నేను, సుప్రియా నటనా రంగంలో రాణించి పాఠక్ వంశ ఘనతను కాపాడాం. మా అమ్మ, నాన్న ఫలానాది చేయొద్దు అని ఎప్పుడూ చెప్పలేదు. ఆడపిల్ల అనే కారణాన అడ్డుకోలేదు. చదువులో, కెరీర్‌లో ఎంత దూరం వెళ్లగలిగితే అంత దూరం వెళ్లనిచ్చారు. చిన్నప్పటి నుంచి మాకు పుస్తకాలు చదవడం అలవాటు చేశారు. మా నాన్న ఢిల్లీ నుంచి కార్లు తెచ్చి ముంబైలో అమ్మేవారు. ఆయన కార్ల కోసం బయలుదేరినప్పుడల్లా మేము కూడా వెళ్లేవాళ్లం. ఆ ప్రయాణాలు కూడా మాకు మంచి చదువును ఇచ్చాయి' అంటారామె.

నటన అంటే: 'నటనలో నాకు గురువు మా అమ్మ. అయితే ఆమె ప్రతిభకు తగ్గ పాత్రలు రాలేదనే అనుకుంటాను. నేను నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామాలో మూడేళ్లు నటన నేర్చుకున్నాను. ఒక నటికి కావాల్సింది మనసును, మెదడును డైలాగ్‌కెలా సిద్ధం చేయాలో తెలియడమే. మంచి రూపం బోనస్ కావచ్చు కాని అదే నటనకు అర్హత కాదు. మంచి నటి తన శరీరాన్ని కూడా ఎక్స్‌ప్రెసివ్‌గా మారుస్తుంది. ఆంగికాభినయం ముఖ్యం. నటి అందంగా కంటే దృఢంగా ఉండాలి. నాకు ఇప్పుడు ఏమనిపిస్తుందంటే నేను శరీరాన్ని మరింత దృఢంగా ఉంచుకోవడంలో నిర్లక్ష్యం చేశానని. నటులకు ఈ నిర్లక్ష్యం పనికి రాదు'. అని చెప్పారు రత్నా పాఠక్.

'నేను నటిగా కెరీర్ మొదలైన రోజుల్లో స్త్రీలకు వయసు ఉన్నంత కాలమే పాత్రలు ఉంటాయి. తర్వాత వారు తెర మరుగు అవడమే అనుకునేదాన్ని. కాని నన్ను నటిగా కలకాలం నిలబెట్టేది నా నటనా నైపుణ్యమే తప్ప రూపం, వయసు కావు అని అర్థం కావడానికి చాలా కాలం పట్టింది' అంటారు రత్న పాఠక్.

జుట్టుకు రంగు మానేశాక: 'నటీమణులు తెల్ల జుట్టులో కనిపించడానికి ఇష్టపడరు. నేనూ ఇష్టపడను. కాని తలకు రంగు వేయడం అనేది ఒక ప్రహసనం. రంగు వేసి వేసి శారీరక ధర్మాల నుంచి ఎంతకాలం దూరం వెళ్లగలం అనిపించింది. నసీరుద్దీన్ షా కూడా రంగు మానేసి చూడు... నిన్ను నీలా యాక్సెప్ట్ చెయ్ హాయిగా ఉంటుంది అని ప్రోత్సహించాడు. రంగు మానేశాను. తెల్లటి జుట్టుతో కనిపిస్తుంటే ముందు మార్కెట్ పోతుంది... నాక్కూడా పోయింది. ఎందుకంటే నాతో నటించే నా వయసు మగ నటులు కూడా రంగు వేసుకుంటున్నారు. అయినా సరే నాకొచ్చే పాత్రలు నాకొచ్చాయి. నేను రంగు నుంచి స్వేచ్ఛ పొందాను. మనకు ప్రతిభ ఉంటే రూపం అడ్డు నిలవదు.

ఆధునికత అంటే ఎదుటివారిని ఎలా చూస్తున్నావు, ఎలా అర్థం చేసుకుంటున్నావు అనే సంస్కారం పెరగడమే. అలాగే ఈ కాలపు కుర్రకారు మాటలు అప్పుడప్పుడు చెవిన పడుతుంటాయి. అమ్మాయిలు, అబ్బాయిలు ప్రతి మాటలో బూతులు మాట్లాడుతున్నారు. ఇది ఆధునికత అయితే నాకు గతకాలమే మేలు అనిపిస్తుంది. కాసింత మర్యాద, గౌరవం, పద్ధతీ పాడూ వద్దా ఈ కాలం పిల్లలకు?' అని ముగించారామె.

● మన(సు)లో మాట

మీ జీవితం... మీ హక్కు!

నాకు 62 ఏళ్లు. నేనొక రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగిని. నా భార్యకి క్యాన్సర్ ఉండేది. ఐదు సంవత్సరాల క్రితం కోవిడ్ సమయంలో చనిపోయింది. పిల్లలిద్దరూ వాళ్ల భర్తలతో వేరే దేశాలలో స్థిరపడ్డారు. నా భార్యకి సహాయం చేయడం కోసం, ఇంట్లో వంట చేయడం కోసం ఒక ఆవిడ పది సంవత్సరాల నుండి మా ఇంట్లో పని చేస్తోంది. ఆవిడ భర్త తాగుబోతు, ఆమెని వదిలేశాడు. ఆమెకు ఒక పెళ్లీడు వచ్చిన అమ్మాయి ఉంది. నా భార్య చనిపోయాక తను నాకు తోడుగా ఉంటోంది. మేమిద్దరం పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకున్నాము. తాను నా నుంచి ఏమీ ఆశించకపోయినా, తన కూతురి పెళ్లి కోసం ఒక 5 లక్షలు ఇవ్వాలని నిర్ణయించుకున్నాను. కానీ నా పిల్లలు ఆవిడని పెళ్ళి చేసుకోవడానికి, ఆవిడకి ఆర్థిక సహాయం చేయడానికి ఒప్పుకోవట్లేదు. నన్ను ఏదైనా వృద్ధాశ్రమంలో ఉండమని చెప్తున్నారు. నాకు పెన్షన్ వస్తుంది. నేను ఇప్పుడు ఆరోగ్యంగానే ఉన్నాను. నేను ఇష్టంగా కట్టుకున్న ఇంట్లో నా అన్న వాళ్ళతో చివరిదాకా ఉండి, కన్నుమూయాలని కోరిక – పిల్లలు వచ్చి నాతో ఉండలేరు. అలా అని నన్ను వాళ్ళ దగ్గరికి తీసుకెళ్లి వాళ్లతో ఉంచుకోలేరు. ఈ వయసులో నాకు కావలసింది ఒక తోడు, నాకు వేరే ఎలాంటి ఉద్దేశాలు లేవు. కానీ పిల్లలు మా చుట్టాలకు ఫోన్ చేసి చాలా ఘోరంగా మాట్లాడుతున్నారు. ఈయనకి ఈ వయసులో ఇదేం పాడు ఆలోచన అని. ఈ వయసులో ఒంటరితనాన్ని దూరం చేసుకోవడం కోసం ఒక తోడు కావాలని అనుకోవడం తప్పా? నా పిల్లల కోసం నా ఆలోచన మార్చుకుని వృద్ధాశ్రమంలో ఉండమంటారా, నాకు సరైన సలహా ఇవ్వగలరు!

– సత్యనారాయణ, హిందూపూర్

ముందుగా మీసమస్యని ధైర్యంగా మాతో పంచుకున్నందుకు అభినందనలు, బంటరితనం మనిషిని ఎంతో కుంగదీస్తుంది ఈ వయసులో మీరు ఒంటరిగా ఉండకుండా, ఒక తోడుంటే బాగుంటుందని అనుకోవడం తప్పేం కాదు! ఓ భర్తగా, తండ్రిగా, మీ బాధ్యతలన్నీ ఏ లోటూ లేకుండా నిర్వర్తించారు.. రిటైర్మెంట్ తర్వాత ప్రశాంతంగా ఉండాలని అనుకుంటున్నారు. మీరు చెప్పిన దాని ప్రకారం మీ పిల్లలు తమ జీవితాల్లో బిజీగా ఉండటం వల్ల వాళ్లు మిమ్మల్ని చూసుకోలేరు. అదే సమయంలో మిమ్మల్ని వృద్ధాశ్రమంలో ఉండాలని చెప్పే అధికారం వాళ్ళకి లేదు. మీరు చెప్పినావిడ మిమ్మల్ని బాగా చూసుకుంటుంది, మీరు ఆమెని మీ జీవిత భాగస్వామిగా కోరుకోవడం. తనకి ఎంతో కొంత ఆర్థికంగా సహాయం చేయాలని అనుకోవడం ఇవన్నీ మంచి విషయాలే. అయితే ఇదే సమయంలో పిల్లలనుండి వ్యతిరేకత లేకుండా వీలైనంత సామరస్యంగా ఈ సమస్యని పరిష్కరించుకోవడం ముఖ్యం. బహుశా తమ తల్లి స్థానాన్ని ఇంకొకరికి ఇవ్వడం వాళ్ళకి ఇష్టం ఉన్నట్లుగా లేదు. అలాగే వాళ్ళకి ఆర్థికపరమైన అభద్రతా భావం కూడా ఉండి ఉండవచ్చు. పెళ్ళి తర్వాత మీరు వాళ్ళకి దూరం అవుతారనే ఆలోచన కూడా ఉండొచ్చు. మీ చుట్టాల్లో ఒక తటస్థ వ్యక్తిని మధ్యవర్తిగా ఉంచి, వాళ్ళకున్న ఇబ్బంది ఏంటో స్పష్టంగా కనుక్కోండి. మీ పిల్లలకు ఆమోదయోగ్యంగా ఉండేలా ఒక వీలునామా రాయండి. మీరు వివాహం చేసుకునే ఆవిడ మీ నుండి ఏమీ ఆశించలేదంటున్నారు కాబట్టి ఆవిడ అభ్యంతరం చెప్తుంది అని నేను అనుకోవట్లేదు. ఒకవేళ ఆవిడ ఏదైనా పేచీ పెడితే మీకు అక్కడే ఆవిడ ఉద్దేశ్యం అర్థం అవుతుంది. అప్పుడు మీరు మీ నిర్ణయాన్నీ పునరాలోచన చేయవచ్చు. ఆమె మీ నిర్ణయాన్ని సంతోషంగా ఒప్పుకుంటే ఆమెను నిరభ్యంతరంగా వివాహం చేసుకోవచ్చు. మీ వివాహాన్ని రిజిస్టర్ చేయించుకోండి. తద్వారా ఆమె భవిష్యత్తుకి కూడా కొంత భరోసా కల్పించిన వారవుతారు. ప్రతియేటా కొంతకాలం మీ పిల్లలతో గడిపేలా ఏర్పాట్లు చేసుకోండి.. మీ జీవితంలో మీ పిల్లల స్థానం పదిలంగా ఉందన్న ఆశ, నమ్మకం వారికి కలుగుతాయి.. ఇవన్నీ చేసినా కూడా మీ పిల్లలు మిమ్మల్ని ఇంకా ఇబ్బంది పెడుతుంటే, ఇంక మీరు వాళ్ళ గురించి పట్టించుకోవాల్సిన అవసరం లేదు. వృద్ధాప్యంలో ఒక గౌరవ ప్రదమైన జీవితం గడపాలనుకోవడం మీకున్న హక్కు. సమాజం కోసమో, మీ పిల్లలు బాధపడతారనో దాన్ని మీరు త్యాగం చేయాల్సిన అవసరం లేదు. కాబట్టి మీరు తీసుకునే నిర్ణయం గురించి ఎలాంటి అపరాధనా భావన లేకుండా ముందుకు వెళ్ళండి. ఆల్ ది బెస్ట్!



డా. ఇండ్ల విశాల్ రెడ్డి, సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ.
మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన
మెయిల్ ఐడీ: sakshifamily3@gmail.com

మెన్స్ వరల్డ్

● గ్రీన్ ఆల్టర్‌నేటివ్

నాన్నగారి కొలను



చార్టర్డ్ ఎకౌంటెంట్ వికాస్ కుమార్ తన బాల్యజ్ఞాపకాల్లోకి వెళ్లినప్పుడల్లా కొంగల రెక్కల చప్పుడుతో ఊరి చెరువు ప్రత్యక్షమయ్యేది. ఆ చెరువులో తాను ఎన్నో సార్లు ఈత కొట్టాడు. అలాంటి అద్భుతమైన అనుభవం ఈతరం పిల్లలకు దూరం కావడం అతడికి బాధగా ఉండేది. ఆ బాధలో నుంచి పుట్టిందే... ఎకో ఫ్రెండ్లీ కొలను! కోయంబత్తూరులో ఉంటున్న వికాస్ సమీపంలోని చెరువుల్లో తన పిల్లాడికి ఈత నేర్పించాలనుకున్నాడు. అయితే మురికి, రసాయనాలతో కూడిన చెరువులు అతడిని భయపెట్టాయి. అలా అని ఆయన ఊరకే ఉండిపోలేదు. పొల్లాచ్చిలోని తన స్వంత వ్యవసాయక్షేత్రంలో సెల్ఫ్–క్లీనింగ్ పాండ్‌ను నిర్మించాడు. దీనికి ముందు యూరప్‌లో ప్రసిద్ధి పొందిన ఎకో–ఫ్రెండ్లీ బయో స్విమ్ పాండ్స్ గురించి అధ్యయనం చేశాడు. తన వ్యవసాయక్షేత్రంలో సెల్ఫ్–క్లీనింగ్ పాండ్‌ను నిర్మించడానికి మాత్రమే పరిమితం కాలేదు వికాస్. మన దేశ వాతావరణం, జీవనశైలికి అనుగుణంగా బయో స్విమ్మింగ్ కొలనులను నిర్మించడానికి 'బయోస్పియర్' అనే కంపెనీ ప్రారంభించాడు. ఈ కంపెనీ సహజసిద్ధమైన జలపాతాలు, కొలనులకు రూపకల్పన చేస్తోంది. 'మాకు మీలాంటి కొలను ఒకటి కావాలి' అని తమ పిల్లలతో తల్లిదండ్రులు వచ్చినప్పుడు వికాస్‌కు కలిగే సంతోషం అంతా ఇంతా కాదు. ఆ సంతోషం తన కంపెనీకి వచ్చే లాభాల గురించి కాదు. పర్యావరణ హిత, రసాయన రహిత కొలనుల గురించి వారు ఆలోచన చేస్తున్నందుకు!

● పర్యావరణ హిత

ఒకప్పుడు... ఎటు చూసినా చెత్తే ఇప్పుడు... ఎటు చూసినా పచ్చదనమే!



ఒకప్పుడు యూపీలోని నోయిడాలో డంపింగ్ గ్రౌండ్‌ల చుట్టుపక్కల నివసించే ప్రజలు ఎదుర్కొన్న సమస్యలు ఇన్నీ అన్నీ కావు. అపరిశుభ్రత రాజ్యమేలే ఆ ప్రదేశాల సమీపంలో నడవాలంటే దుర్వాసన భరించడం కష్టంగా ఉండేది. చెత్తపడేసేవాళ్లకు, చుట్టుపక్కల వాళ్లకు ఎప్పుడూ ఏవో తగాదాలు జరుగుతూనే ఉండేవి. ఈ పరిస్థితిలో సమూలంగా మార్పు తీసుకురావడానికి సేఫ్ (సోషల్ యాక్షన్ ఫర్ ఫారెస్ట్ అండ్ ఎన్విరాన్‌మెంట్) అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా సమూల మార్పు తీసుకువచ్చాడు విక్రాంత్ టోంగాడ్. 'ఈ స్థలం ఇక ఎందుకు పనికి రాదు' అనుకున్న స్థలాన్ని పచ్చదనంతో కళకళలాడేలా చేశాడు. దీనికి ముందు ఘజియాబాద్‌లో వ్యర్థాలు పడేసే ప్రదేశాలను ఆహ్లాదకరమైన ప్రదేశాలుగా మార్చాడు. స్వచ్ఛంద కార్యకర్తల భాగస్వామ్యం, సీఎస్ఆర్(కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) ఫండింగ్‌తో చెత్త వేయడానికి తప్ప ఎందుకు పనికిరాదు అనుకున్న పది ఎకరాల స్థలంలో వ్యర్థాలు లేకుండా చేశాడు. వందల కిలోల ప్లాస్టిక్‌ను రీసైకిల్‌కు ఉపయోగించాడు. ప్లాస్టిక్ బెంచీలు తయారుచేయించాడు. మొక్కలు నాటడం మొదలుపెట్టాడు. రెండు మూడు సంవత్సరాల వ్యవధిలో ఎక్కువ చెట్లు పెంచేలా జపనీస్ 'మియావాకీ మెథడ్'ను అనుసరించాడు. 'ఒక్కడే కష్టపడుతున్నాడు' అన్నట్లుగా ఉండేది ఒకప్పుడు విక్రాంత్ పరిస్థితి. అయితే స్థానికులు అతడికి తోడయ్యారు. దీంతో విక్రాంత్ పని సులువు అయింది. ఒకప్పుడు 'ఎటు చూసినా చెత్తే' అన్నట్లుగా ఉండే ప్రదేశాలు ఇప్పుడు 'ఎటు చూసినా పచ్చదనమే' అన్నట్లు మారాయి.

● స్టడీ

ఈ పక్షుల విడాకుల గురించి ముందే తెలిసిపోతుంది!



మనుషుల సామాజిక సంబంధాలు, భార్యాభర్తల మధ్య ఉండే అనుబంధాలు, అలకల గురించి మనకు చాలానే తెలుసు. మరి పక్షుల సంగతి? అనుబంధాలు, ఆప్యాయతలు సరే...వాటిలో కూడా కయ్యాలు, విడిపోవడాలు ఉంటాయా? వాటి సంకేతాలు ఏమిటి?... మొదలైన కోణాలలో 'గ్రేట్ టిట్' పక్షులపై అధ్యయనం జరిగింది. 'యూనివర్శిటీ ఆఫ్ ఆక్స్‌ఫర్డ్' పరిశోధకులు 'యూనివర్శిటీ ఆఫ్ లీడ్స్' సమన్వయంతో ఈ అధ్యయనాన్ని నిర్వహించారు. ఈ అధ్యయనం ద్వారా తెలిసిన కీలక విషయం... 'ఒక పక్షుల జంట విడిపోవడానికి సంబంధించిన సంకేతాలు బ్రీడింగ్ సీజన్ కంటే చాలా ముందుగానే కనిపిస్తాయి' గతంతో పోల్చితే పక్షుల జంట తక్కువ సమయం మాత్రమే కలిసి ఉండడం, ఎప్పుడో ఒకసారి కలుసుకోవడం... మొదలైనవి అవి విడిపోబోతున్నాయి అని చెప్పడానికి సంకేతాలు. పక్షుల ప్రపంచంలో కొన్ని జంటల అనుబంధాలలో మార్పు రాకుండా, విడిపోకుండా ఉండగలగడానికి కారణం ఏమిటి? కొన్ని జంటలు మాత్రం బ్రీడింగ్ సీజన్‌కు ముందు ఎందుకు విడిపోతాయి? అనే విషయంలో స్పష్టత లేకపోయినప్పటికీ నాన్–బ్రీడింగ్ సీజన్‌లో పక్షి జంటల ప్రవర్తన ఆధారంగా భవిష్యత్ కాలంలో అవి కలిసి ఉండబోతున్నాయా? విడిపోబోతున్నాయా? అనేది స్పష్టంగా చెప్పవచ్చు అంటున్నారు పరిశోధకులు.

● లైఫ్‌స్టైల్

స్టుపిడ్ కాదు సూపర్ కపుల్!



మాది 'జీరో కాస్ట్ ఆఫ్ లివింగ్' అంటారు కావ్య, సంగీత్ దంపతులు. ఈ మాట చాలామందికి కొత్త, వింత. కొందరైతే 'ఈ దంపతులకు మతి చెడింది' అని గుసగుసగా అనుకొని 'స్టుపిడ్ కపుల్' అని నామకరణం చేశారు. అయితే కావ్య, సంగీత్‌ల జీవనశైలిని వివరంగా తెలుసుకున్నాక మాత్రం వారిని అభినందించకుండా ఉండలేకపోయారు. వారిని ఆదర్శంగా తీసుకోవాలనుకున్నారు. ఇంతకీ ఏమిటీ జీరో కాస్ట్ ఆఫ్ లివింగ్? కావ్య, సంగీత్ దంపతులు కట్టుకున్న ఇంటి పేరు... జీరో కాస్ట్ ఆఫ్ లివింగ్! ఇది ఇంటిపేరు మాత్రమే కాదు...వారి ఆదర్శవంతమైన జీవనశైలిని సూచించే పేరు. స్వయం సమృద్ధిగా తమ ఇంటిని తీర్చిదిద్దుకున్నారు. కూరగాయలు తామే పండించుకుంటారు. కొలనులో చేపలు పెంచుతున్నారు. గుడ్ల నుంచి పాలు, తేనె వరకు బయటికి వెళ్లాల్సిన అవసరమే వారికి ఉండదు. 'వ్యర్థం నుంచి ఇంధనం' అనే కాన్సెప్ట్‌లో భాగంగా బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు చేసుకున్నారు. ఒక గదిలో ప్రత్యేకంగా పుట్టగొడుగులు పెంచుతున్నారు. కూరగాయలు, గుడ్లు, చేపలు, పుట్టగొడుగులు....మొదలైన వాటి అమ్మకం ద్వారా ఎంతో కొంత డబ్బు కూడా సంపాదిస్తున్నారు. 'హోమ్ విత్ జీరో కాస్ట్ ఆఫ్ లివింగ్' కాప్షన్‌తో కావ్య, సంగీత్ దంపతులు ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన వీడియోకు అనూహ్యమైన స్పందన వచ్చింది. 33 లక్షల లైక్‌లు, 19,000 కామెంట్స్, 33 మిలియన్‌ల వ్యూస్ వచ్చాయి.

బులియన్ (బంగారం 10 గ్రా.: వెండి కిలో) ఆగస్టు 6న ముగింపు రూ.లలో

నగరం	బంగారం (24 క్యారెట్లు)	బంగారం (22 క్యారెట్లు)	వెండి
హైదరాబాద్	1,00,810	93,670	1,17,000
విజయవాడ	1,03,760	93,800	1,16,900
విశాఖపట్నం	1,02,330	93,800	1,26,000
రాజమండ్రి	1,02,330	93,800	1,26,000
ప్రొద్దుటూరు	1,00,300	92,280	1,17,000
చెన్నై	1,02,320	93,800	1,26,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

సాక్షి
స్పోర్ట్స్
గురువారం
7-8-2025



శివాని
శ్రీనిత్య

శ్రీనిత్యకు స్వర్ణం... శివానికి కాంస్యం

జాతీయ జూనియర్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణకు తొలి స్వర్ణ పతకం లభించింది. అహ్మదాబాద్‌లో జరుగుతున్న ఈ చాంపియన్‌షిప్‌లో బాలికల అండర్–17 విభాగం 200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ ఈవెంట్‌లో తెలంగాణ అమ్మాయి శ్రీనిత్య సాగి పసిడి పతకాన్ని గెల్చుకుంది. శ్రీనిత్య 2 నిమిషాల 21.65 సెకన్లలో గమ్యానికి చేరి అగ్రస్థానాన్ని దక్కించుకుంది. బాలికల అండర్–15 విభాగం 200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ ఈవెంట్‌లో శివాని కర్రా కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. శివాని 2 నిమిషాల 30.34 సెకన్లలో గమ్యానికి చేరి మూడో స్థానంలో నిలిచింది. నేటితో ముగియనున్న ఈ చాంపియన్‌షిప్‌లో ఇప్పటి వరకు తెలంగాణకు ఆరు పతకాలు లభించాయి. ఇంతకుముందు బాలికల అండర్–17 విభాగం 400 మీటర్ల మెడ్లీలో శ్రీనిత్య సాగి కాంస్య పతకం, 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ విభాగంలో రజత పతకం సాధించింది. బాలుర అండర్–17 విభాగం 200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో మైలారి సుహాస్ ప్రీతమ్ రజత పతకం, 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ ఈవెంట్‌లో కాంస్య పతకం గెలిచాడు.

కెరీర్ అత్యుత్తమ ర్యాంక్‌కు సిరాజ్

15వ స్థానంలో నిలిచిన భారత పేస్ బౌలర్ ● ఐదో ర్యాంక్‌కు యశస్వి జైస్వాల్

దుబాయ్: ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌లో అద్భుత ప్రదర్శన కనబర్చిన భారత పేస్ బౌలర్ మొహమ్మద్ సిరాజ్ అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ర్యాంకింగ్స్‌లోనూ దూసుకుపోయాడు. ఓవల్‌లో జరిగిన చివరి టెస్టులో 9 వికెట్ల ప్రదర్శన నమోదు చేసిన అతను బుధవారం విడుదల చేసిన ఐసీసీ బౌలర్ల తాజా ర్యాంకింగ్స్‌లో 12 స్థానాలు ఎగబాకాడు. సిరాజ్ 674 రేటింగ్ పాయింట్లతో 15వ స్థానంలో నిలిచాడు. గతంలో సిరాజ్ అత్యుత్తమంగా 16వ ర్యాంక్ సాధించాడు. ఈ జాబితాలో జస్‌ప్రీత్ బుమ్రా (889 పాయింట్లు) అగ్ర స్థానంలో కొనసాగుతుండగా... భారత్ నుంచి రవీంద్ర జడేజా (17వ స్థానం) కూడా టాప్–20లో ఉన్నాడు. టెస్టు బ్యాటర్ల జాబితాలో భారత ఓపెనర్ యశస్వి జైస్వాల్ మూడు స్థానాలు మెరుగుపర్చుకొని ఐదో ర్యాంక్ (792 రేటింగ్ పాయింట్లు)కు చేరుకున్నాడు. ఇంగ్లండ్‌తో సిరీస్‌లో జైస్వాల్ 2 సెంచరీలు సహా మొత్తం 411 పరుగులు చేశాడు. ఈ జాబితాలో జో రూట్ (908) తన అగ్ర స్థానాన్ని నిలబెట్టుకోగా... రిషభ్ పంత్ (8వ), శుబ్‌మన్ గిల్



(13వ)లకు టాప్–20లో చోటు లభించింది. టెస్టు ఆల్‌రౌండర్ల జాబితాలో రవీంద్ర జడేజా (405 పాయింట్లు) నిలకడగా నంబర్‌వన్‌గా కొనసాగుతుండగా... వాషింగ్టన్ సుందర్ 16వ ర్యాంక్‌లో ఉన్నాడు.

హైదరాబాద్ చేరుకున్న సిరాజ్...

ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు టెస్టుల పోరులో అత్యధికంగా 23 వికెట్లు తీసి సిరీస్‌ను భారత్ సమంగా ముగించడంలో కీలక పాత్ర పోషించిన సిరాజ్ సొంతగడ్డకు చేరుకున్నాడు. బుధవారం ఉదయం శంషాబాద్ విమానాశ్రయంలో సన్నిహితులు, అభిమానులు అతనికి స్వాగతం పలికారు. ఫీల్డింగ్ కోచ్ టి.దిలీప్‌తో కలిసి లండన్ నుంచి నేరుగా ముంబైకి చేరుకున్న సిరాజ్ ఆ తర్వాత స్వస్థలానికి వచ్చాడు. వచ్చే నెలలో జరిగే ఆసియా కప్ వరకు భారత జట్టు ఎలాంటి మ్యాచ్‌లు ఆడటం లేదు. ఈ నేపథ్యంలో నగరంలోనే ఉండనున్న సిరాజ్‌కు త్వరలోనే ప్రత్యేక సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయాలని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) యోచిస్తోంది. ప్రస్తుతానికి అధ్యక్ష, కార్యదర్శులు వివిధ ఆరోపణలతో జైలులో ఉన్నందుకు ఈ కార్యక్రమ నిర్వహణ తదితర అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.



బీసీసీఐ సమాచారం ఇవ్వనవసరం లేదు!

ఆర్టీఐ పరిధిలోకి రాకుండా క్రీడా బిల్లు

న్యూఢిల్లీ: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)కి ఊరటనిచ్చే కీలక నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకుంది. ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన నేషనల్ స్పోర్ట్స్ గవర్నెన్స్ బిల్ (ఎన్ఎస్‌జీబీ)లో కొత్త సవరణను చేర్చింది. ఇప్పటి వరకు ఉన్న బిల్లులో 'గుర్తింపు పొందిన ఏ క్రీడా సంఘమైనా ప్రజలకు చెందినదే. తమ విధులు, అధికారాలు నిర్వహించే విషయంలో సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ)–2005 పరిధిలోకే అది వస్తుంది' అని స్పష్టంగా ఉంది. అయితే దీనిపై బీసీసీఐ చాలా కాలంగా తమ అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఇతర క్రీడా సంఘాల తరహాలో తాము ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థిక సహకారం తీసుకోవడం లేదని, బోర్డు ఆర్టీఐ పరిధిలోకి రాదని చెబుతూ వచ్చింది. చివరకు బోర్డు ఆశించిన ప్రకారం వారికి ఊరట కలిగించే విధంగా ప్రభుత్వం కొత్త బిల్లులో సవరణను జోడించింది. దీని ప్రకారం 'ప్రభుత్వం నుంచి నిధులు, సహాయం పొందే క్రీడా సంఘాలకే ఆర్టీఐ నిబంధన వర్తిస్తుంది. అలా ఆర్థిక సహకారం తీసుకుంటేనే దానిని ప్రజా సంస్థగా గుర్తిస్తారు' అని స్పష్టతనిచ్చింది. తాజా సవరణ నేపథ్యంలో సమాచార హక్కు చట్టాన్ని ఉపయోగిస్తూ సామాన్యులు ఎవరైనా బీసీసీఐని ప్రశ్నించడానికి లేదా వారి కార్యకలాపాలకు సంబంధించిన వివరాలు కోరడానికి గానీ అవకాశం లేదు. 'తాజా బిల్లులో ఇది ఒక సమస్యగా కనిపించింది. ఆర్థిక సహకారం తీసుకోవడం లేదనే కారణం చూపించి ఈ బిల్లు ఆమోదం కాకుండా పార్లమెంట్‌లో అడ్డుకునే అవకాశం ఉండేది. లేదా ఇదే కారణంతో బీసీసీఐ కోర్టుకెక్కేది కూడా. అందుకే సవరణ చేయాల్సి వచ్చింది' అని కేంద్ర క్రీడాశాఖ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. అయితే ఆర్టీఐ పరిధిలోకి రాకపోయినా... కొన్ని ఇతర నిబంధనలు బీసీసీఐని కూడా ప్రభుత్వం ప్రశ్నించేందుకు అవకాశం కల్పిస్తున్నాయి. బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొంది చట్టంగా మారితే బీసీసీఐ కూడా వెంటనే జాతీయ క్రీడా సమాఖ్యగా కొత్తగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది. 2028 నుంచి క్రికెట్ కూడా ఒలింపిక్ క్రీడగా మారనుండటం దీనికి ఒక కారణం. కొత్త బిల్లు ప్రకారం నిధులు పొందకపోయినా... వ్యవస్థ నడిచేందుకు ఇతర రూపాల్లో సహాయ సహకారాలు తీసుకుంటుంది కాబట్టి జవాబుదారీతనం ఉండాల్సిందే. పైగా బీసీసీఐ కూడా నేషనల్ స్పోర్ట్స్ ట్రిబ్యునల్ (ఎన్ఎస్‌టీ) పరిధిలోకి వస్తుంది. క్రీడా సంఘాల్లో ఎన్నికల నుంచి ఆటగాళ్ల ఎంపిక వరకు ఏదైనా వివాదం వస్తే ఎన్ఎస్‌టీ పరిష్కరిస్తుంది. ట్రిబ్యునల్ తీర్పులను సుప్రీం కోర్టులో మాత్రమే సవాల్ చేసే అవకాశం ఉంది.



రాధా యాదవ్

షఫాలీ, రాధా యాదవ్‌పై దృష్టి

నేడు ఆస్ట్రేలియా మహిళల 'ఎ' జట్టుతో భారత 'ఎ' జట్టు టి20 మ్యాచ్

మకాయ్ (క్వీన్స్‌లాండ్): అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) మహిళల వన్డే ప్రపంచకప్ ప్రారంభానికి ముందు భారత యువ ప్లేయర్లు ఆస్ట్రేలియాలో పర్యటిస్తున్నారు. ఈ టూర్‌లో భాగంగా భారత మహిళ 'ఎ' జట్టు... ఆస్ట్రేలియా 'ఎ' జట్టుతో మూడు టి20లు, మూడు వన్డేలు, ఓ నాలుగు రోజుల అనధికారిక టెస్టు మ్యాచ్ ఆడనుంది. టి20 సిరీస్‌లో భాగంగా గురువారం మకాయ్ వేదికగా తొలి మ్యాచ్ జరగనుంది. ఇందులో భారత 'ఎ' జట్టుకు రాధా యాదవ్ సారథిగా వ్యవహరిస్తుండగా... చాన్నాళ్ల తర్వాత భారత టి20 జట్టులోకి వచ్చిన షఫాలీ వర్మ సత్తా చాటేందుకు సిద్ధమైంది. ఇప్పటికే అంతర్జాతీయ అనుభవం ఉన్న పలువురు ప్లేయర్లతో పాటు కొత్త వాళ్లకు ఇందులో అవకాశం కల్పించారు. మిన్ను మణి, సజన, ఉమా ఛెత్రి, రాఘ్వి బిస్త్, తనూజ కన్వర్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన షబ్నమ్ షకీల్, సైమా ఠాకూర్, టిటాస్ సాధు భారత 'ఎ' జట్టు తరఫున బరిలోకి దిగనున్నారు. మరోవైపు గాయం కారణంగా గత కొన్ని మ్యాచ్‌లకు దూరమైన ఆస్ట్రేలియా రెగ్యులర్ కెప్టెన్ అలీసా హీలీ ఆసీస్ 'ఎ' జట్టు తరఫున బరిలోకి దిగనుంది. ఆస్ట్రేలియా 'ఎ' జట్టుకు నికోల్ ఫాల్టమ్ కెప్టెన్‌గా వ్యవహరిస్తుండగా... తహిలా విల్సన్, కిమ్ గార్త్ వంటి పలువురు స్టార్ ఆటగాళ్లు ఈ మ్యాచ్‌లో ఆడనున్నారు. ఈ పర్యటనలోని మూడు ఫార్మాట్లకూ భారత 'ఎ' జట్టుకు రాధ యాదవ్ కెప్టెన్‌గా వ్యవహరించనుంది.

షెడ్యూల్

తొలి టి20	ఆగస్టు 7	మకాయ్	మ.,గం. 1:30 నుంచి
రెండో టి20	ఆగస్టు 9	మకాయ్	మ.,గం. 1:30 నుంచి
మూడో టి20	ఆగస్టు 10	మకాయ్	మ. గం. 1:30 నుంచి
తొలి వన్డే	ఆగస్టు 13	బ్రిస్బేన్	ఉ. గం. 5:00 నుంచి
రెండో వన్డే	ఆగస్టు 15	బ్రిస్బేన్	ఉ. గం. 5:00 నుంచి
మూడో వన్డే	ఆగస్టు 17	బ్రిస్బేన్	ఉ. గం. 5:00 నుంచి
అనధికారిక టెస్టు	ఆగస్టు 21	బ్రిస్బేన్	ఉ. గం. 5:00 నుంచి

'బుమ్రా లేకుండా గెలవడం యాదృచ్ఛికమే'

● అతనో అసాధారణ బౌలర్
● భారత పేసర్‌పై సచిన్ ప్రశంసలు



ముంబై: ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌లో భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ముందుగా అనుకున్నట్లుగా మూడు మ్యాచ్‌లే ఆడాడు. అయితే అతను బరిలోకి దిగని బర్మింగ్‌హామ్, ఓవల్ టెస్టులలోనే టీమిండియా గెలిచింది. దాంతో బుమ్రా లేకపోయినా పెద్దగా తేడా రాదని, అతను లేకపోయినా మ్యాచ్‌లు గెలవగలమని కొన్ని విశ్లేషణలు ప్రచారంలోకి వచ్చాయి. దీనిపై భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ స్పందించాడు. అసాధారణ బౌలర్ అయిన బుమ్రా గురించి తప్పుగా మాట్లాడవద్దంటూ అండగా నిలిచాడు. 'బుమ్రా సిరీస్‌ను చాలా బాగా మొదలు పెట్టాడు. ఆడింది మూడు మ్యాచ్‌లే అయినా... తొలి టెస్టులో ఒకసారి, మూడో టెస్టులో ఒకసారి ఐదు వికెట్ల ప్రదర్శన నమోదు చేశాడు. అయితే ప్రజలు వేరే అంశాలు ముందుకు తెచ్చి అతను లేని టెస్టుల్లో భారత్ గెలిచిందంటూ ప్రచారం చేస్తున్నారు. కానీ నా అభిప్రాయ ప్రకారం అది యాదృచ్ఛికం మాత్రమే. బుమ్రా ఒక అసాధారణ బౌలర్. ఇప్పటికే ఎన్నో అద్భుతాలు చేశాడు. చాలా కాలంగా నిలకడగా రాణించాడు. నా దృష్టిలో నిస్సందేహంగా అందరికంటే అతను అగ్ర స్థానంలో ఉంటాడు' అని సచిన్ కితాబిచ్చాడు. మాంచెస్టర్ టెస్టులో స్టోక్స్ 'షేక్ హ్యాండ్'కు నిరాకరించి జడేజా, సుందర్ ఆటను కొనసాగించడంలో ఎలాంటి తప్పూ లేదని టెండూల్కర్ అభిప్రాయపడ్డాడు. 'డ్రా'కు అంగీకరించాలని ఇంగ్లండ్ కోరడంలో అర్థం లేదన్న సచిన్... భారత బ్యాటర్లు స్పందించిన తీరుతో తాను వంద శాతం ఏకీభవిస్తున్నానని అన్నాడు.

ఫైనల్లో నలుగురు భారత బాక్సర్లు

బ్యాంకాక్: అండర్–22 ఆసియా బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో నలుగురు భారత బాక్సర్లు ఫైనల్లోకి దూసుకెళ్లారు. పురుషుల విభాగంలో నీరజ్ (75 కేజీలు), ఇషాన్ కటారియా (ప్లస్ 90 కేజీలు)... మహిళల విభాగంలో యాత్రి పటేల్ (57 కేజీలు), ప్రియా (60 కేజీలు) తుదిపోరుకు చేరి కనీసం రజత పతకాలు ఖాయం చేసుకున్నారు. సెమీఫైనల్స్‌లో నీరజ్ 5–0తో కై యాంగో బాంగ్ (దక్షిణ కొరియా)ను ఓడించగా... చైనా బాక్సర్ చెన్ చెన్‌పై ఇషాన్ ఏకపక్ష విజయం సాధించాడు. యాత్రి 5–0తో థి నుంగ్ ఖ్వాండ్ (వియత్నాం)పై... ఉజ్బెకిస్తాన్ బాక్సర్ ఇస్మాయిలోవాపై ప్రియా గెలిచారు. సెమీఫైనల్లో ఓడిన రాకీ చౌదరీ (85 కేజీలు)... హర్ష్ (60 కేజీలు), మయూర్ (90 కేజీలు), అంకుశ్ (71 కేజీలు), భావన (48 కేజీల), పార్థవి (60 కేజీలు), ప్రాంజల్ (65 కేజీలు), శ్రుతి (75 కేజీలు) కాంస్యాలు గెలుచుకున్నారు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా



● రజనీకాంత్

డైరెక్టర్ రిపీట్?

రజనీకాంత్ హీరోగా నటించిన 'కూలీ' ఈ నెల 14న విడుదల కానున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో 'జైలర్ 2'లో హీరోగా నటిస్తున్నారు ఈ సూపర్ స్టార్. ఈ చిత్రం తర్వాత ఏ దర్శకుడితో రజనీ సినిమా చేయనున్నారనే విషయం గురించి చర్చ జరుగుతోంది. హెచ్. వినోద్, వివేక్ ఆత్రేయ, నిథిలన్ స్వామినాథన్... ఇలా పలువురు దర్శకుల పేర్లు వినిపించాయి. తాజాగా శివ పేరు వినిపిస్తోంది. రజనీకాంత్ హీరోగా శివ దర్శకత్వంలో 'అన్నాత్తే' (2021) సినిమా రూపొందింది. అయితే ఈ సినిమా చెప్పుకోదగ్గ వసూళ్లు రాబట్టలేదు. కానీ ఈ సినిమా తనకు బాగా నచ్చడంతో శివకు రజనీకాంత్ బంగారు గొలుసు బహుమతిగా ఇచ్చారని అప్పట్లో ప్రచారం జరిగింది. ఆ విధంగా శివ డైరెక్షన్‌ని రజనీ ఇష్టపడ్డారని ఊహించవచ్చు. తాజాగా శివ ఓ కథ చెప్పగా, ఆయన డైరెక్షన్‌లో మళ్లీ సినిమా చేయడానికి అంగీకరించారట. మరి... వార్తల్లో ఉన్న ప్రకారం డైరెక్టర్ శివని రజనీ రిపీట్ చేయనున్నారా? ఈ కాంబినేషన్‌లో మళ్లీ సినిమా వస్తుందా? చూడాలి.



● ఎన్టీఆర్

హద్దులు పెట్టుకోదలచుకోలేదు!

''ఇక నుంచి టాలీవుడ్, మాలీవుడ్, బాలీవుడ్... అంటూ ప్రత్యేకంగా ఏమీ ఉండవు. ఉండేదంతా ఒక్కటే... 'ఇండియన్ సినిమా'. అందుకే హద్దులు పెట్టుకోదలచుకోలేదు. కథ నచ్చితే సినిమా చేసేస్తా. హిందీ 'వార్ 2' ఒప్పుకోవడానికి కారణం స్క్రిప్ట్. చాలా బలమైన కథ కావడంతో ఈ సినిమా చేశాను'' అని హీరో ఎన్టీఆర్ పేర్కొన్నారు. హృతిక్ రోషన్, ఎన్టీఆర్ కాంబినేషన్‌లో అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో రూపొందిన 'వార్ 2' ఈ నెల 14న విడుదల కానుంది. ఇటీవల ఓ ప్రముఖ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఎన్టీఆర్ ఈ సినిమా ఒప్పుకోవడానికి గల ముఖ్య కారణం 'కథ' అని చెప్పారు. ఇంకా ఆ ఇంటర్వ్యూలో తన కుమారులు అభయ్ రామ్, భార్గవ్ రామ్ గురించి మాట్లాడారు. ''వారసత్వాన్ని అనుసరించి మీరు హీరోలే అవ్వాలి అని మా అబ్బాయిలతో చెప్పను. ఓ వారధిలా ఉండి ఈ ప్రపంచం గురించి, సంస్కృతుల గురించి వారికి అవగాహన కల్పించాలనుకుంటున్నాను. సొంతంగా అనుభవం సంపాదించుకునే స్వేచ్ఛను వాళ్లకు ఇవ్వాలనుకుంటున్నాను. అలాగే ఇంతకు ముందు ఆదివారం కూడా షూటింగ్ చేసేవాడిని. అయితే ఇప్పుడు మాత్రం వారంలో ఒక్క రోజైనా కుటుంబంతో గడపాలని ఫిక్స్ అయి, ఆదివారం దాదాపు సెలవు తీసుకుంటున్నాను. పిల్లలు ఎదిగే కొద్దీ వాళ్ల చదువులతో బిజీ అయిపోతారు. దాంతో వాళ్లతో కావాల్సినంత టైమ్ గడపడానికి కుదరదు. అందుకే పండగ లప్పుడు ఇంటిపట్టునే ఉండి, పండగల అర్థం చెప్పడానికి ప్రయత్నిస్తుంటా'' అని పేర్కొన్నారు.

డేవిడ్ రెడ్డి తిరుగుబాటు



● మనోజ్

మంచు మనోజ్ హీరోగా 'డేవిడ్ రెడ్డి' అనే సినిమా ప్రకటన వచ్చింది. ఈ చిత్రానికి హనుమ రెడ్డి యక్కంటి దర్శకత్వం వహించనున్నారు. వెల్వెట్ సోల్ మోషన్ పిక్చర్స్‌పై మోతుకూరి భరత్, నల్లగంగుళ వెంకట్ రెడ్డి నిర్మించనున్నారు. ''పవర్‌ఫుల్ హిస్టారికల్ యాక్షన్ డ్రామాగా రూపొందనున్న చిత్రం 'డేవిడ్ రెడ్డి'. ఈ సినిమా కథ 1897 నుంచి 1922 వరకూ నడుస్తుంది. గతంలో ఎన్నడూ చూడని పవర్‌ఫుల్ రోల్‌లో మనోజ్ కనిపిస్తారు. కుల వ్యవస్థ ఒత్తిడుల నుంచి తిరగబడి బ్రిటిష్ సామ్రాజ్యంపై తిరుగుబాటు చేసిన ఓ రెబల్ కథ ఇది. రా, గ్రౌండెడ్, ఎమోషనల్ మాస్ టచ్‌తో ప్రేక్షకుల మనసుల్లో నిలిచిపోయేలా ఈ సినిమా ఉంటుంది. మంచు మనోజ్ 'దొంగ దొంగది' చిత్రంతో 21 ఏళ్ల క్రితం (6–8–2004) ఇదే రోజున అరంగేట్రం చేశారు. సరిగ్గా రెండు దశాబ్దాల తర్వాత తన న్యూ బ్లాస్టింగ్ వెంచర్ 'డేవిడ్ రెడ్డి'ని ప్రకటించడం హ్యాపీగా ఉంది. ఈ సినిమా షూటింగ్‌ని త్వరలోనే ఆరంభిస్తాం'' అని యూనిట్ పేర్కొంది.

గతిలేనోళ్లం కాదు...

'ఈ ఘాట్లలో ఘాటీలుంటారు సార్... బ్రిటిష్ కాలంలో కొండలు బద్దలు కొట్టి రక్తంతో రోడ్లు వేసినోళ్లు... ఇప్పుడు గంజాయి మోసే కంచర గాడిదలు... వీళ్లు కదిలే కొండలు సార్' అనే డైలాగ్స్‌తో 'ఘాటీ' ట్రైలర్ ఆరంభమైంది. అనుష్క, విక్రమ్ ప్రభు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఘాటి'. 'వేదం' (2010) వంటి హిట్ మూవీ తర్వాత అనుష్క, డైరెక్టర్ క్రిష్ జాగర్లమూడి కాంబినేషన్‌లో రూపొందిన ద్వితీయ చిత్రమిది. యూవీ క్రియేషన్స్ సమర్పణలో రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మించారు. పలుమార్లు విడుదల వాయిదా పడిన ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో సెప్టెంబరు 5న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించి, ట్రైలర్‌ని రిలీజ్ చేశారు మేకర్స్. 'ఘాటీలంటే గతిలేనోళ్లం కాదు... గస, కసి వస్తే గొంతు కొరికేసి ఘోరీ కట్టేటోళ్లం' (విక్రమ్ ప్రభు), 'పది మంది బతుకుల్ని నాశనం చేసే బతుకు బతుకా?', 'ఘాట్లు ఘాటీలవి, వచ్చే తరాలవి... వాళ్లవి వాళ్లకి ఇస్తాం... అడ్డొచ్చే వాళ్ల నెత్తురుతో కడిగిస్తాం' (అనుష్క) వంటి డైలాగులు ట్రైలర్‌లో ఉన్నాయి. ''యాక్షన్ డ్రామాగా రూపొందిన చిత్రమిది. ఒక బలహీన మహిళ క్రిమినల్, అక్కడి నుంచి లెజెండ్‌గా మారే పాత్రలో అనుష్క నటన అద్భుతంగా ఉంటుంది'' అని యూనిట్ తెలిపింది.



● అనుష్క

నేను హీరో అనుకోవడం లేదు

– ప్రవీణ్



''హాస్యనటులు హీరోగా మారితే కమెడియన్‌గా అవకాశాలు తగ్గిపోతాయని అంటుంటారు. అయితే నన్ను నేను హీరోగా భావిస్తే అలాంటి భావన ఇతరుల్లోనూ వస్తుంది. కానీ, 'బకాసుర రెస్టారెంట్' చిత్రంలో నేను లీడ్ రోల్ చేశాననే భావనతో ఉన్నాను. అందుకే ప్రస్తుతం 'విశ్వంభర, ఉస్తాద్ భగత్ సింగ్, మాస్ జాతర, లెనిన్, ఆకాశంలో ఓ తార' వంటి చిత్రాలతో నటుడిగా బిజీగా ఉన్నాను'' అని ప్రవీణ్ అన్నారు. క్యారెక్టర్ ఆర్టిస్ట్, కమెడియన్ ప్రవీణ్ హీరోగా నటించిన చిత్రం 'బకాసుర రెస్టారెంట్'. ఎస్‌జే శివ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో వైవా హర్ష టైటిల్ రోల్ చేశారు. లక్ష్మయ్య ఆచారి, జనార్దన్ ఆచారి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 8న విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రవీణ్ విలేకరులతో మాట్లాడుతూ– ''బకాసుర రెస్టారెంట్' చిత్రం ఐదుగురు బ్యాచిలర్స్ పాత్రలతో నడుస్తుంది. ఇందులో కథను నడిపించే పరమేష్ అనే పాత్రలో కనిపిస్తాను. నా పాత్రలో వినోదం, భావోద్వేగం ఉంటాయి. ఇకపైనా అన్ని రకాల పాత్రలు చేస్తాను. అయితే లీడ్ రోల్ చేయాలంటే పూర్తి వినోదాత్మక కథ ఉండాలి. ఎందుకంటే నాలాంటి కమెడియన్స్ నుంచి ప్రేక్షకులు వినోదాన్ని ఆశిస్తారు'' అని తెలిపారు.

బాలుగాడి ప్రేమకథ

ఆకుల అఖిల్, దర్శికా మీనన్ జంటగా నూతన దర్శకుడు యల్. శ్రీనివాస్ తేజ్ తెరకెక్కించిన చిత్రం 'బాలుగాడి లవ్ స్టోరీ'. ఆకుల భాస్కర్ సమర్పణలో ఆకుల మంజుల నిర్మించిన ఈ సినిమాని 'సిల్వర్ స్క్రీన్' గణేశ్ ఈ నెల 8న రిలీజ్ చేస్తున్నారు.



● అఖిల్, దర్శిక

ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఆకుల మంజుల మాట్లాడుతూ– ''మా అందరికీ ఇది తొలి చిత్రం. మంచి విజయం సాధించి, మా అందరికీ మంచి పేరు తీసుకురావాలి'' అని చెప్పారు. ''వాస్తవ ఘటనలను ఆధారంగా చేసుకొని ఈ సినిమాను తెరకెక్కించారు శ్రీనివాస్'' అన్నారు భాస్కర్. ''ఈ సినిమాలో కామెడీ, లవ్, యాక్షన్.. ఇలా అన్ని అంశాలుంటాయి'' అని శ్రీనివాస్ తేజ్ తెలిపారు.

చాలా మంచోళ్లు!

'30 రోజుల్లో ప్రేమించడం ఎలా' మూవీ ఫేమ్ మున్నా ధులిపూడి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'బ్యాడ్ గాళ్స్'. 'కానీ చాలా మంచోళ్లు' అనేది ట్యాగ్ లైన్. అంచల్ గౌడ, పాయల్ చెంగప్ప, రోషిణి, యష్ణ లీడ్ రోల్స్‌లో నటిస్తున్న ఈ చిత్రంలో రేణూ దేశాయ్, రోహన్ సూర్య, మొయిన్ కీలక పాత్రధారులు. శశిధర్ నల్లా, ఎమ్మాడి సోమ నర్సయ్య, రామిశెట్టి రాంబాబు, రావుల రమేశ్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం టైటిల్ మోషన్ పోస్టర్ లాంచ్ ఈవెంట్‌లో డైరెక్టర్ చందు మొండేటి మాట్లాడుతూ – ''బ్యాడ్ గాళ్స్' లోని నటీనటులు, సాంకేతిక నిపుణులు నాకు పరిచయం ఉన్న వాళ్లే. ఈ మూవీ పెద్ద హిట్టవ్వాలి'' అని కోరారు. ''నా మిత్రుడు మున్నా కష్టానికి తగ్గ ఫలితం రావాలి'' అన్నారు కృష్ణ చైతన్య. ''నలుగురు కొత్త అమ్మాయిలను పెట్టి సినిమా చేయడం సాహసమే'' అని శివ నిర్వాణ చెప్పారు. ''అమ్మాయిలకు పెళ్లికి ముందు ఉండే స్వేచ్ఛ పెళ్లి తర్వాత ఉండదు. అలాంటి చాలామంది కథల స్ఫూర్తితో ఈ సినిమా తీశాను. అమ్మాయిలను భయంతో కాదు ధైర్యంగా ఓ అమ్మోరులా పెంచాలి'' అని మున్నా చెప్పారు. ''కుటుంబంతో సహా ప్రేక్షకులు మా సినిమాని చూసి ఎంజాయ్ చేయాలని కోరుతున్నాం'' అని నిర్మాతలు పేర్కొన్నారు



● రాంబాబు, మున్నా, యష్ణ, రోషిణి, అనూప్

మేము సమ్మెలో పాల్గొనడం లేదు

– తెలంగాణ ఫిల్మ్ ఫెడరేషన్ అధ్యక్షుడు వడ్డే కరుణాకర్ రెడ్డి

తెలుగు పరిశ్రమలో పని చేస్తున్న కార్మికుల వేతనాలు 30 శాతం పెంచాలంటూ తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 4 నుంచి బంద్ జరుగుతున్న సంగతి తెలిసిందే. దీనిపై తెలంగాణ ఫిల్మ్ ఫెడరేషన్ అధ్యక్షుడు వడ్డే కరుణాకర్ రెడ్డి బుధవారం ఓ వీడియో విడుదల చేశారు. ''వేతనాలు పెంచితే మంచిదే. కానీ ఈ వేతనాల పెంపు, బంద్ విషయంపై తెలంగాణ ఫిల్మ్ ఫెడరేషన్‌కి వాళ్లు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. అందుకే మేం ప్రొడ్యూసర్స్ కౌన్సిల్‌కి ఒక్కటే చెబుతున్నాం. మేం సమ్మెలో పాల్గొనడం లేదు. 24 క్రాఫ్ట్స్‌కు సంబంధించి మీరు ఎప్పుడు పిలిచినా షూటింగ్ చేసేందుకు సిద్ధంగా ఉన్నాం'' అని ఆ వీడియోలో పేర్కొన్నారు.

నిర్మాతలు బాగుండాలి.. మేమూ బాగుండాలి

– తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు అనిల్ వల్లభనేని

వేతనాలు పెంచాలంటూ సమ్మె చేస్తున్న తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ కార్మికులు బుధవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ అధ్యక్షుడు అనిల్ వల్లభనేని మాట్లాడుతూ–''చిరంజీవిగారు ఇండస్ట్రీ పెద్ద. ఆయన నిర్ణయానికి కట్టుబడి ఉంటాం. నిర్మాతలు బాగుండాలి... మేమూ బాగుండాలి. వేతనాల పెంపు, పెంచిన వేతనాలు ఏరోజుకారోజు ఇవ్వాలనేదే మా ప్రధాన డిమాండ్. నిర్మాతలు చెప్పిన కొన్ని రూల్స్ మాకు అర్థం కాలేదు. 'అర్థం కాకపోతే గురువారం రండి.. స్పష్టంగా చెబుతాం' అన్నారు. సినీ కార్మికుల్లో నైపుణ్యం లేదని నిర్మాత టీజీ విశ్వప్రసాద్ మాట్లాడటం తగదు. ఇక యూనియన్ సభ్యత్వ రుసుము తీసుకున్నా దాన్ని ఆపదలో ఉన్న యూనియన్ సభ్యులకే ఖర్చు చేస్తాం'' అని చెప్పారు. తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ అమ్మిరాజు, ట్రెజరర్ అలెక్స్ పాల్గొన్నారు.

స్టాక్ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	166	80,544
నిఫ్టీ ▽	75	24,574

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	21,147	△	133
డోజోన్స్	44,264	△	152
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,172	△	29
డాక్స్	23,913	△	67
షాంఘై	3,634	△	16
నికాయ్	40,795	△	245

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	87.30	88.32
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	114.50	117.45
€	యూరో	ఎస్‌బీఐ	99.73	102.48
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	58.38	58.11
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.86	57.69
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	65.81	69.45
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.50	23.99
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.97	24.22
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.34	13.16

రేట్ల కోతకు బ్రేక్!

ప్రస్తుతానికి వేచిచూద్దాం!

- కీలక పాలసీ రేట్లు యథాతథం
- తటస్థ వైఖరికే కట్టుబడిన ఆర్‌బీఐ ఎంపీసీ
- ద్రవ్యోల్బణం అంచనా 3.1 శాతానికి తగ్గింపు
- జీడీపీ వృద్ధి అంచనా 6.5 శాతం స్థాయిలోనే



ముంబై: వరుసగా మూడు సమీక్షల్లో కీలక రేట్లను తగ్గిస్తూ వచ్చిన ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) ఈ సారి ఆచితూచి వ్యవహరించింది. కీలకమైన రెపో రేటును (ఆర్‌బీఐ నుంచి బ్యాంకులు తీసుకునే నిధులపై వసూలు చేసే రేటు) 5.5 శాతం వద్దే కొనసాగించాలని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అధ్యక్షతన గల ఎంపీసీ కమిటీ ఏకగ్రీవంగా నిర్ణయించింది. రివర్స్ రెపో రేటును (బ్యాంకుల నుంచి ఆర్‌బీఐ తీసుకునే నిధులపై రేటు) సైతం 3.35 శాతం వద్దే కొనసాగించింది. ముఖ్యంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న అస్పష్ట వాణిజ్య విధానాలకు తోడు టారిఫ్‌ల పట్ల అనిశ్చితులు కొనసాగుతుండడాన్ని పరిగణనలోకి తీసుకుంది. ఇప్పటికే పలు విడతలుగా రేట్లను తగ్గించగా ఇది పూర్తి స్థాయిలో బదిలీ కావాల్సి ఉండడం, ద్రవ్యోల్బణం రిస్కను దృష్టిలో పెట్టుకుని రేట్ల పరంగా యథాతథ స్థితిని కొనసాగించడమే ఉత్తమమని భావించింది. ద్రవ్య పరపతి విధానం పరంగా తటస్థ వైఖరినే (న్యూట్రల్) కొనసాగించాలని నిర్ణయించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2025–26) ద్రవ్యోల్బణం మొత్తం మీద 3.7 శాతంగా ఉండొచ్చన్న గత అంచనాను 3.1 శాతానికి తగ్గించింది. అలాగే, జీడీపీ వృద్ధి రేటు 6.5 శాతం అంచనాలో ఎలాంటి మార్పు చేయలేదు.

ఆర్థిక వ్యవస్థకు మద్దతుగా నిలుస్తాం..

రుతుపవన ఆధారిత వర్షాలు అనుకున్న విధంగా కొనసాగుతుండడం, పండుగల సీజన్ సమీపిస్తుండడం ఆర్థిక వ్యవస్థకు జోష్‌నిస్తాయని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు. మారుతున్న ప్రపంచ క్రమంలో బలమైన మూలాలు, సౌకర్యవంతమైన ఫారెక్స్ మిగులు నిల్వలు కలిగి ఉన్న భారత ఆర్థిక వ్యవస్థకు మధ్యకాలానికి ఉజ్వల అవకాశాలున్నట్టు చెప్పారు. అన్ని రకాల డేటాను గమనిస్తూ అవసరమైతే రేట్లపై తగిన నిర్ణయంతో ఆర్థిక వ్యవస్థకు మద్దతుగా నిలుస్తామని ప్రకటించారు. ''అంతర్జాతీయంగా ఎన్నో సవాళ్లతో కూడిన వాతావరణంలో భారత ఆర్థిక వ్యవస్థ ధరల స్థిరత్వంతో, నిలకడైన వృద్ధి పథాన్ని కొనసాగించింది. ద్రవ్యోల్బణం నియంత్రణలోకి రావడంతో వృద్ధికి మద్దతుగా పరపతి విధానాన్ని చక్కగా వినియోగించుకున్నాం. ఫిబ్రవరి నుంచి జూన్ మధ్య నాలుగు నెలల్లోనే రెపో రేటును ఒక శాతం తగ్గించాం. వ్యవస్థలో రేట్ల బదలాయింపు ఇంకా కొనసాగుతోంది''అని చెప్పారు. రేట్ల తగ్గింపు పూర్తి స్థాయిలో అమల్లోకి వస్తే అప్పుడు రుణ వితరణ పుంజుకోవచ్చన్నారు. గృహ రుణ విభాగం 14 శాతం వృద్ధితో మెరుగైన పనితీరు చూపిస్తున్నట్టు చెప్పారు. ప్రస్తుతమున్న తీవ్ర అనిశ్చితుల్లో రూపాయి ఆల్‌టైమ్ కనిష్టానికి పడిపోవడం ఆశ్చర్యం కలిగించలేదన్నారు.

ఏడాది చివర్లో ద్రవ్యోల్బణం పైపైకి..

ఏడాది చివర్లో ద్రవ్యోల్బణం కొంత పెరిగే అవకాశాలున్నట్టు మల్హోత్రా చెప్పారు. ''రిటైల్ ద్రవ్యోల్బణం క్యూ4లో (2026 జనవరి–మార్చి) 4 శాతం పైకి చేరుకోవచ్చు. విధానపరమైన చర్యల మద్దతుతో (రేట్ల కోత) డిమాండ్ పెరగడం ఇందుకు దారితీయొచ్చు''అని అభిప్రాయపడ్డారు.

డెడ్ ఎకానమీ కాదు.. సంజీవని

భారత ఆర్థిక వ్యవస్థను డెడ్ ఎకానమీ (నిర్వీర్యమైన ఆర్థిక వ్యవస్థ) అంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలకు ఆర్‌బీఐ గవర్నర్ మల్హోత్రా తగిన బదులిచ్చారు. భారత ఆర్థిక వ్యవస్థ చక్కని పనితీరు చూపిస్తోందంటూ.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు అమెరికా కంటే భారతే దన్నుగా నిలుస్తున్నట్టు చెప్పారు. 2025లో ప్రపంచ ఆర్థిక వృద్ధి 3 శాతంగా ఉంటే, భారత ఆర్థిక వృద్ధి 6.5 శాతంగా ఉంటుందన్న ఐఎంఎఫ్ అంచనాలను ప్రస్తావించారు. "అంతర్జాతీయ ఆర్థిక వృద్ధిలో అమెరికా వాటా 11 శాతంగా ఉంటే, భారత్ 18 శాతం సమకూరుస్తోంది. ఇదే పనితీరును ఇక ముందూ కొనసాగిస్తాం"అని చెప్పారు. భారత వృద్ధి ఆకాంక్షలు 6.5 శాతం కంటే అధికంగా ఉండాలని అభిప్రాయపడ్డారు. గతంలో ఏటా సగటున 7.8 శాతం వృద్ధిని నమోదు చేయడాన్ని గుర్తు చేశారు.

అకౌంట్, లాకర్ క్లెయిమ్ సులభతరం



బ్యాంక్ ఖాతాలు, లాకర్ల క్లెయిమ్ ప్రక్రియను ప్రామాణీకరించనున్నట్టు ఆర్‌బీఐ గవర్నర్ మల్హోత్రా తెలిపారు. మరణించిన కస్టమర్ల తరఫున నామినీ సులభంగా క్లెయిమ్ చేసుకోవడం దీని లక్ష్యమని చెప్పారు. ట్రెజరీ బిల్లుల్లో రిటైల్ ఇన్వెస్టర్లు నేరుగా పెట్టుబడులు పెట్టుకునేందుకు వీలుగా ఆర్‌బీఐ రిటైల్–డైరెక్ట్ ప్లాట్‌ఫామ్ కార్యకలాపాలను విస్తరించే ప్రణాళికతో ఉన్నట్టు తెలిపారు.

పాలసీ ముఖ్యాంశాలు..

- యథాతథ స్థితికి అనుకూలంగా ఎంపీసీలోని ఆరుగురు సభ్యులు ఓటు వేశారు.
- రెపో రేటును ఐదేళ్ల విరామం తర్వాత ఈ ఏడాది ఫిబ్రవరిలో 25 బేసిస్ పాయింట్లు (పావుశాతం) తగ్గించి 6.25 శాతం చేయగా, ఏప్రిల్‌లో మరో పావు శాతం కోతతో 6 శాతానికి దిగొచ్చింది. జూన్‌లో అర శాతం కోతతో 5.5 శాతానికి పరిమితమైంది.
- రివర్స్ రెపో రేటు 3.35 శాతంలోనూ ఎలాంటి మార్పులేదు.
- తదుపరి ఆర్‌బీఐ ఎంపీసీ సమీక్ష సెప్టెంబర్ 29- అక్టోబర్ 1 మధ్య నిర్వహించనున్నారు.

లిస్టింగ్ ధమాకా..

రెండు హిట్.. ఒకటి ఫ్లాట్!



- ఎన్ఎస్‌డీఎల్ ఇష్యూ ధర(రూ.800)తో పోలిస్తే బీఎస్‌ఈలో 10% ప్రీమియంతో రూ.880 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 18% ఎగసి రూ.944 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 17% లాభంతో రూ.936 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.18,720 కోట్లుగా నమోదైంది.



- శ్రీ లోటస్ డెవలపర్స్ లిస్టింగ్ సక్సెస్ అయ్యింది. ఇష్యూ ధర(రూ.150)తో పోలిస్తే బీఎస్‌ఈలో 19% ప్రీమియంతో రూ.179 వద్ద లిస్టయ్యింది. భారీగా కొనుగోళ్ల మద్దతు లభించడంతో 31% ఎగసి ఇంట్రాడే గరిష్టం రూ.197 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.9,621 కోట్లుగా నమోదైంది.
- ఎంఅండ్‌బీ ఇంజనీరింగ్ షేరు ఇష్యూ ధర(రూ.385)తో పోలిస్తే బీఎస్‌ఈలో ఫ్లాటుగా రూ.386 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 9% ఎగసి రూ.419 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 6% లాభంతో రూ.409 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.2,338 కోట్లుగా నమోదైంది.

మెప్పించని ఆర్‌బీఐ పాలసీ!

- ఐటీ, ఫార్మా షేర్లలో అమ్మకాలు
- స్టాక్ సూచీలకు స్వల్ప నష్టాలు



ముంబై: రిజర్వ్ బ్యాంకు కీలక వడ్డీరేట్ల యథాతథ కొనసాగింపు నిర్ణయం మార్కెట్ వర్గాలను మెప్పించలేకపోయింది. ఫలితంగా బుధవారం సెన్సెక్స్ 166 పాయింట్లు నష్టపోయి 80,544 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 75 పాయింట్లు పతనమై 24,574 వద్ద నిలిచింది. ఉదయం బలహీనంగా మొదలైన సూచీలు రోజంతా పరిమిత శ్రేణిలో లాభ, నష్టాల మధ్య ట్రేడయ్యాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 261 పాయింట్లు కోల్పోయి 80,449 వద్ద, నిఫ్టీ 111 పాయింట్లు పతనమై 24,539 వద్ద కనిష్టాలు తాకాయి. అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు స్వల్ప లాభాల్లో ట్రేడవుతున్నాయి.

- ఐటీ, ఫార్మా షేర్లు భారీ నష్టాలు చవిచూశాయి. రంగాల వారీగా బీఎస్‌ఈ ఇండెక్సుల్లో ఐటీ, ఫార్మా 2%, రియల్టీ 1.50%, టెక్ 1.20%, ఇండస్ట్రియల్స్, క్యాపిటల్ గూడ్స్, ఎఫ్ఎంసీజీ, టెలికమ్యూనికేషన్ 1% చొప్పున పతనమయ్యాయి. మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు ఒకశాతం నష్టపోయాయి.
- ఆర్‌బీఐ కీలక వడ్డీరేట్లలో ఎలాంటి మార్పు లేకపోవడంతో రేట్ల సంబంధిత ఆటో, రియల్టీ, బ్యాంకుల షేర్లు డీలా పడ్డాయి. ఆటో షేర్లలో బాష్ 5%, హ్యుందాయ్ మోటార్ 2%, హీరో మోటోకార్ప్ 1.31%, అపోలో టైర్స్ 1.07%, ఎంఅండ్ఎం, అశోక్ లేలాండ్, టీవీఎస్ 1%, టాటా మోటార్స్ 0.50%, మారుతీ సుజుకీ 0.04 నష్టపోయాయి.
- రియల్టీ రంగానికి చెందిన ప్రెస్టేజ్ ఎస్టేట్స్ ప్రాజెక్ట్స్ 3%, గోద్రెజ్ ప్రాపర్టీస్, ఫీనిక్స్ మిల్స్ 2.50%, బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్ 2.27%, అనంత రాజ్ 2%, లోధా డెవలపర్స్ 1.50% ఒబెరాయ్ రియల్టీ 1.40%, సిగ్నేచర్ గ్లోబల్, శోభా లిమిటెడ్ ఒకశాతం నష్టపోయాయి.
- ఇండస్‌ఇండ్ బ్యాంక్ 2.5%, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు 1.3%, బ్యాంక్ ఆఫ్ బరోడా 0.5%, యాక్సిస్ బ్యాంక్ 0.16% నష్టపోయాయి.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
టీసీఎస్ ఉద్యోగులకు వేతన పెంపు షురూ | పబ్లిక్ ఇష్యూ ప్రణాళికల్లో ఇండోసోల్

హీరో మోటోకార్ప్ లాభం హైజంప్



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసికంలో ద్విచక్ర వాహన రంగ దిగ్గజం హీరో మోటోకార్ప్ ఆసక్తికర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 65% జంప్‌చేసి రూ. 1,706 కోట్లకు చేరింది. ఈవీ కంపెనీ ఏథర్ ఎనర్జీ ఐపీవో ద్వారా పెట్టుబడులపై ఆర్జించిన లాభం ఇందుకు సహకరించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ.1,032 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 10,211 కోట్ల నుంచి రూ. 9,728 కోట్లకు క్షీణించింది. ఈ కాలంలో సహచర కంపెనీ ఏథర్ ఎనర్జీలో పెట్టుబడుల విక్రయం ద్వారా రూ. 722 కోట్లు ఆర్జించినట్లు హీరో మోటో వెల్లడించింది. కాగా.. మొత్తం వ్యయాలు సైతం రూ. 8,974 కోట్ల నుంచి రూ. 8,541 కోట్లకు తగ్గాయి. వాహన విక్రయాలు 11% క్షీణించి 13.67 లక్షలకు పరిమితమయ్యాయి.

ఫలితాల నేపథ్యంలో హీరో మోటో షేరు 1.5 శాతం క్షీణించి రూ. 4,475 వద్ద ముగిసింది.

సదరన్ ట్రావెల్స్ 'తిరంగా ట్రావెల్ సేల్'



హైదరాబాద్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సదరన్ ట్రావెల్స్ 'తిరంగా ట్రావెల్ సేల్'ను తీసుకొచ్చింది. ప్రతి టూర్‌పై భారీ డిస్కౌంట్లు అందిస్తోంది. దేశీ, విదేశీ యాత్రలపై భారీ తగ్గింపు ఇస్తోంది. ఇప్పటికే మొదలైన ఆఫర్ ఆగస్టు 31 వరకు ఉంటుంది. అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని కంపెనీ కోరింది. మరిన్ని వివరాలకు 7800 600 400 నంబర్‌ను సంప్రదించాలని తెలిపింది. సదరన్ ట్రావెల్స్ భారత ప్రభుత్వం నుంచి వరుసగా 8 సార్లు 'ది బెస్ట్ డొమెస్టిక్ టూర్ ఆపరేటర్'గా అవార్డు దక్కించుకుంది. ట్రావెల్ రంగంలో 50 ఏళ్లకు పైగా సేవలు అందిస్తోంది.

బజాజ్ ఆటో లాభం అప్

క్యూ1లో రూ. 2,210 కోట్లు



న్యూఢిల్లీ: ఈ ఏడాది (2025–26) తొలి త్రైమాసికంలో ద్విచక్ర, త్రిచక్ర వాహన రంగ దిగ్గజం బజాజ్ ఆటో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 14% వృద్ధితో రూ.2,210 కోట్లను అధిగమించింది. ప్రీమియం మోటార్‌సైకిళ్లు, ఎగుమతులు, చేతక్ ఎలక్ట్రిక్ స్కూటర్ అమ్మకాలు పుంజుకోవడం ఇందుకు సహకరించింది. గతేడాది (2024–25) ఇదే కాలంలో రూ.1,942 కోట్లు ఆర్జించింది. ఆదాయం రూ. 11,932 కోట్ల నుంచి రూ. 13,133 కోట్లకు జంప్ చేసింది. ఈ కాలంలో 1% అధికంగా మొత్తం 11,11,237 వాహనాలను విక్రయించింది.

బజాజ్ ఆటో షేరు 0.6% తగ్గి రూ. 8,177 వద్ద ముగిసింది.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

నాణ్యమైన న్యాయ విద్యకు.. క్లాట్

- క్లాట్ యూజీ, పీజీ 2026 నోటిఫికేషన్ విడుదల
- 25 జాతీయ లా వర్సిటీల్లో న్యాయ కోర్సుల్లో ప్రవేశాలు



కామన్ లా అడ్మిషన్ టెస్ట్.. క్లాట్! ఇది దేశంలోని జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాల్లో అండర్‌గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్ లా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే పరీక్ష. కన్సోర్టియం ఆఫ్ నేషనల్ లా యూనివర్సిటీ ఏటా ఈ పరీక్షను నిర్వహిస్తుంది. తాజాగా క్లాట్ 2026కు నోటిఫికేషన్ విడుదలైంది. 2026-2027 విద్యాసంవత్సరంలో దేశవ్యాప్తంగా ఉన్న 25 నేషనల్ లా యూనివర్సిటీలు అందించే ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్‌బీతోపాటు ఎల్ఎల్ఎం ప్రోగ్రామ్స్‌లో ప్రవేశాలు క్లాట్ 2026 ద్వారా చేపడతారు. ఈ నేపథ్యంలో.. క్లాట్ 2026 వివరాలు, ప్రవేశాలు, దరఖాస్తుకు అర్హతలు, పరీక్ష విధానం, సిలబస్ అంశాలు తదితర సమాచారం..

ప్రవేశం కల్పించే నేషనల్ లా యూనివర్సిటీలు

ఎన్ఎల్ఎస్ఐయూ–బెంగళూరు, నల్సార్(ఎన్ఏఎల్ఎస్ఏఆర్)–హైదరాబాద్, ఎన్ఎల్ఐయూ–భోపాల్, డబ్ల్యూబీఎన్‌యూజేఎస్–కోల్‌కతా, ఎన్ఎల్‌యూ –జోధ్‌పూర్, హెచ్ఎన్ఎల్‌యూ–రాయ్‌పూర్, జీఎన్ఎల్‌యూ–గాంధీనగర్, జీఎన్ఎల్‌యూ–సిల్వస్సా క్యాంపస్, సిల్వస్సా; ఆర్ఎంఎల్ఎన్ఎల్‌యూ–లక్నో, ఆర్‌జీఎన్‌యూఎల్–పంజాబ్, సీఎన్ఎల్‌యూ–పట్నా, ఎన్‌యూఏఎల్ఎస్–కొచి, ఎన్ఎల్‌యూఓ–ఒడిశా, ఎన్‌యూఎస్ఆర్ఎల్–రాంచీ, ఎన్ఎల్‌యూజేఏ–అస్సాం, డీఎస్ఎన్ఎల్‌యూ– విశాఖపట్నం, టీఎన్ఎన్ఎల్‌యూ–తిరుచిరాపల్లి, ఎంఎన్ఎల్‌యూ–ముంబై, ఎంఎన్ఎల్‌యూ–నాగ్‌పూర్, ఎంఎన్ఎల్‌యూ–ఔరంగాబాద్, హెచ్‌పీఎన్ఎల్‌యూ–సిమ్లా, డీఎన్ఎల్‌యూ–జబల్‌పూర్, డీబీఆర్ఏఎన్ఎల్‌యూ–హర్యానా, ఎన్ఎల్‌యూటీ–అగర్తలా, ఆర్‌పీఎన్ఎల్‌యూపీ–ప్రయాగ్‌రాజ్, ఐయూఎల్ఈఆర్–గోవా.

అర్హతలు

- క్లాట్ యూజీ(అండర్ గ్రాడ్యుయేట్)కి దరఖాస్తు చేసుకునేందుకు 10+2/ఇంటర్ కనీసం 45 శాతం మార్కులతో ఉత్తీర్ణులవ్వాలి. ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూడీ కేటగిరీ అభ్యర్థులు కనీసం 40 శాతం మార్కులు సాధించాలి. మార్చి/ఏప్రిల్ 2026లో 10+2/ఇంటర్ ఫైనల్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు కూడా దరఖాస్తుకు అర్హులే. క్లాట్ యూజీకి దరఖాస్తు చేసుకునేందుకు ఎలాంటి గరిష్ఠ వయోపరిమితి నిబంధన లేదు.
- క్లాట్ పీజీ(పోస్ట్‌గ్రాడ్యుయేట్)కి దరఖాస్తు చేసుకునేందుకు ఎల్ఎల్‌బీ డిగ్రీ లేదా తత్సమాన కోర్సును కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులవ్వాలి. ఎస్సీ /ఎస్టీ /పీడబ్ల్యూడీ కేటగిరీ అభ్యర్థులు కనీసం 45 శాతం మార్కులు సాధించాలి. ఏప్రిల్/మే 2026లో అర్హత కోర్సు ఫైనల్ పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులు కూడా దరఖాస్తుకు అర్హులే. క్లాట్ పీజీకి దరఖాస్తు చేసుకునేందుకు ఎలాంటి గరిష్ఠ వయోపరిమితి నిబంధన లేదు.

క్లాట్ యూజీ పరీక్ష విధానం

క్లాట్ యూజీ పరీక్షలో ఐదు విభాగాల నుంచి మొత్తం 120 ఆబ్జెక్టివ్ తరహా మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఉంటాయి. ప్రతి పశ్నకు ఒక మార్కు. పరీక్ష సమయం రెండు గంటలు. ఈ పరీక్షలో నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 0.25 మార్కులను తగ్గిస్తారు. ఇందులో ఇంగ్లిష్ లాంగ్వేజ్‌పై 22–26 ప్రశ్నలు ఉంటాయి. జనరల్ నాలెడ్జ్‌తోపాటు కరెంట్ అఫైర్స్ విభాగంలో 28–32 ప్రశ్నలు అడుగుతారు. అదేవిధంగా లీగల్ రీజనింగ్ నుంచి 28–32 ప్రశ్నలు ఉంటాయి. లాజికల్ రీజనింగ్‌పై 22–26 ప్రశ్నలు అడుగుతారు. క్వాంటిటేటివ్ టెక్నిక్స్ విభాగంలో 10–14 ప్రశ్నలు అడుగుతారు.

క్లాట్ యూజీలో రాణించేలా

- క్లాట్ యూజీ పరీక్షలో అభ్యర్థి కాంప్రెహెన్షన్, రీజనింగ్ స్కిల్స్, సామర్థ్యాలను పరిశీలించేలా ప్రశ్నలు ఉంటాయి. ముఖ్యంగా న్యాయ విద్యలో రాణించేందుకు అవసరమైన అప్టిట్యూడ్‌ను, స్కిల్స్‌ను పరీక్షిస్తారు.
- ఇంగ్లిష్ విభాగంలో 450 పదాలతో ప్యాసేజ్‌లు ఇస్తారు. ఇవి చారిత్రకంగా, ప్రస్తుత పరిస్థితుల్లో ప్రాధాన్యం సంతరించుకున్న ఫిక్షన్, నాన్ ఫిక్షన్ రచనల నుంచి ఉంటాయి. సాధారణంగా ఈ ప్యాసేజ్‌లు 10+2 స్థాయిలోనే ఉంటాయి. ఆయా ప్యాసేజ్‌ల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్యాసేజ్‌లో చర్చించిన ప్రధాన అంశాన్ని గుర్తించడం, అనుకూల–ప్రతికూల వాదనలను అవగాహన చేసుకోవడం, విభిన్న వాదనలను పోల్చగలగడంతోపాటు ప్యాసేజ్‌లో పేర్కొన్న వివిధ ఆంగ్ల పదాలకు అర్థాలు తెలుసా లేదా అనే కోణంలో పరీక్షిస్తారు.
- కరెంట్ అఫైర్స్, జనరల్ నాలెడ్జ్ విభాగంలో.. వార్తాంశాలు, వివిధ జర్నలిజం విభాగాలు, ఇతర నాన్ ఫిక్షన్ రచనల నుంచి 450 పదాలతో ప్యాసేజ్‌లు ఉంటాయి. ఈ ప్యాసేజ్‌ల ద్వారా అడిగే ప్రశ్నల ద్వారా ప్రపంచంలో, భారత్‌లో జరుగుతున్న తాజా పరిణామాలపై అభ్యర్థికి ఉన్న అవగాహనను పరిశీలిస్తారు. అదేవిధంగా చరిత్ర, సంస్కృతి, అంతర్జాతీయ అంశాలు, చారిత్ర సంఘటనలపై ఉన్న పరిజ్ఞానాన్ని పరీక్షిస్తారు.
- లీగల్ రీజనింగ్ విభాగంలో.. న్యాయ అంశాలు, పబ్లిక్ పాలసీ, నైతిక తత్వాలకు సంబంధించిన అంశాలపై 450 పదాలతో వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించే ప్యాసేజ్‌లు అడుగుతారు. వీటి ద్వారా అడిగే ప్రశ్నలు అభ్యర్థి నిబంధనలు, నియమాలను అనుసరించే సామర్థ్యాన్ని పరిశీలించేలా ఉంటాయి. నిబంధనలు, సూత్రాలను వివిధ వాస్తవ పరిస్థితులకు అన్వయించే నైపుణ్యాన్ని పరీక్షిస్తారు.
- లాజికల్ రీజనింగ్ విభాగంలో.. 450 పదాలున్న చిన్న చిన్న పలు ప్యాసేజ్‌లను ఇస్తారు. వీటి ద్వారా అడిగే ప్రశ్నలు అభ్యర్థి హేతుబద్ధ నైపుణ్యాలను పరిశీలించేలా ఉంటాయి. వీటికి సమాధానాలు ఇచ్చేందుకు వాదనను, నేపథ్యాన్ని, ముగింపును గుర్తించగలిగే నైపుణ్యాలు పెంచుకోవాలి. ప్యాసేజ్‌లో పేర్కొన్న విభిన్న వాదనలను గుర్తించగలగాలి. దీంతోపాటు హేతుబద్ధ నమూనాలను విమర్శనాత్మకంగా విశ్లేషించడం, నిర్దేశిత ఆధారాలపై తుది అంచనాకు రావడం, వాదనలను బలపర్చడం, బలహీన పరచడం వంటి స్కిల్స్‌ను పరిశీలిస్తారు. సంబంధాలను, అనాలజీస్‌ను గుర్తించగలగాలి.
- క్వాంటిటేటివ్ టెక్నిక్స్ విభాగంలో.. చిన్న గణాంకాలు, న్యూమరికల్ సమాచారం ఆధారంగా ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు ఇచ్చిన ప్యాసేజ్‌లు, లేదా గణిత సూత్రాల ఆధారంగా సమాధానం రాబట్టాల్సి ఉంటుంది. పదో తరగతి స్థాయి గణిత అంశాలైన రేషియోస్, ప్రపోర్షన్స్, బేసిక్ ఆల్జీబ్రా, మెన్సురేషన్, స్టాటిస్టికల్ ఎస్టిమేషన్స్ వంటి గణిత సూత్రాలను అన్వయించడం ద్వారా సమాధానాలు గుర్తించేలా ప్రశ్నలు ఉంటాయి. ఈ విభాగంలో రాణించేందుకు అభ్యర్థులు పదో తరగతి స్థాయి గణిత సూత్రాలపై పట్టు సాధించాలి.

క్లాట్ పీజీ ఇలా

క్లాట్ పీజీ పరీక్షలో మొత్తం 120 ఆబ్జెక్టివ్ తరహా మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఉంటాయి. ప్రతి పశ్నకు ఒక మార్కు. పరీక్ష సమయం రెండు గంటలు. ఇందులో నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 0.25 మార్కులు తగ్గిస్తారు. క్లాట్ పీజీ ప్రశ్న పత్రంలో కాన్స్టిట్యూషనల్ లాతో పాటు, జురిస్‌ప్రుడెన్స్, అడ్మినిస్ట్రేటివ్ లా, లా ఆఫ్ కాంట్రాక్ట్, టార్ట్స్, ఫ్యామిలీ లా, క్రిమినల్ లా, ప్రాపర్టీ లా, కంపెనీ లా, పబ్లిక్ ఇంటర్నేషనల్ లా, ట్యాక్స్ లా, ఎన్విరాన్‌మెంటల్ లా, లేబర్ అండ్ ఇండస్ట్రియల్ లా నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఇందులో ముఖ్యమైన తీర్పుల నుంచి ప్యాసేజ్‌లను ఇస్తారు. ప్రతి ప్యాసేజ్‌పై పలు ప్రశ్నలు అడుగుతారు. వీటికి సరైన సమాధానాలు గుర్తించేందుకు అభ్యర్థికి ఆయా ప్యాసేజ్‌లో చర్చించిన ముఖ్యాంశాలను, వాదనలను గుర్తించి అవగాహన చేసుకునే నైపుణ్యం అవసరం. ఆయా సేజ్‌లో పేర్కొన్న న్యాయ అంశాలు, వాస్తవ సమాచారం, తీర్పుల గురించిన అవగాహన ఉండాలి. అదేవిధంగా ప్యాసేజ్‌ను సంక్షిప్తీకరించే నైపుణ్యం ప్రదర్శించగలగాలి. అభ్యర్థి న్యాయ విభాగంలో తనకున్న పరిజ్ఞానాన్ని అన్వయించి సమాధానాలు గుర్తించగలగాలి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం: 01.08.2025
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: 31.10.2025
- క్లాట్ 2026 పరీక్ష తేదీ: 07.12.2025
- వెబ్‌సైట్: https://consortiumofnlus.ac.in/clat-2026

విద్య, ఉద్యోగ సమాచారం

గేట్ 2026

ఐఐటీల్లో మాస్టర్స్, పీహెచ్‌డీ వంటి కోర్సుల తోపాటు ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగాలకు వీలు కల్పించే ప్రతిష్టాత్మక పరీక్ష.. గ్రాడ్యుయేట్ అప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్(గేట్)–2026కు షెడ్యూల్ విడుదలైంది. గేట్ 2026 నిర్వాహక సంస్థగా ఐఐటీ గౌహతి వ్యవహరించనుంది. మొత్తం 30 టెస్ట్ పేపర్లలో ఈ పరీక్ష నిర్వహించనున్నారు.

అర్హతలు

ఇంజనీరింగ్/ టెక్నాలజీ/ ఆర్కిటెక్చర్/ సైన్స్/ కామర్స్/ఆర్ట్స్/హుమానిటీస్ విభాగాల్లో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సు ఉత్తీర్ణులు లేదా ఆయా అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల మూడో ఏడాది చదువుతున్న విద్యార్థులు గేట్ 2026కు దరఖాస్తు చేసుకోవచ్చు.

పరీక్ష విధానం

గేట్ 2026 పరీక్షను కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో వంద మార్కులకు నిర్వహిస్తారు. సంబంధిత సబ్జెక్టుతోపాటు జనరల్ అప్టిట్యూడ్, ఇంజనీరింగ్ మ్యాథమెటిక్స్ తదితర అంశాలపై ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్న పత్రం ఇంగ్లిష్ మీడియంలో ఉంటుంది. పరీక్ష వ్యవధి మూడు గంటలు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం: 25.08.2025
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: 25.09.2025
- ఆలస్య రుసుముతో దరఖాస్తులకు చివరి తేదీ: 06.10.2025
- పరీక్ష తేదీలు: 2026 ఫిబ్రవరి 07, 08, 14, 15
- వెబ్‌సైట్: https://gate2026.iitg.ac.in

ఇండియన్ నేవీలో 260 షార్ట్ సర్వీస్ కమిషన్ ఆఫీసర్ పోస్టులు

ఎజిమల(కేరళ)లోని ఇండియన్ నేవల్ అకాడమి(ఐఎన్ఏ)లో 2026 జూన్ నుంచి ప్రారంభమయ్యే షార్ట్ సర్వీస్ కమిషన్(ఎస్ఎస్‌సీ) కోర్సులో ప్రవేశాలకు సంబంధించి అర్హులైన అవివాహిత పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం ఖాళీల సంఖ్య: 260.
- ఖాళీల వివరాలు: ఎగ్జిక్యూటివ్ బ్రాంచ్(జీఎస్(ఎక్స్)/హైడ్రో కేడర్)–57, పైలట్–24, నావల్ ఎయిర్ ఆపరేషన్స్ ఆఫీసర్(అబ్జర్వర్స్)–20, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్(ఏటీసీ)–20, లాజిస్టిక్స్–10,నావల్ ఆర్మమెంట్ ఇన్‌స్పెక్టరేట్ కేడర్–20, లా–02, ఎడ్యుకేషన్–15, ఇంజనీరింగ్ బ్రాంచ్(జనరల్ సర్వీస్)–36, ఎలక్ట్రికల్ బ్రాంచ్(జనరల్ సర్వీస్)–40,నావల్ కన్‌స్ట్రక్టర్–16.
- అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఎస్సీ, బీకాం, బీఈ, బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ, ఎంఎస్సీ, లా, డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక /వైద్య ప్రమాణాలు కలిగి ఉండాలి.
- వయసు: 02.07.2001 నుంచి 01.07.2007 మధ్య జన్మించిన అభ్యర్థులు అర్హులు.
- ప్రారంభ వేతనం: నెలకు రూ.1,10,000.
- ఎంపిక విధానం: విద్యార్హతల్లో సాధించిన మార్కులు, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 09.08.2025.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 01.09.2025
- వెబ్‌సైట్: www.joinindiannavy.gov.in

ఓఐసీఎల్, న్యూఢిల్లీలో 500 అసిస్టెంట్ పోస్టులు

న్యూఢిల్లీలో ఒరియంటల్ ఇన్సురెన్స్ కంపెనీ లిమిటెడ్(ఓఐసీఎల్).. క్లాస్–3 కేడర్–అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం పోస్టుల సంఖ్య: 500.
- అర్హత: ఏదైనా విభాగంలో గ్రాడ్యుయేట్ ఉత్తీర్ణులవ్వాలి. ఎస్ఎస్‌సీ/హెచ్ఎస్‌సీ/ ఇంటర్మీడియట్/డిగ్రీలో ఇంగ్లిష్ సబ్జెక్టులో ఉత్తీర్ణులై ఉండాలి. దరఖాస్తు చేసిన స్టేట్/యూనియన్ టెరిటరీ రీజనల్ లాంగ్వేజ్‌లో చదవడం, రాయడం, మాట్లాడడం వచ్చి ఉండాలి.
- వయసు: 31.07.2025 నాటికి 21 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
- వేతనం: నెలకు రూ.22,405 నుంచి 62,265.
- ఎంపిక విధానం: ప్రిలిమినరీ పరీక్ష(టైర్–1), మెయిన్స్ పరీక్ష(టైర్–2), రీజనల్ లాంగ్వేజ్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 17.08.2025
- ప్రిలిమినరీ పరీక్ష తేది: 07.09.2025.
- మెయిన్ పరీక్ష తేది: 28.10.2025.
- వెబ్‌సైట్: https://orientalinsurance.org.in

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–ఇండియన్ హిస్టరీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం–ఫిజిక్స్
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–జనరల్ స్టడీస్–జాగ్రఫీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం– రీజనింగ్

ఇంట్రెస్ట్ పోయింది!

విసిగిపోయిన భారతీయ విద్యార్థులు

అన్నీ అడ్డంకులూ, అంతరాయాలే!

ఎఫ్‌–1 వీసాల జారీలో తీవ్ర జాప్యం

దెబ్బకొట్టేసిన 'ఓపీటీ' చట్ట ప్రతిపాదనలు

'ఫాల్‌'లో 25 శాతం వరకు తగ్గిన ప్రవేశాలు!



వీసా వస్తే వచ్చింది.. పోతే పోయింది

అమెరికాలో ఇది 'ఆటమ్ / ఫాల్' అడ్మిషన్ల సీజన్. యూనివర్సిటీల ప్రాంగణాలన్నీ అంతర్జాతీయ విద్యార్థులతో కళకళలాడాల్సిన సమయం. కానీ ఈ సెమిస్టర్‌లో (సెప్టెంబర్–అక్టోబర్–నవంబర్) తరగతి గదులు వెలవెలబోనున్నాయి. అందుకు కారణం .. మారిన నిబంధనలు, నిరంతర అంతరాయాలు! విద్యార్థులకు ఇచ్చే ఎఫ్–1 వీసాల ప్రాసెసింగ్ తీరుబడిగా సాగుతోంది. చదువు పూర్తయ్యాక ఉద్యోగం చేయటానికి అనుమతి ఇచ్చే 'ఓపీటీ' మార్పులపై అమెరికన్ కాంగ్రెస్ ఇంకా ఏమీ తేల్చలేదు. దీంతో విద్యార్థులు.. ముఖ్యంగా భారతీయ విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఏం చేయాలో తోచడం లేదట. వీసా వస్తే వచ్చింది.. పోతే పోయింది.. ఏదైతే అది జరగనీ అనుకుంటున్నారట. పర్యవసానమే.. ఖాళీగా ఉన్న కాలేజీ సీట్లు.

వీసాల జారీలో జాప్యం, 'ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రెనింగ్' (ఓపీటీ) పై అనిశ్చితి కారణంగా 2025 సెప్టెంబర్–అక్టోబర్–నవంబర్ సెమిస్టర్‌కు గాను, అమెరికన్ విశ్వవిద్యాలయాలలో భారతీయ విద్యార్థుల ప్రవేశాలు 20–25% వరకు తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. దాదాపు నెల రోజుల పాటు స్తంభించిపోయిన యూఎస్ స్టూడెంట్ వీసా నియామకాలు, ఓపీటీల భవిష్యత్తుపై కొనసాగుతున్న అస్పష్టత భారతీయ విద్యార్థులను సందిగ్ధంలో ఉంచి, అమెరికన్ విశ్వవిద్యాలయాలలో భారతీయ విద్యార్థుల ప్రవేశాల శాతం పడిపోటానికి దారి తీశాయని ఇండియాలోని 'స్టడీ–అబ్రాడ్' కేంద్రాలు చెబుతున్నాయి.

విరామం తొలగినా..!

అమెరికన్ ప్రభుత్వం ఈ ఏడాది మే 27 నుంచి జూన్ 18 వరకు కీలకమైన కాల వ్యవధిలో విద్యార్థి వీసా నియామకాలపై విరామం ఇచ్చింది. వీసా సేవలపై విరామం తొలగి తిరిగి అవి ప్రారంభమైన ప్పటికీ, స్లాట్ లభ్యత పరిమితంగానే ఉంటోంది. దీంతో తమ దరఖాస్తులకు ఎప్పటికి విముక్తి లభిస్తుందో తెలియక భారతీయ విద్యార్థులు అయోమయంలో పడ్డారు.

27 శాతం తగ్గుదల

2025 మార్చి–మే మధ్య జారీ అయిన ఎఫ్–1 విద్యార్థి వీసాలు.. గత సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే 27% క్షీణించాయి. ఈ సంవత్సరం మార్చి–మే మధ్య భారతీయ విద్యార్థులు 9,906 ఎఫ్–1 (విద్యా) వీసాలను పొందారు. గత ఏడాది ఇదే కాలంలో 13,478 వీసాలను అందుకున్నారు. అమెరికాలోని ప్రధాన విశ్వవిద్యాలయాల్లో ఆటమ్ సెమిస్టర్ ప్రవేశాలకు అంతర్జాతీయ విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటారు కనుక సాధారణంగా మే–జూలై మధ్య అత్యధిక సంఖ్యలో ఎఫ్–1 వీసాల ప్రాసెస్ జరుగుతుంది. దాదాపు 70 శాతం అంతర్జాతీయ విద్యార్థి వీసాలు ఈ వ్యవధిలో జారీ అవుతాయి. కానీ ఈ సంఖ్య భారీగా తగ్గిందని సమాచారం.

లేఖ రాయాల్సి వచ్చింది

2025 ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో.. అంటే అక్టోబరు 2024 నుంచి మార్చి 2025 వరకు చూస్తే.. సోషల్ మీడియా వెట్టింగ్, స్టూడెంట్ వీసా ఇంటర్వ్యూలు నిలుపుదల వంటి చర్యల ఫలితంగా అమెరికా జారీ చేసే మొత్తం ఎఫ్1 వీసాలు భారీగా తగ్గాయి. అంతకుముందు ఏడాది ఇదే సమయంతో పోలిస్తే 15 శాతం తగ్గి, 89,000 వీసాలే జారీ వచ్చాయి. ఇక మనదేశం విషయానికొస్తే. ఏకంగా 44 శాతం తగ్గి, 14,700 జారీ అయ్యాయి. అయినా విదేశీ విద్యార్థుల సంఖ్యలో మనమే మొదటి స్థానంలో ఉండటం విశేషం. ఈ నేపథ్యంలో ఈ ఏడాది జులై 24న అమెరికన్ కాంగ్రెస్ సభ్యుల బృందం ఒకటి వీసా అపా యింట్‌మెంట్లలో జాప్యాన్ని నివారించాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరిందట. ఫాల్ సెమిస్టర్‌లో భారత విద్యార్థులు క్లాసులకు హాజరవ్వడానికి.. వారికి వీసా ప్రాసెసింగ్‌లో ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ఉండేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటోందో ఆగస్టు 8 లోగా తెలియజేయాల్సిందిగా వారు కోరారట.

ఎటూ తేలని ఓపీటీ

విద్యానంతరం అంతర్జాతీయ విద్యార్థులు ఉద్యోగాల కోసం అమెరికాలో తాత్కాలికంగా ఉండేందుకు వీలు కల్పించే, అత్యంత ప్రజాదరణ కలిగిన ఆప్షన్ ప్రాక్టికల్ ట్రెనింగ్ (ఓపీటీ)కి సంబంధించి యూఎస్ కాంగ్రెస్ ప్రతిపాదనలు నిలిచిపోవటంతో అస్పష్టత ఏర్పడింది. మరోవైపు గత ఏప్రిల్‌లో ప్రతినిధుల సభలో హెచ్.ఆర్. 2315 అనే కొత్త బిల్లును ప్రవేశపెట్టారు. దీని లక్ష్యం ఎఫ్–1 వీసాలపై అంతర్జాతీయ విద్యార్థుల ఓపీటీని తొలగించడం. అదీగాక, గత నెలలోనే కాంగ్రెస్ సభ్యులు 2025 డిగ్నిటీ చట్టాన్ని ప్రవేశపెట్టారు. ఈ చట్టం ఓపీటీ ద్వారా విదేశీ ఉద్యోగులు పొందే ఆదాయాలను అదనపు పన్నుల విధింపు పరిధిలోకి తెస్తుంది.

యూనివర్సిటీలకు నష్టం

ఓపీటీ కీలకమైన ఉద్యోగ అనుభవంగా పనికొస్తుందన్న ఆశతో, చదువు కోసం తీసుకున్న రుణాలను తీర్చుకునే ఏకైక మార్గంగా ఓపీటీపై ఆధారపడిపడిన భారతీయ విద్యార్థులకు.. అమెరికా చట్ట సభల ప్రతిపాదనలు తీవ్ర నిరాశను మిగిల్చాయి. చాలామంది తమ యూఎస్ ప్రణాళికలను వాయిదా వేయడానికి లేదా రద్దు చేసుకోటానికి మొగ్గు చూపుతున్నారు. దీంతో అమెరికన్ విశ్వవిద్యాలయాలలో చేరవలసిన భారతీయ విద్యార్థుల శాతం గణనీయంగా తగ్గింది. అంతర్జాతీయ విద్యార్థులపై అమలవుతున్న ట్రంప్ పరిపాలనా నిర్బంధ విధానాలు అనేక యూఎస్ ఉన్నత విద్యా సంస్థలకు ఆర్థిక నష్టాన్ని కలిగిస్తాయని, తద్వారా విద్యార్థులు నమోదు తగ్గుతుందని ఇటీవలే మూడీస్ రేటింగ్స్ వెల్లడించటం గమనార్హం.

చైనాను దాటేసిన భారత్.. ప్రస్తుతం ఇండియానే యూఎస్ విశ్వవిద్యాలయాలకు అతిపెద్ద మార్కెట్. భారత్ తర్వాతి స్థానాలలో చైనా, దక్షిణ కొరియా ఉన్నాయి. 2024లో భారతదేశం 3,31,602 మంది విద్యార్థులను యూఎస్‌కు పంపింది. అంతకుముందు సంవత్సరంతో పోలిస్తే ఇది 23 శాతం ఎక్కువ.

క్లుప్తంగా...



పవిత్రోత్సవాలు పరిసమాప్తం

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో పవిత్రోత్సవాలు వైభవంగా ముగిశాయి. ఈ నెల 4న ప్రారంభమైన ఉత్సవాలు బుధవారం శ్రీస్వామి వారికి పవిత్రమాలలు సమర్పించడంతో పరిసమాప్తం అయినట్లు ఆలయ అర్చకులు వెల్లడించారు. ఉదయం ఆలయంలో ద్వార తోరణ, ధ్వజ కుంభారాధన, చతుఃస్థానార్చన, మూలమంత్ర హోమం వంటి పూజలు నిర్వహించారు. అనంతరం మహా పూర్ణాహుతిని జరిపించి, శ్రీస్వామి వారికి పవిత్రమాలలు వేసి పూజలు నిర్వహించారు. ఆయా వేడుకల్లో ఆలయ ఈఓ వెంకట్రావ్, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, అర్చకులు, అధికారులు పాల్గొన్నారు. కాగా, రెండు రోజులుగా రద్దు చేసిన శాశ్వత, నిత్య సుదర్శన హోమం, కల్యాణం, బ్రహ్మోత్సవ పూజలు గురువారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి.

'సాక్షి' ఫొటో జర్నలిస్ట్‌కు జాతీయ అవార్డు





సాక్షి, హైదరాబాద్: ప్రపంచ గిరిజన దినోత్సవం –2025 సందర్భంగా నిర్వహించిన జాతీయ ఫొటోగ్రఫీ పోటీల్లో నల్లగొండ సాక్షి సీనియర్ ఫొటో జర్నలిస్ట్ కంది భజరంగ్ ప్రసాద్ తీసిన ఫొటోకు జాతీయ అవార్డు లభించింది. గిరిజన సంస్కృతి విభాగం కింద ఆయన తీసిన ఫొటో ఈ అవార్డుకు ఎంపికైంది. ఈ విషయాన్ని ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక చైర్మన్, కార్యదర్శి టి.శ్రీనివాసరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18న విజయవాడలోని ఎంబీవీకే బాలోత్సవ్ భవన్‌లో జరిగే కార్యక్రమంలో అవార్డును అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా, ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రాఫిక్ కౌన్సిల్‌తో కలిసి ఏపీ స్టేట్ క్రియేటివిటీ అండ్ కల్చర్ కమిషన్ ఈ పోటీని నిర్వహించింది.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు క్లియర్

- యుద్ధప్రాతిపదికన ఆ మొత్తం చెల్లించాలని ఆర్టీసీకి ప్రభుత్వ ఆదేశం
- ప్రత్యేకంగా హడ్కో నుంచి రూ.300 కోట్ల రుణం తీసుకున్న సంస్థ
- రిటైర్డ్ ఉద్యోగుల ఆవేదనపై 'సాక్షి' కథనానికి స్పందన



సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీలో పదవీ విరమణ చేసి ఆర్థిక ప్రయోజనాలు అందక ఏళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరిగి అలసిసొలసి చివరకు ప్రతి సోమవారం రోడ్డెక్కి నిరసనలు తెలిపేందుకు సిద్ధమైన వృద్ధులకు తీపి కబురు ఇది. ఏళ్లుగా పేరుకుపోయిన బకాయిలు చెల్లించేందుకు ఆర్టీసీ సిద్ధమైంది. ఇందుకోసం ప్రత్యేకంగా రూ.300 కోట్లు సిద్ధం చేసుకుంది. అందుకు కావాల్సిన మొత్తాన్ని హడ్కో నుంచి రుణంగా పొందింది. దాదాపు 16 వేల మంది విశ్రాంత ఉద్యోగుల ఆవేదనను కళ్లకు కడుతూ గత నెల 27న సాక్షి ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. దీనికి స్పందించిన రాష్ట్రప్రభుత్వం, ఆ వృద్ధ కుటుంబాలకు వెంటనే ఆర్థిక ప్రయోజనాలు అందజేయాల్సిందిగా ఆర్టీసీని ఆదేశించింది.

2017 వేతన సవరణ ఫిట్‌మెంట్ 2024 జూన్ నుంచి అమలులోకి రాగా, ఆ ఏడాది మే వరకు రిటైర్ అయిన అందరికీ ఇప్పుడు ఆ బకాయిలు చెల్లించాల్సి ఉంది. పనిచేసిన కాలంలో 300 వరకు పేరుకునే ఆర్జిత సెలవుల (దాదాపు 10 నెలల వేతనంతో సమానం) మొత్తాన్ని కూడా రిటైర్మెంట్ సమయంలో ఉద్యోగులకు ఇవ్వాల్సి ఉండగా ఇది కూడా బకాయి ఉంది. 2017 వేతన సవరణతో జీతాలు పెరిగినందున, ఆర్జిత సెలవు బకాయిలు కూడా పెరుగుతాయి. 2019 జూలై నుంచి ఆర్టీసీలో డీఏల చెల్లింపు నిలిచిపోయింది. గతేడాది ఒకేసారి ఐదు పెండింగు డీఏలను చెల్లించారు. ఈ మధ్య కాలంలో రిటైర్ అయినవారికి ఆ లబ్ధి ఇవ్వలేదు. ఒక్కో పెండింగ్ డీఏ నికరంగా 2.5 శాతం నుంచి 3.2 శాతం మధ్య ఉంది. ఆ మొత్తం కూడా రిటైర్డ్ ఉద్యోగులకు భారీగా లభించాల్సి ఉంది. గ్రాట్యుటీపై 2017 వేతన సవరణ ప్రభావాన్ని లెక్కగట్టి ఇవ్వాల్సి ఉంది. వేతన సవరణతో పెరిగే జీతం ప్రకారం పీఎఫ్ మొత్తం కూడా పెరుగుతుంది. ఆ పెరిగిన మొత్తాన్ని ఇవ్వలేదు. ఆర్టీసీ సహకార పరపతి సంఘంలో రిటైర్డ్ ఉద్యోగులు అధిక వడ్డీ ఆశతో దాచుకున్న మొత్తాలపై ప్రస్తుతం వడ్డీ చెల్లింపు నిలిచిపోయింది. చాలామందికి ఆ బకాయి కూడా పేరుకుపోయి ఉంది. ఈ లబ్ధి పొందకుండానే పలువురు చనిపోయారు. ఇలా.. రిటైర్డ్ ఉద్యోగుల ఆవేదనను 'సాక్షి'ఆ కథనంలో వివరించింది. దీనికి స్పందించిన ప్రభుత్వం ఆ ప్రయోజనాలను తక్షణం చెల్లించాలని ఆదేశించింది. దీంతో రిటైర్డ్ ఉద్యోగుల వివరాలను ఆడిట్ చేయించి ఈనెల 13లోపు అందించాలని ఆర్టీసీ అన్ని డిపోలను ఆదేశించింది. ఆ వివరాలు అందిన వెంటనే బకాయిల చెల్లింపునకు చర్యలు తీసుకోబోతోంది.

రక్షా బంధన్. పోషణ బంధం





ఆడపిల్లలను రక్షిద్దాం, ఆడపిల్లలను చదివిద్దాం అంటూ పోషణ బంధం రాఖీ.. వ్యసనాలకు లోనుకాకు, మత్తువదులూ అంటూ సోదరబంధం రాఖీలతో కొత్త రాఖీలకు శ్రీకారం చుట్టింది పెద్దపల్లి జిల్లా స్త్రీ శిశుసంక్షేమ శాఖ. పోషకాహారం, మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తనదైన శైలిలో సరికొత్త మార్గంలో రాఖీ వేడుకలకు సన్నద్ధమవుతోంది. జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ అభియాన్ పథకంలో భాగంగా చిన్నారులకు పోషణ బంధం రాఖీల పంపిణీ.. ప్రభుత్వ కళాశాలల్లోని యువతకు మిషన్ పరివర్తన నషాముక్త్‌భారత్ అభియాన్ పథకంలో భాగంగా సోదరబంధం రాఖీలు పంపిణీ చేసి రక్షాబంధన్ వేడుకలు నిర్వహించనుంది. జిల్లా సంక్షేమ శాఖ అధికారి వేణుగోపాల్ వీటికి సోదరబంధం, పోషణ బంధం రాఖీలుగా నామకరణం చేసి ఈ ఏడాది ప్రతీ అంగన్‌వాడీ బడిలోనూ, కళాశాలల్లోనూ రాఖీ వేడుకలు జరిగేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

నేతన్నలకు కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డులు

- అవార్డుకు మొత్తం 33 మందిని ఎంపిక చేసిన ప్రభుత్వం
- జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నేడు ప్రదానం

సాక్షి, హైదరాబాద్: జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో గురువారం ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని 33 మంది నేత కార్మికులు, డిజైనర్లకు కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డులు ప్రదానం చేయనున్నారు. అవార్డుకు ఎంపికైన 33 మంది జాబితాను జిల్లాలవారీగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. తుమ్మ రామస్వామి, గుర్రం కొండయ్య (కరీంనగర్).. లిక్కి శంకరయ్య (మంచిర్యాల).. కంచె నర్సింగరావు (వరంగల్).. న్యాలపల్లి విజయ ప్రకాశ్ (జనగామ).. ఎల్ది రేఖ (రాజన్న సిరిసిల్ల).. గంజిం శ్రీనివాస్, గుర్రం చంద్రమౌళి (రంగారెడ్డి).. కర్దాసు రమేశ్ (హైదరాబాద్).. జిందం రాజేశం, మంతూరు వెంకటేశం (సిద్దిపేట).. గూడ పవన్, కొలను శంకర్, సామల భాస్కర్, మంగళపల్లి శ్రీహరి, చెలిమల కృష్ణ (యాదాద్రి భువనగిరి).. కర్నాటి సద్గురు, చిలుకూరి శ్రీనివాసులు, చిట్టిపోలు ధనుంజయ, గాజుల అనిల్, గుర్రం యాదయ్య, మునగపాటి శ్రీనివాస్, కర్నాటి కృష్ణయ్య, అవరి రవీంద్ర (నల్లగొండ).. జన్ను ఆంజనేయులు, యాంగల్ ఆంజనేయులు (నారాయణపేట).. సూర్య వెంకటేశ్, లక్ష్మి (జోగుళాంబ గద్వాల).. దేవరకొండ సీతన్న, శీల బుడ్డన్న, మహంకాళి సులోచన, సారంగి రాములు (వనపర్తి)కి అవార్డులు దక్కాయి.

చేనేత పాగా.. పుట్టపాక | సాక్షి ఫ్లస్ ఈ-పేపర్‌లో

31న ఉద్యోగ విరమణ.. అంతలోనే ఏసీబీకి చిక్కి...

- జేసీబీని సీజ్ చేయకుండా ఉండేందుకు డీటీఓ లంచం డిమాండ్



ఏసీబీకి చిక్కిన డీటీవో భద్రునాయక్, ఆయన డ్రైవర్ అరవింద్

జగిత్యాలక్రైం: ఈ నెల 31న ఉద్యోగ విరమణ చేయనున్న జగిత్యాల జిల్లా రవాణా అధికారి (డీటీవో) బానోవత్ భద్రునాయక్ ఏసీబీకి చిక్కాడు. ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్ ఆ వివరాలు వెల్లడించారు. కోరుట్లకు చెందిన శశిధర్ జేసీబీని ఈ నెల 4న డీటీవో భద్రునాయక్ పట్టుకున్నారు. దానికి పొల్యూషన్, ఇన్సూరెన్స్ లేదని, సీజ్ చేస్తామని బెదిరించాడు. దీంతో వాహన యజమాని రూ.35 వేలు ఇచ్చేందుకు ఒప్పుకొని రూ.13వేలు చెల్లించాడు. మిగిలిన డబ్బుల కోసం శశిధర్ వద్దనున్న రెండు సెల్‌ఫోన్లను డీటీవో తీసుకున్నాడు. రెండుమూడు రోజుల్లో మిగతా డబ్బులు చెల్లించి.. అదేరోజు ఫోన్లు తీసుకుంటానని శశిధర్ చెప్పాడు. అనంతరం ఏసీబీని ఆశ్రయించాడు. తాను డీటీవో కార్యాలయానికి వచ్చినట్టు బుధవారం శశిధర్.. భద్రునాయక్‌కు సమాచారం ఇవ్వగా, తన వ్యక్తిగత డ్రైవర్ బానోవత్ అరవింద్‌కు డబ్బులు ఇవ్వాలని సూచించాడు. ఆయనకు డబ్బులు ఇస్తుండగా అప్పటికే కాపుకాస్తున్న ఏసీబీ అధికారులు అరవింద్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. భద్రునాయక్ సూచన మేరకే తాను డబ్బులు తీసుకున్నానని అరవింద్ చెప్పడంతో డీటీవోపై కేసు నమోదు చేసి నిందితులను కరీంనగర్‌లోని ఏసీబీ కోర్టుకు తరలించారు. కొద్దిరోజులుగా వాహనాల తనిఖీ పేరిట డీటీవో వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. చివరకు లంచం తీసుకుంటూనే ఆయన ఏసీబీకి చిక్కడం గమనార్హం.

బర్త్ సర్టిఫికెట్ కోసం వెళ్తే.. డెత్ సర్టిఫికెట్ ఇచ్చారు!



బర్త్ సర్టిఫికెట్ కోసం తీసిన చలానా ప్రతి



తహసీల్ నుంచి జారీ అయిన డెత్ సర్టిఫికెట్

నాలుగేళ్ల బాలిక పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేస్తే మరణ ధ్రువీకరణ పత్రం జారీ చేసిన తహసీల్ ఉద్యోగుల తీరు విమర్శలకు తావిచ్చింది. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం గట్టుసింగారం గ్రామానికి చెందిన కదారి ఉపేందర్ – మమత దంపతుల నాలుగేళ్ల కుమార్తెకు జనన ధ్రువీకరణ పత్రం కావాలని గతేడాది డిసెంబర్ 17న తహసీల్‌లో దరఖాస్తు ఇచ్చారు. నాటి నుంచి తిరుగుతుండగా రకరకాల సాకులు చెప్పిన ఉద్యోగులు.. ఎట్టకేలకు ఈనెల 4వ తేదీన సర్టిఫికెట్ జారీ చేశారు. కానీ అది డెత్ సర్టిఫికెట్ కావడంతో తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేయగా.. ఉద్యోగి తప్పుగా వచ్చిందంటూ దాన్ని వెనక్కి తీసుకుని చించేశారు. ఆపై బర్త్ సర్టిఫికెట్ ఇచ్చినా అందులో సరైన వివరాలు లేకపోవడంతో ప్రశ్నించగా.. ఆ ఉద్యోగి 'సర్టిఫికెట్ ఇవ్వడమే ఎక్కువ.. మళ్లీ ప్రశ్నిస్తారా'అంటూ ఆగ్రహం వ్యక్తం చేశాడని ఉపేందర్ తెలిపాడు. ఈ ఘటనపై తహసీల్దార్ రవికుమార్ స్పందిస్తూ, విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని, సరైన పత్రం జారీ చేస్తామని తెలిపారు.

కూసుమంచి

సంపాదనే ధ్యేయంగా సంతాన సాఫల్య కేంద్రాలు

వైద్యారోగ్య శాఖ తనిఖీల్లో నిగ్గు తేలిన నిజాలు

- గ్రేటర్‌లోని 271 సెంటర్లలో తనిఖీలు పూర్తి
- రిజిస్ట్రేషన్ నుంచి మొదలు సరోగసీ, ఐవీఎఫ్ చికిత్సల దాకా నిబంధనల ఉల్లంఘన



సాక్షి, హైదరాబాద్: సంతానం కోసం తపన పడే దంపతులను ఏమార్చి..రూ.లక్షలు ఆర్జించడమే లక్ష్యంగా రాష్ట్రంలో అత్యధిక సంతాన సాఫల్య కేంద్రాలు కొనసాగుతున్నట్టు ప్రభుత్వం ప్రాథమికంగా గుర్తించింది. రాష్ట్రం నలుమూలలనుంచే గాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సరోగసి, ఐవీఎఫ్ చికిత్స కోసం ఏటా వేలాదిగా వచ్చే గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని సంతాన సాఫల్య కేంద్రాల్లో 50 శాతం నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి.. ధనార్జనే ధ్యేయంగా దందా సాగిస్తున్నట్టు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ గుర్తించింది. నిబంధనలు పాటించని సరోగసీ, ఐవీఎఫ్ చికిత్సలు చేసే సంతాన సాఫల్య కేంద్రాలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని నిర్ణయించింది. 'సృష్టి ఫెర్టిలిటీ కేంద్రం'అంశం సంచలనం సృష్టించడంతో ప్రభుత్వం స్పందించింది. రాష్ట్రంలోని అన్ని ఫెర్టిలిటీ కేంద్రాల్లో తనిఖీలు చేయాలని వైద్య, ఆరోగ్యశాఖను ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఆరోగ్యశాఖ తరఫున 35 బృందాలు తొలుత గ్రేటర్ పరిధిలో తనిఖీలు చేపట్టాయి.

రాష్ట్రంలో 381 సంతాన సాఫల్య కేంద్రాలు

రాష్ట్రవ్యాప్తంగా 381 సంతాన సాఫల్య కేంద్రాలుంటే, వీటిలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలోని 271 కేంద్రాలను వైద్య బృందాలు తనిఖీ చేశాయి. బుధవారంతో తనిఖీల ప్రక్రియ ముగిసింది.

- మెజారిటీ కేంద్రాల్లో కనీస నిబంధనలు కూడా పాటించడం లేదని తనిఖీ బృందాలు గుర్తించాయి.
- ఆరోగ్యశాఖకు సమర్పించిన నివేదికలో చూపించిన డాక్టర్లు, సిబ్బందికి అక్కడ పనిచేసే సంఖ్యకు, పేర్లకు పొంతన లేదని తేలింది.
- రికార్డుల్లో చూపిన అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రాలకు, అక్కడున్న సంఖ్యకు కూడా పొంతన లేదని తనిఖీల్లో వెల్లడైంది. ఒక ఫెర్టిలిటీ కేంద్రం రిజిస్ట్రేషన్ సమయంలో రెండు అల్ట్రాసౌండ్ యంత్రాలున్నట్లు చూపితే తనిఖీల సమయంలో మాత్రం 4 మిషన్లు ఉన్నట్లు గుర్తించారు.
- ఆయా కేంద్రాల్లో చేసే స్కానింగ్‌ల సంఖ్యలోనూ భారీ వ్యత్యాసం ఉందని, అన్ని రకాల అక్రమాలు ఈ కేంద్రాల్లో సాగుతున్నాయని గుర్తించారు. ఒకటి రెండు రోజుల్లో ఫెర్టిలిటీ కేంద్రాలపై తనిఖీ నివేదికను ప్రభుత్వానికి వైద్యారోగ్యశాఖ అందజేయనుంది.

ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ సూపర్‌వైజర్‌పై కేసు

- 'రూ.2 లక్షలిస్తే గుడిలో కొలువు' కథనానికి స్పందన

వేములవాడ: ఆలయాల్లో ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని సరఫరా చేసిన ఏజెన్సీ సూపర్‌వైజర్‌పై వేములవాడ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల పేరుతో డబ్బులు వసూలుచేసిన వైనంపై 'రూ.2 లక్షలిస్తే గుడిలో కొలువు'శీర్షికతో సాక్షి మెయిన్ పేజీలో ఈనెల 6న ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. దేవాదాయశాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ ఎం.రామకృష్ణారావు, డిప్యూటీ కమిషనర్ టి.వెంకటేశ్ బుధవారం వేములవాడ రాజన్న ఆలయంలో దర్యాప్తు చేపట్టారు. ఆలయంలో ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల ప్రతినిధులు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నట్లుగా ఓ ఆడియో క్లిప్పింగ్ సోషల్‌మీడియాలో సర్క్యులేట్ అయినట్లు అధికారులు గుర్తించారు. ఆడియో క్లిప్పింగ్‌ను దేవస్థానంలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందితో సంప్రదించి నిజానిజాలపై విచారణ చేపట్టారు. ఈ ఆడియో క్లిప్పింగ్‌లో ఉన్న గొంతు ఈ దేవస్థానం ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని సరఫరా చేసిన ప్రణయన్ హౌస్ కీపింగ్ అండ్ సెక్యూరిటీ సర్వీసెస్, శాన్వి సర్వీసెస్ ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ, శివబాలాజీ కన్సల్టెన్సీలకు సూపర్‌వైజర్‌గా వ్యవహరిస్తున్న బూర్ల లక్ష్మీనారాయణ వాయిస్‌గా గుర్తించారు. విచారణ కాపీని ఈవో రాధాబాయికి అందించారు. ఆమె ఆదేశాలతో వేములవాడ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నీకు తిండి పెట్టలేం..

- తల్లిని ఇంటినుంచి గెంటేసిన కుమారుడు
- నర్సంపేట ఆర్డీవోకు వృద్ధురాలి ఫిర్యాదు



వృద్ధాప్యంలో ఉన్న తల్లిని ఓ కుమారుడు నిర్దాక్షిణ్యంగా ఇంటినుంచి గెంటేశాడు. దీంతో కొడుకు, కోడలు తీవ్రంగా గాయపర్చి వెళ్లగొట్టారని ఆ తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు నర్సంపేట ఆర్డీవోకు తన గోడును వెళ్లబోసుకుంది. వృద్ధురాలు తెలిపిన వివరాల ప్రకారం... వరంగల్ జిల్లా నర్సంపేట డివిజన్‌లోని నెక్కొండ మండలం చిన్నకోర్పోలు గ్రామానికి చెందిన బత్తిని సంపతమ్మకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వయసు మీద పడటంతో కుమారుడిపై ఆధారపడింది. ఈ క్రమంలో కుమారుడు, కోడలు గత ఆరు నెలలుగా సంపతమ్మను ఇబ్బందులు పెడుతూ దాడికి పాల్పడుతున్నారు. ఈనెల 2వ తేదీన తీవ్రంగా కొట్టి ఇంటినుంచి గెంటేశారు. దీంతో ఆమె మంగళవారం నెక్కొండ పోలీసులను ఆశ్రయించింది. ఎస్సై మహేందర్‌రెడ్డి వృద్ధురాలి నుంచి ఫిర్యాదు తీసుకుని కేసు నమోదు చేశారు. అనంతరం బుధవారం నర్సంపేట ఆర్డీవో ఉమారాణిని కలిసి సంపతమ్మ తన గోడును వెళ్లబోసుకుంది. ఆర్డీఓ వెంటనే నెక్కొండ ఎస్సైతో మాట్లాడి వివరాలు సేకరించారు. అనంతరం వృద్ధురాలిని సఖి సెంటర్‌కు తరలించారు.

నర్సంపేట

సదరన్ ట్రావెల్స్ 'తిరంగా ట్రావెల్ సేల్'

సాక్షి, హైదరాబాద్: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా సదరన్ ట్రావెల్స్ 'తిరంగా ట్రావెల్ సేల్'ను అందుబాటులోకి తీసుకొచ్చినట్టు తెలిపింది. ఈ సందర్భంగా ప్రతి టూర్‌పై భారీ డిస్కౌంట్స్‌ను అందిస్తున్నట్టు ప్రకటించింది. ఈ డిస్కౌంట్స్ దేశీయ, అంతర్జాతీయ యాత్రలకు వర్తిస్తాయంది. ఈ ఆఫర్ ఈనెల 6 నుంచి 31వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందని తెలిపింది. వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, ఈ ఆఫర్ గురించి మరిన్ని వివరాలకు 7800600400 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చని సూచించింది.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034.
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సాక్షి ప్లస్
గురువారం । 7-8-2025


చీరను నేస్తున్న సామల భాస్కర్


దారాలను చిటికీలు కడుతున్న కార్మికులు

చేనేత పాగా.. పుట్టపాక

- చేనేత కళలో అంతర్జాతీయ గుర్తింపు పొందిన పుట్టపాక
- ప్రాచీన కళ తేలియా రుమాల్ వస్త్రంతో గుర్తింపు
- తేలియా రుమాల్ తయారీలో పలువురికి పద్మశ్రీతో పాటు జాతీయ, రాష్ట్రస్థాయి అవార్డులు
- పలు దేశాలకు ఎగుమతి.. అమెరికా అధ్యక్ష భవనంతో పాటు పలువురు ప్రముఖులు ఫిదా
- జాతీయ చేనేత అవార్డులకు గ్రామానికి చెందిన గూడ పవన్, గజం నర్మద ఎంపిక
- నేడు జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రదానం

సంస్థాన్ నారాయణపురం: చేనేత కళలో అంతర్జాతీయ గుర్తింపు పొందింది యాదాద్రి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని పుట్టపాక. చేనేత రంగంలో నూతన ఒరవడులు సృష్టిస్తూ ఏటా రాష్ట్ర, జాతీయ స్థాయి అవార్డులు అందుకుంటోంది. ఈ గ్రామ కళాకారులు లేకుండా చేనేత అవార్డు జాబితా ఉందంటే అతిశయోక్తి కాదు. ఇటీవల భారత ప్రభుత్వం ప్రకటించిన జాతీయ చేనేత అవార్డులకు పుట్టపాక గ్రామానికి చెందిన ఇద్దరు ఎంపికయ్యారు. యువ చేనేత విభాగంలో గూడ పవన్, మార్కెటింగ్ విభాగంలో గజం నర్మద గురువారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే కొండా లక్ష్మణ్‌బాపూజీ అవార్డులకు సామల భాస్కర్, కొలను శంకర్, గూడ పవన్ ఎంపికయ్యారు. వీరు గురువారం హైదరాబాద్‌లో అవార్డులు అందుకుంటారు.

ప్రశంసల నుంచి పద్మశ్రీ వరకు

పుట్టపాక గ్రామ జనాభా 6,550 ఉండగా.. అందులో 3,500 వరకు చేనేత కుటుంబాలు ఉంటాయి. గ్రామానికి చెందిన చేనేత కార్మికుడు గజం నర్సింహ కుమారుడు అంజయ్య.. తన తండ్రి నేచిన తేలియా రుమాలు వస్త్రాన్ని ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించాడు. ఈయనతో పాటు గజం గోవర్ధన్, అంజయ్య, గోలి సాంబయ్య తదితరులు తమ కళా నైపుణ్యంతో వస్త్రాలు తయారు చేస్తూ ఎంతోమంది కళాకారులకు ఉపాధి కల్పిస్తున్నారు. వీరు రూపొందించిన డిజైన్లతో గజం గోవర్ధన్‌కు 2011, గజం అంజయ్యకు 2013లో పద్మశ్రీ అవార్డులు లభించాయి.

- 2009 సంవత్సరపు సంతు కబీర్ అవార్డును గజం రాములుకు ప్రకటించగా, ఆయన మృతి చెందడంతో ఆయన భార్య రాంబాయమ్మ అందుకున్నారు. రాంబాయమ్మ వ్యక్తిగత కళానైపుణ్యంతో ఎన్నో జాతీయ అవార్డులు అందుకుంది. అలాగే 2010 సంవత్సరానికి సంతుకబీర్ అవార్డు గజం అంజయ్య, 2009 జాతీయ చేనేత అవార్డును గజం భగమహారుషితో పాటు గూడ శ్రీను, గజం భద్రయ్య, పున్న కష్ణయ్య, ఏ.నాగరాజు, గజం యాదగిరికి దక్కాయి.
- 2016 చేనేత జాతీయ అవార్డు గజం శ్రీనివాస్, ఇదే గ్రామానికి చెందిన చెరుపల్లి భావనారుషి నేషనల్ మెరిట్ అవార్డులు అందుకున్నారు. గతంలో చేనేత జాతీయ అవార్డును చేనేత కళాకారులు కొలను బుచ్చిరాములు, పిల్లలమర్రి రాధాకృష్ణమూర్తి సంయుక్తంగా అందుకున్నారు. వీరేకాక ఇదే గ్రామానికి చెందిన చాలా మంది చేనేత కార్మికులు రాష్ట్రపతి సంతుకబీర్ అవార్డు, కమలా అవార్డు, అష్టకళా నైపుణ్య అవార్డు, జాతీయ అవార్డులతో పాటు ప్రముఖుల ప్రశంసలు అందుకున్నారు.
- 2018 సంవత్సరం జాతీయ చేనేత అవార్డు కొలను పెద్ద వెంకయ్య, ఆయన కుమారుడు రవీందర్‌కు దక్కింది.
- 2021 సంవత్సరం కొండా లక్ష్మణ్‌బాపూజీ అవార్డును అయిటిపాముల నీరజ, 2011 గజం గోవర్ధన్‌కు, 2013లో గజం అంజయ్యకు పద్మశ్రీతోపాటు గ్రామంలో పలువురికి రాష్ట్ర, జాతీయ స్థాయిలో 63 అవార్డులు వరించాయి. 2025లో గూడ పవన్, గజం నర్మద, కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డులు.. సామల భాస్కర్, కొలను శంకర్, గూడ పవన్ జాతీయ అవార్డులు అందుకున్నారు.

ఏటా అవార్డుల పోటీలో..

పుట్టపాక చేనేత కళాకారులు వంశపారంపర్యంగా వస్తున్న చేనేత వృత్తిపై ప్రయోగాలు చేస్తున్నారు. ప్రాచీన కళ తేలియా రుమాలు వస్త్రంతో ఇప్పటికే అనేక డిజైన్లు రూపొందించి అవార్డులు సాధించారు. కాలానుగుణంగా వస్తున్న పోటీని తట్టుకుంటూ అధునాతన డిజైన్లతో పాటు 3డీ ఎఫెక్ట్, లెనిన్, డబుల్ ఇక్కత్.. ఇలా అనేక ప్రయోగాలు చేస్తూ నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. ఏటా రాష్ట్ర, జాతీయ స్థాయి అవార్డుల్లో పుట్టపాకకు చోటు లభించడం విశేషం.

విదేశాలకు ఎగుమతి

ఇక్కడ తయారు చేసి వస్త్రాలను అరబ్ దేశాలకు సైతం ఎగుమతి చేస్తారు. గజం నర్సింహ ప్రాచీన తేలియా రుమాల్ వస్త్ర తయారీలో సిద్ధహస్తుడు. గజం నర్సింహ ముంబై, సోలాపూర్ ప్రాంతాలకు మొదటగా తేలియా రుమాలు వస్త్రాలను ఎగుమతి చేశారు. ఆ తర్వాత కోల్‌కతా, చెన్నై (మద్రాస్), గుజరాత్, బెంగళూరుతో పాటు సింగపూర్, అమెరికా, జర్మనీ, జపాన్, నెదర్లాండ్, అరబ్ దేశాలకు ఎగుమతులు జరిగాయి. ఇక్కడ తయారు చేసిన వస్త్రాలు లండన్ మ్యూజియం, అమెరికా అధ్యక్షుడి భవనంతో పాటు మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, సోనియాగాంధీలతో పాటు ఎందరో ప్రముఖ మహిళలు, ఎందరో విదేశీ మహిళలు ఫిదా అయ్యారు.

హైదరాబాద్‌లో వ్యాపార సంస్థలు

పుట్టపాక చేనేత కళాకారులు తయారు చేసిన వస్త్రాలను మార్కెటింగ్ చేయడానికి హైదరాబాద్‌లో మాస్టర్ వీవర్స్‌లో వ్యాపార సంస్థలను ఏర్పాటు చేసుకున్నారు. మాస్టర్ వీవర్స్ చేనేత కళాకారులకు ముడి సరుకులు ఇస్తూ తయారు చేయిస్తారు.

నైపుణ్యం పెంచుకోవడానికి నిరంతర శ్రమ


పుట్టపాక చేనేత కళాకారులు నిరంతరం శ్రమిస్తూ నైపుణ్యాలను పెంపొందించుకుంటూ కాలానుగుణంగా పోటీ పడుతున్నారు. సృజనాత్మకతకు పదును పెడుతూ అధునాతన డిజైన్‌లతో ప్రయోగాలు చేస్తారు. ఇక్కడి చేనేత కళాకారుల నైపుణ్యానికి ఒక బ్రాండ్ ఇమేజ్ ఉంటుంది. గ్రామ కళాకారులకు ప్రతి సంవత్సరం అవార్డులు రావడం సంతోషంగా ఉంది. దీంతో పుట్టపాకకు జాతీయ స్థాయిలో గుర్తింపు ఉంది.

– సామల భాస్కర్, మాజీ సర్పంచ్, కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డుకు ఎంపికైన చేనేత కళాకారుడు


సామల భాస్కర్‌కు కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డు తెచ్చిన నెమలి దేవత 3డీ ఎఫెక్ట్ చీర


చీర నేస్తున్న గూడ పవన్


పవన్‌కు అవార్డు తెచ్చిన చీర


పుట్టపాక గ్రామ వ్యూ



ఉద్యమాన్ని సజీవంగా ఉంచిన ఘనత జయశంకర్‌దే

తెలంగాణ ఉద్యమ ఆయువుపట్టు గద్దర్ • ఇద్దరు నేతలకూ ముఖ్యమంత్రి నివాళులు

సాక్షి, న్యూఢిల్లీ: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతం, ప్రజలు ఏ విధంగా నష్టపోయారో గణాంకాలతో ఎప్పటికప్పుడు వివరిస్తూ ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని ఆరు దశాబ్దాలు సజీవంగా ఉంచిన ఘనత ప్రొఫెసర్ జయశంకర్‌దేనని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కొనియాడారు. తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని పురస్కరించుకొని బుధవారం ఆయన చిత్రపటానికి సీఎం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రమే శ్వాసగా, ధ్యాసగా, లక్ష్యంగా జయశంకర్ సర్ చివరివరకు బతికారని, సకల జనుల్లో ఉద్యమ స్ఫూర్తిని రగిలించారన్నారు. తన జీవితాన్ని తెలంగాణకు అంకితం చేసిన గొప్ప పోరాట యోధుడని, ప్రొఫెసర్ జయశంకర్‌ని తెలంగాణ సమాజం సదా గుర్తుంచుకుంటుందని రేవంత్‌రెడ్డి చెప్పారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు ఆయన చేసిన నిర్విరామ కృషిని, సేవలను ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు. ఆయన ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తామని తెలిపారు.

పాటను తూటాగా మార్చిన వ్యక్తి గద్దర్..

ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి ఆయువుపట్టుగా నిలిచిన వ్యక్తి గద్దరన్న అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజా యుద్ధనౌక గద్దర్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చేసిన సేవలను సీఎం స్మరించుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గద్దర్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. పేద కుటుంబంలో పుట్టి ఇంజినీరింగ్ విద్యను అభ్యసించిన గద్దర్, ఉన్నత కొలువులవైపు దృష్టిసారించకుండా జీవితాంతం తన పాటలతో ప్రజలను చైతన్యపర్చారన్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమానికి ఊపిరులూదిన వారిలో అగ్రగణ్యుడు గద్దర్ అని.. ఆయన పాటను తూటాగా మార్చిన ప్రజా యుద్ధనౌక అని సీఎం కొనియాడారు.

జయశంకర్ జీవితం నేటి యువతకు ఆదర్శం


ప్రొఫెసర్ జయంతి సందర్భంగా శాసనమండలి చైర్మన్ గుత్తా నివాళులు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర సాధనే శ్వాసగా జీవించిన మహోన్నతుడు ప్రొఫెసర్ జయశంకర్ అని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకత ఏంటో యువతకు అర్థమయ్యేలా రచనలు చేసి రాష్ట్ర సాధన ఉద్యమానికి ఊపిరిగా నిలిచిన జయశంకర్ జీవితం నేటి యువతకు ఆదర్శప్రాయమన్నారు. తెలంగాణ జాతిపిత జయశంకర్ జయంతి సందర్భంగా అసెంబ్లీ ప్రాంగణంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి మండలి చైర్మన్ గుత్తా ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ మన నీళ్లు, మన ఉద్యోగాలు మనకేనని గర్జించిన ధీశాలి జయశంకర్ అని పేర్కొన్నారు. ఆయన సేవలను గుర్తించి భూపాలపల్లి జిల్లాతో పాటు వ్యవసాయ వర్సిటీకి ఆయన పేరు పెట్టి గౌరవించుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులుతో పాటు శాసనసభ, మండలి ఉద్యోగులు, చైర్మన్ పేషీ అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి మార్గదర్శి జయశంకర్

మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి ప్రొఫెసర్ జయశంకర్ మార్గదర్శిగా నిలిచారని శాసనమండలిలో ప్రతిపక్ష నేత, ఎమ్మెల్సీ ఎస్.మధుసూదనాచారి అన్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థి దశ నుంచే తెలంగాణ సాధన కోసం కృషి చేసి ఉద్యమానికి సిద్ధాంతకర్తగా నిలిచారని మధుసూదనాచారి పేర్కొన్నారు. మలిదశ ఉద్యమానికి ప్రొఫెసర్ జయశంకర్ ప్రేరణగా నిలిచారని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ కొనియాడారు. తెలుగు, ఉర్దూ, ఆంగ్ల భాషలపై ఆయనకు ఎనలేని పట్టు ఉందన్నారు. కేసీఆర్ నిరాహార దీక్ష నేపథ్యంలో 2009, డిసెంబర్ 9 నాటి ప్రకటన, శ్రీకృష్ణ కమిటీకి విజ్ఞాపనలు తదితరాల వెనుక జయశంకర్ చేసిన కృషిని దేశపతి వివరించారు. జయంతి వేడుకల్లో మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, పొన్నాల లక్ష్మయ్య, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, పార్టీ నేతలు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమానికి చుక్కాని.. ప్రొఫెసర్ జయశంకర్

ఆయన జయంతి సందర్భంగా కేటీఆర్ నివాళులు



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ ఉద్యమానికి ప్రొఫెసర్ జయశంకర్ చుక్కానిగా నిలిచారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొనియాడారు. ప్రత్యేక రాష్ట్ర సాధనే ధ్యేయంగా, తెలంగాణ ఉద్యమమే ఊపిరిగా జీవించారని గుర్తు చేశారు. ఆయన జయంతి సందర్భంగా ఢిల్లీలో జయశంకర్ చిత్రపటానికి రాజ్యసభ ఫ్లోర్ లీడర్ సురేశ్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, దామోదర్‌రావు, పార్థసారథి రెడ్డి, మాజీ ఎంపీ వినోద్ కుమార్‌లతో కలిసి కేటీఆర్ పూలమాలలతో ఘన నివాళులర్పించారు. తెలంగాణ మలిదశ ఉద్యమ రథసారథి కేసీఆర్‌కు అనునిత్యం అండగా ఉంటూ తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను సాకారం చేసేందుకు కడదాకా పోరాడిన జయశంకర్ పేరు తెలంగాణ చరిత్రలో ఎప్పటికీ నిలిచి ఉంటుందని కేటీఆర్ పేర్కొన్నారు.

పార్లమెంట్ ప్రశ్నోత్తరాలు

హైదరాబాద్‌కు ఎన్‌డీఆర్‌ఎఫ్ నుంచి రూ.231.75 కోట్లు మంజూరు

కాంగ్రెస్ ఎంపీ అనిల్‌యాదవ్ ప్రశ్నకు కేంద్ర మంత్రి నిత్యానంద రాయ్ సమాధానం


అనిల్‌కుమార్ యాదవ్

సాక్షి, న్యూఢిల్లీ: 2024లో ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 8 వరకు హైదరాబాద్‌లో భారీ వర్షాల కారణంగా ఏర్పడిన నష్టం స్థాయిని అంచనా వేసిన ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీమ్ నివేదిక ఆధారంగా కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తు స్పందన నిధి (ఎన్‌డీఆర్‌ఎఫ్) నుంచి రూ.231.75 కోట్లు మంజూరు చేసిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ తెలిపారు. 2024లో తెలంగాణలో ఎదురైన భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు పంపించే నివేదిక కోసం ఎదురుచూడకుండా, కేంద్ర ప్రభుత్వం 2024 సెప్టెంబర్ 5న ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీమ్‌ను నియమించిందని కేంద్రమంత్రి పేర్కొన్నారు. ఈ బృందం సెప్టెంబర్ 10 నుంచి 13 వరకు రాష్ట్రంలో పర్యటించి నష్టాలను ప్రత్యక్షంగా పరిశీలించినట్టు తెలిపారు. బుధవారం రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. కాగా 2024–25 ఆర్థిక సంవత్సరానికి తెలంగాణకు రూ.555.20 కోట్లు (రూ.416.80 కోట్లు కేంద్ర వాటా + రూ.138.40 కోట్లు రాష్ట్ర వాటా) ఎస్‌డీఆర్‌ఎఫ్ కింద కేటాయించగా, ఇందులో కేంద్ర వాటా ముందుగానే విడుదల చేసినట్టు తెలిపారు.

డిజిటల్ అరెస్టులపై 17 లక్షలకు పైగా ఫిర్యాదులు: బండి సంజయ్



దేశవ్యాప్తంగా పౌరులను టార్గెట్ చేస్తూ చోటుచేసుకుంటున్న 'డిజిటల్ అరెస్ట్' మోసాలపై కేంద్రం తీవ్రంగా స్పందించినట్టు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ రాజ్యసభలో తెలిపారు. ఇండియన్ సైబర్ క్రైం కోఆర్డినేషన్ సెంటర్ (ఐ4ఐ) స్థాపనతో అన్ని రకాల సైబర్ నేరాలను సమగ్రంగా ఎదుర్కొనేందుకు కేంద్రం చర్యలు తీసుకుందని చెప్పారు. సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్, సిటిజన్ ఫైనాన్షియల్ సైబర్ ఫ్రాడ్ రిపోర్టింగ్ సిస్టమ్ వంటి టూల్స్ ద్వారా ప్రజలు మోసాలపై ఫిర్యాదులు చేయొచ్చని పేర్కొన్నారు. ఇప్పటివరకు 17.82 లక్షల ఫిర్యాదుల ద్వారా రూ.5,489 కోట్ల నష్టం నివారించగలిగినట్టు వివరించారు. ప్రజలకు తక్షణ సహాయం కోసం టోల్‌ఫ్రీ నంబర్ 1930 కొనసాగుతోందన్నారు. బుధవారం కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి బండి సంజయ్ లిఖితపూర్వక సమాధానమిచ్చారు. సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్టు మోసాల నివారణ, విచారణ రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోనే ఉంటాయని... అయితే కేంద్రం ఈ నేరాలపై రాష్ట్రాలకు మౌలిక సదుపాయాల కల్పన, ఆర్థిక సహాయం, అవగాహన కార్యక్రమాల ద్వారా తోడ్పడుతోందని బండి సంజయ్ తెలిపారు. ఇప్పటివరకు 9.42 లక్షల సిమ్ కార్డులు, 2.63 లక్షల ఐఎంఈఐ నంబర్లు బ్లాక్ చేశామని కేంద్రమంత్రి వెల్లడించారు. ప్రజలకు స్వీయభద్రత పెరగేందుకు సంచార్ సాథి పోర్టల్ ద్వారా సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు.

పెద్దపల్లి గ్రామాలకు హైస్పీడ్ ఇంటర్నెట్ సేవలు

కాంగ్రెస్ ఎంపీ గడ్డం వంశీకృష్ణ ప్రశ్నకు కేంద్రం సమాధానం


గడ్డం వంశీకృష్ణ

పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గం సహా దేశంలోని గ్రామీణ ప్రాంతాలకు హైస్పీడ్ ఇంటర్నెట్ సేవలు అందించేందుకు కేంద్రం 2024–25 సంవత్సరంలో డిజిటల్ భారత్ నిధి (డీబీఎన్) నుంచి రూ.13,700 కోట్లు కేటాయించిందని కేంద్ర కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ గడ్డం వంశీకృష్ణ అడిగిన ప్రశ్నకు బుధవారం కేంద్రమంత్రి లిఖితపూర్వక సమాధానమిచ్చారు. భారత్‌నెట్ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో దశలవారీగా అమలు చేస్తున్నామని కేంద్రమంత్రి తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో 266 గ్రామ పంచాయతీల్లోని 252 గ్రామాలకు ఇప్పటికే ఆప్టికల్ ఫైబర్ కనెక్షన్ కల్పించామని... మిగిలిన పంచాయతీల్లో పనులు పురోగతిలో ఉన్నాయని చెప్పారు. పెద్దపల్లి జిల్లాలో 141 కామన్ సర్వీస్ సెంటర్లు పనిచేస్తున్నాయని, వీటిలో 87 కేంద్రాలు గ్రామ పంచాయతీ స్థాయిలో ఉన్నట్టు తెలిపారు. కోల్‌మైన్ ప్రాంతాల్లో పనిచేస్తున్న కార్మికులు, వారి కుటుంబాలకు డిజిటల్ అవగాహన కల్పించేందుకు వీటి ద్వారా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ముఖ్యంగా భూగర్భ బొగ్గు గనుల్లో అత్యవసర పరిస్థితుల్లో కమ్యూనికేషన్‌కు మౌలిక వసతులు మెరుగుపరిచినట్టు కేంద్రమంత్రి పెమ్మసాని తెలిపారు. ఇందుకోసం టెలికాం సంస్థలకు వివిధ ఫ్రీక్వెన్సీ బ్యాండ్లను కేటాయించారని, 300/400 మెగాహెర్ట్జ్ బ్యాండ్లు కూడా అవసరమైన సంస్థలకు ఉపయోగించుకునేందుకు ఇచ్చినట్టు కేంద్రమంత్రి వివరించారు.

సింగరేణిలో వరంగల్ స్థానికులకు 1,136 ఉద్యోగాలు

లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ కడియం కావ్య ప్రశ్నకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సమాధానం


కడియం కావ్య

వెనుకబడిన ప్రాంతాలకు ప్రాధాన్యం ఇచ్చే విధంగా సింగరేణిలో నియామక విధానం కొనసాగుతోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. గత ఐదేళ్లలో వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో 1,136 మంది స్థానికులకు సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్)లో ఉద్యోగాలు కల్పించినట్టు కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి లిఖితపూర్వక సమాధానమిచ్చారు. ఎస్సీ అభ్యర్థులకు ఉద్యోగ నియామకాల్లో ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వడాన్ని ఎస్‌సీసీఎల్ కొనసాగిస్తోందని చెప్పారు. 15 శాతం రిజర్వేషన్, వయస్సులో 5 ఏళ్ల సడలింపు, అర్హత మార్కుల్లో 5 శాతం మినహాయింపు, పరీక్ష ఫీజు మాఫీ వంటి విధానాలు ఎస్సీ అభ్యర్థులకు అమలులో ఉన్నట్టు తెలిపారు. కాగా ప్రస్తుతం వరంగల్ నియోజకవర్గంలో ఎస్‌సీసీఎల్ కార్యకలాపాలను విస్తరించేందుకు ఎలాంటి ప్రణాళికలు లేవని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.

ఎదురుకాల్పుల్లో మావోయిస్టు మృతి

మరో తొమ్మిది మంది లొంగుబాటు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో బుధవారం జరిగిన ఎదురుకాల్పుల్లో ఒక మావోయిస్టు మృతిచెందగా.. తొమ్మిది మంది పోలీసుల ఎదుట లొంగిపోయారు. బీజాపూర్ జిల్లా గంగులూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే నిఘా వర్గాల సమాచారంతో డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్ బలగాలు కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో తారసపడిన మావోయిస్టులు పోలీసుల పైకి కాల్పులు జరపగా, బలగాలు సైతం ఎదురుకాల్పులకు దిగాయి. ఈ ఘటనలో ఒక మావోయిస్టు మృతి చెందాడు. కాగా, ఎదురుకాల్పుల్లో పాల్గొన్న మరో తొమ్మిది మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. వారిలో ఒక మహిళ కూడా ఉంది. వారిలో ఆరుగురిపై రూ. 24 లక్షల రివార్డు ఉందని పోలీసులు వెల్లడించారు. మావోయిస్టు మృతదేహాన్ని బీజాపూర్‌కు తరలించారు. కాగా, ఈ ఘటనలో మరికొందరు మావోయిస్టులు తప్పించుకున్నారని, వారికోసం అదనపు బలగాలతో కూంబింగ్ చేయిస్తున్నామని ఉన్నతాధికారులు తెలిపారు.

భానుడు భగభగ



విజయనగరం జిల్లా కేంద్రంలో వర్షాకాలం వచ్చినా సూర్యుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. వర్షాకాలంలో వర్షాలు అంతం తమాత్రంగానే పడుతుండటంతో నగరంలో చల్లదనం కరువైంది. రోజురోజుకి పెరుగుతున్న ఉష్ణోగ్రతల వల్ల రోడ్డుపైకి రావాలంటే ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఎండ వేడిని తట్టుకోలేక..మహిళలు గొడుగులను పట్టుకునే రోడ్లపైకి వస్తున్నారు. రోడ్లపై జనసంచారం లేకపోవడంతో చిరు వ్యాపారులు దిగాలుగా కనిపిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం





సిద్ధమవుతున్న గణనాథులు..

దండాలయ్యా ఉండ్రాలయ్యా అంటూ భక్తులు ఆ దేవదేవుడైన గణపతిని పూజించే నవరాత్రి ఉత్సవాలకు శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా ముస్తాబవుతోంది. నగరంలోని పొదలకూరు రోడ్డులో జెడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలో వివిధ రకాల వినాయకుడి విగ్రహాలను అమ్మకాలకు ఉంచారు. మరికొన్ని విగ్రహాలకు తుదిమెరుగులు దిద్దుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని చెప్పడానికి పులివెందులలో జరిగిన దాడి ఘటనే సాక్ష్యం. జెడ్పీటీసీ ఎన్నికల్లో గెలవలేమని చంద్రబాబు గూండాలు అరాచకాలకు పాల్పడుతున్నారు.

– విడదల రజిని, మాజీ మంత్రి

ప్రజలకు మంచి చేసి గెలవాలి. దాడులు, దౌర్జన్యాలు చేసి కాదు. పులివెందులలో ఎమ్మెల్సీ రమేశ్‌యాదవ్, రాముపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి.

– ధర్మాన కృష్ణదాస్, మాజీ మంత్రి

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగితే ఓటమి తప్పదనే టీడీపీ దాడులకు పాల్పడుతోంది. ఈ విషయం రాష్ట్ర ప్రజలందరికీ అర్థమైంది.

– బుర్ర మధుసూదన్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే

14 నెలల పాలనలో మంచి చేసిఉంటే దాడులు చేయాల్సిన అవసరం వచ్చి ఉండేది కాదు. రెడ్‌బుక్ రాజ్యాంగం ద్వారా ఎన్నికల్లో గెలవాలని చూడటం అవివేకం.

– కెఆర్‌జే భరత్, ఎమ్మెల్సీ

పులివెందుల దాడి ఘటన చూశాక ప్రజాస్వామ్యంలోనే ఉంటున్నామా అని అనుమానం కలుగుతోంది. బీసీ నాయకుడు,ఎమ్మెల్సీ రమేశ్‌యాదవ్, రాముపై దాడిని ఖండిస్తున్నాను.

– రెడ్డిశాంతి, మాజీ ఎమ్మెల్యే

యాప్‌రే బాప్



- అసలు కంటే యాప్‌ల పనే ఎక్కువంటూ అంగన్‌వాడీ కార్యకర్తల ఆగ్రహం
- స్మార్ట్‌ఫోన్ల వినియోగంపై సంపూర్ణ అవగాహన లేని వైనం
- విధి నిర్వహణలో ఒత్తిడితో తీవ్ర అసహనం
- సీడీపీఓకు 2జీ సెల్‌ఫోన్లు అప్పగింత
- కొత్త ఫోన్లు ఇచ్చే వరకూ 'నో ఫోన్.. నో వర్క్'

రాజమహేంద్రవరం రూరల్: టెన్త్ కనీస విద్యార్హతతో విధుల్లో చేరిన వారే అంగన్‌వాడీ కార్యకర్తలు. గ్రామీణ ప్రాంత కార్యకర్తల్లో అత్యధికులకు స్మార్ట్ ఫోన్ వినియోగం పూర్తి స్థాయిలో తెలియదు. అలాంటి వీరితో ఒకే పనిని పలుమార్లు యాప్‌ల్లో నమోదు చేయాలన్న సర్కార్ ఆదేశాలతో, వారి ప్రధాన విధి అయిన ప్రీ స్కూల్ బోధన పక్కదారి పడుతోంది. ఐదేళ్ల క్రితం ఇచ్చిన 2జీ సెల్‌ఫోన్లతోనే ఇప్పుడూ పలు యాప్‌ల్లో నమోదు చేయిస్తున్నారు. ఆ ఫోన్లలో యాప్‌ల వల్ల నెట్‌వర్క్ పనిచేయకపోవడంతో అంగన్‌వాడీ కార్యకర్తలు వారి సొంత ఫోన్లలో యాప్‌లు డౌన్‌లోడ్ చేసి, నమోదు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. కొత్త 5జీ సెల్‌ఫోన్లు, ట్యాబ్‌లు ఇవ్వాలని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి డిమాండ్ చేస్తున్నప్పటికీ, ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందనా లేదు. దీంతో చేసేది లేక అంగవాడీ కార్యకర్తలు జిల్లాలో మూకుమ్మడిగా సెల్‌ఫోన్లను సీడీపీవో కార్యాలయాల్లో తిరిగిచ్చేశారు. కొత్త ఫోన్లు ఇచ్చేవరకూ 'నో ఫోన్.. నో వర్క్' విధానం పాటిస్తామని కుండబద్దలు కొట్టారు. ప్రీ స్కూలు విధులు నిర్వహిస్తూ, రికార్డులు మాత్రమే రాస్తామని చెబుతున్నారు.

తూర్పు గోదావరి జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు పోషకాహారం సరఫరా వివరాలను ప్రత్యేక యాప్‌ల్లో పలుమార్లు నమోదు చేయాల్సి వస్తోంది. దీంతో అంగన్‌వాడీ కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పోషణ్ ట్రాకర్ యాప్‌లో ముఖ గుర్తింపు వ్యవస్థ(ఎఫ్ఆర్ఎస్)/బయోమెట్రిక్ తప్పనిసరి. దీంతో నెట్‌వర్క్ సరిగా పని చేయకపోయినా, లబ్ధిదారుల మొబైల్స్‌కు మెసేజ్ బ్యాలన్స్ లేక ఓటీపీ రాకపోయినా సరకులు అందించలేని పరిస్థితి. దీంతో తమతో పాటు, లబ్ధిదారులు కూడా తిప్పలు పడాల్సి వస్తోందని కార్యకర్తలు వాపోతున్నారు.

టీహెచ్ఆర్‌తో తిప్పలు

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలతో పాటు, ఆరు నెలల నుంచి మూడేళ్ల చిన్నారులకు ప్రతి నెలా పోషకాహారాన్ని ఇంటికే అందిస్తున్నారు. గతంలో అంగన్‌వాడీ కేంద్రాల వద్దే ఇచ్చేవారు. దీనిని గతంలోనే టేక్ హోమ్ రేషన్(టీహెచ్ఆర్)గా మార్చి, పాలు, కోడిగుడ్లు, నూనె, పప్పు దినుసులు, బియ్యం వంటివి ప్రతి నెలా రెండు సార్లు అందిస్తున్నారు. రెండు సార్లు పోషక్ ట్రాకర్ యాప్‌లో వివరాల నమోదుకే ఎక్కువ సమయం పడుతుంది. బయోమెట్రిక్ ఆధార్‌తో అనుసంధానించిన మొబైల్‌కు వచ్చే ఓటీపీని నమోదు చేయాలి. చాలాసార్లు ఈ నమోదుకే ఒక్కో లబ్ధిదారుకు అరగంటకు పైనే పడుతోందని, దీంతో పిల్లలకు ప్రాథమిక విద్య, బోధన ఇబ్బందికరంగా మారిందని అంగన్‌వాడీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రాజెక్టులకు సెల్‌ఫోన్ల అప్పగింత!

యాప్‌లతో పనిచేయని ఫోన్లను సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలు 'నో ఫోన్.. నో వర్క్' పేరుతో ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో సీడీపీవోలకు అప్పగించారు. తమ సమస్యలు పరిష్కరించే వరకూ, కొత్త ఫోన్లు అందించే వరకూ సెల్‌ఫోన్లతో పని చేయబోమని అంగన్‌వాడీ కార్యకర్తలు స్పష్టం చేశారు. త్వరలో కొత్త సెల్‌ఫోన్లను ప్రభుత్వం ఇస్తుందని అధికారులు చెప్పినప్పటికీ.. ఫోన్లు తీసుకెళ్లేది లేదని అంగన్‌వాడీ కార్యకర్తలు భీష్మించారు.

నెట్‌వర్క్ సమస్య కూడా..

తూర్పు గోదావరి జిల్లాలో చాలా వరకు గ్రామీణ ప్రాంతం కావడంతో మొబైల్ నెట్‌వర్క్ సమస్య అధికంగా ఉంది. ప్రభుత్వం అందించిన తక్కువ సామర్థ్యం(ర్యామ్) ఫోన్లలో యాప్‌ల పనితీరు దారుణంగా ఉంది. ఈ క్రమంలో యాప్‌లు మొరాయించడం సర్వసాధారణంగా మారింది. దీంతో పిల్లలకు ప్రీ స్కూల్ బోధన దాదాపు అటకెక్కుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అంగన్‌వాడీ కార్యకర్తలు యాప్‌ల వల్ల ఫోన్లు పనిచేయడం లేదని, 5జీ ఫోన్లు లేదా ట్యాబ్‌లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటివరకు ప్రభుత్వ పెద్దలు అంగన్‌వాడీ కార్యకర్తల యూనియన్ నేతలతో భేటీ కూడా కాలేదు. సెల్‌ఫోన్ల సమస్యతో పాటు, అంగన్‌వాడీ కార్యకర్తల జీతాలు సైతం పెంచకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తోంది.



సెల్‌ఫోన్లు మాకొద్దంటూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు(ఫైల్)

యాప్‌లతో ఒత్తిడికి గురవుతున్నాం



పాత సెల్‌ఫోన్లలో యాప్‌ల వల్ల అంగన్‌వాడీ కార్యకర్తలు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. నెట్‌వర్క్ సరిగా పని చేయకపోవడంతో ఒక్కో నమోదు అర గంటకు పైగా పడుతుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 5జీ సెల్‌ఫోన్లు లేదా ట్యాబ్‌లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం. కానీ ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందనా రాలేదు. మరోవైపు జీతాలు కూడా పెంచడం లేదు.

– యాళ్ల బేబీరాణి, తూర్పు గోదావరి జిల్లా కార్యదర్శి, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, తూర్పు గోదావరి

పని పెరిగి.. బోధన తగ్గి..

ప్రస్తుతం అంగన్‌వాడీ కార్యకర్తలు ఆయా కేంద్రాల్లో 15 వరకూ రికార్డులు నిర్వహిస్తున్నారు. లబ్ధిదారులకు అందించే ఆహార వినియోగం (ఎఫ్‌సీఆర్), పిల్లలు, బాలింతలు, గర్భిణుల నమోదు, ప్రీ స్కూల్ అడ్మిన్ రికార్డులను ప్రతి రోజూ విధిగా నమోదు చేయాలి. మరోవైపు పిల్లల టీకాల రికార్డులు, విటమిన్–ఎ రికార్డు, రిఫరల్ సర్వీసెస్, గృహ సందర్శకుల రికార్డులు, నెలవారీ ప్రాజెక్టులు, హౌస్‌హోల్డ్ సర్వే రికార్డు, గ్రోత్ చార్ట్ తదితర వ్యవహారాలతో పాటు, ఇప్పుడు యాప్‌లు అదనం. ఈ యాప్‌ల్లో నమోదు ప్రక్రియ మరింత కష్టంగా మారింది.

తూర్పు గోదావరి జిల్లాలో ఇలా..

అంగన్‌వాడీ కేంద్రాలు	:	1,530
మినీ అంగన్‌వాడీ కేంద్రాలు	:	26
అంగన్‌వాడీ కార్యకర్తలు	:	1,506
అంగన్‌వాడీ హెల్పర్లు	:	1,486
మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు	:	26
గర్భిణులు	:	8,579
బాలింతలు	:	6,843
ఆరు నెలల నుంచి మూడేళ్ల లోపు చిన్నారులు	:	51,423
మూడేళ్ల నుంచి ఆరేళ్ల వరకు చిన్నారులు	:	38,794

రాష్ట్రంలో దళితులు, గిరిజనుల పరిస్థితి అధ్వానం

మాజీ ఎంపీ చింతామోహన్



సాక్షి ప్రతినిధి, కాకినాడ: చంద్రబాబు కూటమి పాలనలో దళితులను అంటరానివారిగా మార్చేశారని మాజీ ఎంపీ చింతామోహన్ విమర్శించారు. రాష్ట్రంలో దళితులు, గిరిజనుల పరిస్థితి అధ్వానంగా మారిందన్నారు. కాకినాడలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కూటమి పాలనలో అంటరానితనం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఎస్సీ వర్గీకరణతో చంద్రబాబు చేస్తున్నది తప్పు అని, వర్గీకరణపై తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ చూసి చంద్రబాబు నేర్చుకోవాలని హితవు పలికారు. ఎస్టీలు కూడా బాబు పాలనలో అన్యాయమైపోతున్నారన్నారు. మన్యంలో విలువైన ఖనిజాలపై పెద్దల కన్ను పడిందన్నారు.

నాయీబ్రాహ్మణులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్

మంత్రి సవిత హర్షం

సాక్షి, అమరావతి: నాయీబ్రాహ్మణులకు ఉచిత విద్యుత్ 150 యూనిట్ల నుంచి 200 యూనిట్లకు పెంచుతూ మంత్రివర్గం నిర్ణయం తీసుకోవడం పట్ల రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆమె బుధవారం ప్రకటన వెలువరించారు. అర్హులైన నాయీబ్రాహ్మణులందరికీ ఉచిత విద్యుత్‌ను 200 యూనిట్లకు పెంచడంపై సీఎంకు ఆమె ధన్యవాదాలు తెలియజేశారు.

దళిత అధికారులకు రాజకీయాలను ఆపాదించొద్దు

ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సురేశ్ బాబు

సాక్షి, అమరావతి: దళిత అధికారులకు రాజకీయాలను ఆపాదించి బలి చేయొద్దని సీఎం చంద్రబాబుకు ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సురేశ్ బాబు బుధవారం లేఖ రాశారు. సమాచార పౌరసంబంధాల శాఖకు చెందిన దళిత మహిళా అధికారి కస్తూరిబాయికి వెంటనే పోస్టింగ్ ఇవ్వాలని కోరారు. పత్రికలకు ప్రభుత్వ ప్రకటనలు ఇవ్వడంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులందరికీ పోస్టింగ్‌లు ఇచ్చి ఎలాంటి సంబంధం లేని కస్తూరిబాయికి ఇవ్వకపోవడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఏకంగా 10 నెలలు పోస్టింగ్ ఇవ్వకుండా వెయిటింగ్‌లో ఉంచారని గుర్తు చేశారు. రాజకీయాలను ఆపాదించి బ్లాక్ మెయిల్ చేసే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని దళిత అధికారులు, ఉద్యోగులకు సూచించారు.



ఉద్యాన రైతుకు శఠగోపం

కూటమి 'బీమా'య

- ఉద్యాన రైతును నిండా ముంచిన సర్కార్
- ఉచిత పంటల బీమాకు మంగళం
- రైతులే ప్రీమియం చెల్లించినా అందని పరిహారం

పుట్టపర్తి: రైతుల రెక్కల కష్టం నిష్ఫలమైపోతోంది. పెట్టుబడులు కూడా చేతికందక అప్పులు మిగులుతున్నాయి. అందుకే గత వైఎస్ జగన్ సర్కార్ రైతు వేసే ప్రతి అడుగులోనూ తోడుగా నిలిచింది. తక్కువ నీటితోనే ఉద్యాన పంటలను ప్రోత్సహించింది. అంతే కాకుండా పంట పండితే గిట్టుబాటు ధర కల్పించింది.. పంట ఎండితే ఉచిత పంటల బీమా అమలు చేసి పరిహారం ఇచ్చి ఆర్థికంగా అండగా నిలిచింది. అందుకే గతంలో రైతులు ఆనందంగా పంటలు సాగుచేశారు. జగన్ ప్రభుత్వ హయాంలో ఉచిత బీమా కింది సత్యసాయి జిల్లాలో 11 వేల మంది ఉద్యాన రైతులకు రూ.350 కోట్ల వరకు పరిహారం అందింది. కానీ కూటమి సర్కార్ రైతు సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించింది. ఉచిత పంటల బీమాకు మంగళం పాడింది. ఉద్యాన రైతులే ప్రీమియం చెల్లించినా.. నేటికీ పరిహారం ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులు పెడుతోంది. ఈ ఏడాది రైతులు మామిడి పంటకు పెద్ద మొత్తంలో బీమా ప్రీమియం చెల్లించారు. సీజన్ ముగిసినా.. బీమా సొమ్ము రైతుల ఖాతాల్లో జమ కాలేదు.

ధీమా ఇవ్వని బీమా

కూటమి ప్రభుత్వం పంటల బీమా పేరుతో ఎకరా మామిడికి రూ.1,800 చొప్పున ప్రీమియం కట్టించుకుంది. సత్యసాయి జిల్లాలో మామిడి 50 వేల ఎకరాల్లో సాగులో ఉండగా...2,500 మంది రైతులు 5 వేల ఎకరాలకుపైగా సాగు చేసిన మామిడి పంటలకు బీమా కోసం రూ.కోటి వరకూ ప్రీమియం చెల్లించారు. ఈసారి మామిడి పూర్తిగా దెబ్బతినగా రైతులకు రూ.500 కోట్లు నష్టం వాటిల్లింది. ఎకరాకు కనీసంగా రూ.25 వేల చొప్పున పరిహారం ఇచ్చినా బీమా చేసిన రైతులకు రూ.12.50 కోట్లకుపైగా రైతులకు అందాల్సి ఉంది. కానీ నేటికీ పైసా అందలేదు. జగన్ సర్కార్ ఏటా చీనీ రైతులకు ఉచిత పంటల బీమా కింద ఎకరాకు రూ.20 వేలు ఇవ్వగా... కూటమి సర్కార్ మూడు సీజన్లు దాటినా నయాపైసా ఇవ్వలేదు.

పరిహారం ప్రకటించాల్సి ఉంది



సత్యసాయి జిల్లాలో ఉద్యాన పంటలకు సంబంధించి ప్రీమియం కట్టిన రైతులకు పరిహారం ఎంత అన్నది ప్రకటించాల్సి ఉంది. వాతావరణ బీమా కాబట్టి వర్షపులెక్కల మేరకు బీమా కంపెనీలు పరిహారం లెక్కగట్టాల్సి ఉంది. ఆ ప్రక్రియ పూర్తయితే పరిహారం ఎంతన్నది తేలుతుంది. ఆ తర్వాత పరిహారం మొత్తాన్ని నేరుగా రైతుల ఖాతాల్లోనే జమ చేస్తాం. – చంద్రశేఖర్, జిల్లా ఉద్యానశాఖ అధికారి

బీమా రాలేదు



నేను మామిడి, చీనీ పంటలు సాగు చేశా. గతంలో వైఎస్ జగన్ ప్రభుత్వం ఉచిత పంటల బీమా కింద చీనీ పంటకు క్రమం తప్పకుండా నాలుగేళ్ల ఎకరాకు రూ.20 వేల చొప్పున జమ చేసింది. ఈ సీజన్‌లో మామిడి పంటకు ఎకరాకు రూ.1,800 ప్రీమియం కట్టినా.. ఇప్పటి వరకు బీమా సొమ్ము జమకాలేదు. జమ అవుతోందో కాదో కూడా తెలియడం లేదు.

–ఆవుటాల ఓబిరెడ్డి, బుచ్చయ్య గారిపల్లి, బుక్కపట్నం మండలం

ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలి



వైఎస్ జగన్ ప్రభుత్వం అమలు చేసిన ఉచిత పంటల బీమా పథకాన్ని కూటమి సర్కార్ కొనసాగించాలి. ప్రీమియం చెల్లించాల్సి వచ్చినా ప్రభుత్వం కట్టాలి. రెండేళ్లుగా మామిడి, చీనీ పంటలు పండక, పండినా గిట్టు బాటు ధర లేక నాలాంటి సన్నకారు రైతులు పెద్ద ఎత్తున నష్టపోయారు. పెట్టుబడి కూడా చేతికందలేదు. ప్రభుత్వం స్పందించి ఎకరాకు కనీసం రూ.40 వేల పరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

– లోసారి వెంకట్రాముడు, కడవనాగేపల్లి, బుక్కపట్నం మండలం

పెట్టుబడి దక్కలేదు



ఈ ఏడాది వాతావరణ మార్పులతో మామిడి దిగుబడి గణనీయంగా తగ్గింది. అరకొరగా పండిన పంటకూ గిట్టుబాటు ధర లేక పెద్ద ఎత్తున నష్టపోయాం. దీంతో పెట్టుబడులు కూడా రాక రైతులంతా అప్పుల పాలయ్యారు. ప్రభుత్వం మామిడి రైతులను ఆదుకోవాలి. జగన్ హయాంలో మాదిరి ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేయాలి.

– గంగురులప్ప, బుచ్చయ్యగారిపల్లి, బుక్కపట్నం మండలం

పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని కోరారు. పోలవరం నిర్వాసిత బృందంతో బుధవారం సచివాలయంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు ఆయన వినతిపత్రం అందజేశారు. అలాగే,కేంద్రం మంజూరు చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1,121 కోట్లను విద్యుత్ బకాయిల పేరిట దారిమళ్లించడం సరికాదని.. వాటిని తక్షణమే పంచాయతీలకు విడుదల చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు రాసిన లేఖను బుధవారం మీడియాకు విడుదల చేశారు.

క్రైస్తవులకు కులధ్రువీకరణ పత్రాల జారీలో ఆటంకాలు

జీసెస్ బిలీవర్స్ అసోసియేషన్ కౌన్సిల్

సాక్షి, అమరావతి: క్రైస్తవులుగా మారిన వారికి కులధ్రువీకరణ పత్రాల జారీలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జీసస్ బిలీవర్స్ అసోసియేషన్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ జోసెఫ్ మోసిగంటి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జోసెఫ్ ప్రకటన విడుదల చేశారు. ఎస్సీలు క్రైస్తవులుగా సెల్ఫ్ డెకరేషన్ ఇస్తే బీసీ–సీ కులధ్రువీకరణ పత్రం ఇవ్వాలన్నారు. చర్చికి వెళ్లినంత మాత్రాన క్రైస్తవులైపోయినట్టు కాదని మద్రాస్ హైకోర్టు స్పష్టం చేసిందని గుర్తు చేశారు. విద్యా సంస్థల్లో ప్రవేశాలు, స్కాలర్‌షిప్‌లకు విద్యార్థులు ఇబ్బంది పడకుండా కులధ్రువీకరణ పత్రాలు జారీ చేసేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

పాఠ్యప్రణాళిక తయారీకి ఆసక్తి ఉంటే తెలపండి

సాక్షి, అమరావతి: వచ్చే (2026–27) విద్యాసంవత్సరానికి ఒకటి నుంచి 10వ తరగతి వరకు పాఠ్యప్రణాళిక రూపకల్పనకు నైపుణ్యం గల విద్యా సంబంధిత సంస్థలు ఆసక్తి ఉంటే తెలపాలని రాష్ట విద్యాపరిశోధన, శిక్షణమండలి డైరెక్టర్ ఒక ప్రకటనలో కోరారు. ఎన్ఈపీ–2020కి అనుగుణంగా నూతన పాఠ్యప్రణాళిక రూపొందించడం, ప్రాథమిక అభ్యసనం, విమర్శనాత్మక ఆలోచన, 21వ శతాబ్దపు నైపుణ్యాలు, సమ్మిళిత విద్యను ప్రోత్సహించడం వంటి సంస్కరణల లక్ష్యంగా పాఠ్యాంశాలు ఉంటాయని వివరించారు. ఇందులో ప్రాథమిక స్థాయి (1–5 తరగతులు), ఉన్నతస్థాయి (6–10 తరగతులు) పాఠ్యప్రణాళిక రూపకల్పన, ఉపాధ్యాయ వృత్యంతర శిక్షణాభివృద్ధి, సహకారం, బోధనాభ్యసన సామగ్రి రూపకల్పన ఉన్నట్లు తెలిపారు. పూర్తి వివరాలను https://cse.ap.gov.inలో ఉంచినట్టు తెలిపారు. ఆయా సంస్థలు తమ ప్రతిపాదనలను ఈనెల 13వ తేదీలోగా scert. cse@ apschooledu. in లేదా csepeshi@ apschooledu. inకు మెయిల్ చేయాలని సూచించారు.

ఏఈఈ పోస్టుల ఫలితాలు విడుదల

కాలుష్య నియంత్రణ మండలిలో అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ (ఏఈఈ) పోస్టులకు నిర్వహించిన పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థుల వివరాలు విడుదల చేసినట్టు ఏపీపీఎస్సీ ఒక ప్రకటనలో తెలిపింది. వివరాలు కమిషన్ వెబ్‌సైట్ https://psc.ap.gov.inలో ఉంచినట్టు పేర్కొంది.

బీఆర్క్ కోర్సుకు ఆర్కిటెక్చర్ కౌన్సిల్ అనుమతి

కడపలోని వైఎస్సార్ ఆర్కిటెక్చర్ విశ్వవిద్యాలయం అందిస్తున్న బీఆర్ డిగ్రీ కోర్సుకు 2025–2026 విద్యాసంవత్సరానికి ఆర్కిటెక్చర్ కౌన్సిల్ అనుమతిని పొడిగించినట్టు ఉన్నత విద్యామండలి బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. దీంతోపాటు కరోనా సమయంలో తనిఖీలకు సమయం లేకపోవడంతో పెండింగ్‌లో పడిన 2020–21, 2021–22, 2022–23 విద్యా సెషన్లలో విశ్వవిద్యాలయం చేపట్టిన అడ్మిషన్లను కూడా గుర్తించిందని వివరించింది.



• వల్లూరమ్మవారు

తెలుగు రాష్ట్రాలలో ప్రసిద్ధి చెందిన అమ్మవారి ఆలయాలలో ప్రకాశంజిల్లా టంగుటూరు మండలం వల్లూరు గ్రామంలోని వల్లూరమ్మ ఆలయం ఒకటి. మూడు వందల సంవత్సరాల క్రితం హోమ గుండంనుండి ఉల్కాముఖిగా ఆవిర్భవించిన ఆదిశక్తి వల్లూరు గ్రామనామంతో వల్లూరమ్మగా వ్యవహరింపబడుతూ భక్తుల పూజలందుకుంటున్నది. ప్రజలను, పశుసంపదను వ్యాధి బాధలనుండి, దుష్టశక్తులనుండి కాపాడే చల్లనితల్లిగా విరాజిలుతోంది. రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, మంత్రులు, ఉన్నతాధికారులువంటివారు వల్లూరమ్మను తప్పక దర్శించి పూజలు నిర్వహిస్తారు. నాయకులకు వల్లూరమ్మ ఆలయంవద్ద ఘనంగా స్వాగతం పలికి ఊరేగింపుగా తీసుకురావడం నేటికీ అమలు జరుగుతున్న సంప్రదాయం.

వరాలమ్మ వల్లూరమ్మ

వల్లూరమ్మ ఆవిర్భావం వెనుక ఆసక్తిదాయక కథనం ఉంది. 17వ శతాబ్దిలో ఒంగోలుతోపాటు పరిసర ప్రాంతాలను ఒంగోలు రాజులుగా పేరొందిన మందపాటి జమీందారులు పాలించేవారు. రామభద్రరాజు, రామచంద్రరాజు హైదరాబాద్, కర్నాటక నవాబులకు అనుకూలంగా వ్యవహరిస్తూ తమ రాజ్యాన్ని విస్తరించుకున్నారు. వీరిలో రామచంద్రరాజు అమిత ధైర్యశాలిగా, పరాక్రమవంతునిగా పేరొందాడు. ఒంగోలు రాజుల ప్రాబల్యం వెంకటగిరి రాజులకు కంటగింపైంది. చిలికిచిలికి గాలివాన

పొంగళ్ల సమర్పణ..

ప్రతి ఆదివారం ఆలయంలోని వల్లూరమ్మకు భక్తులు పొంగళ్లను, మొక్కుబడులను సమర్పిస్తారు. సంతానం లేనివారు, వివాహం కానివారు తమ ఈప్సితాలు నెరవేరేలా చూడమంటూ అమ్మవారిని ప్రార్థిస్తారు. ఆలయం బయట పొర్లుదండాలు పెడతారు. గుడి చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. రైతులు, వ్యాపారులు కూడా తమ కోరికలు తీర్చాలంటూ అమ్మవారికి పొలపొంగళ్లు సమర్పిస్తారు. ఆదివారం వల్లూరమ్మ ఆలయం భక్తజన సందోహంతో కళకళలాడుతుంటుంది.



• ఆలయంలోని గంగమ్మ



• ఆలయంలోని పోలేరమ్మ

అన్నట్లు కొన్ని విషయాలలో ఉభయుల మధ్య ఏర్పడిన తగాదా చివరకు యుద్ధానికి దారితీసే పరిస్థితి ఏర్పడింది.

ఒంగోలు రాజులు పరాక్రమంలో గొప్పవారు కాగా వెంకటగిరి రాజులు ఆర్థికంగా, సైనికపరంగా బలోపేతులు. యుద్ధంవల్ల జననష్టం, ధన నష్టం జరుగక తప్పదనే భావన కలిగింది. దీనితో వెంకటగిరి రాజులను ప్రత్యక్షంగా కాకుండా పరోక్షంగా జయించాలనే ఆలోచన ఒంగోలు రాజులలో కలిగింది. ఒంగోలు రాజులకు సన్నిహితుడు, దేవీ ఉపాసకుడు, మంత్రతంత్ర శాస్త్రాలలో అపార ప్రావీణ్యం కలిగిన అద్దంకి రామచంద్రయ్య బరూరి నరసింహ యోగీంద్రుల సహకారంతో అగ్నిగుండంనుండి దివ్యశక్తిని ఉద్భవింపచేసి వెంకటగిరి రాజులను జయించవచ్చని సలహా ఇచ్చాడు. అద్దంకి రామచంద్రయ్య యజ్ఞకర్తగా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ సంగతి గూఢచారులద్వారా తెలుసుకున్న వెంకటగిరి రాజులు పోలూరి వంశజుల సహకారంతో, పరాంకుశవారి తోడ్పాటుతో ఒంగోలు రాజులు తలపెట్టిన హోమానికి విఘాతం కలిగించే మంత్రతంత్ర ప్రక్రియలకు శ్రీకారం చుట్టారు. ప్రధాన యజ్ఞకర్తయైన బరూరి నరసింహ యోగీంద్రునిపై మంత్రతంత్ర ప్రయోగం చేసారు. దాని ప్రభావంతో ఆయనకు తీవ్రమైన కడుపు నొప్పి ప్రారంభమైంది. యజ్ఞగుండం నుండి అమ్మవారు ఆవిర్భవించే సమయం ఆసన్నమైందని, ఆమె ఆవిర్భవించగానే ఆమెకు హారతి ఇచ్చి, బలి సమర్పించి సంప్రీతురాలిని చేయవలసినదిగా చెప్పి ఆయన బహిర్భూమికి వెళ్లారు. జ్వాలలు వెలిగక్కుతూ యజ్ఞగుండంనుండి 12 సంవత్సరాల బాలిక రూపంలో అమ్మవారు బయలువెడలడంతో అది చూసిన అద్దంకి రామచంద్రయ్య చేష్టలుడిగి అమ్మవారికి నివేదన చేయలేదు. దాంతో ఆమె అలిగి ముందుకు సాగింది. ఆమె చూపులు ప్రసరించిన మేర అంతా మంటలు వ్యాపించి కాలి బూడిద అయ్యాయి. అందువల్ల ఆమెకు జ్వాలాముఖి అనే పేరు కలిగింది. ఆమె ఈతముక్కల ప్రాంతానికి చేరగానే గ్రామ రైతు రామచంద్రారెడ్డి అమ్మవారిని గమనించి ఆమెకు పాలను సమర్పించి సంతోషపరచాడు. తాను గ్రామాన్ని, ప్రజలను చల్లగా కాపాడుతూ అక్కడనే ఉంటానని పలికి జ్వాలాముఖి ఈతముక్కల గ్రామ పొలిమేరలో వెలసింది.



• వల్లూరమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు నాగేశ్వరరావు



• వల్లూరమ్మ ఆలయంలోని వినాయకుడు

విశేష కార్యక్రమాలు..

వల్లూరమ్మ ఆలయంలో శ్రావణ మాసంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలను నిర్వహిస్తారు. వెయ్యిమందికిపైగా మహిళలు పాల్గొంటారు. ఆశ్వయుజ మాసంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. కనుమ పర్వదినంనాడు అమ్మవారికి గ్రామోత్సవంతోపాటు వల్లూరు చెరువులో వల్లూరమ్మకు తెప్పోత్సవం నిర్వహిస్తారు. ప్రతి శుక్రవారం గుడి ఉత్సవం జరుగుతుంది.

ఆలయంలో సుందర శిల్పాల ఏర్పాటు..

దాతలు, భక్తుల సహకారంతో ఆలయంలోపలి భాగంలో అష్టలక్ష్ములతోపాటు గాయత్రి, సరస్వతి, రాజరాజేశ్వరి, శివపార్వతులు, వినాయకుడు, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, దక్షిణామూర్తి వంటి పలు దేవతామూర్తులను ఏర్పాటు చేశారు. ఇవి జీవకళ ఉట్టిపడుతూ భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.



• వల్లూరమ్మ ఆలయంలోని శిల్పాలు



• వల్లూరమ్మ దర్శనం కోసం విచ్చేసిన భక్తులు

ఉల్కాముఖి ఆవిర్భావం..

వెంకటగిరి రాజుల వంచనవల్ల తమ కార్యం విఫలమైందని మందపాటి రాజులు, అద్దంకి రామచంద్రయ్య బాధపడుతుండగా బరూరి నరసింహ యోగీంద్రులు శుచియై యజ్ఞస్థలికి వచ్చి పరిస్థితిని గ్రహించారు. యజ్ఞగుండం నుండి మరో దివ్యశక్తిని ఆవిర్భవింపచేయవచ్చని పలికి యజ్ఞాన్ని కొనసాగించారు. కొంతసేపటికి యజ్ఞగుండంనుండి చిటపటలతో, ఉల్కలను వెదజల్లుతూ ఉల్కాముఖి ఆవిర్భవించింది. ఉల్కాముఖి ఆవిర్భవించగానే అద్దంకి రామచంద్రయ్య, బరూరి నరసింహ యోగీంద్రులు ఆమెకు నివేదనలు సమర్పించి సంతృప్తిపరిచారు. ప్రజలను ఆపదలనుండి కాపాడవలసినదిగా వారు ఆమెను ప్రార్థించారు. వారి ప్రార్థన మేరకు ముందుకు సాగిన ఉల్కాముఖి వల్లూరు చెరువు కట్ట వద్దకు రాగానే అక్కడ నిలిచిపోయింది. తాను అక్కడనే ఉండి ప్రజలను, పశుసంపదను చల్లగా కాపాడుతుంటానని ఆమె వారికి హామీ ఇచ్చింది. ఆ ప్రకారమే ఉల్కాముఖి ప్రజలను దుష్టశక్తుల నుండి, వ్యాధి బాధలనుండి కాపాడుతూ చల్లనితల్లిగా పూజలందుకుంటున్నది. యజ్ఞకుండంలో ఉల్కల మధ్యనుండి ఆవిర్భవించినందున ఉల్కాముఖిగా ఆమె పేరొందింది. వల్లూరు గ్రామంలో వెలసినందున వల్లూరమ్మ అనే పేరు ఆమెకు స్థిరమైంది. వల్లూరమ్మ ఆవిర్భావానికి కారణభూతులైన అద్దంకి వారి ఆడపడుచుగా వల్లూరమ్మ ప్రసిద్ధి చెందింది. ఆ తర్వాత ప్రాణ ప్రతిష్ఠ జరిగింది. తరువాతి కాలంలో అమ్మవారి విగ్రహాన్ని తయారు చేయించి ప్రతిష్ఠించారు. మరికొద్దికాలం తర్వాత శిథిలావస్థకు చేరి నిరాదరణకు గురైన ఆలయం ఆ తర్వాత జరిగిన శతచండీ యాగం లనంతరం నూతన విగ్రహ ప్రతిష్ఠ, విమాన గోపురం, ముఖ మండపం, ప్రహరీ గోడ, సింహద్వార నిర్మాణం జరిగాయి. ఆలయంలో పరివార దేవతలుగా గంగమ్మ, పోలేరమ్మ విగ్రహాలను ప్రతిష్ఠించారు.



• వల్లూరమ్మ ఆలయం ముఖద్వారం

వాహన పూజలు..

వల్లూరమ్మ ఆలయం వాహన పూజలకు ప్రసిద్ధి చెందింది. జిల్లాకు చెందినవారే గాక గుంటూరు, నెల్లూరు జిల్లాలనుండి కూడా ఎంతోమంది భక్తులు తాము నూతనంగా కొనుగోలు చేసిన వాహనాలను ఆలయానికి తీసుకువచ్చి పూజలు జరిపిస్తారు. ఆలయం చుట్టూ వాహనంపై ప్రదక్షిణ చేస్తారు. అలాచేస్తే అమ్మవారి అనుగ్రహంతో ఏ విధమైన ప్రమాదాలు జరగకుండా రక్షిస్తుందని విశ్వాసం.

చేరుకునే మార్గం..

వల్లూరమ్మ ఆలయం విజయవాడ–చెన్నై ప్రధాన జాతీయ రహదారిలో ఉండడంతో రవాణాపరంగా ప్రయాణీకులకు, భక్తులకు అనుకూలమే. ఉంటుంది. పల్లెవెలుగు బస్సులతోపాటు ఆటోలు, ఇతర ప్రైవేటు వాహనాలు అందుబాటులో ఉంటాయి.

• నిర్మల వాణి

షట్చక్రోపరి సంస్థితా...



108వ నామం వద్ద అమ్మవారిని 'షట్చక్రోపరి సంస్థితా' అని స్తుతిస్తారు. అనగా ఆరు చక్రాల పైభాగం నందు చక్కగా ఉన్నది అని అర్థం. మన సూక్ష్మ శరీరంలో వెన్నుపాము వెంబడి తల మీద మాడు భాగం వరకు మూలాధార చక్రం, స్వాధిష్ఠాన చక్రం, మణిపూర చక్రం, అనాహత చక్రం, విశుద్ధి చక్రం, ఆజ్ఞా చక్రం, సహస్రార చక్రం అనే ఏడు శక్తి కేంద్రాలు ఉంటాయి. కుండలినీ శక్తి మొదటి చక్రమైన మూలాధార చక్రం పైన ఉండే మూలాధారమనే త్రికోణాకారపు ఎముకలో నివసిస్తుంది. అది పైకి వచ్చే దారిలో మిగిలిన ఆరు చక్రాలను అనగా షట్చక్రాలను దాటుకుంటూ వచ్చి, మన తల మీద ఉండే బ్రహ్మ రంధ్రం ద్వారా బయటకు వచ్చి, మన చుట్టూ ఉండే సర్వ వ్యాపితమైన భగవంతుని పరమ చైతన్య శక్తిలో విలీనమవుతుంది. అప్పుడే మనకు యోగం లభిస్తుంది.

100వ నామం వద్ద అమ్మవారిని 'బ్రహ్మ గ్రంథి విభేదినీ' అని వర్ణిస్తారు. కుండలినీ శక్తి ప్రయాణించే మార్గములో చక్రముల మధ్యలో బ్రహ్మ గ్రంథి, విష్ణు గ్రంథి, రుద్ర గ్రంథి అనే గ్రంథులు ఉంటాయి. కుండలినీ శక్తి పైకి ప్రయాణించేటప్పుడు ఈ గ్రంథులను భేదించుకుంటూ పైకి ప్రయాణిస్తుంది. అందువలన ఆమెకు బ్రహ్మ గ్రంథి విభేదినీ, విష్ణు గ్రంథి విభేదినీ, రుద్ర గ్రంథి విభేదినీ అనే నామాలు ఏర్పడ్డాయి.



శ్రీ మాతాజీ నిర్మలాదేవి

– డా. పి. రాకేష్
సహజ యోగ సంస్థాపకురాలు,
పరమ పూజ్య శ్రీ మాతాజీ నిర్మలా దేవి గారి ప్రవచనాల ఆధారంగా

• ఇస్లాం వెలుగు

సేవతోనే సాఫల్యం

పూర్వం కోళ్ళపురి అనే ఊరిలో చాలా కోళ్ళు ఉండేవి. వాటితో పాటు కొంతమంది బాతులు కూడా పెంచుకునేవారు. ఒకరోజు ఊరి వెలుపల చెరువులో ఒకబాతు స్నానానికి వెళ్ళింది. ఈదీఈదీ (స్నానం చేసి) బయటికొచ్చింది. ఒళ్ళంతా, ఈకలన్నీ తడిసిపోవడంతో రెక్కలు టపటపలాడించసాగింది. అప్పుడు అనుకోకుండా దాని రెక్కలు పక్కనే ఉన్న ముళ్ళపొదలో ఇరుక్కుపొయ్యాయి. ఎంత విదిలించుకున్నా ఒళ్ళంతా గాయాలయ్యాయి గాని, అందులోంచి బయట పడలేక పోయింది. అంతలో చాలా కోళ్ళు మేసుకుంటూ మేసుకుంటూ అటువైపుగా వచ్చాయి. వాటిని చూడగానే బాతు ప్రాణం లేచి వచ్చింది. స్నేహితులారా.. నాక్కాస్త సహాయం చేయండి. నేనీ ముళ్ళ పొదలో చిక్కుకుపోయాను. నా ప్రాణాలు కాపాడండి. అని మొరపెట్టుకుంది. కాని ఆ కోళ్ళు దానికి సహాయం చెయ్యకపోగా, "మాకేం పని.. నువ్వేమైనా మాకులమా.. మా మతమా.. నీది బాతుకులం.. మాది కోడి కులం.." అంటూ తమదారి తాము వెళ్ళి పొయ్యాయి. కాని అందులో ఒక తెల్లని కోడి, "లేదు..లేదు.. మనమంతా కలిసి బాతును రక్షిద్దాం.. మనం కులం కాక పోయినా దానిది కూడా ప్రాణమేకదా..మనకెలా భయం, బాధ కలుగుతాయో దానికీ అలాగే కలుగుతాయికదా.. రండి రక్షిద్దాం" అని చెప్పింది.

కాని కోళ్ళుదాని మాట వినలేదు. "నీకంత ప్రేమ ఉంటే నువ్వెళ్ళి కాపాడుకో.. మేము రాము" అని తెగేసి చెప్పాయి. తమదారి తాము వెళ్ళిపోయాయి. పాపం తెల్ల కోడి చాలా బతిమాలింది. ఈరోజు మనం దానికి సహాయం చేస్తే, రేపు మనకేదైనా ఆపద వస్తేదేవుడు మనల్ని కాపాడతాడు. అని నచ్చజెప్పజూసింది. అయినా కోళ్ళు దాని మాట లక్ష్య పెట్టకుండా కొ..క్కొ..క్కొ..క్కో... అనుకుంటూ అక్కణ్ణించి వెళ్ళిపోయాయి. తెల్లకోడి ఇక చేసేదేమీలేక ఒక్కతే బాతును రక్షించడానికి కంకణం కట్టుకుంది. ముళ్ళకొమ్మలు ముక్కుతో, కాళ్ళతో లాగడం వల్ల అది కూడా తీవ్రంగా గాయపడింది. అయినా సరే దైవంపై భారంవేసి శక్తినంతా కూడగట్టుకొని ప్రయత్నించింది. చివరికి విజయం సాధించింది. బాతు ప్రాణాలతో బయట పడింది. బాతు దైవానికి, తెల్ల కోడికి కృతజ్ఞతలు సమర్పించుకుంది. తెల్లకోడిని వాటేసుకొని మరీ మరీ ధన్యవాదాలు చెప్పింది. నీ మేలు ఎన్నటికీ మరువనని వాగ్దానం చేసింది.

కొన్నాళ్ళకు కోళ్ళపురి అనే ఆ ఊరికి వరదలొచ్చాయి. అంతా తట్టా బుట్టా సర్దుకొని తలా ఒక మెట్ట వైపుకు బయలు దేరారు. కోళ్ళన్నీ భయంతో గజగజ వణికిపోతూ సహాయం కోసం ఎదురు చూస్తున్నాయి. తమ యజమానులైనా రక్షిస్తారేమోనని ఎదురు చూశాయి. కాని వారే ప్రాణభయంతో తలా ఒక దిక్కుకు పరుగు లంకించుకుంటున్నారు. చూస్తూ చూస్తూనే వరద సమీపిస్తోంది. కాళ్ళ దగ్గరికొచ్చేసింది. అంతలో బాతు పరుగెత్తుకుంటూ వచ్చింది. వచ్చీరాగానే తెల్ల కోడిని సమీపించి, మిత్రమా భయపడకు నేనున్నాను. అంటూ వీపుపై ఎక్కించుకొంది. అది చూసి మిగతా కోళ్ళకు పశ్చాత్తాపం కలిగింది. ఆరోజు మనం కూడా సహాయానికి పోయి ఉంటే ఈనాడు మనకు కూడా సహాయం అందేదే అని చేసిన తప్పును గుర్తుచేసుకొని సిగ్గుతో తలవంచుకున్నాయి. బాతు ఏమాత్రం ఆలస్యం చెయ్యకుండా తెల్ల కోడిని సురక్షిత ప్రదేశానికి చేర్చి, తన తోటి బాతులన్నిటినీ పిలుచుకొచ్చింది. కోళ్ళన్నిటినీ అవి తమ వీపులపై ఎక్కించుకొని ఈదుకుంటూ అవతలకు చేర్చాయి.

కష్టాల్లో ఉన్నవారికి సహాయం చెయ్యడం, ఇతరుల బాధను తొలగించడం చాలా గొప్ప పుణ్యకార్యం. ఆపదలో ఉన్నవారు మనవాళ్ళా కాదా అని చూడడం అజ్ఞానం. మనవాళ్ళయితే సహాయం చెయ్యడం, కాకపోతే వదిలేయడం ధర్మ వ్యతిరేకం. మానవత్వానికి వ్యతిరేకం. ఆపదలో పడింది ఎవరైనా సరే ఆదుకోవడం ధర్మం, మానవత్వం. ఏదోఒక సమయంలో దాని ప్రతిఫలం లభించి తీరుతుంది. మనకు తెలియకుండానే ఊహించని వైపునుండి సహాయం అందుతుంది.

ఇతరుల కష్టాలను దూరం చేసేవారిని దైవం ప్రేమిస్తాడని, వారి కష్టాలను దూరం చేస్తాడని దైవ ప్రవక్త వారు చెప్పిన సూక్తికి ఈ కథ అద్దం పడుతోంది. కనుక కష్టాల్లో, బాధల్లో ఉన్న వారు ఎవరైనా సరే శక్తిమేర ఆదుకునే ప్రయత్నం చేయడమే విశ్వాసుల లక్షణం. తద్వారానే ఇహ, పరలోకాల సాఫల్యం ప్రాప్తమవుతుంది.



– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్

పర్వాల పూర్ణిమ

దైవీశక్తులతో కూడిన శ్రావణ శుద్ధ పూర్ణిమను రాఖీపూర్ణిమగా, జంధ్యాల పూర్ణిమగా జరుపుకుంటారు. శక్తిస్వరూపిణిగా వ్యవహరించబడే ఇంటి ఆడపడుచు(సోదరి) చేత ఈరోజు రక్షాబంధనం కట్టించుకున్న సోదరులకు దేవతలు రక్షగా నిలిచి అరిష్టాలను తొలగిస్తారని, అన్నింటా అండదండగా నిలుస్తారని విశ్వాసం.
రక్షాబంధన పండుగ పరమార్థం ఏమిటి?


తన సోదరుని జీవితం తీపివలె ఎల్లప్పుడూ కమ్మగా ఉండాలని, తలపెట్టే ప్రతికార్యం విజయవంతం కావాలని, అతనికి సకల సంపదలు చేకూరాలని కోరుతూ తోబుట్టువులు సోదరుని చేతికి రక్షాబంధనం కట్టే ఈ పండుగ నుంచి గ్రహించవలసిన పరమార్థం ఏమంటే– ప్రతిఫలాన్ని ఆశించకుండా నిష్కల్మషమైన ప్రేమతో, స్వచ్ఛమైన మనస్సుతో జరుపుకునే ఈ పండుగ సమాజంలో అందరూ ఒకరికొకరు తోబుట్టువుల వంటి వారేనని, స్వంత సంబంధం లేకపోయినా, సామాజికంగా స్త్రీ పురుషుల మధ్య ప్రేమ, ఆత్మీయత, మమతానురాగాలు పరిఢవిల్లాలని, తోబుట్టువులు లేరని చింతించకుండా సోదర ప్రేమ కలిగిన వారికి రక్షణగా నిలవాలన్నది ఈ పండుగ పరమార్థం.

ఈరోజున బ్రాహ్మణులు, వైశ్యులు, క్షత్రియులు తదితర జంధ్యాన్ని ధరించే అన్ని కులాలవారు స్నానాన్ని ఆచరించి నూతన యజ్ఞోపవీతం ధరిస్తారు. కొత్తగా ఉపనయనం జరిగిన వారికి ఉపాకర్మ జరిపిస్తారు. అందుకే దీనికి జంధ్యాల పూర్ణిమ అని పేరొచ్చింది. ఈరోజునే హయగ్రీవ జయంతి

"జ్ఞానానంద మయం దేవం నిర్మల స్ఫటికాకృతిం
ఆధారం సర్వవిద్యానాం హయగ్రీవ ముపాస్మహే"

అంటూ సర్వవిద్యలకూ ఆధారభూతంగా చెప్పుకునే హయగ్రీవుని స్తుతించడం వల్ల విద్యార్థులలో జ్ఞాపకశక్తి పెరుగుతుందని శాస్త్ర వచనం.






• సువార్త

అభిషిక్త అనగా దేవునిచే అభిషేకించబడినవారు. ప్రాచీనకాలంలో కొన్ని వేల సంవత్సరాల క్రితం దేవుడు యాజకత్వ బాధ్యతను ప్రత్యేకించి ఇశ్రాయేలీయులలో ఒకే వంశానికి, గోత్రానికే అప్పగించాడు. వారే లేవీ గోత్రం వారు. మోషే లేవీ గోత్రానికే చెందినవాడైనప్పటికీ ఆ బాధ్యతను తన సహోదరుడైన 'అహరోను'కు అప్పగించాడు. ఆ వంశానికి గోత్రానికే యాజకత్వం అని అర్థం. మోషే మాత్రం పరవాసులుగాను ఐగుప్తులో నున్న ఆయన ప్రజలు లేక జనాంగములైన ఇశ్రాయేలీయులను బానిసత్వంలో వున్నవారిని విడుదల పరచడానికి అంటే నాయకత్వ బాధ్యతను అప్పగించాడు యెహోవా.

సృష్ట్యారంభంలో దేవుడు మానవులను సృజించినప్పుడు, వారిని ఫలించి అభివృద్ధి చెంది ఫలించమన్నాడు. కానీ వారు దేవుని ఆజ్ఞను అతిక్రమించడం ద్వారా (ఆజ్ఞాతిక్రమము) వారు ఏదేను తోట నుండి వెడలగొట్టబడ్డారు. అనగా దేవునికి, మానవునికి వున్న సంబంధం తెగిపోయింది. అనగా శపించబడ్డారు. వారు ఆదినరనారీలు (ఆదాము, హవ్వ). ఏదేను తోట అనగా పరదేశం లేక పవిత్ర పర్వతం. ఆ బాంధవ్యాన్ని ఇశ్రాయేలు జనాంగ పితామహుడు విశ్వాసానికి తండ్రిలాంటి అబ్రాహాము ద్వారా నీ సంతానాన్ని ఇసుకరేణువుల లాగా అభివృద్ధి పరుస్తానని దేవుడు వాగ్దానాన్ని స్థిరపరచాడు మోరియా దేశంలో వున్న పర్వతం పైన. అలాగే మోషే ద్వారా సీనాయి పర్వతం మీద దేవుడు మోషే పది ఆజ్ఞలు అనుగ్రహించి స్థిరపరిచాడు. అబ్రాహాము త్యాగానికి, విశ్వాసానికి, దేవుడు ఒక సందర్భంలో స్నేహితుడుగా సంబోధించిన వాక్యం పరిశుద్ధగ్రంథంలో చూస్తాం. అలాగే ఆ ప్రజలలోని గొర్రెల కాపరిగా వున్న 'దావీదు'ను మహారాజుగా అభిషేకించాడు. యెరుషలేమనగా 'సమాధానపురం' అని అర్థం. ఆ సమాధిపురం అనే 'యెరుషలేము'నకు 'దావీదు' రాజు కుమారుడై 'సొలోమోను రాజుగా స్థిరపడ్డాడు. 'సొలోమోను' అనగా సమాధాన కర్త అని అర్థం. అనగా సమాధానపురానికి సమాధాన కర్త రాజయ్యాడు. దేవుడు ఇశ్రాయేలీయులను మోషే చేత వెలుపలికి రప్పించి హోరేబు కొండపై ప్రత్యక్షమై పది ఆజ్ఞలు అనుగ్రహించి తర్వాత మందిర నిర్మాణం చేయించాడు.

అభిషిక్త పరిచర్య క్రీస్తు పరిమళం



మందిర నిర్మాణం తర్వాత యాజకత్వ బాధ్యత మోషే సహోదరుడైన అహోరానుకు, ఆయన వంశానికి దేవునిచే అనుగ్రహింపబడింది. యాజకుడు పవిత్రత కొరకు వారికి వస్త్రధారణలో పవిత్రత కొరకు శుద్ధీకరణ స్నానం, అభిషేక వస్త్రాల (ఏఫోదు), రొమ్ములపై ధరించు పతాకాలను, నడికట్టు, తలపాగా, కిరీటం, అభిషేక తైలం ఈ ఏడు సేవలు జరుపుకొనేందుకు ప్రతిష్ఠింపబడింది. దేవాలయం మూడు భాగాలుగా ఒకటి వెలుపటి (బయట) స్థలం, పరిశుద్ధస్థలం, అతిపరిశుద్ధస్థలం, వెలుపలి స్థలంలో ప్రజలుండు లాగున పరిశుద్ధస్థలంలో లేవీయులు, యాజకులు సేవలు జరుపులాగున, అతిపరిశుద్ధ స్థలంలో ప్రధాన యాజకులు సంవత్సరానికి ఒక్కమారు ప్రవేశించులాగున నిర్ణయించబడింది (నిర్గమ 29 :1-9), నిర్గమ 28 అధ్యాయం. ఇది ప్రాచీనకాలంలో అభిషిక్తుని పరిచర్య.

క్రీస్తు ప్రభువు రెండువేల సంవత్సరాల క్రితం దేవుడైన తండ్రి నరావతారిగా జన్మింపజేశాడు. యేసుప్రభువు జీవించిన కాలం ముప్పయి మూడున్నర సంవత్సరాలు మాత్రమే. ఆ కాలంలో చివరి మూడున్నర సంవత్సరాలు ఆయన బలహీనవర్గాలతో ఎక్కువకాలం గడిపాడు. ఉదా: కనాను స్త్రీ, రెండు సమరయస్త్రీ. తరువాత డెబ్బదిమంది యితరులను నియమించి వారితో ఇదిగో–తోడేళ్ళమధ్యకు గొర్రెపిల్లలను పంపినట్లు నేను మిమ్మును పంపుతున్నాను. మీరు అందులో వున్న రోగులను స్వస్థపరచుడి –దేవుని రాజ్యము మీ దగ్గరకు వచ్చియున్నదని వారితో చెప్పమని చెప్పి పంపాడు (లూకా 10:1–11).

ప్రస్తుతకాలంలో పాస్టర్లు, వీరిమీద పీఠాధిపతి (బిషప్పులు), మోడరేటర్లుగా సేవ అందిస్తున్నారు. ఆ సేవ అంతమట్టుకు కాక పట్టణాలలో, నగరాల్లోని పెద్ద మందిరాలలో వచ్చే ఆదాయాన్ని కొంత వరదలు, ప్రకృతి విపత్తులలో వాడుతున్నారు. ప్రభువు నాకొక వేరే మంద వున్నదనగా క్రైస్తవులు, యూదులే గాకుండా శ్వాస పీల్చే ప్రతి జీవీ నా ప్రజలే గనుక వారికి సువార్త, రోగుల స్వస్థత స్వచ్ఛంద సేవలు చేయుదురుగాక. అదే క్రీస్తు పరిమళం (యోహాను 10: 17).

– కోట బిపిన్ చంద్రపాల్

ఆర్‌బీఐ పాలసీ
ఎవరేమన్నారంటే..

ఆర్‌బీఐ ఎంపీసీ రేట్లపై యథాతథ స్థితిని కొనసాగించిన నేపథ్యంలో రానున్న రోజుల్లో మరో విడత రేట్ల తగ్గింపునకు వెసులుబాటు ఉంటుందని ఆర్థిక నిపుణులు, బ్యాంకర్లు, పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడ్డాయి. అంచనాలకు అనుగుణంగానే ఆర్‌బీఐ నిర్ణయం ఉన్నట్టు పేర్కొన్నాయి.

ఊహించిందే..



యథాతథ స్థితి అంచనా వేసిందే. రానున్న రోజుల్లో వినియోగ ధరల ఆధారిత ద్రవ్యోల్బణం నియంత్రణల్లోనే ఉండడం, వృద్ధికి మద్దతు అవసరమైతే రేట్ల తగ్గింపునకు అవకాశం మిగిలే ఉంది.
– బినోద్ కుమార్, ఇండియన్ బ్యాంక్ ఎండీ

వేచి చూసే ధోరణి కొనసాగొచ్చు



విధానాల్లో నాటకీయ మార్పులు లేనంత వరకు మరి కొంత కాలం పాటు వేచి చూసే ధోరణి కొనసాగించొచ్చు. డేటా ఆధారంగా మరొక్క విడత రేటు తగ్గింపు ఉండొచ్చు.
– మదన్ సబ్నవిస్, బ్యాంక్ ఆఫ్ బరోడా ముఖ్య ఆర్థికవేత్త

వృద్ధికి సవాళ్లు..



మరో విడత రేట్ల తగ్గింపు ఇప్పుడే అవసరం లేదు. వృద్ధి అంచనాలను ఆర్‌బీఐ 6.5 శాతం వద్దే కొనసాగించింది. దీనిపై కొంచెం ఒత్తిళ్లు ఉండొచ్చు. 0.10-0.20 శాతం తగ్గే రిస్క్ ఉంది. అంతర్జాతీయ అనిశ్చితుల కారణంగా ప్రతికూలతలు ఎదురైతే దేశీ డిమాండ్‌ను పెంచుకోవడం ద్వారా అధిగమించొచ్చు.
– రాజెస్ బెనర్జీ, పీడబ్ల్యూసీ ఇండియా ఎకనమిక్ అడ్వైజరీ లీడర్

తటస్థ వైఖరిని సూచిస్తుంది..



సెంట్రల్ బ్యాంక్ నిర్ణయం తటస్థ వైఖరిని సూచిస్తోంది. అంతర్జాతీయ అనిశ్చితుల నుంచి దేశీ ఆర్థిక వ్యవస్థకు మద్దతుగా నిలవడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నట్టు కనిపిస్తోంది. గతంలో చేపట్టిన రేట్ల తగ్గింపు నిర్ణయాలు హౌసింగ్ రంగంలో బలమైన డిమాండ్‌కు మద్దతుగా నిలుస్తాయి. అయినప్పటికీ ఈ దశలో మరొక్కసారి మోస్తరుగా రేట్లను తగ్గించినట్టయితే అందుబాటు ధరలు, మధ్యదాయ గృహ విభాగాల్లో కొనుగోలుదారులకు ప్రేరణనిస్తుంది.
– శేఖర్ పటేల్, క్రెడాయ్ నేషనల్ ప్రెసిడెంట్

భవిష్యత్తులోనైనా తగ్గించాలి...



ఆర్‌బీఐ తదుపరి ఎంపీసీ సమీక్షలో అయినా రెపో రేటు తగ్గింపును పరిశీలించాలి. రియల్ ఎస్టేట్ మార్కెట్‌కు ప్రస్తుతం ఉత్తేజం కావాలి. రెపో రేటును తగ్గించినట్టయితే కొత్త ప్రాజెక్టులను చేపట్టే దిశగా డెవలపర్లకు మద్దతునిస్తుంది. కొనుగోలుదారులకు ప్రోత్సాహాన్నిస్తుంది.
– జి.హరిబాబు, నరెడ్కో నేషనల్ ప్రెసిడెంట్

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

7-8-2025

విశాఖ	500-00
చిత్తూరు	513-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	480-00
విజయవాడ	490-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	440-00
వరంగల్	442-00
రిటైల్ ధర	5.00

నిఫ్టీ 50
టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ASIANPAINT	2,484.10	1.94
HDFCLIFE	752.4	1.88
M&M	3,240.10	0.87
BEL	389.3	0.69
COALINDIA	376.5	0.67

నిఫ్టీ 50
టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
WIPRO	239.75	-2.5
SUNPHARMA	1,593.50	-2.37
JIOFIN	326	-2.06
TECHM	1,455.00	-2.05
INDUSINDBK	803	-1.97

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	10,375
ఎన్ఎస్ఈ	89,123
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,33,585
ఎఫ్ఐఐ	- 4,999
డీఐఐ	+ 6,794

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.30కు		క్రితం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	64.27	$	65.16
బ్రెంట్	66.79	$	67.64



నిస్సాన్ స్పెషల్ ఎడిషన్
'మాగ్నైట్ కురో'
ప్రారంభ ధర రూ.8.30 లక్షలు

గురుగ్రామ్: నిస్సాన్ మోటార్ తన పాపులర్ బ్రాండ్ మాగ్నైట్‌ను సరికొత్త లుక్‌లో 'మాగ్నైట్ కురో' పేరుతో మార్కెట్లోకి తీసుకొచ్చింది. 'కురో' అంటే జపాన్ భాషలో నలుపు అర్థం. పేరు తగ్గట్లే పూర్తి నలుపు రంగులో ఉండే ఈ స్పెషల్ ఎడిషన్ ధర రూ.8.30 లక్షల నుంచి ప్రారంభమవుతుంది. మొత్తం నాలుగు వేరియంట్లలో అందుబాటులో ఉంది. రూ.11,000 ముందస్తు చెల్లింపుతో బుకింగ్ చేసుకోవచ్చు. సాధారణ మాగ్నైట్ కార్లలో ఉన్న ఇంజిన్‌నే ఇందులోనూ ఉపయోగించారు. ఫీచర్ల విషయానికొస్తే.., 8 అంగుళాల డ్యుయల్ డిజిటల్ టచ్‌స్క్రీన్స్, యాపిల్ కార్‌ప్లే, ఆండ్రాయిడ్ ఆటో, వైర్‌లెస్ ఛార్జర్, అర్కామిస్ సౌండ్ సిస్టం, ఆటో ఐఆర్‌వీఎమ్, ఐ-కీ ఆటో అన్‌లాక్, ఇల్యూమినేటెడ్ గ్లోవ్ బాక్స్, రియర్ ఏసీ వెంట్స్‌తో క్లైమెట్ కంట్రోల్ వంటి ఇందులో ఉన్నాయి.

5 కంపెనీలు ఐపీవోకు రెడీ



తాజాగా సెబీ గ్రీన్ సిగ్నల్

న్యూఢిల్లీ: పబ్లిక్ ఇష్యూలు చేపట్టేందుకు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా ఐదు కంపెనీలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జాబితాలో ప్రెస్టీజ్ హాస్పిటాలిటీ వెంచర్స్, ఆనంద్ రాఠీ షేర్ అండ్ స్టాక్ బ్రోకర్స్, ఎస్ఎస్ఎఫ్ ప్లాస్టిక్స్ ఇండియా, గుజరాత్ కిడ్నీ అండ్ సూపర్ స్పెషాలిటీ, ఈప్యాక్ ప్రీఫ్యాబ్ టెక్నాలజీస్ చేరాయి. ఈ కంపెనీలు సెబీకి ఈ ఏడాది జనవరి-ఏప్రిల్ మధ్య ప్రాస్పెక్టస్ దాఖలు చేశాయి.

ప్రెస్టీజ్ హాస్పిటాలిటీ

రియల్టీ దిగ్గజం ప్రెస్టీజ్ ఎస్టేట్స్ ప్రాజెక్ట్స్ అనుబంధ సంస్థ ప్రెస్టీజ్ హాస్పిటాలిటీ వెంచర్స్ ఐపీవో ద్వారా రూ. 2,700 కోట్లు సమీకరించే ప్రణాళికల్లో ఉంది. దీనిలో భాగంగా రూ. 1,700 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 1,000 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను ప్రమోటర్ సంస్థ ప్రెస్టీజ్ ఎస్టేట్స్ ప్రాజెక్ట్స్ విక్రయానికి ఉంచనుంది.

ఆనంద్ రాఠీ

ఆనంద్ రాఠీ గ్రూప్ బ్రోకింగ్ సర్వీసుల విభాగం ఆనంద్ రాఠీ షేర్ అండ్ స్టాక్ బ్రోకర్స్ ఐపీవోలో భాగంగా రూ. 745 కోట్ల ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. తద్వారా సమీకరించనున్న రూ. 745 కోట్లలో రూ. 550 కోట్లు దీర్ఘకాలిక వర్కింగ్ క్యాపిటల్, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది.

ఎస్ఎస్ఎఫ్ ప్లాస్టిక్స్

పబ్లిక్ ఇష్యూ ద్వారా ఎస్ఎస్ఎఫ్ ప్లాస్టిక్స్ ఇండియా రూ. 550 కోట్లు సమీకరించే ప్రణాళికల్లో ఉంది. దీనిలో భాగంగా రూ. 300 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 250 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను ప్రమోటర్లు, ప్రమోటర్ గ్రూప్ సంస్థలు విక్రయానికి ఉంచనున్నాయి. ఈక్విటీ జారీ నిధులను రుణ చెల్లింపులు, ప్లాంటు, మెషినరీ కొనుగోళ్లు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది.

ఈప్యాక్ ప్రీఫ్యాబ్ టెక్

పబ్లిక్ ఇష్యూలో భాగంగా ఈప్యాక్ ప్రీఫ్యాబ్ టెక్నాలజీస్ రూ. 300 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో కోటి ఈక్విటీ షేర్లను ప్రమోటర్లు ఆఫర్ చేయనున్నారు. ఈక్విటీ జారీ నిధులను రాజస్తాన్‌లోని అల్వార్‌లోగల ఘిలోత్ ఇండస్ట్రియల్ ఏరియాలో తయారీ యూనిట్ ఏర్పాటుకు వెచ్చించనుంది. అంతేకాకుండా ఆంధ్రప్రదేశ్‌లోగల ప్లాంటు విస్తరణతో పాటు.. రుణ చెల్లింపులు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు సైతం వినియోగించనుంది.

గుజరాత్ కిడ్నీ అండ్ సూపర్ స్పెషాలిటీ

ఆరోగ్య పరిరక్షణ రంగ సంస్థ గుజరాత్ కిడ్నీ అండ్ సూపర్ స్పెషాలిటీ పబ్లిక్ ఇష్యూలో భాగంగా 2.2 కోట్ల ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. ఇష్యూ నిధులను అహ్మదాబాద్‌లోని పరేఖ్స్ హాస్పిటల్ కొనుగోలుసహా.. ఇప్పటికే సొంతం చేసుకున్న అశ్విని మెడికల్ సెంటర్ పాక్షిక చెల్లింపులకు, వడోదరలో రోబోటిక్స్ పరికరాలతోపాటు కొత్త ఆసుపత్రి ఏర్పాటుకు వినియోగించనుంది. అంతేకాకుండా మరికొన్ని నిధులను రుణ చెల్లింపులు, ఇతర సంస్థల కొనుగోళ్లు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు సైతం వెచ్చించనుంది.

పబ్లిక్ ఇష్యూ ప్రణాళికల్లో ఇండోసోల్
రూ. 69,000 కోట్ల పెట్టుబడులు



భవిష్యత్ ప్రణాళికలు..

హైదరాబాద్: షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ అనుబంధ సంస్థ ఇండోసోల్ సోలార్ వచ్చే ఆర్థిక సంవత్సరంలో పబ్లిక్ ఇష్యూకి వచ్చే ప్రణాళికల్లో ఉంది. రాబోయే కొన్నేళ్లలో రూ. 69,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ సీఎండీ ఎన్ విశ్వేశ్వరరెడ్డి ఈ విషయాలు వెల్లడించారు. 'ఈ ఆర్థిక సంవత్సరం ఆఖరు నాటికి ఆంధ్రప్రదేశ్‌లో 1 గిగావాట్ల సమగ్ర తయారీ లైన్ (ఇన్‌గోట్ నుంచి సెల్ మాడ్యూల్ వరకు) ప్రారంభించనున్నాం. ఆ తర్వాత ఐపీవోకి వచ్చే యోచన ఉంది. ప్రాథమికంగా, ప్రీ-ఐపీవో ప్లేస్‌మెంట్ ద్వారా 25-26 శాతం వాటా విక్రయించాలని భావిస్తున్నాం' అని విశ్వేశ్వరరెడ్డి చెప్పారు. ఇండోసోల్‌లో షిర్డీ సాయి 51 శాతం వాటాలను తన దగ్గరుంచుకుని, దాదాపు 49 శాతం వరకు వాటాలను విక్రయించే అవకాశం ఉందని తెలిపారు. ఒకవేళ ఇండోసోల్ ఐపీవో గానీ కుదరకపోతే షిర్డీ సాయి ఎలక్ట్రికల్సే 2027 ఆర్థిక సంవత్సరంలో పబ్లిక్ ఇష్యూకి రావచ్చని ఆయన సూచనప్రాయంగా తెలిపారు. సోలార్ పీవీ తయారీ ప్లాంటు ఏర్పాటు కోసం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కారేడు గ్రామంలో 8,348 ఎకరాల స్థలం, అదే జిల్లాలోని చెవురు గ్రామంలో మరో 114.5 ఎకరాల స్థలాన్ని ఇండోసోల్‌కి కేటాయించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

పాలీసిలికాన్‌కి ముడి వనరైన క్వార్ట్జ్ మైనింగ్‌కి సంబంధించి కర్నూలు, అనంతపురంలో మైనింగ్ హక్కులు దక్కించుకున్నామని విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. రూ. 25,000-రూ. 28,000 కోట్లతో ఫేజ్1లో భాగంగా తలపెట్టిన 10 గిగావాట్ల లైన్ వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి ఏర్పాటవుతుందని పేర్కొన్నారు. దీర్ఘకాలంలో 90,000 మిలియన్ టన్నుల (ఎంటీ) పాలీసిలికాన్ ఉత్పత్తి తదితర లక్ష్యాలతో ఇండోసోల్ ప్రాజెక్టుపై పెట్టుబడులు మొత్తం మీద రూ. 64,000 కోట్లుగా ఉంటాయని విశ్వేశ్వరరెడ్డి చెప్పారు. ఇందుకోసం అంతర్గతంగాను, అలాగే ఇండియన్ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఇరెడా) నుంచి నిధులు సమీకరిస్తున్నట్లు తెలిపారు. బహుళ జాతి సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థలతో కూడా సంప్రదింపులు జరుపుతున్నట్లు వివరించారు. మరోవైపు, షిర్డీ సాయి ఆర్డర్ బుక్ రూ. 12,000 కోట్లుగా ఉంది. గత ఆర్థిక సంవత్సరంలో ఆదాయం రూ. 3,000 కోట్లుగా ఉండగా, ఈసారి రూ. 6,500 కోట్లు అంచనా వేస్తోంది.

టీసీఎస్ ఉద్యోగులకు వేతన పెంపు షురూ
సెప్టెంబర్ 1 నుంచి అమలు



న్యూఢిల్లీ: టీసీఎస్ తన ఉద్యోగులకు తీపి కబురు చెప్పింది. జూనియర్ లెవల్ నుంచి మధ్య స్థాయి ఉద్యోగుల వరకు 80 శాతం సిబ్బందికి సెప్టెంబర్ 1 నుంచి వేతన పెంపులను అమలు చేయనున్నట్టు సమాచారం ఇచ్చింది. ఉద్యోగులకు పంపిన ఈ మెయిల్‌లో టీసీఎస్ సీహెచ్‌ఆర్‌వో మిలింద్ లక్కడ్, సీహెచ్‌ఆర్‌వోగా నియమితులైన కే సుదీప్ తెలిపారు. గ్రేడ్ సీ3ఏ, దీనికి సమానమైన అసోసియేట్‌లకు (మొత్తం ఉద్యోగుల్లో 80 శాతం) వేతన సవరణను అమలు చేయనున్నట్టు వెల్లడించారు. 12,000 మంది ఉద్యోగులను తొలగించనున్నట్టు ఈ సంస్థ ఇటీవలే ప్రకటించడం తెలిసే ఉంటుంది.

పేటీఎం మనీ యాప్‌లో జియో బ్లాక్‌రాక్ ఫండ్స్

Paytm Money BlackRock Jio

హైదరాబాద్: పేటీఎం మనీ (వన్97 కమ్యూనికేషన్స్ సబ్సిడరీ), జియో బ్లాక్‌రాక్ అస్సెట్ మేనేజ్‌మెంట్ కంపెనీతో జట్టుకట్టింది. జియో బ్లాక్ రాక్ ఐదు ఇండెక్స్ ఫండ్స్‌కు సంబంధించి (న్యూ ఫండ్ ఆఫర్‌లు/ఎన్‌ఎఫ్‌వోలు) పెట్టుబడులకు ఆహ్వానం పలకడం గమనార్హం. ఇన్వెస్టర్లు పేటీఎం మనీ యాప్ ద్వారా జియో బ్లాక్‌రాక్ ఐదు ఎన్‌ఎఫ్‌వోల్లో పెట్టుబడులు పెట్టుకోవచ్చని ప్రకటించింది. జీరో కమీషన్‌తో మ్యూచువల్ ఫండ్స్ పథకాల డైరెక్ట్ ప్లాన్లను పేటీఎం మనీ ఆఫర్ చేస్తుంటుంది. జియో బ్లాక్‌రాక్ ఇంతకుముందు తీసుకొచ్చిన డెట్ ఫండ్స్‌లో పెట్టుబడులకు పేటీఎం మనీ యాప్ ద్వారా 7,000 లావాదేవీలు నమోదైనట్టు వన్97 కమ్యూనికేషన్స్ తెలిపింది. ఇందులో 45 శాతం లావాదేవీలు సిప్ రూపంలో ఉన్నట్టు పేర్కొంది.

వాట్సాప్ నుంచి 'సేఫ్టీ ఓవర్‌వ్యూ' సాధనం
68 లక్షల ఖాతాలపై నిషేధం



న్యూఢిల్లీ: స్కాములు, మోసాల నుంచి యూజర్లకు రక్షణ కల్పించే దిశగా మెసేజింగ్ యాప్ వాట్సాప్ మరిన్ని సాధనాలను అందుబాటులోకి తెస్తోంది. ఇందులో భాగంగా 'సేఫ్టీ ఓవర్‌వ్యూ'ని ఆవిష్కరించింది. మన కాంటాక్ట్స్‌లో లేని వారెవరైనా మనకు తెలియని ఓ కొత్త వాట్సాప్ గ్రూప్‌లో మన పేరు యాడ్ చేస్తే ఇది వెంటనే అలర్ట్ చేస్తుంది. ఈ టూల్‌లో సదరు గ్రూప్‌కి సంబంధించిన కీలక వివరాలు, సురక్షితంగా ఉండేందుకు తీసుకోతగిన టిప్స్ మొదలైనవి ఉంటాయి.

ఎయిర్‌బస్ భారత ఎండీగా జుర్గెన్ వెస్టర్‌మీర్



న్యూఢిల్లీ: ఎయిర్‌బస్ ఇండియా ప్రెసిడెంట్, ఎండీగా జుర్గెన్ వెస్టర్‌మీర్ (53) నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన ఎయిర్‌బస్‌లో ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, చీఫ్ ప్రొక్యూర్‌మెంట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. సెప్టెంబర్ 1 నుంచి కొత్త బాధ్యతలు చేపట్టనున్నట్టు ఎయిర్‌బస్ ప్రకటించింది. ప్రస్తుతం ఎయిర్‌బస్ ఇండియా చైర్మన్, ఎండీగా ఉన్న రెమి మైలార్డ్ ఇకపై కమర్షియల్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజనీరింగ్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్‌గా, టెక్నాలజీ హెడ్‌గా పనిచేయనున్నారు. ఎయిర్‌బస్‌కు భారత్ ఎంతో ముఖ్యమైన మార్కెట్ కావడం గమనార్హం.

వ్యాపార అవకాశాలపై కంపెనీల ధీమా

ఏప్రిల్-జూన్‌లో 149.4కి వ్యాపార విశ్వాస సూచీ



న్యూఢిల్లీ: వ్యయాలు తగ్గుతున్న నేపథ్యంలో వచ్చే ఆరు నెలల్లో వ్యాపార అవకాశాలు మెరుగ్గా ఉంటాయని పరిశ్రమ వర్గాలు ఆశావహంగా ఉన్నాయి. ఏప్రిల్-జూన్ వ్యవధిలో వ్యాపార విశ్వాస సూచీ (బీసీఐ) 149.4కి పెరగడం ఇందుకు నిదర్శనం. జనవరి-మార్చి త్రైమాసికంలో ఇది 139.3గా నమోదైనట్లు నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లైడ్ ఎకనమిక్ రీసెర్చ్ (ఎన్‌సీఏఈఆర్) వెల్లడించింది. ఇందుకు సంబంధించిన సర్వేలో పాల్గొన్నవారిలో వచ్చే ఆరు నెలల్లో ఉత్పత్తి మెరుగ్గా ఉంటుందని 78.7 శాతం, దేశీయంగా అమ్మకాలు పెరుగుతాయని 79.1 శాతం కంపెనీలు ఆశాభావం వ్యక్తం చేశాయి. అలాగే ముడి వస్తువుల దిగుమతులు పెరుగుతాయని 54.3 శాతం, పన్నుల ముందు లాభాలు మెరుగుపడతాయని 61 శాతం సంస్థలు అంచనా వేస్తున్నాయి. ఆరు నగరాలవ్యాప్తంగా జూన్‌లో నిర్వహించిన ఈ సర్వేలో 479 కంపెనీలు పాల్గొన్నాయి. వచ్చే ఆరు నెలల్లో ఆర్థిక పరిస్థితులు, కంపెనీల ఆర్థిక స్థితిగతులు, పెట్టుబడుల వాతావరణం తదితర నాలుగు అంశాలు బీసీఐకి ప్రాతిపదికగా ఉంటాయని ఎన్‌సీఏఈఆర్ తెలిపింది.

క్యూ1 ఫలితాలు

పిడిలైట్ 1:1 బోనస్ షేర్లు
షేరుకి రూ. 10 డివిడెండ్ | లాభం రూ. 678 కోట్లు

Pidilite

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) తొలి త్రైమాసికంలో అడెసివ్స్, సీలెంట్స్, కన్‌స్ట్రక్షన్ కెమికల్స్ తయారీ దిగ్గజం పిడిలైట్ ఇండస్ట్రీస్ ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. అంతేకాకుండా కంపెనీ వ్యవస్థాపకుడు బీకే పరేఖ్ 101వ జయంతి సందర్భంగా 1:1 నిష్పత్తిలో బోనస్ షేర్ల జారీకి బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఫలితంగా వాటాదారులకు తమ వద్దగల ప్రతీ షేరుకీ మరో షేరు ఉచితంగా లభించనుంది. దీంతోపాటు.. షేరుకి రూ. 10 చొప్పున ప్రత్యేక మధ్యంతర డివిడెండ్ చెల్లించేందుకు బోర్డు అనుమతించింది. డివిడెండ్ చెల్లింపునకు ఈ నెల 10 రికార్డ్ డేట్‌గా ప్రకటించింది. కాగా.. ఏప్రిల్-జూన్(క్యూ1)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 19 శాతం ఎగసి రూ. 678 కోట్లను అధిగమించింది. అమ్మకాల పరిమాణం పుంజుకోవడం, పటిష్ట మార్జిన్లు ఇందుకు సహకరించాయి. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 571 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 11 శాతం వృద్ధితో రూ. 3,753 కోట్లను తాకింది. నిర్వహణ లాభ(ఇబిటా) మార్జిన్లు 1.01 శాతం మెరుగుపడినట్లు కంపెనీ పేర్కొంది. కన్జూమర్ అండ్ బజార్ విభాగం ఆదాయం 10 శాతం బలపడి రూ. 3,007 కోట్లకు చేరగా.. బీటూబీ విభాగం సైతం 11 శాతం అధికంగా రూ. 807 కోట్లు నమోదు చేసింది. అయితే మొత్తం వ్యయాలు 9 శాతం పెరిగి రూ. 2,923 కోట్లను తాకాయి. ఇతర ఆదాయంతో కలసి మొత్తం టర్నోవర్ 11 శాతం ఎగసి రూ. 3,839 కోట్లను తాకింది.

ఫలితాల నేపథ్యంలో పిడిలైట్ షేరు బీఎస్ఈలో 1.6 శాతం లాభంతో రూ. 3,044 వద్ద ముగిసింది.

బ్లూస్టార్ లాభం నేలచూపు
రూ. 121 కోట్లు

BLUE STAR

న్యూఢిల్లీ: ఏసీలు, కమర్షియల్ రిఫ్రిజిరేషన్ సిస్టమ్‌ల తయారీ దిగ్గజం బ్లూస్టార్ లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) తొలి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం 28 శాతం క్షీణించి రూ. 121 కోట్లకు పరిమితమైంది. ముందస్తు రుతుపవనాల కారణంగా రూమ్ ఏసీ బిజినెస్ నీరసించడం ప్రభావం చూపింది. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 169 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం 4 శాతం పుంజుకుని రూ. 2,982 కోట్లను తాకింది. గత క్యూ1లో రూ. 2,865 కోట్ల టర్నోవర్ అందుకుంది. అయితే మొత్తం వ్యయాలు సైతం 6 శాతం పెరిగి రూ. 2,834 కోట్లకు చేరాయి. ఆదాయంలో ఎలక్ట్రో మెకానికల్ ప్రాజెక్టులు, కమర్షియల్ ఏసీ సిస్టమ్‌ల నుంచి 36 శాతం అధికంగా రూ. 1,412 కోట్ల ఆదాయం లభించింది. అయితే యూనిటరీ ప్రొడక్టుల విభాగం 13 శాతం క్షీణించి రూ. 1,499 కోట్లకు పరిమితమైంది.

ఫలితాల నేపథ్యంలో బ్లూస్టార్ షేరు బీఎస్ఈలో 2.2 శాతం లాభంతో రూ. 1,789 వద్ద ముగిసింది.

భారత్ ఫోర్జ్ లాభం హైజంప్
రూ. 284 కోట్లు

BHARAT FORGE KALYANI

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) తొలి త్రైమాసికంలో ఆటో విడిభాగాల దిగ్గజం భారత్ ఫోర్జ్ పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం 63 శాతం జంప్‌చేసి రూ. 284 కోట్లకు చేరింది. గతేడాది(2024-25) ఇదే కాలంలో కేవలం రూ. 174 కోట్లు ఆర్జించింది. అయితే మొత్తం ఆదాయం మాత్రం రూ. 4,158 కోట్ల నుంచి రూ. 3,958 కోట్లకు క్షీణించింది. ఇటీవల ట్రంప్ టారిఫ్‌ల విధింపుతోపాటు.. ఉద్గారాల నిబంధనల్లో సవరణల నేపథ్యంలో పూర్తి ఏడాదికి యూఎస్ ఎగుమతుల బిజినెస్‌పై అప్రమత్తంగా స్పందించనున్నట్లు కంపెనీ చైర్మన్, ఎండీ బాబా కల్యాణి తెలియజేశారు. ప్రస్తుత సమీక్షా కాలంలో రూ. 847 కోట్ల విలువైన కొత్త ఆర్డర్లు గెలుచుకున్నట్లు వెల్లడించారు. వీటిలో డిఫెన్స్ నుంచి లభించిన రూ. 269 కోట్లు కలసి ఉన్నట్లు పేర్కొన్నారు. దీంతో 2025 జూన్‌కల్లా డిఫెన్స్ ఆర్డర్‌బుక్ విలువ రూ. 9,463 కోట్లకు చేరినట్లు తెలియజేశారు.

ఫలితాల నేపథ్యంలో భారత్ ఫోర్జ్ షేరు 2 శాతం క్షీణించి రూ. 1,139 వద్ద ముగిసింది.

పీఎఫ్‌సీ డివిడెండ్ రూ. 3.7
లాభం రూ. 8,981 కోట్లు



న్యూఢిల్లీ: విద్యుత్ రుణాల పీఎస్‌యూ దిగ్గజం పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్(పీఎఫ్‌సీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) తొలి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం 25 శాతం జంప్‌చేసి రూ. 8,981 కోట్లను తాకింది. అధిక వడ్డీ ఆదాయం ఇందుకు తోడ్పడింది. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 7,182 కోట్లు మాత్రమే ఆర్జించింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 3.7 చొప్పున మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. కాగా.. మొత్తం ఆదాయం సైతం రూ. 24,737 కోట్ల నుంచి రూ. 28,629 కోట్లకు ఎగసింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 15,843 కోట్ల నుంచి రూ. 17,430 కోట్లకు పెరిగాయి. ఈ కాలంలో లోన్ అసెట్ బుక్ 13 శాతం వృద్ధితో రూ. 11,34,347 కోట్లకు చేరింది. స్థూల మొండిబకాయిలు 2.97 శాతం నుంచి 1.47 శాతానికి తగ్గాయి.

ఫలితాల నేపథ్యంలో పీఎఫ్‌సీ షేరు బీఎస్ఈలో 0.5 శాతం లాభంతో రూ. 516 వద్ద ముగిసింది.

ఈఐడీ ప్యారీ లాభం రూ. 464 కోట్లు



చెన్నై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ. 464 కోట్ల లాభం ఆర్జించినట్లు ఈఐడీ ప్యారీ (ఇండియా) వెల్లడించింది. అంతక్రితం క్యూ1లో ఇది రూ. 226 కోట్లుగా నమోదైంది. జూన్ క్వార్టర్‌లో ఆదాయం రూ. 6,807 కోట్ల నుంచి రూ. 8,813 కోట్లకు చేరింది. రిలీజ్ కోటా తక్కువగా ఉండటం వల్ల చక్కెర విభాగం ఆదాయం 14 శాతం క్షీణించి రూ. 404 కోట్ల నుంచి రూ. 347 కోట్లకు తగ్గిందని సంస్థ సీఈవో ముత్తయ్య మురుగప్పన్ తెలిపారు. డిస్టిలరీ విభాగం ఆదాయం రూ. 263 కోట్ల నుంచి రూ. 296 కోట్లకు పెరగ్గా, న్యూట్రాస్యూటికల్స్ డివిజన్ 29 శాతం క్షీణించి రూ. 8.41 కోట్ల నుంచి రూ. 5.94 కోట్లకు పరిమితమైందని పేర్కొన్నారు.

క్యాస్ట్రాల్ ఫర్వాలేదు
లాభంలో 5 శాతం వృద్ధి

Castrol

ముంబై: లూబ్రికేటింగ్ ఆయిల్స్ కంపెనీ క్యాస్ట్రాల్ ఇండియా జూన్ త్రైమాసికంలో స్థిరమైన పనితీరు చూపించింది. లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూసినప్పుడు 5 శాతం వృద్ధితో రూ.244 కోట్లకు చేరింది. ఆదాయం ఇదే కాలంలో రూ.1,398 కోట్ల నుంచి రూ.1,497 కోట్లకు ఎగిసింది. ''సంక్లిష్టమైన స్థూల ఆర్థిక పరిస్థితుల మధ్య క్యూ1లో మాదిరే క్యూ2లోనూ నిలకడైన పనితీరును చూపించాం. గ్రామీణ మార్కెట్లలో విస్తరించడం, పారిశ్రామిక విభాగంలో స్థానాన్ని బలోపేతం చేసుకోవడం, కస్టమర్లకు నాణ్యమైన, సౌకర్యవంతమైన ఉత్పత్తులను అందించడంపై మా దృష్టి కొనసాగుతుంది''అని క్యాస్ట్రాల్ ఇండియా ఎండీ కేదార్ లెలే తెలిపారు. ఇండస్ట్రియల్ విభాగం దీర్ఘకాలంలో వృద్ధికి కీలకమని చెప్పారు. ఈ ఏడాది మొదటి ఆరు నెలల్లో కొత్త కస్టమర్లను సంపాదించామని, బలమైన వృద్ధి కనిపించినట్టు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ మంచి ఫలితాలు కనిపిస్తున్నట్టు చెప్పారు. ఈ కంపెనీ జనవరి-డిసెంబర్ కాలాన్ని ఆర్థిక సంవత్సరంగా పాటిస్తోంది.

బీఎస్ఈలో క్యాస్ట్రాల్ షేరు ధర ఒక శాతం లాభంతో రూ.222 వద్ద ముగిసింది.

అలెంబిక్ ఫార్మా ఆకర్షణీయం
లాభం రూ.154 కోట్లు

Alembic Touching Lives over 100 years

న్యూఢిల్లీ: అలెంబిక్ ఫార్మా జూన్‌తో ముగిసిన త్రైమాసికానికి రూ.154 కోట్ల లాభాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో లాభం రూ.135 కోట్లతో పోల్చి చూస్తే 14 శాతం వృద్ధి చెందింది. ఆదాయం ఇదే కాలంలో రూ.1,564 కోట్ల నుంచి రూ.1,717 కోట్లకు వృద్ధి చెందింది. భారత్‌లో బ్రాండెడ్ వ్యాపారం 5 శాతం వృద్ధిని చూసింది. ఈ విభాగంలో ఆదాయం రూ.599 కోట్లకు చేరింది. యూఎస్ జనరిక్స్ ఆదాయం 13 శాతం పెరిగి రూ.523 కోట్లుగా నమోదైంది. ఇక యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రేడియెంట్స్ (ఏపీఐ) ఆదాయం ఒక శాతం పెరిగి రూ.261 కోట్లుగా ఉంది. ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో అలెంబిక్ ఫార్మా షేరు 2 శాతానికి పైనే నష్టపోయి రూ.945 వద్ద ముగిసింది.



తొలిసారి కూతురు సమక్షంలో...

చెన్నై గ్రాండ్ మాస్టర్స్ టోర్నీ బరిలో భారత గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక

చెన్నై: కూతురు సమక్షంలో టైటిల్ సాధించడమే తన లక్ష్యమని చెన్నై గ్రాండ్ మాస్టర్స్–2025 టోర్నమెంట్... చాలెంజర్స్ విభాగంలో బరిలోకి దిగుతున్న భారత గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక వెల్లడించింది. పాపకు జన్మనిచ్చిన తర్వాత... స్వదేశంలో తొలిసారి ఓ పెద్ద టోర్నీ ఆడుతుండటం ఆనందంగా ఉందని హారిక పేర్కొంది. రెండేళ్ల హన్వికను వదిలి విదేశాల్లో టోర్నీలు ఆడటం కష్టంగా ఉండేదని... ఇప్పుడు చెన్నైలోనే పోటీలు జరుగుతుండటంతో కుటుంబంతో కలిసి పాల్గొంటున్నట్లు వెల్లడించింది. 'ఇంటికి దగ్గరగా ఆడుతుండటం చాలా ఆనందంగా ఉంది. పాపతో కలిసి ఓ టోర్నీకి రావడం ఇదే తొలిసారి. నా క్రీడా జీవితంలో ఇప్పుడు తను కూడా ఒక భాగం కానుంది. కూతురు సమక్షంలో మ్యాచ్‌లు ఆడనుండటం చాలా ఉద్వేగంగా ఉంది. తల్లి అయిన తర్వాత పాపను వదిలి ఉండటం ఎంత కష్టమో తెలిసొచ్చింది. పాపను ఇంట్లో వదిలి టోర్నీల్లో పాల్గొనేందుకు వెళ్లిన ప్రతిసారీ ఎంతో బాధపడేదాన్ని. వెంట తీసుకెళ్లాలని ఎంతో అనిపించేది. కానీ, అక్కడి పరిస్థితులు, వాతావరణం, ఆహారం వల్ల ఏమైనా ఇబ్బందులు తలెత్తుతాయేమోనని వెనకడుగు వేసేదాన్ని' అని హారిక చెప్పుకొచ్చింది. ప్రస్తుత భారత చెస్ బృందంలో చిన్నపిల్లలతో గడపడంలో ప్రపంచ చాంపియన్ దొమ్మరాజు గుకేశ్ అత్యుత్తమమని హారిక కితాబిచ్చింది. 'గుకేశ్ పిల్లలను బాగా హ్యాండిల్ చేస్తాడు. అతడు మంచి 'బేబీ సిట్టర్'. ఢిల్లీలో ఒకసారి అతడు చిన్న పిల్లలతో మమేకమైన తీరు నన్ను ఎంతగానో ఆకట్టుకుంది. నా వల్ల కూడా అలా సాధ్యం కాదేమో' అని హారిక చెప్పింది. జార్జియాలో ఇటీవల జరిగిన మహిళల ప్రపంచకప్ టోర్నీ క్వార్టర్ ఫైనల్ 'టైబ్రేక్'లో దివ్య దేశ్‌ముఖ్ చేతిలో పరాజయం పాలైన హారిక... ఆ పరాజయాన్ని పక్కన పెట్టి చెన్నైలో తిరిగి సత్తా చాటుతానని ఆత్మవిశ్వాసం వ్యక్తం చేసింది.


ప్రధాని నరేంద్ర మోదీతో హారిక (ఫైల్)

కెరీర్ బెస్ట్ ర్యాంక్‌లో తరుణ్



కౌలాలంపూర్: ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) పురుషుల సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో భారత ప్లేయర్, హైదరాబాద్‌కు చెందిన తరుణ్ మన్నేపల్లి కెరీర్ బెస్ట్ ర్యాంక్‌ను అందుకున్నాడు. గతవారం మకావ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–300 టోర్నీలో తరుణ్ సెమీఫైనల్ చేరుకున్నాడు. ఈ ప్రదర్శనతో తరుణ్ ర్యాంక్ మెరుగైంది. గతవారం 47వ ర్యాంక్‌లో ఉన్న తరుణ్ తాజాగా ఏడు స్థానాలు ఎగబాకి కెరీర్ అత్యుత్తమ 40వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. భారత స్టార్ లక్ష్య సేన్ నాలుగు స్థానాలు పడిపోయి 21వ ర్యాంక్‌లో నిలిచాడు. టాప్–20లో భారత్ నుంచి ఎవరూ లేకపోయినా... టాప్–50లో మాత్రం ఎనిమిది మంది భారత క్రీడాకారులు ఉండటం విశేషం. ఆయుశ్ శెట్టి 30వ ర్యాంక్‌లో, హెచ్‌ఎస్ ప్రణయ్ 34వ ర్యాంక్‌లో, కిరణ్ జార్జి 36వ ర్యాంక్‌లో, కిడాంబి శ్రీకాంత్ 43వ ర్యాంక్‌లో, ప్రియాన్షు రజావత్ 45వ ర్యాంక్‌లో, సతీశ్ కుమార్ కరుణాకరన్ 50వ ర్యాంక్‌లో ఉన్నారు. మహిళల సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో పీవీ సింధు 15వ స్థానంలో, మాళవిక 30వ స్థానంలో, ఉన్నతి హుడా 31వ స్థానంలో కొనసాగుతున్నారు. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి జోడీ తొమ్మిదో ర్యాంక్‌లో మార్పు లేదు. మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి–ట్రిసా జాలీ జంట ఒక స్థానం పడిపోయి 12వ ర్యాంక్‌లో ఉంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల–తనీషా క్రాస్టో ద్వయం ఒక స్థానం పురోగతి సాధించి 17వ ర్యాంక్‌లో నిలిచింది.

మెరిసిన దివ్య, శిరీష, యశ్వంత్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో రంగారెడ్డి జిల్లాకు చెందిన దివ్య, శిరీష, ధనావత్ యశ్వంత్ స్వర్ణ పతకాలతో మెరిశారు. గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన ఈ పోటీల్లో జూనియర్, సబ్ జూనియర్ విభాగాల్లో 200 మందికిపైగా అథ్లెట్లు బరిలోకి దిగారు. దివ్య టి47 కేటగిరీ 100, 200 మీటర్ల విభాగాల్లో స్వర్ణ పతకాలు సొంతం చేసుకుంది. శిరీష ఎఫ్40 కేటగిరీ షాట్‌పుట్, జావెలిన్ త్రో ఈవెంట్‌లో బంగారు పతకాలు దక్కించుకుంది. ధనావత్ యశ్వంత్ 400 మీటర్లు, లాంగ్‌జంప్ విభాగాల్లో పసిడి పతకాలను గెల్చుకున్నాడు. హయత్‌నగర్ సాయిచైతన్య మోడల్ స్కూల్లో ఎనిమిదో తరగతి విద్యార్థులైన ఈ ముగ్గురు కోచ్ వినోద్ కుమార్ వద్ద అకాడమీ ఆఫ్ స్పోర్ట్స్‌లో శిక్షణ పొందుతున్నారు. తాజా ప్రదర్శనతో దివ్య, శిరీష, యశ్వంత్ ఈనెల 29 నుంచి 31 తేదీ వరకు మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు అర్హత సాధించారు.

అనురాగ్ ఠాకూర్‌కు మళ్లీ నిరాశ

భారత బాక్సింగ్ సంఘం ఎన్నికల్లో నామినేషన్ తిరస్కరణ

న్యూఢిల్లీ: భారత బాక్సింగ్ సంఘం (బీఎఫ్ఐ) అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్న కేంద్ర మాజీ క్రీడా శాఖ మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్‌కు చుక్కెదురైంది. ఈ నెల 21 బీఎఫ్ఐ కార్యవర్గ ఎన్నికలు జరగనుండగా... హిమాచల్ ప్రదేశ్ బాక్సింగ్ సంఘం (హెచ్‌పీబీఏ) అనురాగ్ ఠాకూర్ పేరును అధ్యక్ష పదవికి నామినేట్ చేసింది. అయితే బుధవారం విడుదల చేసిన ఎలక్టోరల్ కాలేజీ జాబితా నుంచి అనురాగ్ ఠాకూర్ పేరు తొలగించారు. ప్రపంచ బాక్సింగ్ సమాఖ్య పర్యవేక్షణలో ఈ ఎన్నికలు జరగనుండగా... అప్పటి వరకు సంఘం రోజువారీ వ్యవహారాలను పర్యవేక్షించడానికి ఓ తాత్కాలిక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ పరిశీలన అనంతరం అనురాగ్ ఠాకూర్ పేరును జాబితా నుంచి తొలగించారు. అనురాగ్ ఠాకూర్ నామినేషన్ బీఎఫ్ఐ ఆర్టికల్ 20 నిబంధనకు లోబడి లేకపోవడంతో దాన్ని తిరస్కరించారు. జాతీయ ఎన్నికల్లో పోటీ చేస్తున్న వ్యక్తి... వార్షిక సర్వసభ్య సమావేశం సమయంలో తప్పనిసరిగా ఏదేనీ రాష్ట్రం సంఘంలో సభ్యుడై ఉండాలి. అనురాగ్ ఠాకూర్ హెచ్‌పీబీఏలో ఎన్నికైన సభ్యుడు కాకపోవడంతోనే గతంలోనూ నామినేషన్‌ను తిరస్కరించారు. దీంతో అనురాగ్ బీఎఫ్ఐ ఎన్నికలకు దూరం కావాల్సి వచ్చింది.





మార్పు... మంచి కోసమే!

ఫ్రీస్టయిల్ చెస్‌తో ఆటకు మరింత ఆదరణ

- గత ఫలితాలపై ఎక్కువగా ఆలోచించను
- తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ వ్యాఖ్య

చెస్... అందరికీ సుపరిచితమైన ఆట... ఏదో ఒకదశలో ఒక్కసారైనా ఆడిన వాళ్లు ఎందరో ఉన్నారు. అంతర్జాతీయంగానూ ఈ క్రీడకు ఎంతో పేరుంది. కానీ ఒలింపిక్స్‌లో మాత్రం చెస్ ఇంకా అరంగేట్రం చేయలేదు. ఆ దిశగా అడుగులు వేయాలంటే ముందుగా ఆట అందరికీ మరింత చేరువయ్యేలా చేయాలి. ఒకప్పుడు క్లాసికల్ ఫార్మాట్‌లోనే ఎక్కువగా చెస్ టోర్నీలు జరిగేవి. కాలక్రమేనా చెస్ కూడా కొత్త పుంతలు తొక్కుతోంది. నార్వే దిగ్గజం, వరల్డ్ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్ ఈ విషయంలో ఎంతో చొరవ తీసుకుంటున్నాడు. గ్రాండ్‌చెస్ టూర్... ఫ్రీస్టయిల్ చెస్... సూపర్‌బెట్ చెస్... ఇలా మేటి గ్రాండ్‌మాస్టర్లను భాగస్వామ్యం చేస్తూ నిలకడగా టోర్నీలు నిర్వహిస్తున్నాడు. ఈ తరహా మార్పులతో చెస్‌కు మరింత ఆదరణ పెరుగుతోందని... ఈ ఆట కొత్త శిఖరాలకు చేరుకోవడానికి దోహదం పడుతుందనిప్రపంచ ఆరో ర్యాంకర్, తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ అభిప్రాయపడుతున్నాడు. నేటి నుంచి జరగనున్న చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ టోర్నీలో ఫేవరెట్‌గా బరిలోకి దిగుతున్న అర్జున్ గత ఫలితాల గురించి ఆలోచించకుండా ముందుకు వెళ్తాతని తెలిపాడు.

చెన్నై: అంతర్జాతీయస్థాయి**లో కొన్నేళ్లుగా నిల**కడగా రాణిస్తున్న భారత **స్టార్, తెలంగాణ** గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేశ**ి స్వదేశంలో** మెగా టోర్నీకి సిద్ధమయ్యా**డు. గురు**వారం నుంచి ప్రారంభం కా**నున్న** ఈ టోర్నీలో మొత్తం 10 మ**ంది** గ్రాండ్‌మాస్టర్లు తలపడ**ను**న్నారు. భారత్ నుంచి అర్జున్‌తో పాటు, విదిత్ గుజరాతీ, నిహాల్ సరీన్, కార్తికేయన్ మురళి, ప్రణవ్ బరిలో ఉన్నారు. ఇటీవల నిలకడైన ప్రదర్శన కనబరుస్తున్న అర్జున్... ఫ్రీస్టయిల్ గ్రాండ్‌స్లామ్ టూర్‌తో పాటు ఇ–స్పోర్ట్స్ వరల్డ్‌కప్‌లో సెమీఫైనల్స్‌కు చేరుకున్నాడు. స్వదేశంలో జరగనున్న చెన్నై గ్రాండ్ మాస్టర్స్ టైటిల్ సాధించడమే లక్ష్యం**గా** అర్జున్ అడుగులు వేస్తున్నా**డు.** టోర్నీ ఆరంభానికి ముందు **అర్జున్** మాట్లాడుతూ... 'ఎక్కువగా **ఆలోచిం**చడం లేదు. ప్రత్యర్థి ఎవరైనా **సత్తా చాట**డమే లక్ష్యంగా పెట్టుకుంటా**. క్లాసికల్ టోర్న**మెంట్‌లో ప్లేయర్లు దీర్ఘా**లోచనలో మునిగిపో**తారు. దీంతో అభిమానులు **విసుగు చెందుతారు**. కానీ ఇ–స్పోర్ట్స్‌లో అలా జరగదు. వెంట వెంటనే ఎత్తులకు పైఎత్తులు వేయాల్సిన అవసరముంటుంది. అందుకే అభిమానులు ఈ తరహా ఆటలను ఆదరిస్తారు. సమయం అనేది చాలా కీలకం అవుతుంది. ఒక్కొక్కరికి 10 నిమిషాలు మాత్రమే కేటాయిస్తారు. దీంతో చూసేవాళ్లకు బాగా అనిపిస్తుంది. భవిష్యత్తులో ఆటగాళ్లు, అభిమానులు దీని వైపే మొగ్గుచూపడం ఖాయమే' అని అన్నాడు.

క్యాండిడేట్స్ టోర్నీపై దృష్టి

ఇక తాజాగా ఇ–స్పోర్ట్స్ వరల్డ్‌కప్ సెమీఫైనల్లో ఓటమి పాలవడం బాధించిందని వరంగల్ జిల్లాకు చెందిన 21 ఏళ్ల అర్జున్ అన్నాడు. 'ఇ–స్పోర్ట్స్ వరల్డ్‌కప్'లో సెమీఫైనల్‌కు చేరడం ఆనందంగానే ఉంది. కానీ ఆశించిన ఫలితం రాలేదనే అసంతృప్తి ఉంది. ఆఖరి రెండు మ్యాచ్‌ల్లోనూ ఓటమి పాలయ్యాను. ఇలాంటి చేదు అనుభవాల నుంచి బయటపడి మరింత మెరుగైన ప్రదర్శన చేయాలని భావిస్తున్నా' అని అర్జున్ వెల్లడించాడు. లాస్‌వేగస్‌లో జరిగిన గ్రాండ్‌స్లామ్ టోర్నీ చివరి మూడు మ్యాచ్‌ల్లోనూ అర్జున్ ఓటమి పాలయ్యాడు. ఫ్రీస్టయిల్ ఆడటం చాలా బాగుంటుందన్న అర్జున్... భవిష్యత్తులో గ్రాండ్‌స్లామ్‌కు టూర్ చెస్ క్యాలెండర్‌లో తప్పక చోటు దక్కుతుందని ఆశాభావం వ్యక్తంచేశాడు. ప్రస్తుతం ప్రపంచ ఆరో ర్యాంక్‌లో ఉన్న అర్జున్... అన్ని ఫార్మాట్లలో సత్తా చాటాలని భావిస్తున్నాడు. వచ్చే ఏడాది జరగనున్న క్యాండిడేట్స్ చెస్ టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్ గుకేశ్ డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగనుండగా... 8 మంది ప్లేయర్లు టైటిల్ కోసం పోటీపడనున్నారు. ఇప్పటికే **అ**మెరికా గ్రాండ్‌మా**స్టర్** ఫాబియానో **కరువానా** ఈ టోర్నీకి **అర్హత సా**ధించగా... మిగిలిన **ఏడు స్థానాల** కోసం ప్లేయర్లు **పోటీపడుతున్నారు**. ముఖ్యంగి వరల్డ్‌క**ప్‌లో సత్తా చాటిన వారిలో** ముగ్గురు, గ్రాండ్ **స్విస్ టూర్‌లో** మెరుగైన ప్రదర్శన చేసిన ఇద్దరు. 'ఫిడే సర్క్యూట్' నుంచి ఒకరు క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత సాధించనున్నారు. ఈ నేపథ్యంలో అర్జున్ మాట్లాడుతూ... 'క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత సాధించాలంటే నా ముందు రెండే దారులు ఉన్నాయి. గ్రాండ్‌స్విస్, వరల్డ్‌కప్ ఆ రెండింట్లో మెరుగైన ఆటతీరు కనబర్చాలని భావిస్తున్నా. రెండిట్లో కనీసం ఒక్క టోర్నీలో అయినా టైటిల్ సాధించాలి.

రేటింగ్‌లో టాప్

చెన్నై గ్రాండ్ మాస్టర్స్ టోర్నీలో పాల్గొంటున్న 10 మంది ప్లేయర్లలో... అర్జున్ అత్యధిక రేటింగ్ (2,776 పాయింట్లు) కలిగి ఉన్నాడు. ఆ తర్వాత నెదర్లాండ్స్ గ్రాండ్‌మాస్టర్ అనీశ్ గిరి (2748 పాయింట్లు) రెండో... స్థానంలో విన్సెంట్ కీమర్ (2730 పాయింట్లు; జర్మనీ) మూడో స్థానంలో ఉన్నారు. రౌండ్ రాబిన్ పద్ధతిలో జరగనున్న ఈ టోర్నీలో 90 నిమిషాల సమయం కేటాయిస్తారు. గత రెండు ఎడిషన్‌లలో అర్జున్ త్రుటిలో టైటిల్‌కు దూరమయ్యాడు. 2023లో గుకేశ్‌తో టైబ్రేకర్‌లో ఓడి రెండో స్థానానికి పరిమితం కాగా... గతేడాది కూడా టైటిల్ గెలవలేకపోయాడు. 'గత రెండు పర్యాయాలు ఇక్కడ టైటిల్ గెలవకపోవడంతో నాపై ఎలాంటి అంచనాలు లేవు. అదే సమయంలో ఒత్తిడి కూడా ఉండదు. దీంతో ప్రదర్శనపై మరింత దృష్టి పెడతా' అని అర్జున్ అన్నాడు.

అగ్ని ప్రమాదంతో...

నేడు మొదలయ్యే 'చెన్నై గ్రాండ్ మాస్టర్స్ 2025' టోర్నమెంట్‌లో అర్జున్ టాప్ సీడ్‌గా బరిలోకి దిగనున్నాడు. వాస్తవానికి ఈ టోర్నీ బుధవారమే ప్రారంభం కావాలి. కానీ టోర్నీ వేదికైన హయాత్ రీజెన్సీ హోటల్‌లో మంగళవారం అర్ధరాత్రి దాటాక షార్ట్ సర్క్యూట్‌తో స్వల్ప అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. పొగ కమ్ముకోవడంతో హోటల్ సిబ్బంది అందరినీ బయటకు పంపించారు. టోర్నీ నిర్వాహకులు ఈ టోర్నీలో ఆడుతున్న 20 మంది క్రీడాకారులను వెంటనే సమీపంలో మరో హోటల్‌లో బస ఏర్పాటు చేశారు. బుధవారం సాయంత్రానికల్లా అంతా సర్దుకోవడంతో గురువారం నుంచి ఈ టోర్నీని నిర్వహించాలని నిర్వాహకులు నిర్ణయం తీసుకున్నారు. ఈ టోర్నీలో 11వ తేదీన విశ్రాంతి దినం కేటాయించారు. అయితే ఒకరోజు వృథా కావడంతో విశ్రాంతి దినం తొలగించి... వరుసగా తొమ్మిది రోజులపాటు టోర్నీని నిర్వహించాలని నిర్వాహకులు నిర్ణయం తీసుకున్నారు.

'జో రూట్‌కు ఇవ్వాల్సింది'

'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డుపై బ్రూక్ వ్యాఖ్య



లండన్: ఇంగ్లండ్‌గడ్డపై జరిగే టెస్టు సిరీస్‌లలో ప్రత్యర్థి ఎవరైనా సరే... ఇంగ్లండ్ ఆటగాడితో పాటు మరో జట్టు ఆటగాడికి కూడా 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డు ఇవ్వడం ఆనవాయితీ. ఈసారి భారత్ తరఫున శుబ్‌మన్ గిల్, ఇంగ్లండ్ తరఫున హ్యారీ బ్రూక్ ఎంపికయ్యారు. భారత ఆటగాడి పేరును ఇంగ్లండ్ కోచ్ బ్రెండన్ మెకల్లమ్...ఇంగ్లండ్ ఆటగాడి పేరును భారత కోచ్ గౌతమ్ గంభీర్ ఎంపిక చేశారు. 754 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచిన గిల్‌ను ఎంపిక చేయడంలో ఎలాంటి సందేహం లేకుండా పోయింది. అయితే ఇంగ్లండ్ ఆటగాడి ఎంపికే కాస్త ఆశ్చర్యం కలిగించింది. స్వయంగా బ్రూక్ కూడా దీనిపై ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. 'నేను కూడా ఈ అవార్డుకు ఎంపికవుతానని ఊహించలేదు. రూట్‌కంటే నేను తక్కువ పరుగులు చేశాను. అతనికే ప్లేయర్ ఆఫ్ ద సిరీస్ అవార్డు దక్కుతుందని భావించాను' అని బ్రూక్ స్పందించాడు. 2 సెంచరీలు, 2 అర్ధసెంచరీలు సహా 53.44 సగటుతో 481 పరుగులు చేయగా... రూట్ 3 సెంచరీలు, 1 అర్ధసెంచరీ సహా 67.12 సగటుతో 537 పరుగులు సాధించాడు. నాలుగు టెస్టులే ఆడిన స్టోక్స్ కూడా 304 పరుగులు చేయడంతో పాటు 17 వికెట్లతో సిరీస్‌పై ఎంతో ప్రభావం చూపించాడు. కానీ వీరిద్దరిని కాదని బ్రూక్‌ను గంభీర్ ఎంపిక చేయడం విశేషం.



బెంగాల్ క్రికెట్ ఎన్నికల బరిలో గంగూలీ!

న్యూఢిల్లీ: భారత మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ మరోసారి క్రీడా పరిపాలనలో అడుగు పెట్టనున్నాడు. భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అధ్యక్ష పదవి నుంచి గంగూలీ తప్పుకొని మూడేళ్లు కావొస్తుండగా... త్వరలో జరగనున్న బెంగాల్ క్రికెట్ సంఘం (క్యాబ్) ఎన్నికల్లో అధ్యక్ష పదవికి పోటీపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. బీసీసీఐ అధ్యక్ష పీఠం అధిరోహించడానికి ముందు వరకు 'దాదా'...'క్యాబ్' అధ్యక్షుడిగా కొనసాగాడు. గంగూలీ పదవీ కాలం ముగిసిన అనంతరం రోజర్ బిన్నీ బోర్డు అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. 'గంగూలీ తిరిగి పాలకవర్గంలో అడుగుపెట్టనున్నాడు. క్యాబ్ అధ్యక్ష పదవికి అతడు పోటీ పడటం ఖాయమే. బీసీసీఐ నియమావళి అంగీకరిస్తే ఆ పదవికి గంగూలీ ఎన్నికవడం ఖాయమే. అయితే ఇప్పుడప్పుడే ఎన్నికలపై స్పష్టత రాదు' అని బెంగాల్ క్రికెట్ సంఘానికి చెందిన ఓ అధికారి తెలిపారు. ప్రస్తుతం గంగూలీ సోదరుడు స్నేహాశీష్ గంగూలీ 'క్యాబ్' అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నాడు. ఆయన ఈ పదవిలో ఆరేళ్లుగా కొనసాగుతుండటంతో... లోధా కమిటీ సిఫార్సుల ప్రకారం మూడేళ్ల కూలింగ్ ఆఫ్ పీరియడ్ తప్పనిసరి. దీంతో గతంలో 'క్యాబ్'ను సమర్థవంతంగా నడిపించిన గంగూలీ మరోసారి పగ్గాలు చేపట్టే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి.



విజేతలు అఖిల, నితిన్ నాయక్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లా క్రీడాకారులు మెరిశారు. హనుమకొండలో జరిగిన ఈ పోటీల్లో మహిళల జావెలిన్ త్రో ఈవెంట్‌లో కొర్రా అఖిల (రంగారెడ్డి)... పురుషుల 400 మీటర్ల విభాగంలో ఇస్లావత్ నితిన్ నాయక్ (హైదరాబాద్) స్వర్ణ పతకాలను సొంతం చేసుకున్నారు. అఖిల జావెలిన్‌ను 30.25 మీటర్ల దూరం విసిరి అగ్రస్థానాన్ని దక్కించుకుంది. 400 మీటర్ల ఫైనల్ రేసును నితిన్ 49.67 సెకన్లలో పూర్తి చేసి టాప్ ర్యాంక్‌లో నిలిచాడు. ఆరురోజులపాటు జరిగిన ఈ చాంపియన్‌షిప్‌లో అండర్–14, 16, 18, 20, పురుషుల, మహిళల విభాగాల్లో పోటీలు నిర్వహించారు. మహిళల 800 మీటలర్ల విభాగంలో హైదరాబాద్ అమ్మాయి పిల్లి రేవతి (2ని:56.7 సెకన్లు) విజేతగా నిలిచి స్వర్ణ పతకాన్ని అందుకుంది. అండర్–18 బాలుర 110 మీటర్ల హర్డిల్స్‌లో రంగారెడ్డి జిల్లాకు చెందిన దుంబాల అభినవ్ కుమార్ (16.4 సెకన్లు), తేలుకుంట్ల రోషన్ (16.4 సెకన్లు) స్వర్ణ, రజత పతకాలు గెలిచారు. అండర్–20 బాలుర 5000 మీటర్ల విభాగంలో హైదరాబాద్‌కు చెందిన బద్దం ప్రణయ్ రెడ్డి (16ని:17.4 సెకన్లు) అగ్రస్థానాన్ని పొందాడు. పురుషుల 200 మీటర్ల విభాగం ఫైనల్లో కుడుముల ఆంధ్రా సుహాస్ (హైదరాబాద్; 21.84 సెకన్లు) చాంపియన్‌గా అవతరించాడు. హైదరాబాద్‌కే చెందిన ఇస్లావత్ నితిన్ నాయక్ రెండో స్థానంలో నిలిచి రజత పతకాన్ని సాధించాడు. పురుషుల 10,000 మీటర్ల విభాగంలో సాయి సంతోష్ (రంగారెడ్డి; 35ని:17.3 సెకన్లు) విజేతగా నిలిచాడు. పురుషుల జావెలిన్ త్రో ఈవెంట్‌లో పెరుమాళ్ల వరుణ్ కుమార్ (హైదరాబాద్; 55.70 మీటర్లు) అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు.







న్యూఢిల్లీలో బుధవారం కర్తవ్య భవన్ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని వెలుగులీనుతున్న కర్తవ్య పథ్

రష్యాకు అండగా పాక్ కిరాయి సైనికులు

ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆరోపణలు

కీవ్: రష్యాకు అండగా పాకిస్తాన్‌తోపాటు చైనా, తజకిస్తాన్, ఉజ్బెకిస్తాన్, ఆఫ్రికా దేశాల నుంచి కిరాయి సైనికులు రంగంలో దిగారని, ఖర్కీవ్ ప్రాంతంలో తమ జవాన్లపై వారు దాడులకు దిగుతున్నారని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆరోపించారు. రష్యా సైన్యంతో వారు కలిసి పని చేస్తున్నారని తెలిపారు. ఈశాన్య ఉక్రెయిన్‌లోని ఖర్కీవ్‌లో జెలెన్‌స్కీ పర్యటించారు. తమ సైనికాధికారులతో సమావేశమయ్యారు. కిరాయి సైనికుల గురించి అధికారులు ఆయనకు తెలియజేశారు. తమతో యుద్ధం చేస్తున్న కిరాయి సేనలకు తగిన బుద్ధి చెప్పడం ఖాయమని జెలెన్‌స్కీ హెచ్చరించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టుచేశారు. కిరాయి సైనికుల వ్యవహారం గమనిస్తే రష్యాకు దగ్గరయ్యేందుకు పాక్ ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే ఉక్రెయిన్‌పై తన వంతు సాయం అందిస్తున్నట్లు సమాచారం. పాకిస్తాన్‌కు గతంలో సోవియట్ యూనియన్‌తో సన్నిహిత సంబంధాలు ఉండేవి. 1971లో సోవియట్ సహకారంతో పాకిస్తాన్‌లో ఉక్కు పరిశ్రమలు ఏర్పాటయ్యాయి.



గాజాలో ఆగని మృత్యుఘోష

- ఇజ్రాయెల్ దాడుల్లో 31 మంది మృతి
- వాహనాలు బోల్తా పడడంతో మరో 21 మంది బలి

గాజా స్ట్రిప్: గాజాలో మరణ మృదంగం మోగుతూనే ఉంది. బుధవారం వేర్వేరు ప్రాంతాల్లో ఇజ్రాయెల్ సైన్యం దాడుల్లో కనీసం 31 మంది మరణించారని స్థానిక అధికార వర్గాలు తెలిపాయి. వీరిలో 10 మంది మానవతా సాయం పంపిణీ కేంద్రాల వద్ద మృత్యువాత పడ్డారని వెల్లడించాయి. మరికొందరు గాయపడ్డారని వివరించాయి. మరోవైపు మానవతా సాయంతో గాజాలోకి వచ్చిన నాలుగు వాహనాలు బోల్తా పడడంతో 21 మంది పాలస్తీనా పౌరులు ప్రాణాలు కోల్పోయారు. మరో 30 మంది గాయపడ్డారు. మంగళవారం సాయంత్రం ఈ దుర్ఘటన జరిగింది. గాజాలో మానవత సాయం, ఆహారం పంపిణీకి వీలుగా దాడులు ఆపేశామని ఇజ్రాయెల్ సైన్యం పైకి చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయి పరిస్థితులను గమనిస్తే అందులో నిజం లేదని తేటతెల్లమవుతోంది. సాధారణ జనావాసాలపై, శరణార్థుల శిబిరాలపై వైమానిక, క్షిపణి దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. ఆహారం పంపిణీ కేంద్రాల వద్ద బారులు తీరిన జనంపైనా ఇజ్రాయెల్ సైనికులు విచ్చలవిడిగా కాల్పులు జరుపుతున్నారు. ఇజ్రాయెల్ సైన్యం ఆధీనంలో ఉన్న డెయిర్ అల్–బలాహ్‌లో మానవతా సాయంతో వచ్చిన నాలుగు వాహనాలపైకి జనం ఎగబడ్డారు. డ్రైవర్లు నియంత్రణ కోల్పోవడంతో వాహనాలు పక్కనే ఉన్న జనంపై పడిపోయాయి. మరో ఆరు వాహనాలను జనం లూటీ చేశారు. మరోవైపు సరైన పౌష్టికాహారం లేక గాజాలో ఐదుగురు మరణించారని పాలస్తీనా ఆరోగ్య శాఖ ప్రకటించిది. గాజాలో ఇప్పటిదాకా 193 ఆకలి చావులు సంభవించడం గమనార్హం.

ప్రజలే కేంద్రంగా పారదర్శక పాలన

ప్రజాసేవే పరమావధిగా పని చేస్తున్నాం

దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాల అభివృద్ధికి పెద్దపీట

ప్రధానమంత్రి మోదీ స్పష్టీకరణ • ఢిల్లీలో కర్తవ్య భవన్–03 ప్రారంభం

న్యూఢిల్లీ: ప్రజాసేవే పరమావధిగా తమ ప్రభుత్వం పని చేస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. దేశంలో గత 11 ఏళ్లుగా పారదర్శక, స్పందించే, పౌరులే కేంద్రంగా ఉన్న పరిపాలనా విధానం కొనసాగుతోందని స్పష్టంచేశారు. దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని, ఇందుకోసం స్పష్టమైన విజన్‌తో ముందుకెళ్తున్నామని తెలిపారు. ప్రధాని మోదీ బుధవారం ఢిల్లీలో కర్తవ్య భవన్–03ని ప్రారంభించారు. ఈ ప్రాజెక్టుతోపాటు మరిన్ని ఇతర మౌలిక సదుపాయాలు భారత దేశ గ్లోబల్ విజన్‌కు ప్రతీక అని ఉద్ఘాటించారు. బ్రిటిష్ కాలం నాటి భవనాల్లో ప్రభుత్వ యంత్రాంగం దశాబ్దాలుగా పని చేస్తోందని, అవి చాలావరకు కాలం చెల్లిపోయాయని అన్నారు. ఆయా భవనాల్లో సరైన వసతులు, గాలి, వెలుతురు కూడా లేవని చెప్పారు. అందుకే నేటి అవసరాలకు అనుగుణంగా అందుకే కర్తవ్య భవనాలు నిర్మిస్తున్నామని స్పష్టంచేశారు. మొత్తం 10 భవనాలు నిర్మిస్తున్నామని, వీటితో ప్రభుత్వానికి ప్రతిఏటా రూ.1,500 కోట్లు ఆదా అవుతాయని స్పష్టంచేశారు.

విజయ గాథలు లిఖించాలి

మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ విజయ గాథలను లిఖించడానికి మనమంతా కలిసికట్టుగా కృషి చేయాలని దేశ ప్రజలకు ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. అదే మనందరి సంకల్పం కావాలన్నారు. మన శక్తిసామర్థ్యాలు ప్రదర్శించాలని, దేశంలో ఉత్పాదకత పెంచాలని పేర్కొన్నారు. దేశ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే సంకల్పానికి గుర్తు కర్తవ్య భవన్ అని వ్యాఖ్యానించారు. 'అభివృద్ధి చెందిన భారత్'కు ఇది దశ దిశను నిర్దేశిస్తుందని ఉద్ఘాటించారు. మన దేశం స్వాతంత్య్రం సాధించుకున్న ప్రపంచవ్యాప్తంగా సమయంలోనే చాలా దేశాలు స్వాతంత్య్రం పొందాయని ప్రధాని మోదీ వెల్లడించారు. ఆయా దేశాల తరహాలో మన దేశం ఎందుకు అభివృద్ధి చెందలేదో ఆత్మసమీక్ష చేసుకోవాలని సూచించారు. ఇప్పటి సమస్యలను ఇప్పుడే పరిష్కరించుకోవడం మన బాధ్యత అని చెప్పారు. వాటిని భవిష్యత్తు తరాలకు అందించకూడదని స్పష్టంచేశారు.



కర్తవ్య భవన్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ



కార్మికులతో మాట్లాడుతున్న మోదీ

అత్యాధునిక వసతులతో కర్తవ్య భవన్–03

దేశ రాజధానిలో కర్తవ్య భవన్–03 అందుబాటులోకి వచ్చింది. కేంద్ర ప్రభుత్వ శాఖలు, విభాగాలను ఒకే గొడుగు కిందకు తీసుకురావాలన్న లక్ష్యంతో సెంట్రల్ విస్టా రీడెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా మొత్తం 10 ఉమ్మడి కేంద్ర సచివాలయ(సీసీఎస్) భవనాలు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా నిర్మాణం పూర్తయిన తొలి భవనాన్ని మోదీ లాంఛనంగా ప్రారంభించారు. కర్తవ్య భవన్–03లో కేంద్ర హోంశాఖ, విదేశాంగ శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, ఎంఎస్ఎంఈ, పెట్రోలియం–సహజవాయువు శాఖలు కొలువుదీరబోతున్నాయి. ముఖ్య శాస్త్రీయ సలహాదారు కార్యాలయాన్ని కూడా ఇక్కడే ఏర్పాటు చేయబోతున్నారు. ప్రస్తుతం వివిధ ప్రభుత్వ శాఖలు బ్రిటిష్ కాలంతోపాటు 1950వ దశకంలో, 1970వ దశకంలో నిర్మించిన శాస్త్రి భవన్, కృషి భవన్, ఉద్యోగ్ భవన్, నిర్మాణ్ భవన్‌లో పని చేస్తున్నాయి. ఆయా భవనాలు చాలావరకు బలహీన పడడంతో నూతన భవనాల నిర్మాణాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. కర్తవ్య భవన్–03ని ప్రారంభించిన అనంతరం ప్రధాని మోదీ భవనమంతా కలియదిరిగారు. ఉద్యోగులతో మాట్లాడారు. ఈ భవనంలో యోగా రూమ్, మెడికల్ రూమ్ సహా అత్యాధునిక వసతులున్నాయి. కర్తవ్య భవన్–01, కర్తవ్య భవన్–02 నిర్మాణం వచ్చే నెలలో పూర్తికానుందని అధికారులు తెలిపారు. ఢిల్లీలో సెంట్రల్ విస్టా రీడెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా నూతన పార్లమెంట్ భవనాన్ని, వైస్ ప్రెసిడెంట్ కాంక్లేవ్‌ను నిర్మించిన సంగతి తెలిసిందే. అలాగే విజయ్ చౌక్ నుంచి ఇండియా గేట్ దాకా కర్తవ్య పథ్‌ను అభివృద్ధి చేశారు. అలాగే ఎగ్జిక్యూటివ్ కాంక్లేవ్, కేబినెట్ సెక్రెటేరియట్, ఇండియా హౌస్, నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రెటేరియట్ నిర్మించబోతున్నారు. ఎగ్జిక్యూటివ్ కాంక్లేవ్‌లో ప్రధానమంత్రి కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తారు. మొదటి మూడు కర్తవ్య భవన్‌ల భద్రతకు కేంద్ర ప్రభుత్వం 735 మంది సీఐఎస్ఎఫ్ జవాన్లను కేటాయించినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

హిమాచల్‌లో భారీ వరదలు

- కినౌర్ కైలాస్‌యాత్ర తాత్కాలికంగా నిలిపివేత
- యాత్రమార్గంలో చిక్కుకున్న 413 మందిని కాపాడిన బలగాలు

షిమ్లా: ఉత్తరాఖండ్‌తోపాటు పొరుగున ఉన్న హిమాచల్‌ప్రదేశ్‌నూ వరదలు ముంచెత్తి యాత్రికులకు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. తాజాగా హిమాచల్‌లోని కినౌర్ కైలాస్ యాత్రా మార్గంలో కుండపోత వానల కారణంగా ట్రెక్కింగ్ మార్గాల్లో వందలాది మంది యాత్రికులు చిక్కుకుపోయారు. వెంటనే విషయం తెల్సుకున్న ఇండో టిబెటన్ బోర్డర్‌పోలీస్(ఐటీబీపీ), జాతీయ విపత్తు స్పందన(ఎన్‌డీఆర్ఎఫ్) బలగాలు హుటాహుటిన రంగంలోకి దికి 413 మంది యాత్రికులను కాపాడాయి. పర్వతసానువుల గుండా వర్షపు నీటి ప్రవాహం భీకరంగా దూసుకొస్తోంది. దీంతో ట్రెక్కింగ్ మార్గమధ్యంలోని తాత్కాలిక తాంగ్లిప్పి, కాంగరాంగ్ వంతెనలు ప్రవాహ ఉధృతికి కొట్టుకుపోవడంతో యాత్రికులు అక్కడ చిక్కుకుపోయారు. ట్రెక్కింగ్ మార్గం యాత్రకు అనువుగా లేకపోవడంతో కినౌర్ కైలాస్‌యాత్రను తాత్కాలికంగా నిలుపుదలచేస్తున్నట్లు కినౌర్ జిల్లా యంత్రాంగం బుధవారం ప్రకటించింది. టెక్కింగ్ చేస్తూ వెళ్లాల్సిన చాలా చోట్ల బురదపేరుకుపోయి జారే ప్రమాదం పెరిగింది. మిల్లింగ్ ఖాటా, గుఫా ప్రాంతాల్లో కొందరు యాత్రికులు సేదతీరుతున్నారు. వాళ్లకు కనీస సదుపాయాలను ఆర్మీ కల్పిస్తోంది. సముద్ర మట్టానికి 19,850 అడుగుల ఎత్తులో ఉండే కినౌర్ కై లాస్ ప్రాంతాన్ని శివునికి శీతాకాల విడిదిగా చెబుతారు. జూలై 15న ప్రారంభమైన ఈ యాత్ర ఈనెల 30వ తేదీన ముగుస్తుంది. కినౌర్ జిల్లాతోపాటు హిమాచల్‌లోని చాలా ప్రాంతాలు బుధవారం భారీ వర్షాలు కురిశాయి. దీంతో నాలుగు జాతీయరహదారులు సహా 617 రోడ్లను మూసేశారు. విద్యాసంస్థలకు ఒకరోజు సెలవు ప్రకటించారు.

బిహార్‌లో నివసిస్తున్న ట్రంప్ !!

సమస్తీపూర్: కుక్కలకూ నివాస ధృవీకరణ పత్రాలను జారీచేస్తున్న బిహార్ స్థానిక యంత్రాంగం ఈసారి వినూత్నంగా ట్రంప్‌కు రెసిడెన్సీ సర్టిఫికేట్ ఇస్తారని ఓ ఆకతాయి భావించాడు. అనుకున్నదే తడవుగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు రెసిడెన్సీ సర్టిఫికేట్ కోసం ఆన్‌లైన్ దరఖాస్తు చేశాడు. ఇప్పటికే బిహార్‌లో ఓటరు జాబితా సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)తో బిజీగా ఉన్న అధికారుల కంట్లో ఈ దరఖాస్తు పడింది. హసన్‌పూర్‌లో ట్రంప్ నివసిస్తున్నట్లుగా ఈ అప్లికేషన్‌లో పేర్కొనడం చూసిన అధికారులు హుతాశులయ్యారు. వెంటనే తేరుకుని ఆ దరఖాస్తును ఆగస్టు నాలుగో తేదీన బుట్టదాఖలు చేశారు. జులై 29వ తేదీన ఈ దరఖాస్తు వచ్చింది. ట్రంప్ తండ్రి పేరు ఫ్రెడరిక్ క్రిస్ట్ అని, తల్లి మేరీ మెక్‌లాయిడ్ అని నిజమైన పేర్లనే పేర్కొనడం విశేషం.

రష్యా-అమెరికా నిర్మాణాత్మక చర్చలు

- పుతిన్‌తో సమావేశమైన ట్రంప్ ప్రతినిధి స్టీవ్ విట్కాఫ్

మాస్కో: ఉక్రెయిన్‌పై యుద్ధం ముగించే దిశగా రష్యాపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒత్తిడి పెంచుతున్నారు. ఇందులో భాగంగా రష్యా అధినేత పుతిన్‌తో చర్చల కోసం తన ప్రత్యేక ప్రతినిధిగా స్టీవ్ విట్కాఫ్‌ను పంపించారు. విట్కాఫ్ బుధవారం ఉదయం మాస్కోలో పుతిన్‌తో దాదాపు మూడు గంటలపాటు సమావేశమయ్యారు. ఉక్రెయిన్–రష్యా యుద్ధంతోపాటు తాజా పరిణామాలపై చర్చించారు. ట్రంప్ సందేశాన్ని విట్కాఫ్ ఈ సందర్భంగా పుతిన్‌కు చేరవేశారు. ఉక్రెయిన్‌తో శాంతి చర్చలకు సన్నద్ధం కావాలని, కాల్పుల విరమణ పాటించాలని చెప్పారు. పుతిన్, విట్కాఫ్ మధ్య సుహృద్భావ వాతావరణంలో నిర్మాణాత్మక చర్చలు జరిగాయని రష్యా విదేశాంగ ప్రతినిధి యూరి ఉషకోవ్ తెలిపారు. ఇరుపక్షాలు సానుకూల సంకేతాలు పంపించుకున్నాయని వివరించారు. వ్యూహాత్మక సహకారంపై చర్చించుకున్నాయని స్పష్టంచేశారు. ఇదిలా ఉండగా, పుతిన్‌తో చర్చల అనంతరం విట్కాఫ్ బుధవారం మధ్యాహ్నం స్వదేశానికి తిరిగి వెళ్లిపోయారని రష్యన్ మీడియా తెలియజేసింది. అయితే, పుతిన్, విట్కాఫ్ తాజా చర్చలపై అమెరికా, ఉక్రెయిన్ ప్రభుత్వాలు ఇంకా అధికారికంగా స్పందించలేదు. ఉక్రెయిన్‌పై యుద్ధానికి ఇకనైనా ఫుల్‌స్టాప్ పెట్టకపోతే కఠినమైన ఆంక్షలు ఎదుర్కోవాల్సి ఉంటుందని రష్యాను ట్రంప్ తీవ్రంగ హెచ్చరించిన సంగతి తెలిసిందే.

రాష్ట్ర హోదాపై పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టాలి

జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా వినతి

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో రాష్ట్ర హోదా పునరుద్ధరించాలని, ఇందుకోసం పార్లమెంట్‌లో వెంటనే బిల్లు ప్రవేశపెట్టాలని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా బుధవారం తేల్చిచెప్పారు. ఈ విషయంలో సహకరించాలని కోరుతూ రాజకీయ పార్టీలకు లేఖ రాశానని తెలిపారు. ప్రస్తుత పార్లమెంట్ శీతాకాల సమావేశాలోల బిల్లును ప్రవేశపెట్టి, ఆమోదించేలా చొరవ చూపాలని పార్టీలకు ఆయన విజ్ఞప్తి చేశారు. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్రహోదా పునరుద్ధరిస్తామని కేంద్ర ప్రభుత్వం పలు సందర్భాల్లో హామీ ఇచ్చిందని, ఆ హామీని నిలబెట్టుకోవాలని ఒమర్ అబ్దుల్లా స్పష్టంచేశారు. రాష్ట్ర హోదా విషయంలో సుప్రీంకోర్టులో ఇప్పటికే పిటిషన్ దాఖలైంది. దీనిపై ఈ నెల 8న న్యాయస్థానం విచారణ చేపట్టనుంది. ఒమర్ అబ్దుల్లా చెప్పారు.

బెంగాలీలపై బీజేపీ అణచివేత చర్యలు దారుణం

పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆగ్రహం

ఝార్‌గ్రామ్: బెంగాలీ భాష మాట్లాడే ప్రజలపై బీజేపీ అణచివేత చర్యలకు పాల్పడుతోందని, వారిని పీడిస్తోందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత మమతా బెనర్జీ మండిపడ్డారు. ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లిన బెంగాలీల ఓటు హక్కును తొలగిస్తున్నారని ఆరోపించారు. అర్హుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తే సహించబోమని హెచ్చరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ అరాచకాన్ని అంతర్జాతీయ వేదికలపై ఎండగడతామని తేల్చిచెప్పారు. బుధవారం బెంగాల్‌లోని ఝార్‌గ్రామ్‌లో భారీ బహిరంగ సభలో మమతా బెనర్జీ ప్రసంగించారు. ఎన్నికల జాబితా ప్రత్యేక సవరణ పేరిట మైనారీలు, గిరిజనులు, విపక్షాల మద్దతుదార్ల ఓట్లను తొలగించేందుకు బీజేపీ కుతంత్రాలు సాగిస్తోందని ధ్వజమెత్తారు. ఇది 'బ్యాక్‌డోర్ ఎన్ఆర్‌సీ' తప్ప మరొకటి కాదన్నారు. ఓటర్లుగా మారాలంటే పౌరసత్వ ధ్రువీకరణ పత్రాలు అడగడం ఏమిటని మమత నిలదీశారు. బీజేపీ అగ్రనేతల తల్లిదండ్రులకు బర్త్ సర్టిఫికెట్లు ఉన్నాయా? అని ప్రశ్నించారు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తల్లిదండ్రులకు బర్త్ సర్టిఫికెట్ ఉందా? అని అన్నారు. తాను పొరపాటు మాట్లాడితే అరెస్టు చేసుకోవచ్చని సూచించారు. బెంగాలీలపై వేధింపు వెంటనే ఆపాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బుధవారం తిరువనంతపురంలో మగ్గంపై ఓ బామ్మ



అత్యధిక మంది పౌరులు పాల్గొన్న కార్యక్రమంగా రికార్డు సృష్టించిన 'పరీక్షా పే చర్చ'కు లభించిన గిన్నిస్ వరల్డ్ రికార్డు సర్టిఫికేట్‌ను ప్రధాని మోదీకి అందజేస్తున్న మంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, అశ్విని వైష్ణవ్, జితిన్ ప్రసాద్



బుధవారం న్యూఢిల్లీలో బీజేపీ ఎంపీ పినాకి మిశ్రా - టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రాల వివాహ రిసెప్షన్‌లో కేంద్రమంత్రి అనుప్రియా పటేల్, ఎంపీలు సయాని ఘోష్, మలీహా, మహిమా కుమారి



పార్లమెంట్‌లో వాయిదాల పర్వం

ఎస్ఐఆర్‌పై తక్షణమే చర్చించాలని విపక్షాల డిమాండ్

కోర్టు పరిధిలోని అంశాలపై చర్చించలేమన్న కేంద్రం • ఉభయ సభలు గురువారానికి ఆయిదా

న్యూఢిల్లీ: బిహార్‌లో ఎన్నికల సంఘం నిర్వహించిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ(ఎస్ఐఆర్)పై పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు నిప్పులు చెరిగాయి. దీనిపై వెంటనే చర్చ ప్రారంభించాలని, ప్రభుత్వం సమాధానం చెప్పాలని బుధవారం నిలదీశాయి. నిరసన వ్యక్తంచేశాయి. వెల్‌లోకి దూసుకొచ్చి ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలతో హోరెత్తించాయి. దీంతో ఉభయ సభలను పలుమార్లు వాయిదా వేయాల్సి వచ్చింది. లోక్‌సభ ఉదయం ప్రారంభమైన వెంటనే విపక్ష సభ్యులు ఆందోళనకు దిగారు. ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా బిగ్గరగా నినాదాలు చేశారు. దాంతో స్పీకర్ ఓం బిర్లా సభను మధ్యాహ్నం 12 గంటలకు వరకు వాయిదా వేశారు. సభ పునఃప్రారంభమైన తర్వాత కూడా పరిస్థితిలో మార్పు రాలేదు. వెనక్కి వెళ్లి సీట్లలో కూర్చోవాలని, సభకు సహకరించాలని స్పీకర్‌స్థానంలో ఉన్న దిలీప్ సైకియా విజ్ఞప్తి చేయగా, విపక్ష ఎంపీలు పట్టించుకోలేదు. దాంతో ఆయన సభను మధ్యాహ్నం 2 గంటల దాకా వాయిదా వేశారు. సభ మళ్లీ ప్రారంభమైన తర్వాత కూడా నినాదాలు, నిరసనలు యథాతథంగా కొనసాగాయి. చేసేది లేక సభను గురువారానికి వాయిదా వేస్తున్నట్లు దిలీప్ సైకియా ప్రకటించారు. అంతకుముందు లోక్‌సభలో మర్చంట్ షిప్పింగ్ బిల్లును మూజువాణి ఓటుతో ఆమోదించారు.

ఎస్ఐఆర్‌పై చర్చించే ప్రసక్తే లేదు: రిజిజు

ఎస్ఐఆర్‌పై లోక్‌సభలో చర్చించే ప్రసక్తే లేదని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు తేల్చిచెప్పారు. ఆయన బుధవారం సభలో మాట్లాడారు. ప్రస్తుతం ఈ వ్యవహారం కోర్టు పరిధిలో ఉందని గుర్తుచేశారు. అందుకే సభలో చర్చించలేమని అన్నారు. కోర్టు పరిధిలో ఉన్న అంశాలను చర్చించేందుకు పార్లమెంట్ నియమ నిబంధనలు ఒప్పుకోవని స్పష్టంచేశారు. అలాగే స్వతంత్ర సంస్థ అయిన ఎన్నికల సంఘం కార్యకలాపాల గురించి సభలో చర్చ చేపట్టడం సాధ్యం కాదని ఉద్ఘాటించారు.

రాజ్యసభలోనూ అదే అలజడి

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై పార్లమెంట్ ఎగువ సభలోనూ అలజడి కొనసాగింది. ఈ అంశంపై చర్చకు ప్రతిపక్ష ఎంపీలు పట్టుబట్టారు. ఎస్ఐఆర్‌పై వెంటనే చర్చించాలని డిమాండ్ చేస్తూ విపక్షాలు రూల్ 267 కింద 35 నోటీసులు ఇవ్వగా డిప్యూటీ చైర్మన్ హరివంశ్ తిరస్కరించారు. సభలో నినాదాలు, నిరసనలు మిన్నంటాయి. సభను హరివంశ్ మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. రాజ్యసభ పునఃప్రారంభమైన తర్వాత విపక్ష ఎంపీలు తమ స్థానాల్లో నిల్చొని నినాదాలు కొనసాగించారు. ఒకవైపు గందరగోళం కొనసాగుతుండగానే, ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మణిపూర్‌కు సంబంధించిన డిమాండ్స్ ఫర్ గ్రాంట్స్‌ను సభలో ప్రవేశపెట్టారు. తర్వాత 'క్యారేజీ ఆఫ్ గూడ్స్ బై సీ బిల్లు–2025'మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. ఈ బిల్లుపై సభలో స్వల్ప చర్చ జరిగింది. మరోవైపు విపక్షాలు ఆందోళన ఆగలేదు. తృణమూల్ కాంగ్రెస్, కాంగ్రెస్ ఎంపీలు వెల్‌లోకి దూసుకొచ్చి బిగ్గరగా నినాదాలు చేశారు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మమతా ఠాకూర్, ఆమ్ ఆద్మీ పార్టీ సభ్యుడు సంజయ్ సింగ్ చైర్మన్ పోడియంపైకి ఎక్కేందుకు ప్రయత్నించారు. దాంతో సభను గురువారానికి వాయిదా వేస్తున్నట్లు సభాపతి స్థానంలో ఉన్న భువనేశ్వర్ కలితా వెల్లడించారు.



ఫ్రాన్స్‌లో రగిలిన కార్చిచ్చు.. ఒకరి మృతి

పారిస్: దక్షిణ ఫ్రాన్స్‌లో కార్చిచ్చు వేగంగా వ్యాప్తి చెందుతోంది. స్పెయిన్ సరిహద్దులో అడవిలో నిప్పంటుకుంది. ఈ ఘటనలో ఒకరు మృతిచెందారు. మరో తొమ్మిది మంది గాయపడ్డారు. ఒకరు గల్లంతయ్యారు. ఔదీ ప్రాంతంలోని రిబాటీలో మంగళవారం మధ్యాహ్నం మొదలైన మంటలు బుధవారం మరికొన్ని ప్రాంతాలకు వ్యాపించాయి. మంటలు ఆర్పేందుకు 1,500 మంది అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగారు. రాజధాని పారిస్ విస్తీర్ణంతో సమానమైన ప్రాంతంలో కార్చిచ్చు రగిలినట్లు అధికారులు వెల్లడించారు. కేవలం 12 గంటల వ్యవధిలో 11,000 హెక్టార్ల భూభాగాన్ని మంటలు చుట్టుముట్టాయని తెలిపారు. ఇటీవలి కాలంలో ఇదే అతిపెద్ద కార్చిచ్చు అని స్పష్టంచేశారు. దక్షిణ యూరప్‌లో వేసవి కాలంలో కార్చిచ్చులు రగలడం గత కొన్నేళ్లుగా పరిపాటిగా మారిపోయింది. కాలుష్యం, వాతావరణ మార్పులే ఇందుకు కారణమని నిపుణులు చెబుతున్నారు.

'దేవానాం ప్రియ' అనేది ఎవరి బిరుదు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

జైనమతం (క్రీ.పూ. 540-468)

జైనమత స్థాపకుడు రుషభనాథుడు. జైన ప్రవక్తలను 'తీర్థంకరులు' అంటారు. మొత్తం 24 మంది తీర్థంకరులు ఉండేవారు. రుషభనాథుడు మొదటి తీర్థంకరుడు. 23వ తీర్థంకరుడు పార్శ్వనాథుడు. చివరివారైన 24వ తీర్థంకరుడు మహావీరుడు.

మహావీరుడు క్రీ.పూ. 540లో వైశాలి నగరానికి సమీపాన ఉన్న 'కుంద' గ్రామంలో క్షత్రియ కుటుంబంలో జన్మించాడు. ఈయన తల్లిదండ్రులు సిద్ధార్థుడు, వైశాలి. మహావీరుడి భార్య యశోధ, కుమార్తె ప్రియదర్శిని. ఈయన జీవిత సుఖాలతో తృప్తి చెందక కొంత కాలం దిగంబరుడిగా కఠోర నియమాలను పాటించి తపస్సు చేశాడు. 'జృంబిక' గ్రామంలో పరిపూర్ణజ్ఞానాన్ని పొందిన తర్వాత 'మహావీరుడు'గా పేరు పొందాడు. ఈయన ప్రబోధించిన సరైన క్రియ, సరైన విశ్వాసం, సరైన జ్ఞానం అనే మూడు అంశాలను 'త్రిరత్నాలు'గా పేర్కొంటారు. పంచవ్రతాల ద్వారా మోక్షాన్ని సాధించవచ్చని మహావీరుడు ప్రవచించాడు. ఈయన తన 72వ ఏట క్రీ.పూ. 468లో 'పావాపురి' వద్ద నిర్యాణం చెందాడు.

జైనులు కర్మ సిద్ధాంతాన్ని నమ్ముతారు. ఉపవాసాలు చేసి శరీరాన్ని కృశింపజేసుకొని మరణించడాన్ని 'సల్లేఖన వ్రతం'గా పేర్కొంటారు. చాలా మంది రాజులు జైనమతాన్ని ఆదరించి అభివృద్ధి చేశారు. చంద్రగుప్త మౌర్యుడు ఈ మతాన్ని అనుసరించి, అన్నింటినీ త్యజించి శ్రావణ బెళగొళలో మరణించాడు. జైనులు ప్రజల భాష అయిన ప్రాకృతంలో తమ సందేశాన్ని ప్రచారం చేశారు. చంద్రగుప్తుడి కాలంలో పాటలీపుత్రంలో స్థూలభద్ర ఆధ్వర్యంలో జైనమత మొదటి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జైనమత బోధనలను 12 అంగాలుగా విభజించి క్రోడీకరించారు. కొంతకాలం తర్వాత వస్త్రధారణ విషయంలో అభిప్రాయభేదాలు తలెత్తడం వల్ల జైనమతం దిగంబర, శ్వేతాంబర శాఖలుగా చీలిపోయింది. రెండో జైన సంగీతి క్రీ.శ. 512లో వల్లభి (గుజరాత్)లో దేవార్థి క్షమపణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో 'గంధర్వ' అనే పవిత్ర గ్రంథాలను క్రమానుసారంగా రాశారు. జైనులు శిల్పకళను అభివృద్ధి చేశారు.

క్రీ.పూ. 4వ శతాబ్దం చివరి రోజుల్లో గంగా లోయ ప్రాంతంలో తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో చాలామంది జైన గురువులు, సన్యాసులు దక్షిణ భారతదేశానికి తరలివెళ్లారు. ముఖ్యంగా శ్రావణ బెళగొళ ప్రాంతానికి ఎక్కువ మంది వచ్చారు. దక్షిణానికి వచ్చినవారిలో భద్రబాహుడు, చంద్రగుప్త మౌర్యుడు లాంటి ప్రముఖులు ఉన్నారు. మగధలో ఉన్న జైనులు శ్వేతాంబరులయ్యారు. వీరికి గురువు స్థూల బాహుడు.



జైనమత మహత్వ సూత్రాలు:

1) అహింస 2) సత్యభాషణ
3) అపరిగ్రహం (దొంగిలించకపోవడం)
4) అస్తేయం (ఆస్తి లేకుండా ఉండటం)
5) బ్రహ్మచర్యం

వీటిలో మొదటి నాలుగు సూత్రాలు మహావీరుడి ముందు కాలం నుంచే అమల్లో ఉన్నాయి. మహావీరుడు బ్రహ్మచర్యాన్ని పంచమ సూత్రంగా కలిపాడు.

జైనుల ప్రధాన కట్టడాలు:

- అబూ పర్వతం-మహావీరుడి దేవాలయం
- శ్రావణ బెళగొళ-గోమతేశ్వరుడి విగ్రహం
- అజంతా, ఎల్లోరా, ఉదయగిరి గుహలు
- బాదామి – జైన దేవాలయాలు

అజీవికులు: గోశాల మస్కారిపుత్రుడు అజీవిక మతశాఖను స్థాపించారు. ఇది జైన మత సిద్ధాంతాలకు సన్నిహితంగా ఉంది. అశోకుడి కాలంలో ఇది బాగా వ్యాప్తి చెందింది.

హర్యాంక వంశం (క్రీ.పూ.542-490)

క్రీ.పూ. 542–490 మధ్య కాలంలో రాజకీయంగా అనేక పరిణామాలు సంభవించాయి. ఉత్తర భారతదేశంలో మహాజనపదాలుగా పేర్కొనే పదహారు పెద్ద రాజ్యాలు ఏర్పడ్డాయి. వీటినే 'షోడశ మహాజనపదాలు' అంటారు. వీటిలో మగధ రాజ్యం శక్తిమంతమైంది. గిరివ్రజం, పాటలీపుత్రం దీని రాజధాని నగరాలు. మొదటగా దీన్ని బృహద్రధ వంశస్థులు పాలించారు. తర్వాత హర్యాంక వంశస్థులు పరిపాలించారు. వీరిలో బింబిసారుడు గొప్పవాడు. ఈయన తర్వాత అజాతశత్రువు పాలించాడు.

అజాతశత్రువు పాలనా కాలం క్రీ.పూ. 495–464. ఈయన హర్యాంక వంశ స్థాపకులైన బింబిసారుడి కుమారుడు. అజాతశత్రువు భార్య వజీరాదేవి. ఈమె కోసలరాజు ప్రసేనజిత్తు కుమార్తె. అజాతశత్రువు వజ్జి గణరాజ్య సమాఖ్యతో 16 ఏళ్ల యుద్ధం చేసి జయించాడు. కంటక శిల, కంటక బోధన అనే రాళ్లు, విసరు రథాలను యుద్ధంలో ఉపయోగించి శత్రురాజులను జయించాడు. ఈయన పాటలీపుత్రాన్ని నిర్మించాడు. ఈయనకు కుణిక అనే పేరు కూడా ఉంది. ఉదయనుడు ఈయన వారసుడు. అజాతశత్రువు గౌతమబుద్ధుడి సమకాలీకుడు.

హర్యాంక వంశం తర్వాత మగధను శిశునాగ వంశం (క్రీ.పూ. 490–458) పాలించింది. వీరి తర్వాత నంద వంశస్థులు రాజ్యానికి వచ్చారు. నంద వంశంలో మహాపద్మనందుడు గొప్పరాజుగా పేరు పొందాడు. ఈయనకు 'మహాక్షత్రాంతక' అనే బిరుదు ఉంది. ఆ తర్వాత చంద్రగుప్త మౌర్యుడు చాణక్యుని సహాయంతో నందవంశాన్ని నిర్మూలించి మౌర్యవంశాన్ని స్థాపించాడు.

విదేశీ దండయాత్రలు (క్రీ.పూ. 327–325): భారతదేశంలో రాజకీయ అనైక్యత కారణంగా విదేశీయులు దండయాత్రలు ప్రారంభించారు. పారశీకులు మొదటగా భారత్‌పై దండయాత్ర చేశారు. వీరిలో 'సైరస్', 'డేరియస్' గొప్పవారు. పారశీక చక్రవర్తి 'సైరస్' గాంధారను జయించారు. వీరి తర్వాత గ్రీకులు భారతదేశంపై దండెత్తారు. గ్రీకు రాజ్యాల్లో అగ్రగామి అయిన మాసిడోనియా చక్రవర్తి అలెగ్జాండర్ విశ్వవిజేతగా పేరు పొందారు. గ్రీకు దండయాత్రల ఫలితంగా భారతదేశానికి, యూరప్ దేశాల మధ్య సంబంధాలు ఏర్పడ్డాయి. భారతీయులు గ్రీకుల నుంచి నాణేల ముద్రణ; శిల్ప, ఖగోళ శాస్త్రాలను నేర్చుకున్నారు.

మౌర్య సామ్రాజ్యం (క్రీ.పూ. 322)

మౌర్యుల చరిత్రకు ఆధారాలు:

విదేశీ గ్రంథాలు: మెగస్తనీస్ (గ్రీకు రాయబారి) రాసిన 'ఇండికా', స్ట్రాబో, డియోడరస్, ఏరియస్, ప్లీనీ రచనలు మౌర్యుల చరిత్రకు ప్రధాన ఆధారాలుగా ఉన్నాయి.

సాహిత్య ఆధారాలు: కౌటిల్యుడి 'అర్థశాస్త్రం', విశాఖదత్తుడి 'ముద్రారాక్షసం'.

మత సంబంధ ఆధారాలు: పురాణాలు, బౌద్ధుల దివ్య వదన, అశోకవదన, శ్రీలంకకు సంబంధించిన దీపవంశ, మహావంశ, జైనులకు సంబంధించిన పరిశిష్ట పర్వన్ మొదలైనవి కూడా మౌర్యుల చరిత్రను తెలుసుకోవడానికి దోహదపడుతున్నాయి.

వీటితో పాటు శిలా శాసనాలు, రాతి చెక్కడాలు, గుహలు కూడా మౌర్యుల చరిత్రకు ఆధారాలుగా ఉన్నాయి.

చంద్రగుప్త మౌర్యుడు: ఈయన మౌర్యవంశ స్థాపకుడు. చంద్రగుప్త మౌర్యుడు తన చివరి రోజుల్లో కర్ణాటకలోని శ్రావణ బెళగొళలో జీవించాడు. 'సల్లేఖన వ్రతం' ద్వారా మరణించాడు. ఈయన క్రీ.పూ. 303లో 'సెల్యూకస్ నికేటర్'తో కుదుర్చుకున్న ఒప్పందం ద్వారా మౌర్య సామ్రాజ్యానికి ఎక్కువ ప్రయోజనం కలిగింది.

బిందుసారుడు (క్రీ.పూ. 298–273): ఈయన చంద్రగుప్త మౌర్యుడి కుమారుడు. బిందుసారుడికి 'అమిత్రఘాత', 'సింహసేనుడు' అనే బిరుదులు ఉన్నాయి. ఈయన రాజ్యాన్ని మైసూరు వరకు విస్తరించాడు. చాణక్యుడు కొంత కాలంపాటు బిందుసారుడికి కూడా మహామంత్రిగా ఉండి ఆయనకు రాజ్య రక్షణలో సాయపడినట్లుగా టిబెట్ చరిత్రకారుడు తారానాథ్ పేర్కొన్నారు. బిందుసారుడి పాలనా కాలంలో తక్షశిలలో తిరుగుబాటు జరిగింది. ఈయన ఆజ్ఞ ప్రకారం అశోకుడు తక్షశిలకు వెళ్లి శాంతి నెలకొల్పాడు. బిందుసారుడు గ్రీకు రాజ్యాలతో స్నేహ సంబంధాలు పెంపొందించాడు.

అశోకుడు (క్రీ.పూ. 273–232): ఈయన బిందుసారుడి కుమారుడు. అశోకుడు పట్టాభిషేకం చేసుకున్న తొమ్మిదేళ్లకు (క్రీ.పూ. 262– 61లో) సామ్రాజ్యకాంక్షతో కళింగ రాజ్యంపై దండెత్తి జయించాడు. ఈ యుద్ధం 'ధర్మాశోకుడు'గా పూర్తిగా పరివర్తనం చెందడానికి కారణమైంది. ఆ తర్వాత ఉపగుప్తుడు అనే బౌద్ధ ఆచార్యుడి వద్ద అశోకుడు బౌద్ధమత దీక్ష స్వీకరించాడు. ధర్మప్రచారానికి పూనుకొని 'దేవానాం ప్రియ', 'ప్రియదర్శిని' బిరుదులు పొందాడు. బానిసలు, సేవకుల పట్ల కరుణ, తల్లిదండ్రులు, పెద్దల పట్ల విధేయత, గురువుల పట్ల గౌరవం, స్నేహితులు, బంధువులు, పరిచయస్థుల పట్ల ఔదార్యం, పురోహితులు, భిక్షువుల పట్ల ఆదరణ అనేవి అశోకుడు ప్రబోధించిన 'ధర్మం'లోని సూత్రాలు. 'అహింసా' అనేది 'ధర్మం'లోని ముఖ్యసూత్రం. అశోకుడు 42 ఏళ్ల పరిపాలించి క్రీ.పూ. 232లో మరణించాడు.

వివిధ శాసనాల ఆధారంగా అశోకుడి సామ్రాజ్య సరిహద్దుల గురించి తెలుస్తోంది. షహబాద్‌గిరి, మాన్‌షేషరా శాసనాలు వాయవ్య సరిహద్దును, రుమిందై శాసనం ఈశాన్య సరిహద్దును, సొపారా, గిర్నార్ శాసనాలు పశ్చిమ సరిహద్దును తెలుసుకోవడానికి ఉపయోగపడుతున్నాయి. బబ్రూ శాసనం అశోకుడి బౌద్ధమత స్వీకారం గురించి, ధౌలీ, జునాగఢ్ శాసనాలు ఉదాత్త రాజ ధర్మ స్వరూపం గురించి, బరాబర్ శాసనం పరమత సహనం గురించి, 13వ శిలాశాసనం కళింగ యుద్ధం గురించి తెలుపుతున్నాయి. మస్కీలో అశోక అనే పదం ఉంది. కళింగ యుద్ధం తర్వాత అశోకుడి పాలన గురించి కళింగ శాసనం ద్వారా తెలుస్తోంది. రుమిందై, ఇగ్లివ శాసనాలు అశోకుడికి బుద్ధుడిపై ఉన్న గౌరవాన్ని వివరిస్తాయి. తరాయి శాసనం అశోకుడికి బౌద్ధమతంపై ఉన్న గౌరవాన్ని తెలుపుతుంది.

అన్ని మతాల సారాంశం ఆధారంగా అశోకుడు కొన్ని సూత్రాలతో దమ్మను తయారు చేశాడు. ఈయన దమ్మ ప్రచారం కోసం ధర్మమహామాత్రులు అనే ప్రచారకులను పంపిస్తే వారు బౌద్ధ మతాన్ని ప్రచారం చేశారు. భారత ఉపఖండంలో అశోకుడు వేయించిన 14 ప్రధాన శిలా శాసనాలు, ఏడు స్తంభ శాసనాలు, అనేక చిన్నరాతి శాసనాలు లభించాయి. ఇందులో చాలావాటిపై ప్రజల కోసం చేసిన ప్రకటనలు చెక్కారు. 14 శిలా శాసనాలు అశోకుడి దమ్మ సూత్రాల గురించి తెలుపుతున్నాయి. మస్కీ శాసనంలో 'దేవానాం ప్రియ' అని ఉంది.

మౌర్య వంశ చివరి పాలకులు (క్రీ.పూ. 232 – 185): అశోకుడి తర్వాత వచ్చిన రాజులు అర్ధ శతాబ్దం పాటు పాలించారు. మౌర్య వంశ చివరి రాజైన బృహద్రధుడిని ఆయన సేనాని పుష్యమిత్రుడు వధించి మగధను ఆక్రమించడంతో వీరి పాలన అంతమైంది.

మౌర్యుల పాలనా వ్యవస్థ

భారతదేశంలో ప్రప్రథమంగా కేంద్రీకృత అధికారాలు కలిగిన నిర్దిష్టమైన పరిపాలన రూపొందించింది మౌర్య చక్రవర్తులే. వీరికి పాలనలో సలహా కోసం మంత్రితో పాటు పరిషత్తు ఉండేది. పాలనా సౌలభ్యం కోసం సామ్రాజ్యాన్ని నాలుగు రాష్ట్రాలుగా విభజించి వాటికి రాజప్రతినిధులను నియమించారు. భూమిశిస్తు ప్రభుత్వ ప్రధాన ఆదాయం. పంట దిగుబడిలో 4 నుంచి 6వ వంతు వరకు శిస్తు వసూలు చేసేవారు. పాటలీపుత్ర నగర పాలన ముప్పై మంది సభ్యులున్న బోర్డు నిర్వహణలో ఉండేది. వర్తకుల 'శ్రేణులు' బ్యాంకులుగా పనిచేశాయి. సమాజంలో బహు భార్యత్వం, కన్యల విక్రయం, సతీసహగమనం లాంటి దురాచారాలు ఉండేవి. ఈ కాలంలో స్త్రీల స్థాయి తగ్గింది. మౌర్యులు ఎక్కువగా ప్రజల భాష అయిన ప్రాకృతాన్ని ఉపయోగించారు. శిలా శాసనాల్లో 'ఖరోష్టి', 'బ్రాహ్మి' లిపులను వాడారు.

భూమిపై వేగంగా పరుగెత్తే జీవి?

భూ ఆత్మభ్రమణ వేగం ప్రస్తుత వేగానికి 17 రెట్లు పెరిగితే భూమధ్యరేఖ వద్ద వస్తువు భారం శూన్యం అవుతుంది.

రోగుల భారాన్ని కనుగొనడానికి ఉపయోగించే పరికరం - సంపీడన స్ప్రింగ్ త్రాసు.

ఒక వ్యక్తి గాలిలో ఎగిరినప్పుడు లేదా ఎత్తు నుంచి కిందకు దూకినప్పుడు అతడు భార రహిత స్థితిలో ఉంటాడు.



జనరల్ స్టడీస్

ఫిజికల్ సైన్స్

యాంత్రిక శాస్త్రం

వస్తువు స్థితి గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని 'యాంత్రిక శాస్త్రం' అంటారు. వస్తువు గమనం గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని 'డైనమిక్స్' అంటారు.

అదిశ రాశి: పరిమాణం మాత్రమే ఉండి, దిశతో సంబంధంలేని భౌతికరాశిని 'అదిశరాశి' అంటారు.

ఉదా: దూరం, వడి, పని, శక్తి.

సదిశ రాశి: పరిమాణం, దిశ ఉన్న భౌతిక రాశిని 'సదిశ రాశి' అంటారు.

ఉదా: స్థానభ్రంశం, వేగం, త్వరణం, బలం.

దూరం: వస్తువు ప్రయాణించిన మొత్తం పొడవును 'దూరం' అంటారు.

ప్రమాణాలు: సెం.మీ., మీ.

- వాహనాలు ప్రయాణించే దూరాన్ని కొలవడానికి 'ఓడోమీటర్' ఉపయోగిస్తారు.

స్థానభ్రంశం: స్థానంలో కలిగే మార్పును 'స్థానభ్రంశం' అంటారు. రెండు బిందువుల మధ్య ఉండే అతి స్వల్ప పొడవే స్థానభ్రంశం.

ప్రమాణాలు: సెం.మీ., మీ.

వడి: నిర్దిష్ట సమయంలో వస్తువు ప్రయాణించిన దూరాన్ని 'వడి' అంటారు.

వడి = దూరం/ కాలం

ప్రమాణాలు: సెం.మీ./సె. (సీజీఎస్ ప్రమాణం), మీ./సె. (ఎస్ఐ ప్రమాణం).

వడిని కొలిచే పరికరం: స్పీడోమీటర్

వేగం: వస్తువు స్థానభ్రంశంలో కలిగే మార్పు రేటునే 'వేగం' అంటారు.

వేగం = స్థానభ్రంశం/ కాలం

ప్రమాణాలు: సెం.మీ./సె. (సీజీఎస్ ప్రమాణం), మీ./సె. (ఎస్ఐ ప్రమాణం).

- వాన చినుకు వేగం 7- 18 mile/hour
- భూమిపై వేగంగా పరుగెత్తే జీవి – చిరుతపులి (97 kmph)
- నెమ్మదిగా కదిలే జీవి – నత్త (0.013 - 0.028 m/s)

త్వరణం: వేగంలో కలిగే మార్పు రేటునే త్వరణం అంటారు.

త్వరణం (a) =వేగంలోని మార్పు/ కాలం

ప్రమాణాలు: సెం.మీ./సె². (సీజీఎస్), మీ./సె². (ఎస్ఐ ప్రమాణం).

వస్తువు త్వరణం కాలానుగుణంగా పెరిగితే దాన్ని 'ధన త్వరణం' అంటారు.

ఉదా: రైల్వేస్టేషన్ నుంచి దూరంగా వెళుతున్న రైలు త్వరణం.

వస్తువు త్వరణం కాలానుగుణంగా తగ్గితే దాన్ని 'రుణ త్వరణం' అంటారు.

ఉదా: బస్‌స్టేషన్ సమీపిస్తున్న బస్సు త్వరణం.

- వాహనాల వేగాన్ని తగ్గించడానికి లేదా పెంచడానికి వాడే పరికరం 'యాక్సిలరేటర్'.
- గమనంలో ఉన్న వస్తువు సమవేగంతో చలించినా లేదా విరామ స్థితిలో ఉన్నా దాని త్వరణం 'శూన్యం'.

గురుత్వ త్వరణం: భూ గురుత్వాకర్షణ బలం ప్రభావం వల్ల వస్తువులో కలిగే త్వరణాన్ని 'గురుత్వ త్వరణం' అంటారు. దీన్ని g తో సూచిస్తారు.

- భూమిపై గురుత్వ త్వరణం = $9.8\ m/s^2$
- చంద్రుడిపై గురుత్వ త్వరణం = $1.6\ m/s^2$
- సూర్యుడిపై గురుత్వ త్వరణం = $27.4\ m/s^2$
- గురుత్వ మాపకాన్ని ఉపయోగించి గురుత్వ త్వరణం విలువ కనుగొంటారు.

ఐసోగ్రామ్‌లు: g విలువ సమానంగా ఉన్న ప్రదేశాలను కలుపుతూ గీసిన రేఖలను ఐసోగ్రామ్‌లు అంటారు. వీటిని ఉపయోగించి ఖనిజ సంపదను గుర్తిస్తారు.

- g విలువ భూమి భౌతికస్థితిపై ఆధారపడి ఉంటుంది.

$$g = Gm/R^2$$

R విలువ ధ్రువాల వద్ద కనిష్ఠం కాబట్టి g విలువ గరిష్ఠంగా ఉంటుంది. R విలువ భూమధ్యరేఖ వద్ద గరిష్ఠం కాబట్టి g విలువ కనిష్ఠంగా ఉంటుంది.

- కణంపై గురుత్వ బలం పనిచేయదు.

ద్రవ్యరాశి: పదార్థ పరిమాణాన్ని ద్రవ్యరాశి అంటారు.

ప్రమాణాలు: గ్రాము (సీజీఎస్ ప్రమాణం), కిలోగ్రాము (ఎస్ఐ ప్రమాణం).

భారం: వస్తువుపై పని చేసే భూమ్యాకర్షణ బలాన్నే భారం అంటారు.

ప్రమాణాలు: గ్రాము, వాట్, కిలోగ్రాము–వాట్, న్యూటన్.

- వస్తువు ద్రవ్యరాశి స్థిరం. ఇది ప్రదేశాన్ని బట్టి మారదు. వస్తువు భారం gపై ఆధారపడి ఉంటుంది కాబట్టి ఇది ప్రదేశాన్ని బట్టి మారుతుంది.
- వస్తువు భారాన్ని కొలవడానికి ఉపయోగించే పరికరం 'స్ప్రింగ్ త్రాసు'. ఇది హుక్ సూత్రం ఆధారంగా పని చేస్తుంది.
- రబ్బర్ కంటే స్టీల్ స్థితిస్థాపకత అధికం.
- పరిపూర్ణ స్థితిస్థాపక వస్తువు సృష్టిలో లేదు. కానీ పరిపూర్ణ స్థితిస్థాపక వస్తువులా ప్రవర్తించే వస్తువు క్వార్ట్జ్.

గరిమనాభి: వస్తువు మొత్తం భారం కేంద్రీకృతం అయ్యేట్లుగా ప్రవర్తించే బిందువును 'గరిమనాభి' అంటారు. ఇది వస్తువు స్థిరత్వాన్ని వివరిస్తుంది.

- సమరీతి గురుత్వకేంద్రంలో వస్తువు ద్రవ్యరాశి కేంద్రం, గరిమనాభి ఏకీభవిస్తాయి.
- ద్రవ్యరాశి కేంద్రం వస్తు చలనాన్ని వివరిస్తుంది.
- నిలబెట్టిన స్థూపానికి గరిమనాభి స్థానం సగం ఎత్తు వద్ద ఉంటుంది.
- వంపు మార్గం వద్ద సైకిలిస్ట్ లోపలి వైపు వంగి ప్రయాణించడం వల్ల స్థిరత్వం పెరుగుతుంది.

లిఫ్ట్‌లో దృశ్య భారం: లిఫ్ట్‌ను 1852లో ఇ.జి. ఓటిస్ అనే శాస్త్రవేత్త కనుగొన్నారు. లిఫ్ట్ పైకి వెళుతున్నప్పుడు త్వరణం ధనాత్మకంగా, కిందికి వెళుతున్నప్పుడు త్వరణాన్ని రుణాత్మకంగా తీసుకోవాలి.

case i): లిఫ్ట్ నిశ్చలస్థితిలో ఉన్నప్పుడు దృశ్య భారం స్థిరం. భారం (w) = mg

case ii): లిఫ్ట్ a అనే త్వరణంతో పై దిశలో చలిస్తున్నప్పుడు దృశ్య భారం పెరుగుతుంది.

$$w = m(g+a).$$

case iii): లిఫ్ట్ a అనే త్వరణంతో కింది దిశలో చలిస్తున్నప్పుడు దృశ్య భారం తగ్గుతుంది.

$$w = m(g-a)$$

case iv): లిఫ్ట్ స్వేచ్ఛగా కిందకు పడుతుంటే దాని దృశ్య భారం శూన్యం.

$$w = m(g-g) \quad (a = g \text{ కాబట్టి})$$

$$w = 0$$

బలం: వస్తువు స్థితిని మార్చేది లేదా మార్చడానికి ప్రయత్నించేదాన్ని 'బలం' అంటారు.

$$F = ma$$

ప్రమాణాలు: గ్రామ్–సెం.మీ./సె². లేదా డైన్ (సీజీఎస్), కిలోగ్రామ్–మీ./సె². లేదా న్యూటన్ (ఎస్ఐ ప్రమాణం).

$$1\ N = 10^5\ dyne$$

బలాలను న్యూటన్ అంతర్గత బలాలు, బాహ్య బలాలు అని రెండు రకాలుగా వర్గీకరించారు.

- ప్రకృతిలో ప్రాథమిక బలాలు ప్రధానంగా 4 రకాలు. అవి: 1. గురుత్వాకర్షణ బలాలు 2. విద్యుదయస్కాంత బలాలు 3. బలమైన కేంద్రక బలాలు 4. బలహీన కేంద్రక బలాలు
- ప్రకృతిలోని ప్రాథమిక బలాల్లో 'బలమైన కేంద్రక బలం' అత్యంత బలమైంది. గురుత్వాకర్షణ బలం అత్యంత బలహీనమైంది.
- విశ్వంలోని ఏవైనా రెండు వస్తువుల మధ్య పనిచేసే బలాన్ని గురుత్వాకర్షణ బలం అంటారు. దీని గురించి న్యూటన్ వివరించారు. గురుత్వాకర్షణ బలం వస్తువుల ద్రవ్యరాశుల లబ్ధానికి అనులోమానుపాతంలో, వాటి మధ్య దూర వర్గానికి విలోమానుపాతంలో ఉంటుంది.
- విశ్వ గురుత్వాకర్షణ బలం సమీకరణం

$$F = Gm_2m_2/r^2$$

$G \rightarrow$ విశ్వగురుత్వాకర్షణ స్థిరాంకం

$$G = 6.67\times10^{-11}\ Nm^2\ kg^{-2}$$

- G విలువను ప్రయోగాత్మకంగా కనుగొన్నవారు హెన్రీ కావెండిష్ (ఈయన హైడ్రోజన్‌ను కూడా కనుగొన్నారు).

భూ గురుత్వాకర్షణ బలాలు అన్ని వస్తువులపై ఒకేరకంగా పనిచేస్తాయని ప్రయోగాత్మకంగా నిరూపించినవారు గెలీలియో. గోపురం పై నుంచి రూపాయి నాణెం, ఈకను ఒకేసారి కిందకు పడేసినప్పుడు అవి దాదాపుగా ఒకేసారి భూమిని చేరుతాయనీ, కొద్దిపాటి కాల వ్యత్యాసానికి కారణం.. గాలిలోని స్నిగ్ధతా బలాలు ఈకపై పనిచేయడమేనని ఆయన వివరించారు. గెలీలియో టెలిస్కోప్‌ను, తొలిసారిగా లోలక గడియారాన్ని తయారు చేశారు.

భూ కేంద్రక సిద్ధాంతం: సూర్యుడితోపాటు గ్రహాలన్నీ భూమి చుట్టూ పరిభ్రమిస్తాయని టాలెమీ (2వ శతాబ్దం) ప్రతిపాదించారు. ఈ సిద్ధాంతం సుమారుగా 1400 ఏళ్ల పాటు ఆమోదంలో ఉంది.

సూర్య కేంద్రక సిద్ధాంతం: భూమి సహా గ్రహాలన్నీ సూర్యుడి చుట్టూ పరిభ్రమిస్తాయని కోపర్నికస్ (1543లో) వివరించారు.

- సూర్యకేంద్రక సిద్ధాంతం సరైందేనని వివరించినవారు – టైకోబ్రాహి.

కెప్లర్ గ్రహగమన నియమాలు: సూర్యకేంద్రక సిద్ధాంతానికి అనుగుణంగా కెప్లర్ గ్రహగమన నియమాలు వివరించారు.

1) **మొదటి నియమం:** సూర్యుని చుట్టూ గ్రహాలన్నీ నిర్దిష్ట దీర్ఘవృత్తాకార కక్ష్యల్లో పరిభ్రమిస్తాయి. దీన్నే 'కక్ష్యా నియమం' అంటారు.
2) **రెండో నియమం:** సూర్యుడి చుట్టూ తిరిగే ప్రతి గ్రహం సమాన కాల వ్యవధుల్లో సమాన వైశాల్యాలు విరజిమ్ముతుంది. దీన్నే 'వైశాల్య నియమం' లేదా 'విస్తీర్ణ నియమం' అంటారు. 'కోణీయ ద్రవ్యవేగ నిత్యత్వ నియమం' (L = mvr) ఆధారంగా దీన్ని వివరించారు.
3) **మూడో నియమం:** సూర్యుడి చుట్టూ పరిభ్రమిస్తున్న గ్రహం ఆవర్తన కాలం వర్గం.. సూర్యుడు, గ్రహానికి మధ్య ఉండే దూరం ఘనానికి అనులోమానుపాతంలో ఉంటుంది.

$T^2 \propto R^3$

$T \rightarrow$ ఆవర్తన కాలం,

$R \rightarrow$ సూర్యుడికి, గ్రహానికి మధ్య దూరం.

భూ స్థావర ఉపగ్రహం: భూ ఆత్మభ్రమణ దిశలో, భూ ఆత్మభ్రమణ వేగానికి సమానంగా భూమి చుట్టూ కక్ష్యలో పరిభ్రమణం చెందే ఉపగ్రహాన్ని 'భూస్థావర ఉపగ్రహం' అంటారు.

- భూ స్థావర ఉపగ్రహం పరిభ్రమణ కాలం 24 గంటలు.
- భూ ఉపరితలం నుంచి భూ స్థావర ఉపగ్రహం ఎత్తు 36,000 కి.మీ.
- భూ కేంద్రం నుంచి భూ స్థావర ఉపగ్రహం ఎత్తు 42,400 కి.మీ.
- భూమికి అత్యంత సమీపంగా పరిభ్రమణం చెందే ఉపగ్రహం ఆవర్తన కాలం 84.6 నిమిషాలు, 5000 సెకన్లు.
- భూ స్థావర ఉపగ్రహాన్ని సమాచార ప్రసారంలో, వాతావరణ పరిస్థితులను అధ్యయనం చేయడానికి, గూఢచర్య వ్యవస్థలో, ఖనిజ లవణాలను కనుగొనడానికి ఉపయోగిస్తారు.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. కిందివాటిలో వెక్టార్ క్వాంటిటీ ఏది? *(గ్రూప్–2, 2003)*
   ఎ) మాస్ బి) కాలం
   సి) పరిమాణం డి) వేగం
2. గురుత్వాకర్షణ శక్తి సూత్రం కనుగొన్నవారెవరు? *(ఏఈఈ–2009, టెక్నికల్ అసిస్టెంట్స్–2012)*
   ఎ) కెప్లర్ బి) గెలీలియో
   సి) న్యూటన్ డి) కోపర్నికస్
3. గురుత్వాకర్షణ సిద్ధాంతం..? *(జేఎల్–2007)*
   ఎ) విశ్వంలో ఎక్కడైనా వర్తిస్తుంది
   బి) సూర్యుడు, నక్షత్రాలకు మాత్రమే వర్తిస్తుంది
   సి) తెలిసిన అన్ని బలాలకు వర్తిస్తుంది
   డి) సౌర వ్యవస్థకు మాత్రం వర్తించదు
4. కిందివాటిలో ఏ బలం అధికంగా ఉంటుంది? *(గ్రూప్–1, 1999)*
   ఎ) పరమాణు బలం
   బి) గురుత్వాకర్షణ బలం
   సి) విద్యుదయస్కాంత బలం
   డి) కేంద్రక బలం
5. కొండను ఎక్కుతున్న వ్యక్తి కొంచెం ముందుకు వంగుతాడు. కారణం? *(ఎస్ఐ–2008, ఏఈఈ–2009)*
   ఎ) జారకుండా ఉండటానికి
   బి) వేగం పెరగడానికి
   సి) అలసట తగ్గించుకోవడానికి
   డి) స్థిరత్వం పెంచుకోవడానికి
6. సౌర వ్యవస్థ ఆవిష్కర్త ఎవరు? *(అసిస్టెంట్ డైరెక్టర్–2012)*
   ఎ) కెప్లర్ బి) కోపర్నికస్
   సి) మార్కోపోల్ డి) అమండసన్
7. కెప్లర్ సిద్ధాంతం ప్రకారం సూర్యుని చుట్టూ ఉపగ్రహ కక్ష్య మండలం ఏవిధంగా ఉంటుంది? *(డీఎల్–2012)*
   ఎ) వృత్తాకారం బి) దీర్ఘ వృత్తాకారం
   సి) చదరం డి) సరళ రేఖ
8. భూస్థిర కక్ష్య ఉపగ్రహానికి ఒక భ్రమణానికి పట్టే కాలం ఎంత? *(ఎఫ్ఆర్‌వో–2012)*
   ఎ) 24 గంటలు బి) 30 రోజులు
   సి) 365 రోజులు
   డి) నిరంతరం మారుతుంది
9. కిందివాటిలో సదిశ రాశి ఏది? *(ఎఫ్ఆర్‌వో–2012)*
   ఎ) ద్రవ్యవేగం బి) పీడనం
   సి) శక్తి డి) పని

సమాధానాలు

1) డి; 2) సి; 3) ఎ; 4) డి; 5) డి; 6) బి; 7) బి; 8) ఎ; 9) బి.

ప్రపంచంలోనే అత్యధిక వర్షపాతం నమోదయ్యే ప్రాంతం?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

భూగోళశాస్త్రం

ఒక ప్రాంతంలోని సగటు వాతావరణ పరిస్థితులనే శీతోష్ణస్థితిగా వ్యవహరిస్తారు. భారతదేశం శీతోష్ణస్థితి ఎంతో వైవిధ్యభరితంగా ఉంటుంది. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా భారత్‌లో ఆరు రుతువులను గుర్తించవచ్చు. అంటే.. ప్రతి రెండు నెలలకు వాతావరణ మార్పులు సంభవిస్తాయి. భారతదేశ శీతోష్ణస్థితిని 'రుతుపవన శీతోష్ణస్థితి' అంటారు. శాస్త్రీయంగా పరిశీలిస్తే భారతదేశం 'ఉష్ణో-ఆర్ద్ర శీతోష్ణస్థితి మండలం' కిందకు వస్తుంది. కానీ సువిశాల భారతదేశంలో వాతావరణ పరిస్థితులు ఒక్కో ప్రాంతంలో, ఒక్కో సమయంలో ఒక్కోలా ఉంటాయి. సువిశాల విస్తీర్ణం, నైసర్గిక స్వరూపం, రుతుపవనాలు, భౌగోళిక ఉనికి లాంటి అంశాలు వాతావరణ పరిస్థితులను ప్రభావితం చేస్తాయి. దేశంలోని కొన్ని ప్రాంతాల్లో అత్యధిక(ఉదా.చిరపుంజి,మాసిన్‌రామ్), మరికొన్ని ప్రాంతాల్లో అత్యల్ప వర్షపాతం నమోదవుతుంది (ఉదా: థార్ ఎడారి). వేసవిలో దక్కన్ పీఠభూమి, పశ్చిమ రాజస్థాన్ ప్రాంతాలు 45 సెంటీగ్రేడ్‌కు పైగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీనికి భిన్నంగా అదే సమయంలో ఉత్తరాన హిమాలయ పర్వత సానువుల్లో వాతావరణం చల్లగా ఉంటుంది. వాతావరణ శాస్త్రజ్ఞులు భారత శీతోష్ణస్థితిని 4 భాగాలుగా విభజించారు. 1. రుతు పవన పూర్వకాలం (మార్చి15-జూన్ 15) 2. నైరుతి రుతుపవన కాలం (జూన్ 15 -సెప్టెంబర్ 15) 3. ఈశాన్య రుతు పవన కాలం (సెప్టెంబర్ 15 -డిసెంబర్ 15) 4. రుతుపవన అనంతర కాలం (డిసెంబర్ 15-మార్చి 15).

రుతుపవన పూర్వ కాలం

రుతుపవన పూర్వ కాలం (మార్చి 15 -జూన్15)లో దేశమంతటా ఉష్ణోగ్రతలు గరిష్ఠంగా ఉంటాయి. ఇది మండు వేసవి. ఈ సమయంలో సంవహన గాలులు వీస్తాయి. ఈ పవనాలను ఆంధీ, లూ, కాల్‌బైశాఖీ, మామిడి జల్లులు లాంటి స్థానిక పేర్లతో పిలుస్తారు. ఈ వేడిగాలులకు అప్పుడప్పుడూ చిరుజల్లులు, గాలిదుమ్ము కూడా తోడవుతాయి. ఈ కాలంలో ద్వీపకల్ప పీఠభూములు, వాయవ్య భారతదేశం బాగా వేడెక్కడంతో అల్పపీడనం ఏర్పడుతుంది. ఈ అల్పపీడనం నైరుతి రుతుపవనాలు భారత్‌లోకి ప్రవేశించటానికి ఉపకరిస్తుంది.

నైరుతి రుతుపవన కాలం

నైరుతి రుతుపవన కాలం(జూన్15- సెప్టెంబర్15)లో అరేబియా సముద్రం, హిందూమహా సముద్రాల నుంచి నైరుతి రుతు పవనాలు భారత్‌లోకి ప్రవేశిస్తాయి. వీటి ప్రభావం వల్ల ఉష్ణోగ్రతలు కాస్త తగ్గి, దేశమంతా విస్తారంగా వర్షాలు కురుస్తాయి. వార్షిక వర్షపాతంలో సుమారు 2/3 వంతు ఈ మూడు నెలల కాలంలోనే సంభవిస్తుంది.

భారత ప్రధాన భూభాగంలోకి నైరుతి రుతు పవనాలు మొదటగా జూన్ మొదటి వారంలో మలబార్ తీరాన్ని తాకుతాయి. క్రమంగా ఇవి జూలై 15 కల్లా దేశమంతా వ్యాపిస్తాయి. నైరుతి రుతుపవనాలు రెండు శాఖలుగా(అరేబియా సముద్రం, బంగాళాఖాతం) దేశంలోకి ప్రవేశిస్తాయి. నైరుతి రుతు పవనాలు ఎత్తయిన పర్వతాలు, పీఠభూములను దాటే సమయంలో పవనాభిముఖదిశలో ఉండే ప్రాంతాల్లో అధిక వర్షపాతం ఉంటుంది. కానీ అదే సమయంలో పవనపరాన్ముఖదిశలో ఉండే ప్రాంతాల్లో అత్యల్ప వర్షపాతం ఉండటంతో అవి పాక్షిక శుష్కమండలాలుగా రూపొందాయి. ఉదాహరణకు అరేబియా సముద్రం నుంచి ప్రవేశించే నైరుతి రుతుపవనాలను పశ్చిమ కనుమలు అడ్డుకుంటాయి. దీనివల్ల మలబార్, కొంకణ్ తీరాల్లో విస్తారంగా వర్షం కురుస్తుంది. ఇవి అతి ఆర్ద్ర మండలాలు. కానీ సహ్యాద్రి కొండలకు వెనుక ఉన్న దక్కన్ పీఠభూమికి చెందిన ఉత్తర కర్ణాటక, పశ్చిమ తెలంగాణ, రాయలసీమ, మరాట్వాడా, విదర్భ ప్రాంతాల్లో వర్షపాతం చాలా తక్కువ. అందువల్ల ఇవి పాక్షిక శుష్కమండలాలుగా రూపొందాయి. ఈ ప్రాంతాలు ఎడారీకరణ సమస్యను ఎదుర్కొంటున్నాయి. మహబూబ్‌నగర్, అనంతపురం జిల్లాలు ఈ మండలం కిందకు వస్తాయి. ఈ మండలంలో వర్షపాత పరిమాణంలో అనిశ్చితి కూడా అధికంగా ఉంది. ఈ మండలం తరచూ తీవ్ర దుర్భిక్షాన్ని ఎదుర్కొంటోంది.

విస్తారంగా వర్షాలు

బంగాళాఖాతం నుంచి ప్రవేశించే నైరుతి రుతు పవనాలు తూర్పు, ఈశాన్య భారతదేశం, గంగా మైదానాల్లో వర్షాన్నిస్తాయి. ఈ పవనాలను పూర్వాంచల్ కొండలు, శివాలిక్ పర్వతాలు అడ్డుకుంటున్నాయి. దాంతో పవనాభిముఖదిశలోని తెరాయి మండలం, మేఘాలయలోని షిల్లాంగ్ పీఠభూమి, నాగాలాండ్ ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. గారో, ఖాసీ కొండల పవనాభిముఖదిశలో ఉన్న మాసిన్‌రామ్, చిరపుంజి ప్రాంతాల్లో ప్రపంచంలోనే అత్యధిక వర్షపాతం నమోదవుతోంది. రాజస్థాన్‌లోని ఆరావళి



పర్వతాలు నైరుతి రుతు పవనాలకు సమాంతరంగా ఉండటంతో ఇవి నైరుతి రుతుపవనాలను అడ్డగించలేవు. అదే సమయంలో పశ్చిమ రాజస్థాన్ ప్రాంత ఊర్ధ్వ ట్రోపో ఆవరణంలో ఉన్న చల్లని స్థిర వాయురాశి నైరుతి రుతు పవనాలను పైకి లేవనీయకుండా అదిమిపెడతాయి. ఈ కారణాల వల్ల పశ్చిమ రాజస్థాన్‌లో వర్షపాతం అత్యల్పంగా ఉండి, శుష్క మండలం ఏర్పడింది. థార్ ఎడారి ఏర్పడటానికి ప్రధాన కారణం.

దక్షిణార్ధగోళంలోకి సూర్యుడు

సెప్టెంబర్ మధ్య నుంచి సూర్యుడు దక్షిణార్ధగోళంలోకి ప్రవేశిస్తాడు. దీంతో భారత్‌లో క్రమంగా ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడతాయి. భారత భూభాగంపై విస్తరించి ఉన్న అల్ప పీడనం క్రమంగా క్షీణించి, ఆ స్థానంలో అధిక పీడనం బలపడుతుంది. ఈ రకంగా నైరుతి రుతు పవనాల తిరోగమనం ప్రారంభమవుతుంది. తిరోగమించే రుతుపవనాలు శుష్కంగా ఉంటాయి. అయితే ఇవి బంగాళాఖాతంలోకి ప్రవేశించినప్పుడు అక్కడి తేమను పీల్చుకొని, ఆర్ద్రగా మారుతాయి. ఇదే సమయంలో బంగాళాఖాతంలో వీస్తున్న ఈశాన్య వ్యాపారపవనాలు.. తిరోగమన రుతు పవనాలను ఈశాన్య రుతు పవనాలుగా రూపాంతరం చెందిస్తాయి. ఈశాన్య రుతుపవనాల వల్ల తమిళనాడు, దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్‌ల్లో వర్షం కురుస్తుంది. ఈ సందర్భంగా గమనించాల్సిందేమిటంటే.. తమిళనాడు ప్రాంతంలోకి నైరుతి రుతుపవనాలు రాకుండా.. నీలగిరి, అన్నామలై, ఏలకుల కొండలు అడ్డగిస్తాయి. అందువల్ల నైరుతి రుతుపవన కాలంలో తమిళనాడులో వర్షం అంతగా కురవదు. ఈశాన్య రుతుపవనాలతో ఈ ప్రాంతం విస్తారంగా వర్షాన్ని పొందుతుంది. డిసెంబర్ 15కల్లా దేశమంతటా శీతాకాలం ప్రారంభమవుతుంది. సైబీరియా నుంచి వచ్చే అతిశీతల పవనాలు.. గంగా-సింధూ మైదానంలోకి రాకుండా హిమాలయ పర్వతాలు అడ్డుకుంటాయి. లేకపోతే వీటి ప్రభావం వల్ల గంగా- సింధూ మైదానంలో ఉష్ణోగ్రతలు మైనస్ డిగ్రీలకు చేరుకొని, నదులు గడ్డకట్టి రబీ సాగు సాధ్యమయ్యేది కాదు. డిసెంబర్, జనవరిల్లో హిమాలయాల నుంచి వీచే శీతల పవనాల వల్ల గంగా-సింధూ మైదానంలో ఎముకలు కొరికే చలి ఉంటుంది. డిసెంబర్-ఫిబ్రవరి కాలం సాధారణంగా దేశమంతా శుష్కంగా ఉంటుంది. కానీ ఎర్ర సముద్రం, మధ్యధరా సముద్రం నుంచి వాయవ్య భారతదేశంలోకి కవోష్ణ చక్రవాతాలు ప్రవేశిస్తాయి. వీటిని పశ్చిమ అలజడులుగా పిలుస్తారు. వీటి ప్రభావం వల్ల దేశ వాయవ్య ప్రాంతంలో చెదురుమదురుగా వర్షాలు కురుస్తాయి. ఈ వర్షాలు రబీలో సాగయ్యే గోధుమ దిగుబడి పెరగటానికి దోహదపడతాయి. బంగాళాఖాతంలో ఏర్పడే అల్పపీడన ద్రోణులు కొన్ని బల పడి ఆయనరేఖా చక్రవాతాలుగా మారి తూర్పు తీరాన్ని తాకుతాయి. వీటి ప్రభావం వల్ల తూర్పు తీరంలో విస్తారంగా వర్షాలు కురుస్తాయి..

సింధూ నది జన్మస్థానం?

భారత్ వ్యవసాయ ప్రధాన దేశం. వ్యవసాయానికి మూలాధారం సాగునీరు. ఈ నీటిని అందించడంలో నదులది కీలక పాత్ర. ప్రధాన నదులైన గంగ, సింధూ, గోదావరి, కృష్ణా లాంటి నదుల జన్మస్థానాలు, ప్రవాహ గతికి సంబంధించిన సమాచారం గ్రూప్స్ పరీక్షల్లో అత్యంత కీలకం!!

సింధూ లేదా ఇండస్

దీని జన్మస్థానం టిబెట్‌లోని కైలాస పర్వతాల్లో ఉన్న 'చాండుయాంగ్' హిమానీనదం. ఈ నది డామ్‌ఛోక్ వద్ద దేశంలోకి ప్రవేశించి షిగార్, గిల్గిత్, ద్రాస్ తదితర ఉపనదులను కలుపుకొని పాకిస్తాన్‌లోకి ప్రవహిస్తుంది. సట్లెజ్, రావి, బియాస్, జీలం, చీనాబ్ నదులు సింధూ ముఖ్య ఉపనదులు. సట్లెజ్ నది కూడా కైలాస పర్వతాల్లోని 'రాకాస్ తావ్'గా పిలిచే హిమానీనద సరస్సు నుంచి ఉద్భవిస్తుంది. ఈ నదిని ప్రాచీన కాలంలో 'సుతుద్రి' అని పిలిచేవారు. సట్లెజ్ నది హిమాచల్ ప్రదేశ్‌లోని 'షిప్కిలా' కనుమ ద్వారా భారత్‌లోకి ప్రవేశిస్తుంది.

సట్లెజ్‌పై భాక్రా నంగల్

సట్లెజ్ నదిపై హిమాచల్‌ప్రదేశ్‌లోని భాక్రా, పంజాబ్‌లోని నంగల్ వద్ద భారీ ఆనకట్టలు నిర్మించారు. భాక్రా నంగల్ భారత్‌లో అతి పెద్ద బహుళార్థక సాధక ప్రాజెక్టుల్లో ఒకటి. భాక్రా నంగల్ రిజర్వాయర్‌ను 'గోవింద సాగర్'గా పిలుస్తారు. జీలం నది కశ్మీర్‌లోని వెరినాగ్ కొండల్లో ఆవిర్భవిస్తుంది. చంద్ర-భాగా నదుల కలయికతో చీనాబ్ నది ఏర్పడింది. ఇవి హిమాచల్ ప్రదేశ్‌లోని రోహతాంగ్ కనుమ వద్ద ఆవిర్భవిస్తాయి.

కాలాబాగ్

రావి నది కులూ కొండల్లో, బియాస్ నది బియాస్‌కుండ్ వద్ద ఆవిర్భవించాయి. సింధూ నదీ వ్యవస్థలో రావి-బియాస్‌ల సంగమం మాత్రమే భారతదేశంలో ఉంది. మిగిలిన నదులన్నీ పాకిస్తాన్ భూభాగంలో ఒక దానితో మరోటి కలుస్తాయి. ఈ నదులన్నీ పాకిస్తాన్‌లోని 'కాలాబాగ్' వద్ద కలిసి, ఒకే ప్రవాహంగా సింధ్ రాష్ట్రం ద్వారా ప్రవహించి అరేబియా సముద్రంలో కలుస్తాయి. రావి-బియాస్ నదులు పంజాబ్ (భారత్)లోని హరికే వద్ద కలుస్తాయి. ఇందిరాగాంధీ కాలువ హరికే వద్ద నిర్మించిన ఆనకట్ట నుంచి ప్రారంభమవుతుంది.

గోదావరి -త్ర్యయంబకం

ద్వీపకల్ప నదీ వ్యవస్థలన్నింటి కంటే గోదావరి పెద్దది. ఇది సహ్యాద్రి పర్వతాల్లో నాసిక్ సమీపంలోని 'త్ర్యయంబకం' వద్ద ఆవిర్భవించింది. ఈ నది మహారాష్ట్రకు చెందిన వార్ధా, పేన్‌గంగ, ప్రాణహిత, ఇంద్రావతి, కోయనా, మధ్యప్రదేశ్‌కు చెందిన వైన్‌గంగను కలుపుకొని తెలంగాణలోకి ప్రవేశిస్తుంది. మానేరు, శబరి, మంజీరా నదులు గోదావరి ముఖ్య ఉపనదులు.

మంజీరాపై నిజాంసాగర్

మంజీరా నది మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్ పర్వశ్రేణుల్లో ఆవిర్భవించింది. ఈ నది తెలంగాణలోని నిజామాబాద్, మెదక్ జిల్లాల్లో ప్రవహించి గోదావరిలో కలుస్తుంది. మంజీరాపై నిజాంసాగర్, సింగూరు ఆనకట్టలు నిర్మించారు. ఛత్తీస్‌గఢ్‌లో ఉద్భవించిన శబరి నది, ఖమ్మం జిల్లాలోని కూనవరం వద్ద గోదావరిలో కలుస్తుంది. గోదావరిపై నిజామాబాద్ జిల్లాలోని పోచంపాడు వద్ద శ్రీరాంసాగర్ ఆనకట్ట నిర్మించారు. గోదావరి రాజమండ్రికి దిగువన గౌతమీ గోదావరి, వశిష్ఠ గోదావరి, వైనతేయి గోదావరి అనే మూడు పాయలుగా చీలిపోతుంది. అనంతరం అంతర్వేది, యానాం, కొమరగిరి పట్నాల వద్ద బంగాళాఖాతంలో కలుస్తుంది.

కృష్ణానది

సహ్యాద్రి కొండల్లోని మహాబలేశ్వర్ వద్ద కృష్ణానది ఆవిర్భవించింది. ఇది కర్ణాటక ద్వారా ప్రవహిస్తూ మహబూబ్‌నగర్ జిల్లాలో మక్తల్ వద్ద తెలంగాణలోకి ప్రవేశిస్తుంది. ఘటప్రభ, మల్లప్రభ, భీమా, తుంగభద్ర, దిండి, మూసీ నదులు కృష్ణా నదికి ముఖ్య ఉపనదులు. తుంగభద్ర కర్ణాటకలోని వరాహ పర్వతాల్లో ఆవిర్భవించి.. కర్నూలులోని సంగమేశ్వర్ వద్ద కృష్ణలో కలుస్తోంది. కృష్ణా జిల్లాలోని అవనిగడ్డకు దిగువన కృష్ణానది పాయలుగా చీలి హంసలదీవి వద్ద బంగాళాఖాతాన్ని చేరుతుంది.

Who amongst the five types the fastest?

BANK EXAMS

REASONING

MODEL QUESTIONS

1. In a certain code, PLANT is written as "$@2H©" and YIELD is written as "b64@%". How is "DELAY" written in that code?
   1) b4H2% 2) b4@2%
   3) %42@b 4) %4@2b
   5) None of these
2. How many meaningful English words can be formed with the letters ARILT using each letter only once in that word?
   1) None 2) One 3) Two
   4) Three 5) More than three
3. D said, "A's father is the only brother of my sister's son." How is A's father related to D?
   1) Cousin2) Nephew 3) Aunt
   4) Data inadequate
   5) None of these

Directions (Q. No. 4-6): The following questions are based on the 5 three-digit numbers given below:


394 632 783 576 895

4. If the positions of the first and the second digit within each number are interchanged, then which of the following will be the second highest number?
   1) 632 2) 783 3) 576
   4) 895 5) 394
5. If the first and second digits of each of the numbers are added, the resulting sum of which of the following numbers will not be exactly divisible by 3?
   1) 895 2) 394 3) 576
   4) 632 5) 783
6. If 2 is added to the last digit of each number and then the positions of the first and the third digits are interchanged, which of the following will be the highest number?
   1) 576 2) 895 3) 783
   4) 394 5) 632
7. If A is coded as 1, B as 3, C as 5 and so on, which of the following is the numerical value of the word "FAZED"?
   1) 81 2) 79 3) 77
   4) 80 5) None of these
8. Which of the following pairs of words have the same relationship as FAN : HEAT?
   1) Water : Drink
   2) Light : Night
   3) Teach : Student
   4) Air : Breathe 5) Food : Hunger
9. Q types faster than R but not as fast as V. T types faster than R. S types faster than V. Who amongst the five types the fastest?
   1) V 2) T 3) S
   4) Data Inadequate
   5) None of these
10. If "B × C" means "B is the daughter of C", "B + C" means "B is the husband of C" and "B – C" means "B is the sister of C", then what does "M + N – P × Q" mean?
   1) M is the brother-in-law of Q
   2) M is the uncle of Q
   3) M is the son-in-law of Q
   4) Q is the mother-in-law of M
   5) None of these

Directions (Q. No. 11-15): Study the following arrangement carefully and answer the questions given below:

RDAK5BI2M JEN97
UZV1W3H4FY8P6TG

11. How many such numbers are there in the above arrangement, each of which is immediately preceded by a consonant and immediately followed by a vowel?
   1) None 2) One 3) Two
   4) Three 5) More than three
12. Which of the following is the eighth to the left of the seventeenth from the left end?
   1) M 2) J 3) 8
   4) 5 5) None of these
13. Four of the following five are alike in a certain way based on their positions in the above arrangement and so form a group. Which is the one that does not belong to that group?
   1) E 9 J 2) Z 1 U 3) H W 4
   4) Y 4 8 5) B 2 K
14. Which of the following is the sixth to the right of the nineteenth from the right end?
   1) 5 2) Z 3) V
   4) 1 5) None of these
15. How many such consonants are there in the above arrangement, each of which is immediately preceded by a number and immediately followed by another consonant?
   1) None 2) One 3) Two
   4) Three 5) More than three



Directions (Q. No. 16-19): Each of the questions below consists of a question and two statements numbered I and II given below it. You have to decide whether the data provided in the statements are sufficient to answer the question. Read both the statements and **Give answer:**

1) If the data in statement I alone are sufficient to answer the question, while the data in statement II alone are not sufficient to answer the question.
2) If the data in statement II alone are sufficient to answer the question, while the data in statement I alone are not sufficient to answer the question.
3) If the data either in statement I alone or in statement II alone are sufficient to answer the question.
4) If the data given in both the statements I & II together are not sufficient to answer the question.
5) If the data in both the statements I & II together are necessary to answer the question.

16. How is 'never' written in a code language?
   I) "never ever go there" is written as "na ja ni ho" in that code language.
   II) "go there and come back" is written as "ma ho sa ni da" in that code language.
17. Among M, P, K, J, T and W, who is lighter than only the heaviest?
   I) P is heavier than M and T.
   II) W is heavier than P but lighter than J who is not the heaviest.
18. What does "$" mean in a code language?
   I) "5 $ # 3" means "flowers are really good".
   II) "7 # 3 5" means "good flowers are available".
19. How many students are there between Suresh and Mohan in a row of fifty students?
   I) Suresh is twelfth from the left end and Mohan is seventeenth from the right end.
   II) Suresh is six places away from Jayesh, who is twentieth from the left end..

Key And Explanations

1. Ans: 4

P	L	A	N	T	Y	I	E	D
$	@	2	✳	©	β	6	4	%

∴ DELAY ⇒ %4@2β

2. Ans: 3. TRAIL, TRIAL,
3. Ans: 2. A's father
   = the only brother of D's sister's son
   = D's sister's son
   = D's nephew
4. Ans: 5. Interchanging the first two digits, we get 934, 362, 873, 756 and 985. Of these, 934 is the second highest.
5. Ans: 1. 895 ⇒ 8 + 9 = 17 is not divisible by 3.
6. Ans: 1. Look for the highest third digit.
7. Ans: 2. In general, n^{th} letter of the alphabet =2n–1 Here, FAZED = 11 + 1 + 51 + 9 + 7 = 79
8. Ans: 5. The first dispels the second.
9. Ans: 4. V > Q > R; T > R; S > V Combining, we get S > V > Q > R and T > R. Hence, either S or T is the fastest.
10. Ans: 3.
    Q
    |
    M(+) ⇔ N(–)<—>P(–)
11. Ans: 1.
12. Ans: 1. 8^{th} to the left of 17^{th} from left = 17 – 8 = 9^{th} from the left = M
13. Ans: 5. In all others, the first and third elements are consecutive ones.
14. Ans: 3. 6^{th} to the right of 19^{th} from the right = 19 – 6 = 13^{th} from the right = V
15. Ans: 4. M, F and T
16. Ans: 4. Only two words are common between I and II.
17. Ans: 5. From I: P > M, T
    From II: J > W > P
    Combining, we get K > J > W > P > M, T Hence, K is the heaviest and J lighter than only the heaviest.
18. Ans: 5.
    From I: 5$#3 = flowers are really good ... (i)
    From II: 7#35 = good flowers are available ... (ii)
    From I and II: 5#3 = flowers are good ... (iii)
    Putting (iii) in (i), we get: $ = really.
19. Ans: 1. **From I:** Suresh = 12^{th} from left
    Mohan = 17^{th} from right
    ∴ No. of students between them = 50 – 29 (12+17) = 21
    From II: No data about Mohan.

విద్య, ఉద్యోగ సమాచారం

ఐసీఏఆర్-ఐఏఆర్ఐ, న్యూఢిల్లీలో వివిధ ఉద్యోగాలు

న్యూఢిల్లీలోని ఐకార్ – ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఐఏఆర్ఐ) ఒప్పంద ప్రాతిపదికన జూనియర్ రీసెర్చ్ ఫెలోలు/ప్రాజెక్ట్ అసోసియేట్, ఫీల్డ్ అటెండెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీల సంఖ్య: 03.

ఖాళీల వివరాలు: జూనియర్ రీసెర్చ్ ఫెలోలు/ప్రాజెక్ట్ అసోసియేట్–02, ఫీల్డ్ అటెండెంట్–01.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ నెట్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయసు: 35 ఏళ్లు మించకూడదు.

వేతనం: నెలకు ఫీల్డ్ అటెండెంట్‌కు రూ.18,000.

ఎంపిక విధానం: షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

దరఖాస్తు విధానం: ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

ఈమెయిల్: geneticsbmgf@gmail.com

దరఖాస్తులకు చివరితేది: 15.08.2025.

వెబ్‌సైట్: https://www.iari.res.in/

టీహెచ్‌డీసీలో మేనేజర్ పోస్టులు

తెహ్రీ హైడ్రో డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్(టీహెచ్‌డీసీ) రెగ్యులర్ ప్రాతిపదికన అడిషనల్ జనరల్ మేనేజర్, డిప్యూటీ జనరల్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం పోస్టుల సంఖ్య: 05.

పోస్టుల వివరాలు: అడిషనల్ జనరల్ మేనేజర్–02, డిప్యూటీ జనరల్ మేనేజర్–03.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో సీఏ/సీఎంఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయసు: అడిషనల్ జనరల్ మేనేజర్‌కు 53 ఏళ్లు, డిప్యూటీ జనరల్ మేనేజర్‌కు 50 ఏళ్లు ఉండాలి.

వేతనం: నెలకు అడిషనల్ జనరల్ మేనేజర్ పోస్టుకు రూ.1,20,000 నుంచి రూ.2,80,000, డిప్యూటీ జనరల్ మేనేజర్ పోస్టుకు రూ.1,00,000 నుంచి రూ.2,60,000.

ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 21.08.2025.

–వెబ్‌సైట్: http://www.thdc.co.in/